విప్లవవీరుడు

# అల్లూరి సీతారామరాజు చరిత్ర



రచయిత: దంతులూరి వెంకటరామరాజు, ఎం.ఎ.



04-07-1897 07-05-1924

# విప్లవ వీరుడు

# అల్లూరి సీతారామరాజు

## 102 జయంతి సందర్భంగా

## ఆ మహనీయునికి నివాళులర్పిస్తూ ....

సీతారామరాజు మేనల్లుడును ఈ గ్రంథ రచయితను అయిన

దంతులూరి వెంకటరామరాజు గారికి

కృతజ్ఞతాభివందనములతో...

**అల్లూరి సీతారామరాజు స్మారక సమితి,**

**C/o. క్షత్రియ సేవా సమితి, ఆం.ప్ర.,**

క్షత్రియ టవర్స్, బ్లాక్ నెం.2, ఫ్లాట్ 103,

2-1-284, నల్లకుంట, హైదరాబాద్ - 500 044. ఫోన్ : 7664359.

జూలై 04, 1999.

## విప్లవ వీరుడు

# అల్లూరి సీతారామరాజు

## చరిత్ర

రచన :

దంతులూరి వెంకటరామరాజు,

(డి. వి. రామరాజు)

తొలి ప్రచురణ : జూన్ 1984

పునర్ముద్రణ : జూలై 04, 1999
(రచయిత అనుమతితో)

వెల : రు. 35

ప్రతులకు :
**అల్లూరి సీతారామరాజు స్మారక సమితి,**
C/o. **ది క్షత్రియ సేవా సమితి,** క్షత్రియ టవర్స్,
బ్లాక్ - 2, ఫ్లాట్ - 103, 2-1-284,
నల్లకుంట, హైదరాబాద్ -44, ఫోన్: 7664359.

ముద్రణ :
సూరజ్ ప్రింటర్స్ అండ్ ప్యాకేజర్స్
తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్ - 1.

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| ఆశయము | | i |
| పరిచయము | | v |
| 1. | ప్రస్తావన | 1 |
| 2. | పూర్వ రంగము - నాటి రాజకీయ పరిస్థితులు | 3 |
| 3. | ఆంధ్ర వీరుని పూర్వులు | 9 |
| 4. | అల్లూరి కుటుంబములోని కొందరు ముఖ్యవ్యక్తులు | 13 |
| 5. | బాల్యము, విద్యాభ్యాసము | 22 |
| 6. | ఉత్తర దేశ యాత్రలు | 32 |
| 7. | మన్య ప్రాంతములో నివాసము - శ్రీరామ విజయనగరము | 35 |
| 8. | మన్య ప్రజలలో మార్పును దెచ్చుట | 40 |
| 9. | ఏజెన్సీలో పూర్వము జరిగిన తిరుగుబాటులు | 45 |
| 10. | శ్రీరామరాజు విప్లవమునాటి ఏజెన్సీ పరిపాలన విధానము | 52 |
| 11. | విప్లవ శంఖము పూరించుట | 54 |
| 12. | విప్లవ ప్రారంభము | 69 |
| 13. | చింతపల్లి పోలీసు స్టేషనుపై దాడి | 76 |
| 14. | కృష్ణాదేవి పేట స్టేషన్ ముట్టడి | 78 |
| 15. | రాజవొమ్మంగి స్టేషనుపై దాడి | 81 |
| 16. | ఒంజేరి ఘాట్ వద్ద పోరాటము | 83 |
| 17. | దేవీపూజ | 89 |
| 18. | స్కాట్ కవర్డ్, హైటరుల దుర్మరణము | 90 |
| 19. | ప్రభుత్వ సన్నాహములు | 97 |

| | | |
|---|---|---|
| 20. | అడ్డతీగల ముట్టడి | 99 |
| 21. | రంపచోడవరము స్టేషన్‌పై దాడి | 105 |
| 22. | ప్రభుత్వ వ్యూహములు, సన్నాహములు | 109 |
| 23. | పెదగెడ్డపాలెములో అపజయము | 118 |
| 24. | అన్నవరము సందర్శనము | 124 |
| 25. | చెదురు మదురు సంఘటనలు | 131 |
| 26. | అగ్గిరాజు | 138 |
| 27. | మల్లుదొర పట్టుబడుట | 141 |
| 28. | గూడెం పోలీసు స్థావరముపై దాడి | 145 |
| 29. | వదంతులు, వాస్తవాలు | 151 |
| 30. | అస్సాం రైఫిల్సు దళము రాక | 153 |
| 31. | అగ్గిరాజు పట్టుబడుట | 155 |
| 32. | మద్రాసు కౌన్సిలులో చర్చ | 160 |
| 33. | సీతారామరాజు అస్తమయము | 162 |
| 34. | గంటందొర, ఇతర విప్లవ వీరుల మరణము | 169 |
| 35. | అనుమానాలు, అపోహలు | 172 |
| 36. | శ్రీరామరాజా, సీతారామరాజా ? | 177 |
| 37. | మన్యములో తిరుగుబాటుకు కారణములు | 181 |
| 38. | విప్లవ లక్ష్యము | 186 |
| 39. | తెగడ్తలు, పొగడ్తలు | 192 |
| 40. | ఉపసంహారము | 198 |
| | పరిశీలించిన గ్రంథములు, పత్రములు | 200 |

# ఆశయము

శ్రీ అల్లూరి సీతారామరాజు చరిత్ర చాలమంది వ్రాసిరి. 1924 లో పితూరి ముగిసినప్పటి నుండి ఇప్పటివరకు వ్రాయుచునే యున్నారు. ఈ మధ్య జయంతులు, వర్ధంతులు ఎక్కువగా జరుపుచుండుటచే ఎవరో ఒకరు సీతారామరాజు పై పొత్తములను వెలువరించుచునేయున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క అంశమునకు ప్రాధాన్యమిచ్చి వ్రాయుచున్నారు. కొన్ని కల్పిత గాథలుగూడా అందు చోటుచేసికొనినవి. 1960 ప్రాంతమున ఆంధ్రప్రదేశ ప్రభుత్వము అప్పటి రాష్ట్ర విద్యామంత్రి శ్రీ బలుసు ప్రభాకర పట్టాభి రామారావుగారు అధ్యక్షులుగా, రివిన్యూ మంత్రి శ్రీ అల్లూరి సత్యనారా యణరాజుగారును, పార్లమెంటు మాజీసభ్యుడు శ్రీ గాం మల్లుదొరగారును, అసెంబ్లీసభ్యుడు శ్రీ పుసులూరి కోదండరామయ్య గారును సభ్యులుగా శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక సంఘము అనుపేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేసిరి. ఆ సంస్థ విప్లవవీరుని చరిత్ర వ్రాయుటకు శ్రీ యర్రమిల్లి నరసింహారావు గారిని నియోగించినది. ప్రభుత్వము తరపున ఆయన విజ్ఞప్తి ననుసరించి పితూరి సమయములో పనిచేసిన అధికారులు, అనధికారులు తమకు తెలిసిన విషయములను ఆయనకు ఉత్తరములద్వారా తెలియజేసిరి. కొందరు ముఖ్యులతో సంప్రదించియు, తనకు దొరికిన ప్రభుత్వ రికార్డులు చూచియు పుస్తకమును వ్రాయగ దానిని 'అల్లూరి సీతారామరాజుచరిత్ర' అను పేరుతో ప్రభుత్వము ప్రచురించినది. ప్రభుత్వమే ఆయనను అపనికి నియోగించినది కావున మన్యములో ప్రధాన ప్రదేశములు తిరిగి , పితూరితో సంబంధమున్న వ్యక్తులను కలిసికొని, తత్సంబంధిత పటముతో సహా ఆ చరిత్రను ప్రచురించుటకు ఆయనకు ఎంతయో అవకాశమున్నను అట్లు చేయుటకు పూనుకొనక తనకు దొరకిన అంశములను ప్రోగుచేసి చరిత్రను వెలువరించుటతో సంతృప్తి పడిరి. నరసింహారావుగారు కాకినాడ కళాశాలలో నా సహాధ్యాయియే. సీతారామరాజు సోదరిని, నన్నును కలిసికొని విషయములు సేకరించుటకు ఆయన వచ్చిరి. సీతారామరాజును గురించి తనకేమియు తెలియదని చెప్పిరి. ప్రయాణ భత్యములు మొదలగు ఖర్చు అంతయు ప్రభుత్వమే భరించుచున్నదిగాన సీతారామరాజుతో సంబంధమున్న వ్యక్తులున్న ప్రదేశములును, మన్యప్రాంతములోని ముఖ్యమైన ప్రదేశములును తిరిగి వ్యక్తులను కలిసికొని సమగ్రముగా విషయములు సేకరించి చరిత్రను ప్రచురించుటకు ప్రభుత్వమువారిచ్చిన ఆ యవకాశమును వినియోగించుమని ఆయనకు సూచించితిని. కాని తనకు ఆరోగ్యమంతగా బాగులేదనియు, అంత ప్రయాసపడుటకు ఓపిక లేదనియు

ఆయన చెప్పిరి. అందుచే ప్రభుత్వముచే ప్రచురింపబడిన ఆ చరిత్ర కూడ సమగ్రముగాలేదు.

అంతకు పూర్వమే భీమవరము కళాశాలలో చరిత్ర శాఖకు అధిపతిగానున్న శ్రీ వై. విఠలారావుగారు అల్లూరి సీతారామరాజుపై ఒక పరిశోధన పత్రమును వెలువరించిరి. అప్పుడే సీతారామరాజు కుటుంబ సభ్యులకు తెలిసిన విషయములన్నియు సేకరించి ఒక గ్రంథమును వ్రాసినచో బాగుండునని నాకు సూచించి, భారతీయ విద్యాభవన్ వారు వేయు పుస్తకములవంటి పుస్తకమును ఇంగ్లీషులో సీతారామరాజు చరిత్రను ప్రచురించవలెనను తలంపు ఆయనకు ఉన్నట్లు చెప్పిరి. కాని అనేక కారణములచే అది కార్యరూపము ధరించలేదు.

తరువాత శ్రీ కె. రామచంద్రయ్య, శ్రీ పెన్మెత్స వెంకటరాజు, మా లైబ్రేరియన్ శ్రీ నరసింహరాజు మొదలగు సహృదయులైన మిత్రులు ఒక సమగ్రమైన చరిత్ర వ్రాయుటకు పూనుకొనుమని నన్ను ప్రోత్సహించు చుండెడువారు. అట్టిది వ్రాయు కాంక్షయున్నను దానికి సంబంధించిన ప్రభుత్వ పత్రములు ఎచ్చటనుండునో తెలిసికొని, వానిని పరిశీలించుటకు ఆయా కార్యాలయాధికారుల అనుమతిని పొందుటయు, మన్య ప్రాంతములను తిరిగి వ్యక్తులను కలిసికొని విషయములను సేకరించుటయు చాల వ్యయప్రయాసలతో కూడుకొని యుండుటచేత ఒక వ్యక్తికి కష్టసాధ్యమని తలచి ఉపేక్షించుచు వచ్చితిని, కాని ఎప్పటికైనను అవకాశము వచ్చినచో గ్రంథస్థము చేయవలయుననెడి యోచనతో తెలిసిన, తెలిసికొనిన అంశములను ముఖ్యమైన వానిని వ్రాసికొని భద్రపరచుచునే యుంటిని. సీతారామరాజు తల్లిగారు జీవించియున్నప్పుడు ఆమెవద్దకి పెక్కు సంగతులు తెలిసికొనుచుండువారము. సీతారామరాజు సోదరుడు ఆయనకు తెలిసిన సంగతులన్నియు జ్ఞాపికలుగా వ్రాసి యుంచిరి. ఇవి అన్నియు ఆ కుటుంబ సభ్యులకు మాత్రమే తెలిసిన విషయములు. ఆ విశేషములు మా తోడనే అంతరించి పోగూడదని నా యాశయము.

ఉద్యోగ విరమణ చేసిన తరువాత మిత్రుల ఒత్తిడి ఎక్కువైనది. సకల విషయముల తోడను సమగ్రమైన సప్రమాణమైన జీవిత చరిత్ర వ్రాయవలెనను తలంపు రూపు దిద్దుకొనమొదలిడెను. హైదరాబాదులో స్థిరపడిన గురుతుల్యులు శ్రీ వై. విఠలరావుగారికి వ్రాసితిని. State Archieves లో ప్రభుత్వ పత్రములు పరిశీలించవలసినదనియు, అందు ఒక అధికారియైన పాలా కృష్ణమూర్తి గారిని కలిసికొనుమనియు ఆయన సలహా ఇచ్చిరి. కృష్ణమూర్తి గారికి ఉత్తరము వ్రాయగా ఆయన అచ్చటి పత్రములను పరిశీలించుటకు కావలసిన అనుమతి మంజూరగుటకు సహాయపడి, అచ్చటి పత్రములను చూచుటకు అచ్చటి ఉద్యోగులకు నన్ను పరిచయముచేసి సకల సదుపాయములను ఒనగూర్చిరి.

అదృష్టవశమున కృష్ణమూర్తిగారు ఈ విషయము మీదనే పితూరికి సంబంధించిన పత్రములు పరిశీలించి పరిశోధన వ్యాసములు వ్రాయుటయు, విశాఖజిల్లా కలెక్టరు ఆఫీసు పత్రములు గూడ దీనికి సంబంధించినవి కొన్ని అక్కడ ఉండుటయు తటస్థించినది. అందుచే ఆ పత్రములన్నియు నాకు చూపించి 'నోట్సు' తీసికొనుటకు చాల సహాయపడిరి. ఆయనకు చాల ఋణపడియున్నాను. అచటి ఉద్యోగులకును, అనుమతి నిచ్చిన స్టేట్ ఆర్కైవ్స్ కమీషనరుగారికి కృతజ్ఞుడను.

సీతారామరాజును చివరకు పట్టుకొను విషయములో ప్రజలలో వివిధాభిప్రాయము లున్నవి. దానికి సంబంధించిన ప్రభుత్వ రహస్య పత్రములు దొరకునని ఆశించితిని గాని అవి లభ్యము కాలేదు. కావలసిన చాల పత్రములు కూడ లభ్యము కాలేదు. ఇంకను క్రింది ఆఫీసులలో, మద్రాసులో, ఢిల్లీలో, లండనులో చాల పత్రములుండి యుండవచ్చును. అవి యన్నియు తెప్పించుటకు ప్రయత్నము చేయుడుమని చెప్పిరి. ఇంతకును సీతారామరాజు పట్టుబడి కాల్చివేయబడినట్లు తెల్పు విషయములో ఒక సంక్షేప ప్రభుత్వ నివేదిక మాత్రమే లభ్యమైనది.

విప్లవకారులు తిరిగిన మన్య ప్రదేశములన్నియు చూపు పటమును గూడ చేర్చవలెను అనుకొంటిని కాని అన్ని ప్రదేశములను చూపు పటమును సంపాదింపలేక పోతిని. హోపెల్ నివేదికకు అనుసంధించబడిన పటమునకు ఇంకను కొన్ని చేర్పులు చేసి తృప్తి పడవలసి వచ్చినది. ఇందును చాల ప్రదేశములు కనబడవు. అయినను పాఠకునికి కొంతయైనను అవగాహనయుండునను ఉద్దేశముతో ఆయు సగ్రమైన పటమునే అనుసంధించితిని.

ఈ గ్రంథ రచనకు ఉపకరించిన పూర్వ చరిత్ర గ్రంథకర్తల నందరిని స్మరించుట నా విధి. వారి నందరిని చివర పేర్కొంటిని. ముఖ్యముగా యర్రమిల్లి నరసింహారావుగారు వ్రాసిన చరిత్రను మూలముగా గ్రహించితిని. వారికందరికి నా కృతజ్ఞతలు.

ఇక నాకు ఈ రచన చేయుటకు సహకరించినవారు సహాయపడిన వారు చాల మంది కలరు. ప్రభుత్వ పత్రములకు, ఇతర పుస్తకములలోని భాగములకు నకళ్లు తీయుటలో మా చిరంజీవులు వెంకటపతిరాజు, పెన్మెత్స విజయలక్ష్మి, మురళీలు చాల ఉత్సాహముతో సహాయపడిరి. హైదరాబాదులో కోనూరి జానకి రామరాజుగారు ఆయన తీయించిన కొన్ని ఫోటోలు, ఉత్తరముల కాపీలు ఇచ్చిరి. మిత్రులు యం.వి. సుబ్బారావుగారు రచనకు నిరంతర ప్రోత్సాహమొసగుచుండిరి. ఈ యందరికిని నా కృతజ్ఞతలు చెప్పవలసియున్నది.

బ్లాకులు చేయుటకు అనువగు పటమును తయారు చేయించుటలోను, ఫోటో కాపీలు తీయించి బ్లాకులు తయారు చేయించుటలోను డి.ఎన్.ఆర్. కళాశాల 'జియాలజీ'

లెక్చరరు చిరంజీవి అల్లూరి సురేంద్రవర్మ చాల శ్రద్ధ తీసికొని శ్రమపడినారు. ఇక గ్రంథ ముద్రణకు కావలసిన సన్నాహ భారమంతయు 'జియాలజీ' విభాగాధిపతియైన శ్రీ N.S.J.R. వర్మ తన భుజస్కంధములపై వేసికొనినారు. గ్రంథ రచనకు ఉపక్రమించినది మొదలు ముద్రణ, ప్రచురణ అగువరకు అడుగడుగున నన్ను ప్రోత్సహించి ఎన్నో విధములుగా సహాయపడిన మిత్రులు శ్రీ ఉద్దరాజు నరేంద్రవర్మ, శ్రీ పెన్మెత్స సుబ్బరాజులు, పుస్తకము ముద్రణకిచ్చినది మొదలు పూర్తి యగువరకు ప్రూఫులు దిద్దుటలోను, 'ప్రెస్' పని చూచుటలోను, మా చిరంజీవి మురళీ గోపాలకృష్ణ నాకు చేదోడు వాదోడుగా నున్నారు. టైటిల్ పేజిని రూపొందించుటలో చిత్రకారుడు శ్రీ పి. భాస్కరరావు ఎన్నియో చిత్రములు గీసి చూపించి, విసుగుదల లేకుండ సహకరించి సహాయపడిరి. వీరి కందరికి నేనెంతయు ఋణపడి యున్నాను.

ఈ పుస్తకమునకు ఒక రూపు నిచ్చుటకు ఉదయిని ప్రెస్ అధిపతి శ్రీ పెన్మెత్స రామచంద్రవర్మ ఎన్నియో విధముల శ్రమపడి సహకరించెను. ఆయన ప్రేరణచేత నాగేశ్వర ప్రింటింగ్ ప్రెస్‌వారు, ఆదర్శ ప్రింటర్స్ వారు సకాలములో ముద్రణ పూర్తి చేసి ఇచ్చిరి. వారందరికీ నా కృతజ్ఞతలు.

చివరగా, ఈ గ్రంథమునకు పరిచయమును వ్రాసిన విజ్ఞులు డాక్టర్ పెన్మెత్స వెంకటరాజుగారికి నా కృతజ్ఞతాభివాద శతములు.

ఒక సమగ్రమైన సప్రమాణమైన జీవిత చరిత్ర వ్రాయవలెననియే నా సంకల్పము. అందరికిని తెలియు రీతిని ఆంధ్ర విప్లవవీరుని చరిత్ర వ్రాయుటయే నా యాశయము. నా యాశయమెంత వరకు సిద్ధించినదో పాఠకులే ప్రమాణము.



గ్రంథకర్త

# పరిచయము

Prof. P. VENKATA RAJU, *Postgraduate Department of Telugu* M.A., Ph.D., Bhasha Praveena (వన్యయ విద్యాపీఠము)
(Professor & Head, DNR College, Bhimavaram-534 202.
Director, Research Studies (A.P.)

2-6-1984

ఆంధ్ర క్షత్రియుల పౌరుష పరాక్రమములకు ప్రతీక శ్రీ అల్లూరి సీతారామరాజు. అఖండ భారత జాతి వీర శౌర్యసాహస గాంభీర్యములు రాశీభూతమై మూర్తిగొన్న విప్లవవీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, పుణ్యమూర్తి శ్రీ అల్లూరి సీతారామరాజు.

పారతంత్ర్యము, పరపీడనము, బానిసత్వములతో క్రుగ్గుతున్న, భారతమాత ఆక్రందనములు ఆలకించి మన్యప్రజల మానప్రాణములు బెబ్బులులకంటె క్రూరముగ బలిగొంటున్న ఆంగ్లపాలకుల దౌర్జన్యములు తిలకించి విల్లంబులు చేత ధరించి, భారత స్వాతంత్ర్య సంగ్రామరంగమున విహరించి, తెల్లదొరల గుండెలదరించి, ఆత్మబలిదానముతో వీరస్వర్గమలంకరించిన వీరకిశోరము శ్రీ అల్లూరి సీతారామరాజు.

ఆ మహావీరుడు సాగించిన స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రము స్వాతంత్ర్య భావచైతన్యము ఆంధ్రజాతికే కాదు, అఖిల భారత జాతికి ఆదర్శప్రాయము, మార్గదర్శకము. ఆ విప్లవ వీరుని జననము, బాల్యము, విద్యాభ్యాసము, దేశ సంచారము, జీవిత ధ్యేయము, సంగ్రామరంగము, సాహసకార్యములు భావిభారత విధి సూత్రములు. ఇట్టి ఉదాత్త సముద్దేశముతో సప్రమాణముగ సర్వాంగ సుందరముగ రచింపబడిన శ్రీ సీతారామరాజు చారిత్రక దర్శనము ఆంధ్రావళి, అఖిల భారతావని ఆమోద సమ్మోదములంద గలదు.

శ్రీ సీతారామరాజు చరిత్ర ఒక తెలుగు వీరగాథ. ఈ వీరగాథను గేయములుగ, గీతములుగ, పద్యములుగ, బుర్రకథలుగ, హరికథలుగ, నాటకములుగ ఎందరెందరో స్వాతంత్ర్య సమర పిపాసువులు రచించి ఆంధ్ర లోకమున కందించిరి. వానిని పాడుకొనుచు, ఆడుకొనుచు, చదువుకొనుచు ఆంధ్రయువత ఉత్సాహమును, ఉత్తేజమును, త్యాగనిరతిని, దేశభక్తిని పెంపొందించుకొనుచున్నది. ఈ వీర గాథను "శ్రీ అల్లూరి సీతారామరాజు" అను పేర చలన చిత్రమును తీసి నటశేఖరుడు, ఉత్సాహవంతుడు అయిన శ్రీ కృష్ణగారు నిద్రాణమైన ఆంధ్రజాతి పౌరుషమును మరల జాగృత మొనర్చిరి. ఈ వీర గాథకు రూపకల్పన చేసి శ్రీ కృష్ణగారు ఆ విప్లవవీరుని రూపము సత్యముగ ధరించి, తన నటనా ప్రాభవముతో ఆ పాత్రకు ప్రాణము పోసి ఆబాలగోపాలము ప్రజల హృదయ సీమలలో శ్రీఅల్లూరి సీతారామరాజును ప్రతిష్ఠించిరి.

ఇక ఈ గ్రంథమును రచించిన శ్రీ దంతులూరి వెంకటరామరాజు గారు విప్లవ వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజుగారికి మేనల్లుడు. శ్రీ సీతారామరాజుగారి ఏకైక సహోదరికి ఏకైక పుత్రుడు. శ్రీ సీతారామరాజు స్వాతంత్ర్య సంగ్రామ సీమలలో విహరించుచున్న సమయమున వీరు జన్మించిరి. మేనమామ పౌరుష పరాక్రమములు వీరికి అబ్బక పోయినను ప్రతిభాపాండిత్యములబ్బినవి. వారి రాజర్షిత్వము అంటక పోయినను బ్రహ్మర్షిత్వము అంటినది. బహుముఖ ప్రజ్ఞావంతులు, శుద్ధసత్త్వ స్వభావులు. ఆంగ్ల సంస్కృత ఆంధ్రభాషా సాహిత్య శాస్త్రములలో అఖండ ప్రజ్ఞా ప్రాభవములు గలవారు. సంస్కృతమునందును, ఆంగ్లమునందును ఎమ్.ఏ. పట్టములు సంతరించుకొన్నవారు. వేద పురాణాగమ విద్యలలో సముచిత పరిచయము కలవారు. భీమవరము శ్రీ దంతులూరి నారాయణరాజు కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా అధ్యయన అధ్యాపక వృత్తిని నిర్వహించి, పదవీ విరమణ గావించినారు. భారత వీరుడు శ్రీ సీతారామరాజు చరిత్ర సప్రమాణముగ రచించుటలో వారికిగల అర్హతను, బాధ్యతను సహవ్రతులము, మిత్రులము అయిన మేము గుర్తు చేసి ప్రోత్సహించగా వారు ఈ సత్కార్యమునకుద్యమించి శ్రమించి సఫలీకృతులయి, మాతుల ఋణమును తీర్చుకొనుటయేగాక ఆంధ్రజాతి వీర చరిత్రమునకు జీవము పోసిరి.


ఇక ఈ గ్రంథము స్వాతంత్ర్య సమరవీరుల చరిత్రకు మణి దర్పణము. బంధుకోటిని సంప్రదించి, మన్యప్రాంతములు సంచరించి, ప్రభుత్వ పత్రములు పరిశీలించి, పూర్వ రచనలను సంశోధించి, శ్రీ సీతామరాజు ఆ బాల్యము నెఱపిన సాహస కార్యములు, సాగించిన సమర సన్నివేశములు, ప్రదర్శించిన త్యాగలక్షణములు సప్రమాణముగ, సవిమర్శకముగ, పరిశోధనాత్మకముగ శ్రీ దంతులూరి వెంకటరామరాజు గారు ఈ గ్రంథమున వివరించుట కారణముగ ఈ గ్రంథమునొక చారిత్రక దర్పణముగ భావింప వచ్చును. ఇది ఈ గ్రంథమునకు గల విశిష్ట లక్షణము.

సామాన్యముగ వీరులు, శూరులు, త్యాగజీవులు, స్వాతంత్ర్య సమరయోధుల సాహసకార్యములు సంపూర్ణముగ, సర్వసమగ్రముగ, జన సామాన్యమునకు గాని, చరిత్రకారులకు గాని, పరిశోధకులకు గాని, అందుబాటునకు రావు. అది వీర వృత్తమునకు అనాదానముగ వచ్చుచున్న ప్రకృతి ధర్మము. అదియే త్యాగధనుల జీవితవృత్తమునకు మణిదీపిక.

జైహింద్

పెన్మెత్స వెంకటరాజు.

2-6-1984.


AGENCY FITURI 1922-24
REBEL AREA

శ్రీ సుధీనుతమ్ము శ్రీరామ రాట్కథ

తెలుగు పౌరుషమ్ము తెలుపు గాథ

విజ్ఞకోటి వలన విన్నంత కన్నంత

తెలియ వచ్చినంత తేటపఱతు.

# 1. ప్రస్తావన

శ్రీరామరాజు గాథ ఆంధ్రుల యొక్క ఉత్తేజకర స్వాతంత్ర్య వీర గాథ. ఆంధ్రుల హృదయ ఫలకములపై చిరస్మరణీయముగా స్థిరముగా చిత్రింపబడిన విచిత్ర విప్లవగాథ. రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్య శక్తులతో తలపడి అసహాయ శూరుడుగా వెలుగొందిన ఆంధ్ర వీరుని ధర్మయుద్ధగాథ.

పారతంత్ర్య శృంఖలాలను ఛేదించి మాతృదేశ విమోచనము చేయుటకు మహాత్ముని నాయకత్వమున జాతీయ కాంగ్రెసు పరప్రభుత్వముతో అహింసాయుతముగా పోరుసల్పుచుండెను. గాంధీ బోధలచే ప్రభావితుడైనను క్షాత్ర స్వభావ ప్రేరితుడై స్వరాజ్యలక్ష్య సిద్ధికి హింసామార్గము నెన్నుకొని శ్రీరామరాజు తన పాత్ర నిర్వహించబూనుకొనెను. 1857లో గిరిజన ప్రథమ స్వాతంత్ర్య సమరమున మొదట విప్లవ కారులకు విజయములు లభించినను పిదప వీగిపోయిన విధముననే ఈ విప్లవమున గూడ జరిగినది. బ్రిటిషు ప్రభుత్వము అపారబలము ముందు సుశిక్షితులు గానట్టియు, ఆధునిక యుద్ధ సామగ్రి లేనట్టి విప్లవకారులు ఆగలేకపోయిరి. అదియునుగాక స్వదేశీయులే తమను వెన్నుపోటు పొడుచుటయు నిరసించుటయు జరిగినది. అంతిమ విజయము గాంచుటలో విఫలమైనను ధైర్య సాహసములతో ప్రారంభించి సాగించినట్టి వారి అద్భుత కృత్యములు, అకుంఠిత దేశాభిమానము, అమేయత్యాగనిరతి, అచంచల దీక్ష మఱువరానివి. రెండు సంవత్సరములు నిర్విఘ్నముగా కొనసాగిన విప్లవ సమరమును జూచి ప్రభుత్వము కంపించినది. తమ పరువు ప్రతిష్ఠలు మంటగలిసినవని ప్రభుత్వాధికారులు వాపోవుచు నివేదికలు పంపుచుండిరి. విజయమో వీరస్వర్గమో కాని మధ్యే మార్గమెఱుగని మహాసాహసి శ్రీరామరాజు మన్య ప్రజల బాధలను గాంచి మనసు కరిగి వారిని చైతన్యవంతులగు వీరులుగా నొనర్చి సహచరులుగా జేసుకొని రాజయోగి కర్మయోగియై సమరము సాగించి తుదకు తన మూలమున వారనుభవించు ప్రభుత్వ హింసలకు హృదయము ద్రవించి శత్రువునకు ఆత్మార్పణము గావించుకొని కథావశేషమైన కీర్తికాయమును ఆంధ్రావని యందు పాదుకొల్పిన అమర వీరుని గాథ యిది.

*(ఇక్కడ ఒక్క మాట వివరించవలసియున్నది. మహాత్ముని అహింసా వాదమునకు వ్యతిరేకముగా శ్రీరామరాజుది హింసా మార్గము అని చెప్పబడినది కాని దుష్ట శిక్షణ,*

*శిష్టరక్షణ కొరకు అవలంబించబడునట్టియు, యుద్ధమున ఆచరించబడునట్టియు హింస కూడ అహింసలో భాగముగానే మన శాస్త్రకారులు సమ్మతించిరి. శాస్త్రమున విధింపబడనిదియు, స్వార్థపూరితమైనదియు నగు హింస మాత్రమే హింసగా పరిగణింపబడినది. ఈ శాస్త్ర విధులెఱిగిన శ్రీరామరాజు ఆచరించినది అహింసగానే గణింపవచ్చును. అందుచేతనే అతడు అనవసరముగా ఎవ్వరిని చంపుటకుగాని హింసించుటకగాని అనుమతింపలేదు. రామాయణ మహాభారతము లందును, ఇతర శాస్త్ర గ్రంథములలోను ఈ హింసా హింసల విషయము విపులముగా చర్చింపబడి యున్నది.)*

# 2. పూర్వ రంగము

## నాటి రాజకీయ పరిస్థితులు

శ్రీరామరాజు మన్యములో తిరుగుబాటు ప్రారంభించునాటికి ఆంధ్రదేశము రాజకీయ చైతన్యముతో నిండియుండెను. గాంధీజీ మొదటి శాసనోల్లంఘనోద్యమము జరిగిన సమయముననే 1921-24 సంవత్సరముల మధ్య రంపపితూరి అని పిలువబడు శ్రీరామరాజు తిరుగుబాటు గూడ జరిగెను. గాంధీజీ ప్రవేశ పెట్టిన సహాయ నిరాకరణోద్యమ ప్రభావము ఆంధ్రదేశములో మిక్కుటముగా నుండెను. 1916లో అణచి వేసిన లాగరాయి తిరుగుబాటు చాయలు మన్య ప్రజల మనస్సులలో నుండి ఇంకను చెరిగిపోలేదు. 1921లో దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారి నాయకత్వమున జరిగిన చీరాల పేరాల శాసనోల్లంఘనము, 1922లో పల్నాడులో పుల్లరికి సంబంధించిన శాసనోల్లంఘనలో కన్నెగంటి హనుమంతు వీర మరణము, ఆ సంవత్సరములోనే జరిగిన పెదనందిపాడు శాసనోల్లంఘనో దంతము ఆంధ్రదేశములోనే కాక దేశమంతటను సంచలనము రేపినవి. వీనియన్నిటి ప్రభావము శ్రీరామరాజు మనస్సున గాఢముద్ర వేసి యుండవచ్చును.

1920 డిసెంబరు 26వ తేదీని జరిగిన నాగపూరు సమావేశములో న్యాయశాంతి పథమున స్వరాజ్య సంపాదన తన లక్ష్యముగా భారత జాతీయ కాంగ్రెసు ప్రకటించినది. తత్సిద్ధికి అహింసాయుత సహాయ నిరాకరణము, శాసనోల్లంఘనము సాధనములుగా నెంచుకొనినది. దాని ననుసరించి ఆంధ్రదేశమున స్వాతంత్ర్యోద్యమము ఉవ్వెత్తుగా లేచినది. దేశభక్తి గీతములు, ప్రభాతఫేరీలు, ఊరేగింపులు, హరికథలు, భజనలు, సంకీర్తనలు మొదలగు వాని ద్వారా మహోధృతముగా ప్రచారము సాగెను.

1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో బెజవాడలో జరిగిన అఖిలభారతీయ కాంగ్రెసు కమిటీకి వచ్చిన మహాత్మాగాంధీ, మోతీలాల్‌నెహ్రూ, చిత్తరంజనదాసు, పటేల్ మున్నగు జాతీయ నాయకుల ఉపన్యాసములచే ఉత్తేజితులైన ఆంధ్ర ప్రజలు వారి అహింసాయుత సహాయ నిరాకరణము, స్వాతంత్ర్య స్వరాజ్య సందేశములను ప్రచారము చేయసాగిరి. పిదప గాంధీ మహాత్ముని ఆంధ్రదేశ పర్యటన ప్రజలలో అధికరాజకీయ చైతన్యము కలుగజేసినది. న్యాయవాదులు, వైద్యులు మొదలగు వృత్తుల వారు, విద్యార్థులు, కొందరు ప్రభుత్వోద్యోగులు తమ తమ వృత్తులు మాని సహాయ నిరాకరణోద్యమములో

జేరిరి. అబ్కారీ వేలం పాటల నిషేధము, మద్య నిషేధము, గ్రామోద్యోగుల రాజీనామాలు, పన్నుల వసూలు నిరాకరణ ప్రభుత్వ వర్గములలో సంచలనము కలుగజేసినవి. నవంబరులో జరిగిన బ్రిటిషు యువరాజు రాకకు ప్రజలు అనేక విధములుగా తమ వ్యతిరేకతను తెలియజేసిరి.

సహాయ నిరాకరణమే కాకుండ మహాత్ముడు సూచించిన నిర్మాణ కార్యక్రమములో గూడ ప్రజలు చురుకుగా పాల్గొనిరి. చాల చోట్ల బ్రిటిషు న్యాయ స్థానములను నిరాకరించి ప్రజలు పంచాయితీ కోర్టులను స్థాపింప మొదలిడిరి. జాతీయ విద్యాశాలలు వెలకొల్పబడెను. ఖద్దరు పరిశ్రమ, ఖద్దరు వస్త్రధారణ, అస్పృశ్యతా నివారణ, స్వచ్ఛంద సేవకులను సమీకరించుట మున్నగు నిర్మాణ కార్యక్రమములు సాగింపబడెను. మహాత్ముని సబర్మతి ఆశ్రమమువంటి ఆశ్రమములు గూడ కొన్ని చోట్ల స్థాపింపబడెను. అట్టివే నెల్లూరు మండలములోని పల్లిపాడు, గుంటూరు జిల్లాలోని వినయాశ్రమము, రాజమంద్రి దగ్గర సీతానగరము ఆశ్రమమును. ఈ విధముగా 1921 సంవత్సరములో ఆంధ్రదేశములో సహాయ నిరాకరణము, నిర్మాణ కార్యక్రమములకు గట్టి పునాదులేర్పడినవి.

తమ ఆదాయము తరిగి పోవుటకంటె ప్రజలలో రాజకీయ చైతన్యము ప్రబలి తమ అధిపత్యమును ధిక్కరింతురను భావము ప్రభుత్వమునకు ఎక్కువ భయము కలుగజేసినది. అందుచే ఈ ఉద్యమమును అణచి వేయుటకు ప్రజలలో భయోత్పాతము కలుగజేయుటకు ప్రభుత్వము పూనుకొనినది. శిక్షాస్మృతి (Penal code) లో నున్న నిబంధనలన్నియు ఉపయోగించి ప్రజలను జైళ్ళలో త్రోయుచుండిరి. జైలు జీవితము దుర్భరము చేయబడినది. సహాయ నిరాకరణ వాదులకు సానుభూతి చూపువారిని గూడ ప్రభుత్వము అనేక విధములుగా శిక్షించుచుండెను.

1921 నవంబరు 5 తేదీని అఖిల భారత కాంగ్రెసు కమిటీ రాష్ట్ర సంఘములకు వారి వారి పరిస్థితులననుసరించి శాసనోల్లంఘనమునకు అనుమతి నిచ్చినది. చీరాలలో పన్నులు చెల్లింపకుండుట, పల్నాడులో అటవీ నిబంధనోల్లంఘనము అంతకు ముందే ప్రారంభింపబడెను.

చీరాల ఉద్యమము 1921 సంవత్సరము మొదటలోనే దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారి నాయకత్వమున ప్రారంభింపబడెను. ఆయన రామదండు నిజముగా

రామదండువలెనే ప్రజలకు సేవ చేసినది. చీరాల, పేరాల గ్రామములను కలిపి మునిసిపాలిటీగా రూపొందించి ప్రభుత్వము ఎక్కువ పన్నులు విధించినది. ఆ పన్నులు చెల్లించుటకు నిరాకరించి ప్రజలందఱును గ్రామములను పూర్తిగా వదలి మునిసిపాలిటీ హద్దులకు బయట దూరముగా పొలములలో పాకలు వేసికొని గడిపిరి. ఇట్లు ప్రభుత్వము పెట్టుబాధలన్నియు సహించి గోపాల కృష్ణయ్యగారు నిర్బంధింపబడు వరకు 11 నెలలు గడిపిరి.

వీరులకు పుట్టినిల్లగు పల్నాడులో ఈ శాసనోల్లంఘనము ఇంకొక విధముగా జరిగినది. అడవులలో పశువులను మేపుకొనుటకు ప్రజలు అత్యధికమైన పుల్లరి కట్టవలసి వచ్చుచుండెను. 1921 సంవత్సరము వాతావరణము అనుకూలముగా లేక పంటలు సరిగా పండక గడ్డు సంవత్సరము అయినది. ప్రజలు ప్రభుత్వమునకు చేసిన విజ్ఞప్తులు ఫలించలేదు. అప్పుడు ప్రభుత్వాధికారులందరిని ప్రజలు సాంఘికముగా బహిష్కరించిరి. నిత్యావసర వస్తువులు గూడ అధికారులకు దొరుకుట కష్టమయ్యెను. ప్రజానాయకులను నిర్బంధించి శిక్షింపగా ప్రజలు పుల్లరి చెల్లించకుండ తమ పశువులను అడవులలో మేపుకొనదొడగిరి. ప్రభుత్వాధికారులకు ప్రజలకు సంఘర్షణ ప్రారంభమయ్యెను. వారికి నాయకుడు కన్నెగంటి హనుమంతు. 1922 ఫిబ్రవరి 26 తేదీన పోలీసుల సాయముతో అటవీశాఖాధికారులు అడవిలో మేయుచున్న 50 గొఱ్ఱెలను, 120 గేదెలను ముట్నూరులోనున్న బందెల దొడ్డికి తోలుకొని పోవుచుండగా రెండు, మూడు వందల మంది స్త్రీ పురుషులున్న పెద్ద గుంపు వారినెదుర్కొనినది. పోలీసులు తుపాకులు కాల్చిరి. అందు నాయకుడు హనుమంతుతో పాటు ముగ్గురు చనిపోయిరి. చాల మంది గాయపడిరి. పిదప చాల మందిని ప్రభుత్వము నిర్బంధించినది. తరువాత ఈ యటవీ సత్యాగ్రహము పల్నాడులో చప్పబడినది.

బాపట్ల తాలూకా పెదనందిపాడు ఫిర్కాలో పర్వతనేని వీరయ్య చౌదరి గారి నాయకత్వమున పన్నుల నిరాకరణ ఉద్యమము తీవ్రస్థాయి నందుకొనినది. గ్రామాధికారులు మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించిరి. ప్రభుత్వాధికారులకు ప్రజలు ఏ విధముగాను సహకరించకుండ చూచుటకు స్వచ్ఛంద సేవకులు అన్ని చోటులను ఉండిరి. రూథర్‌ఫర్డు ఆ సమయమున గుంటూరు అదనపు కలెక్టరుగా నుండెను. ఈ ఉద్యమము నరికట్టుటకు అతడు ప్రత్యేకముగా నియమింపబడెను.

ప్రజలను అనేక విధములుగా హింసించుటలో అతడు ప్రసిద్ధిగాంచెను. నాయకులకు గూడ కొరడా దెబ్బల శిక్ష విధించెడువాడు. కులతత్వములను రేపి ప్రజలను విడదీయుటకు ప్రయత్నించెను. గ్రామములలో పోలీసు దళములను బెట్టి వారి పోషణ ఖర్చును ప్రజల నుండి బలవంతముగా వసూలు చేసెడివారు. దేశపరిస్థితుల ప్రాబల్యమున పిదప కాంగ్రెసు నాయకులు ఈ యుద్యమమును విరమింపజేసిరి. విరమించిన పిమ్మట గూడ ప్రజలను క్రూరముగా శిక్షించి తన కసిదీర్చుకొనుట రూథర్‌ఫర్డు మానలేదు. కొండా వెంకటప్పయ్య గారిని ఖైదు చేసిరి. క్షమాపణ కోరనిచో వీరయ్య గారిని చంపివేయుదుమని బెదరించిరి. పెదనందిపాడు, పల్నాడు, వినుకొండ తాలూకాల గ్రామములన్నియు రిజర్వు పోలీసులతోడను, అశ్వికదళముతోడను తిరిగి జిల్లా కలెక్టరు ప్రజలను భయపెట్టుచు బ్రిటిషు ప్రభుత్వాధిపత్యమును నిలుపవలెనని యుద్యమించెను. ప్రతి గ్రామములోను అనుమానితులందరిని నిర్బంధించి శిక్షించిరి. దీనితో ప్రజలలో భీతి జనించినది. ఏమైనను ఈ సహాయ నిరాకరణోద్యమము సామాన్య ప్రజలలో గూడ రాజకీయ చైతన్యమును దేశభక్తిని **మేల్కొల్పినది.** చౌరీ చౌరా సంఘటనతో 1922 ఫిబ్రవరిలో శాసనోల్లంఘనోద్యమము **నిలుపవేయబడినను** ప్రజలలో ఉత్సాహము మాత్రము తగ్గలేదు.

1922 **జూన్‌లో అఖిల భారతకాంగ్రెసు** కమిటీ లక్నోలో సమావేశమై నిర్మాణ కార్యక్రమము **చురుకుగా సాగునట్లు** చర్యలు తీసికొనవలసినదని రాష్ట్ర కాంగ్రెసు కమిటీలను ఆదేశించెను. సామూహిక **సత్యాగ్రహ**మునకు దేశప్రజలెల్లరును సమాయత్తమై లేరు గాన ఎన్నికలలో పోటీ చేసి కౌన్సిలు సభ్యులై అచ్చట పోరాటము సాగింపవలెనని చిత్తరంజనదాసు నాయకత్వమున కొందరు కాంగ్రెసు నాయకులు వాదించిరి. రాజగోపాలాచారి మొదలగు స్వరాజ్యవాదులు 1923 డిసెంబరు చివరి వారములో కాకినాడలో జరిగిన కాంగ్రెసు సమావేశములో మితవాదులతో అవగాహనము వచ్చి నిర్మాణ కార్యక్రమమును కొనసాగించుటకును, చివరకు శాసనోల్లంఘనమునకు ప్రజలను ఆయత్తము చేయుటకును తీర్మానించుకొనిరి. సహాయ నిరాకరణకు అందరు అంగీకరించిరి గాని అహింసావాదము కొంత మందికి సమ్మతము కాలేదు. మహాత్ముడు అహింసావాదమునకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చెను. నిర్మాణ కార్యక్రమములో ఖద్దరు ఉత్పత్తికి, ఖద్దరు ధారణకు ప్రాధాన్యమీయబడెను.

1922-24 సంవత్సరముల మధ్య ఇంకొక ముఖ్య సంఘటన ప్రాముఖ్యము వహించినది. శాసనోల్లంఘన విచారణ సంఘమును (Civil Disobedience En-

quiry Committee) ఒక దానిని జాతీయ కాంగ్రెసు నియమించెను. అది దేశ ప్రజల అభిప్రాయములను తెలిసికొనుటకు అన్ని రాష్ట్రములు సంచరించినది. 1922 ఆగస్టు ఒకటో తేదీని ఆ సంఘ సభ్యులు మద్రాసు నుండి గుంటూరు వచ్చిరి. వారు వచ్చుదారిలోనున్న ప్రతి స్టేషనులోను వారికి ప్రజలు బ్రహ్మాండమైన స్వాగతమిచ్చిరి. గుంటూరులో విస్తృతముగా ఏర్పాట్లు చేయబడెను. కాని అంతకు ముందు గవర్నరు వచ్చినను చేయని ఏర్పాట్లు, కోలాహలము ప్రభుత్వాధికారులకు కంటగింపుగా నుండెను. అందుచే ఆ సభను భగ్నము చేయుటకు అన్ని ప్రయత్నములు చేసిరి. 144 సెక్షన్ క్రింద నిషేధము విధింపబడెను. ప్రజలు వచ్చుటకు అనేకమైన అడ్డంకులు కల్పింపబడెను. పోలీసులు పందిళ్ళు లాగివేసి ధ్వంసము చేసిరి. అయినను విశాల మైదానప్రాంతమున సభ జరిగినది. పిదప కలకత్తా వెళ్ళు దారిలో సామర్లకోటలో గూడ కాకినాడ మున్నగు ప్రదేశములనుండి నాయకులు, ప్రజలు స్త్రీలతో గూడ వెల్లువ వలె వచ్చి ఆ సంఘమునకు స్వాగతము చెప్పిరి. ఈ సంఘము యొక్క పర్యటన వలన ఆంధ్రదేశములో సహాయ నిరాకరణోద్యమమునెడ ప్రజలకు నూతనోత్సాహము జనించినది.

ప్రభుత్వము ఏదో యొకమిషపై రాజకీయ కార్యకర్తలను, నాయకులను నిర్బంధించి కేసులు పెట్టుచుండిరి. 'కాంగ్రెసు' పత్రిక సంపాదకులు మద్దూరి అన్నపూర్ణయ్య, కె. రామచంద్రరావు మొదలైన వారిపై నేరారోపణ చేసి చిరకాల శిక్షలు విధించిరి. దేవాలయోత్సవములు మొదలగునవి కూడా జరుగకుండా పోలీసులు అనేకాటంకములు కల్పించిరి. 1923లో జరిగిన కాకినాడ కాంగ్రెసు సమావేశము జరుగకుండా చేయుటకు కూడా గోదావరి జిల్లా కలెక్టరు అగు బ్రాకెన్ శతధా ప్రయత్నించెను. నిజముగా 1922 జూలై తరువాత సహాయ నిరాకరణము, శాసనోల్లంఘనము మొదలగు ప్రభుత్వ వ్యతిరేక సంఘటనలేవియు జరుగలేదు. అందుచే ప్రభుత్వము ఆందోళన చెందుటకు అస్కారము లేదు. అయినను 1922-24 సంవత్సరముల మధ్య ప్రభుత్వము అవలంబించిన అనవసరమైన దమనకాండ ఆశ్చర్యము గొలుపును. సహాయ నిరాకరణవాదుల హృదయములలో భీతిగొల్పి ఆ యుద్యమమును నాశము చేయుటయే ప్రభుత్వ లక్ష్యముగా కనబడును.

1922 ఫిబ్రవరిలో పన్నుల నిరాకరణ ఉద్యమము నిలుపుచేయబడినను, ఆగస్టులో రంప ఏజెన్సీలో ప్రారంభింపబడిన అల్లూరి సీతారామరాజు విప్లవము సహాయ నిరాకరణోద్యమము కంటే ప్రభుత్వమునకు ఎక్కువ కలవరము కలిగించెను. ఈ

విప్లవము ఆనాటి స్వాతంత్ర్యోద్యమములో నొక భాగము గాన దానిని గురించి చదువునప్పుడు తత్పూర్వ రంగమును, రాజును ప్రభావితము చేసిన ఆనాటి రాజకీయ పరిస్థితులను గుర్తుంచుకొనవలెను. మహాత్ముని అహింసాయుత సహాయ నిరాకరణమునకును, ఈ విప్లవమునకు సాధన పద్ధతిలో భేదమే గాని లక్ష్యము రెండింటికిని మాతృదేశ విమోచనమే.

ఈ స్వాతంత్ర్యాది భావములు మన ఆంధ్ర వీరునికి అతని పూర్వుల నుండియే సంక్రమించినవి.

# 3. ఆంధ్ర వీరుని పూర్వులు

మన ఆంధ్ర వీరుని అసలు పేరు శ్రీరామరాజు. ఇతని మాతామహుని పేరు మందపాటి శ్రీరామరాజు. మాతామహుని పేరే ఇతనికి బెట్టిరి. అందుచే అసలు పేరు అల్లూరి శ్రీరామరాజు. సీతారామరాజు అని పేరు మార్చుకొనినట్లును, దానికి కారణములుగా చెప్పబడిన ప్రేమ కథలకును ఆధారము కనబడదు. అతడు కూడా ఎప్పుడైనా వ్రాసినను తన పేరు శ్రీరామరాజు అనియే కాని సీతారామరాజు అని ఎప్పుడును వ్రాసికొనలేదు, వ్రాయలేదు. ఉచ్చారణ సౌలభ్యము చేతనో మరెట్టి కారణముననో ప్రజలలో సీతారామరాజు అని మారినది.


అల్లూరి వారు మొదట తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకాలోని కోమటిలంకలోను, బట్టేలంకలోను స్థిరపడిరనియు, కోమటిలంక గోదావరిలో మునిగిపోగా అప్పటివారు అప్పనపల్లి, అంతర్వేదిపాలెం, గుడిమూల రామేశ్వరము, మోరంపూడి, దిరుసుమఱ్ఱు మొదలుగు గ్రామములకు చెదరిపోయి స్థిరపడినారనియు; బట్టేలంక కుదుటివారు అప్పటనే యుండి గుడిమెళ్లంక, సఖినేటిపల్లి, భుజబలపట్నము (బుదరావపట్నము), చింతలపల్లి మొదలగు గ్రామములకు విస్తరించిరనియు; భుజబలపట్నము, సఖినేటిపల్లి మొదలుగు కొన్ని గ్రామములలో కోమటిలంక, బట్టేలంకలకు చెందిన రెండు కుదుళ్ళ వారును కలరనియు 'ఆంధ్ర క్షత్రియ వంశరత్నాకర కర్త వ్రాసిరి.


కోమటిలంక వంశమునకు చెందిన అల్లూరి రామభద్రరాజు గారు అప్పనపల్లి నుండి గుంటూరు జిల్లా నర్సారావుపేట తాలూకాలోని బొప్పూడి గ్రామము వెళ్ళిరి. వీరికి ఆరుగురు కుమారులు. వీరిలో మూడవ వారు గోపాల కృష్ణం రాజు (శ్రీరామరాజు ప్రపితామహుడు). నాల్గవవారు వెంకటనరసింహరాజు. గోపాలకృష్ణంరాజు ఏకైక పుత్రుడు వెంకట కృష్ణం రాజు (శ్రీరామరాజు పితామహుడు). వెంకటనరసింహరాజు, వెంకట కృష్ణం రాజు మోగల్లు గ్రామము వెళ్లి స్థిరపడిరి. వెంకట కృష్ణంరాజుకు అయిదుగురు కుమారులు. అందు రెండవ వారు వెంకట రామరాజు (శ్రీరామరాజు తండ్రి).

శ్రీరామరాజు ముత్తాతలు ఆరుగురు సోదరులలో ఇద్దరి కుటుంబములు బొప్పూడిలో నున్నవి. అప్పటికి కృష్ణా జిల్లాలో అంతర్భాగముగా నుండిన భీమవరము తాలూకా మోగల్లు గ్రామములో రెండు కుటుంబములు నివాసమేర్పరచుకొనగా ఒక కుటుంబము భీమవరము సమీపములోని రాయలము గ్రామములో నున్నారు. ఒకరికి సంతానము లేదు. అందు శ్రీరామరాజు ముత్తాతగారగు గోపాల కృష్ణంరాజు గారి కుటుంబమునందు పాండిత్యము, జాతీయ భావము, స్వాతంత్ర్య ప్రియత్వము అనూచానముగా వచ్చుచున్నవి.


# బొప్పాడి వంశవృక్షము

అల్లూరి రామభద్రరాజు (అప్పనపల్లినుండి బొప్పాడి వెళ్లిరి)





# మోగల్లు వంశవృక్షం


అల్లూరి రామభద్రరాజు (బొప్పాడి)
(3)
అల్లూరి గోపాలకృష్ణం రాజు
(భార్య : సుభద్రమ్మ)
(4)
వెంకట నరసింహరాజు
(మోగల్లు)
వెంకటకృష్ణంరాజు (మోగల్లు)
(భార్య : సీతమ్మ)
వెంకటరామరాజు
వెంకటకృష్ణంరాజు
నరసింహరాజు
గోపాలరాజు
వెంకట రామరాజు
(చివటి రామరాజు)
సత్యనారాయణరాజు
శ్రీరామరాజు
భోజరాజు
రామచంద్రరాజు
వెంకటరామరాజు
(భార్య :
సూర్యనారాయణమ్మ)
రామకృష్ణంరాజు
రంగరాజు
రామభద్రరాజు
రామరాజు
నారాయణరాజు
వెంకటకృష్ణంరాజు
గోపాలకృష్ణంరాజు
శ్రీరామరాజు
(విప్లవవీరుడు)
సీతమ్మ
(భర్త : దంతులూరి
వెంకటపతిరాజు)
సత్యనారాయణరాజు
(జి. బాపనమ్మూరి)
(విశ్వంపేట
దంతులూరివారి
అల్లుడు)
దం. వెంకటరామరాజు
(గ్రంథకర్త)
శ్రీరామరాజు
వెంకట సుబ్బరాజు
తిరుపతిరాజు

# 4. అల్లూరి కుటుంబములోని కొందరు ముఖ్యులగు వ్యక్తులు

శ్రీరామరాజు ముత్తాతగారగు గోపాలకృష్ణంరాజుగారిని గురించిన గాథ యొకటి అతని పినతండ్రి కుమారుడగు డాక్టరు వెంకటకృష్ణంరాజు చెప్పుచుండెడువారు. గోపాల కృష్ణంరాజు గారు మంచి బలశాలి. కర్రసాము మొదలుగు వానిలో ఆరితేరిన వారు. ధైర్య సాహసములకు పెట్టినది పేరు. ఆయన చేతిలో కర్రయున్నచో పదిమంది బలిష్ఠులయినను దగ్గరకు చేరలేకపోయెడి వారట. ఒకసారి దూరముగానున్న ఊరికి వెళ్లి కొంత డబ్బుతో ఇంటికి వచ్చుచుండెను. దారిలో చీకటి పడినది. అప్పట దొంగల భయమున్నను మొండి ధైర్యముతో త్వరగా నడిచి వచ్చుచుండెను. ఇంతలో చీకటి బాగుగా పడుటయు పది పండ్రెండుగురు దొంగలు కర్రలతో అడ్డగించిరి. ఆయన దగ్గర కర్ర అప్పుడు పెనుగులాటలో జారిపోయినది. వట్టి చేతులతో కాళ్ళతో దొంగలను విసరివైచి కొంత సేపు దెబ్బలాడిరి. కాని దొంగల సంఖ్య ఎక్కువగుటచే వారు అందినచోట నెల్ల ఆయనను కర్రలతో బాది డబ్బు సంచిని లాగుకొనుటకు ప్రయత్నించిరి. కాని ఆయన క్రిందబడి సంచిని పొట్ట క్రింద భద్రపరచుకొని దెబ్బలు తిని సహించుచు దగ్గరకు వచ్చి అందిన వారిని చేతులతోడను కాళ్ళతోడను భూమిపై విసరి కొట్టెడు వారు. వారు దగ్గరకు చేరలేకపోయిరి. అలసట వచ్చునంత వరకు కొట్టు చుండిరి చాలా సేపటికి మనుష్యులు వచ్చు అలికిడి కాగా దొంగలు పారిపోయిరి. ఆ బాటసారుల సాయముతో ఆయన డబ్బు సంచితో ఇంటికి చేరుకొనిరి 10,15 రోజుల వరకు గాయములతో మంచము నుండి లేవలేకపోయిరట.

గోపాల కృష్ణంరాజుగారి సోదరి రాజయ్యమ్మగారు సంస్కృతములో మంచి పండితురాలు. ఆమెను 'పండిత రాజయ్యమ్మగారు' అని పిలుచుచుండెడివారు. ఆమె అత్తవారు మోగల్లు గ్రామములోని పెన్మెత్స వారు. ఆమె కాపురమునకు వచ్చిన తరువాత గూడా గుంటూరు మండలము నుండి సందేహనివృత్తి కొరకు పండితులు ఆమె వద్దకు వచ్చు చుండెడి వారు. కాశీ నుండి కూడా పండితులు ఆమె వద్దకు వచ్చుచుండెడివారని చెప్పుదురు.

ఈ కుటుంబములో శ్రీరామరాజు అను పేరుగల ఇంకొక ప్రసిద్ధ వ్యక్తిగలరు. వీరి తాతగారును, శ్రీరామరాజు ముత్తాతగారును సహోదరులు. మరియు వీరును శ్రీ

రామరాజు తండ్రిగారగు వెంకట రామరాజును అక్కసెల్లెండ్ర బిడ్డలు. ఈ రామరాజుగారి సోదరులు ముగ్గురిలో ఈయన మూడవవారు. వీరి అసలు పేరు వెంకట రామరాజు. కొంత కాలము వీరు శ్రీ రామరాజు కుటుంబముతో నున్నప్పుడు ఉభయుల పేర్లు ఒక్కటియే యగుటచే వీరి ఉత్తరములు శ్రీరామరాజు తండ్రిగారు తనవే యనుకొని చింపి చూచెడువారట. అందుచేత తన పేరులో నున్న 'వెంకట' విడిచి రామరాజు అని పేరు మార్చుకొనిరట. వీరికి చెవుడు కలదు. అందుచే వీరికి 'చెవిటి రామరాజుగారు' అని వాడుక కలదు. వీరు అత్యంత మేధావి. పట్టభద్రుడు. సంస్కృత హిందీ భాషలు కూడా బాగుగా వచ్చును. వివాహము చేసికొనుటకు ఒప్పుకొనక బ్రహ్మచారిగానే యుండిరి. మదరాసులో అనిబిసెంటు పుస్తక భాండాగారమున గల గ్రంథములెల్ల చదివి పిమ్మట కాశి వెళ్ళి కొంత కాలము చదువుకొనిరి. వీరు కాశిలో నుండగా అనిబిసెంటు కారాగారమునుండి విడుదల చేయబడెను. అప్పుడు వీరు విజయనగరము మహారాజుగారి సంస్థానమున కాశిలో తహసీల్దారుగా నున్న నడింపల్లి వెంకటపతి రాజుగారి యింటిలో నుండిరి. ప్రజలు అనేక మంది అనిబిసెంటును చూచుటకు రైలు స్టేషనుకు వెళ్లు చుండిరి. వెంకటపతి రాజుగారికి కూడా వెళ్లి చూడవలయునని యున్నది కాని రామరాజుగారు ఏమందురోయను సందేహముతో నుండిరి. ఎటులనో వెళ్లి తిరిగి వచ్చిరి. వచ్చుటతోడనే రామరాజుగారు "మీరు ఎక్కడకు వెళ్లితిరి?" అని యడిగిరి. ఆయన "స్టేషనకు వెళ్ళితిని" అనిరి. అప్పుడు రామరాజుగారు "మీకు ఇంకను చిన్న తనపు చేష్టలు పోలేదు. ఎవరి విధి వారు నెరవేర్చెదరు. అందు ఆశ్చర్యమేమున్నది?" అనిరట. ఆ దినములలో రామరాజు గారు అనేక సాంఘిక సంక్షేమ కార్యములు తలపెట్టిరి. భీమవరము తాలూకాలో 'అనరరీ కో ఆపరేటివ్ సూపర్వైజరు'గా కొంత కాలము పనిచేసి అనేక పరపతి సంఘములు స్థాపించిరి. రాజపుత్ర సమాజము స్థాపించి క్షత్రియులలో బీద విద్యార్థులకు విద్యార్థి వేతనము లిచ్చునట్లు ఏర్పరచి చదువులు చెప్పించిరి. క్షత్రియులలో లక్ష్మీ పుత్రులు చాలా మంది కలరు. కాని వారికి విద్యపై శ్రద్ధ యుండెడిది కాదు. బీద వారైనను చదువుకొందురని రాజపుత్ర సమాజము స్థాపించి రామరాజుగారు నిర్మొగమాటముగా చందాలు అడిగి వసూలు చేసెడివారు. రాజపుత్ర సమాజ సభలకు వచ్చిన వారికి వంటలు చూచి "మీరు కేవలము భోజనమునకు వచ్చితిరా? ఈ సంభారములన్నియు ఎందులకు?" అనెడి వారట, ఈ యుదంతములు అన్నియు నడింపల్లి వెంకటపతిరాజుగారు చెప్పుచుండెడివారు. రామరాజుగారు సూక్ష్మగ్రాహి, వేదాంతి. ఆసనములు వేయుట, భోజనము మాని ఆకులలములు తినుట, నీరు త్రాగి ఆసనము ద్వారా విడుచుట మొదలగు హఠయోగ ప్రక్రియలను అభ్యాసము చేసెడువారు. కొంత కాలమునకు ఆరోగ్యము చెడి భీమవరము తాలూకా చోడవరములో స్వర్గస్థులైరి.

# శ్రీరామరాజు పితృవ్యులు

శ్రీరామరాజు పితృ సోదరులు అయిదుగురు. అందు జ్యేష్ఠుడగు రామచంద్రరాజుగారు మంచి సంస్కృత పండితులు. జ్యోతిషాది శాస్త్రములలో దిట్ట. ఆయనకు మగ సంతానము లేదు. మొదటి భార్యయందు కలిగిన అమ్మన్నమ్మ అను నామెను నరసాపురము తాలూకా అలమూరు గ్రామ వాస్తవ్యులగు పెన్మెత్స భగవానురాజు గారికిచ్చి వివాహము చేసిరి. రెండవ భార్యయందు కలిగిన సత్యవతి అను నామెను పెంప వాస్తవ్యునికిచ్చి వివాహము గావించిరి. రామచంద్రరాజు గారు పెంపలోనే నివసించెడువారు. అచటనే స్వర్గస్థులైరి.

రెండవ వారు శ్రీరామరాజు తండ్రి. వారిని గురించి తరువాత వేరుగా వివరింపబడుచున్నది.

మూడవ వారగు రామకృష్ణంరాజుగారు ప్రభుత్వోద్యోగములో చేరి ఉన్నత పదవు లాక్రమించి డిప్యూటీ కలెక్టరుగా పనిచేసి 1925వ సంవత్సరమున ఉద్యోగ విరమణ చేసిరి. ఆయనపై గాంధీ సిద్ధాంత ప్రభావము మెండుగా నుండెడిది. ఆయన నమ్మిన దానిని క్రమశిక్షణతో దృఢదీక్షతో ఆచరణలో పెట్టెడువారు. సత్య ధర్మములను పాటించుటలో నిర్భీకుడు. ఉద్యోగ విరమణ చేసిన పిమ్మట భీమవరము శివరావుపేటలో స్థిరపడిరి. గిరిజాల జుట్టు తీయించివైచి, గాంధీవలె చొక్కా కూడా తీసివైచిరి. ఉద్యోగము నుండి విరమించిన తరువాత పెక్కు 'ఆనరరీ' ఉద్యోగములు చేసిరి. (1) 1937లో రాజగోపాలాచారి మంత్రి వర్గములో ఋణ పరిష్కార శాసనమునకు సంబంధించిన దావాలు విచారించు అధికారమును ప్రభుత్వము వీరికిచ్చినది. (2) హరిజన సేవా సంఘమునకు అధ్యక్షులు. (3) భీమవరములో ప్రకృతి చికిత్సాలయము స్థాపించి నడిపించిరి. ఆయన క్రమ శిక్షణకు ఉదాహరణముగా ఇచ్చట ఒక యుదంతమును పేర్కొనవలెను. అప్పటి మంత్రి డాక్టరు సుబ్బరాయను ప్రకృతి ఆశ్రమమును చూచుటకు వచ్చి అంతయు చూచుచు సిగరెట్టు కాల్చి ఆ యావరణలో పారవైచెను. అప్పుడు రామకృష్ణంరాజు గారు చూచి "ఈ యావరణలో ఇట్టి పనులు చేయగూడదు." అనిరి. మంత్రి ఆశ్చర్యపడి ఇంటి పేరు అల్లూరి అని యుండుటచే "శ్రీరామరాజు మీకు ఏమగుదురు?" అని ప్రశ్నించెను. రామకృష్ణంరాజుగారు "మా యన్నగారి కుమారుడు' ' అని చెప్పిరి. అందువలననే మంత్రియును సంశయము కూడా లేకుండా అట్లు మందలించిరి అని డాక్టరు సుబ్బరాయను అనుకొనెను. (4) క్షత్రియ బాల వితంతు వివాహ సంఘమునకు అధ్యక్షులుగా నుండి ప్రథమ బాల వితంతు వివాహము

చేయించుటకు చాలా కృషి చేసిరి. ఆంధ్ర దేశమంతయు తిరిగి ప్రముఖ క్షత్రియులచేత అట్టి సంఘ సంస్కరణకు ఒప్పుకొనినట్లుగా సంతకములు చేయించిరి. ఇట్లు అనేక పదవులలో నుండి విశ్రాంతి లేని ప్రజా సేవ చేసిరి. ఆయన అత్తవారి ఊరు విశాఖమండలములోని లింగరాజు పాలెం గ్రామము. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు పుత్రికలు. పుత్రికలలో సరస్వతి అను నామెను భీమవరము తాలూకా కుముదవల్లి వాస్తవ్యులును స్వాతంత్ర్య సమరయోధులును అగు భూపతిరాజు రామమూర్తి రాజుగారికిచ్చి వివాహ మొనరించిరి. రెండవ పుత్రిక సత్యవతి అనునామెను విశాఖ జిల్లా అలమండ వాస్తవ్యులు పెన్మెత్స అప్పల వెంకట కృష్ణంరాజు గారికిచ్చి వివాహము గావించిరి. రామకృష్ణంరాజు గారు పింఛను తీసికొనుచున్నను కాశిలో చదువుచున్న నారాయణరాజు అను రెండవ కుమారుని వెంటనే కాలేజి విడిచి వచ్చి ఉప్పు సత్యాగ్రహములో పాల్గొనమని ఉత్తరము వ్రాసిరి. పిదప ఈ కుమారుడు అవివాహితుడుగానే మరణించెను. జ్యేష్ఠ కుమారుడగు రామరాజును మదరాసు పంపి నేత శిక్షణ పూర్తియయిన పిమ్మట గుంటూరు, తెనాలి, బాపట్ల మొదలగు ప్రదేశములనుండి దూది తెప్పించి వడికించి, ఖద్దరు బట్టలు నేయించి అమ్మించుచుండెడువారు. అందులో పదివేలు నష్టము వచ్చెను. ఈ విధముగా గాంధీజీ ప్రబోధించిన నిర్మాణ కార్యక్రమము సంఘ సంస్కారములకు కృషి చేయుచు ప్రజాసేవ చేయుటకు రాజకీయములలో పాల్గొనుచుండిరి. తుదకు రాజకీయ రంగమునందే ఆత్మబలి దానము గావించిరి.

1937 సంవత్సరములో అవిభక్త మద్రాసు రాష్ట్రములో కాంగ్రెసు ప్రభుత్వము ఏర్పడిన పిమ్మట భీమవరము పంచాయతీ బోర్డుకు కాంగ్రెసు సభ్యుడుగా రామకృష్ణంరాజు గారు ఎన్నికైరి, బోర్డుకు కాంగ్రెసు సభ్యులు నలుగురు మాత్రమే ఎన్నుకోబడిరి. జస్టిసు పార్టీ ప్రాబల్యముగల రోజులవి. రామకృష్ణంరాజు గారు పూర్వము ప్రభుత్వోద్యోగి యగుటచే అధ్యక్షుని ఎన్నిక అగు వరకు వీరినే తాత్కాలికాధ్యక్షునిగా ప్రభుత్వము వారు ఏర్పరచిరి. ఆయన బోర్డులోగల అవకతవకలు, ధనాపహారణము మున్నగునవి బయటపెట్టిరి. అందుచే వానిలో ప్రమేయమున్న వారికి శిక్షలు తప్పవను భీతిచే ఒక రాత్రి వారి పడక గదిలో ఎవరో ప్రవేశించి ఆయనను వధించి రికార్డునంతయు ఎత్తుకొని పోయిరి. ఈ విధముగా రామకృష్ణం రాజుగారు క్రీస్తు, గాంధీవలె సత్యమునకై 1939 మే నెలలో ప్రాణము లర్పించిరి. పిమ్మట అట్టి దుష్కృత్యము చేయించిన వానికి కుమారుడు పోయెననియు, వానికి కుష్ఠువ్యాధి సంభవించెననియు ప్రజలు చెప్పుకొనిరి. ఇట్లు ఆంధ్ర వీరుని కుటుంబ సభ్యులు నిర్భీకులు, సత్యవ్రతులు, జాతీయవాదులు, దేశ సేవా పరాయణులును.

శ్రీరామరాజు పితృవ్యులలో నాలుగవ వారగు రంగరాజు గారు లోకల్ ఫండు ఓవర్సీరుగా కొంత కాలము పనిచేసి స్వతంత్ర్య జీవనము చేయునుద్దేశముతో ఆ యుద్యోగమునకు రాజీనామా చేసి అప్పటి తూర్పు గోదావరి జిల్లా వెంకటాపురము (నూగూరు) తాలూకాలోని తేగడ గ్రామమము వద్ద 50 ఎకరములు భూమిని తీసికొని వ్యవసాయము చేయునుద్దేశముతో అక్కడనే యుండి అచ్చటనే కాలధర్మము నొందిరి. ఆయన మహాత్ముని దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమునకు సహాయపడుటకు ఒక సంఘము నేర్పరచి కొంత సొమ్ము వసూలు చేసి మహాత్మునికి పంపినట్లు కూడా తెలియుచున్నది. రంగరాజు గారికి రెండు వివాహములు జరిగినవి. మొదటి భార్య పుట్టినిల్లు విజయనగర మండలములోని గర్భాంగ్రామము. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలిగిరి. కుమారుడగు వెంకట కృష్ణంరాజు మద్రాసులో డాక్టరు పరీక్షలో ఉత్తీర్ణులై మొదట చాలా కాలము గుంటూరు జిల్లా తెనాలి తాలూకా తురుమెళ్ల గ్రామములోను, పిదప రెండవ ప్రపంచ యుద్ధ సమయమున చర్ల, కాకినాడ, బందరు మొదలుగు చోట్లను ప్రభుత్వ డాక్టరుగా పనిచేసిరి. చివరకు భద్రాచలమునకు 60 మైళ్ల దూరములో చర్ల దగ్గరగల క్రొత్తపేట గ్రామమున స్థిరపడి వ్యవసాయము సాగించి పిదప దివంగతులైరి. ఇక జ్యేష్ఠ పుత్రిక యగు సత్యవతిని తణుకు తాలూకా పెనుమంట్ర మునసబు అగు దాట్ల అచ్యుత రామరాజు గారికిచ్చి వివాహ మొనరించిరి. రెండవ కుమార్తెయగు చిట్టి కొండమ్మను విశాఖ మండలములోని అలమండ గ్రామ వాస్తవ్యులగు డాక్టరు కమ్మెల బుచ్చి రాజుగారికిచ్చి వివాహము కావించిరి. రంగరాజుగారి రెండవ భార్య పుట్టినిల్లు కాకినాడ తాలూకా పైన (రాజుపాలెం) గ్రామము. ఆమెకును గోపాల కృష్ణంరాజు అను ఒక కుమారుడును, సూర్యావతి, కొండమ్మ అను నిద్దరు కుమార్తెలును జనించిరి. కుమారుడు అన్న గారగు డాక్టరు వెంకట కృష్ణం రాజుగారితోపాటు చర్ల సమీపములో వ్యవసాయము చేయించుచు అవివాహితుడుగానే మరణించెను. కుమార్తెలలో పెద్ద కుమార్తె అగు సూర్యావతిని పైన గ్రామ వాస్తవ్యులగు దాట్ల వెంకటేశ్వర రాజునకిచ్చి వివాహము చేసిరి. కొండమ్మ కూడా వివాహితయే.

ఐదవ వారగు రామభద్రరాజుగారు వివాహమైన పిదప సంతానము లేకుండగనే మరణించిరి.

శ్రీరామరాజు తండ్రి వెంకట రామరాజుగారు స్కూలు ఫైనలు వరకు చదువుకొనిరి. సంస్కృతమును కూడా నేర్చుకొనిరి. ఈయనకు బాల్యము నుండియు ఫోటోలు తీయుట, చిత్రలేఖనము, మ్యాజికులాంతరు ప్రదర్శనములందు సరదా. యుక్త వయస్సు రాగానే వీరి మేనమామలు పాలమూరు వాస్తవ్యులైన చింతలపాటి సుబ్బరాజుగారి కుమార్తెనిచ్చి ఆయనకు వివాహము చేయుటకు సన్నాహములు చేయుచుండిరి. తల్లి నడిగి ఆయన

యథార్థమును తెలిసికొనిరి. ఆయనకు మేనరికము ఇష్టము లేదు. అందుచే తల్లి గారి వస్తువులలో కొంత బంగారము, ఇంటిలోని కొంత సొమ్ము తీసికొని రహస్యముగా బొంబాయి వెళ్ళి అచ్చట చిత్రలేఖనము, ఫొటోగ్రఫీ నేర్చుకొని తిరిగి వచ్చి ఫొటో గ్రాఫరుగా ఆయన జీవితము ప్రారంభించెను. ఆయనకు సూర్య నారాయణమ్మతో 1893లో సింహాచలము దేవాలయమున వివాహము జరిగినది. సూర్యనారాయణమ్మ తండ్రిగారి పేరు మందపాటి శ్రీరామరాజు, తల్లి అచ్యుతమ్మ. అసలు వారి పూర్వీకులది విశాఖ జిల్లా చోడవరము తాలూకాలోని తిమ్మనపాలెము. తరువాత వారు విజయనగరము దగ్గరనున్న భీముని పట్నము తాలూకా పాండ్రంగి చేరి అచ్చట స్థిరపడిరి.

వెంకట రామరాజుగారు ఫొటో గ్రాఫరుగా నర్సాపురములోను, తణుకులోను మొదట స్టూడియో పెట్టిరి. పిదప 1902లో కుటుంబముతో రాజమహేంద్రవరము చేరిరి. ఇప్పటివలె అప్పుడు విరివిగా ఫొటోగ్రాఫరులు లేరు. అందుచే ఈయనయే ఉభయ గోదావరి, విశాఖపట్టణము జిల్లాలలో ఫొటో గ్రాఫరని చెప్పవచ్చును. ఆయనకు వృత్తిలో మంచి ఆదాయము లభించెడిది.

ఈ కుటుంబములోని వారికి తమకు న్యాయమని తోచినది చేయుటయే గాని ఇంకొకరు చెప్పునది వినవలయునను స్వభావము తక్కువ, పట్టుదల హెచ్చు. ఒక ప్రాథమిక పాఠశాలోపాధ్యాయుడు తన చిత్రమును వ్రాయుమని ఎంత కోరినను నిరాకరించెను. భార్య, అత్తగారు మున్నగు వారు బ్రతిమాలినను, "నెలకు తనకు వచ్చు 5 లేక 6 రూపాయలు నాకిచ్చి తానేమి తినును, అటువంటి వానికి నేను ఒప్పుకొనను. కాని, ఇటువంటి వారికి ఒక చిత్రము ఉచితముగా వ్రాసి యిచ్చెదమనినను ఇది విని ఇట్టివారు అనేకులు వచ్చెదరు. వారందరికి ఇచ్చుట సాధ్యమా? అట్టి పని వృత్తికి భంగకరము. దానికి విలువయు నుండదు" అని నిరాకరించిరట. కాని ఆయనకు పేదలనిన చాలా జాలి. శ్రీమంతులననుకరించుచు అనవసరపు వ్యయమునకు బోయి కుటుంబమును కష్టములలో ముంచునని అట్లు అనిరట.

వెంకట రామరాజు గారు 1908లో మరణించు వరకు ఫొటో గ్రాఫరు వృత్తిని జయప్రదముగా కొనసాగించిరి. రాజమండ్రి సెంట్రల్ జైలులోని ఫొటోలు ఆయనయే తీసెడివారు. వారు తీసిన ఫొటోలు తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ మున్నగు నాయకులవి. విక్టోరియా మహారాణి, కోడి రామమూర్తి మొదలగు వారి ఫొటోలును చాలా కాలము వరకు వారి యింట నుండెడివి. ఆ రోజులలో తూర్పు పశ్చిమ గోదావరి డెల్టా గ్రామములకు వెళ్లుటకు పడవలు తప్ప అధారము లేదు. రాజమహేంద్రవరములో చినస్వామి, పెదస్వామి అను వారలు అన్ని కాలువలపైనను సరుకులను మనుష్యులను తీసికొని వెళ్లుటకు రహదారి పడవలు నడిపెడువారు.

ఎక్కడకు ఎన్నిసార్లు ప్రయాణము చేసినను వెంకట్రామరాజుగారికి పడవలో గది ఉచితముగా నిచ్చెడివారు. వారి ఇండ్లలో ఎన్ని ఫొటోలు తీసినను ఆయన ఉచితముగానే తీసెడివారు. అట్లే కోడి రామమూర్తి సర్కసు వచ్చినప్పుడు ఫొటోలు ఉచితముగా తీసెడు వారు.

1904 సంవత్సరమున వంగ రాష్ట్ర విభజన జరిగినది. దానికి అసమ్మతిగా వందేమాతరం ఉద్యమము జనించినది. వెంకట రామరాజు గారిని కూడా ఈ జాతీయోద్యమము ఆకర్షించినది, ఆయన ఉద్యమములో పాల్గొనలేదు. గాని 'వందేమాతరం, మనదే రాజ్యము' అని తరచు ఉద్రేకముతో ఇంటిలో పాడుచు ఆ రోజుననే స్వాతంత్ర్యము వచ్చినట్లు సంతోషించుచుండెడువారు. తప్పే ప్రధానముగా నెంచక గౌరవమునకై ప్రాకులాడుటయు, పట్టుదలయు, స్వాతంత్ర్య ప్రియత్వము, జాతీయతా భావములు మిక్కుటముగాగల వ్యక్తి వెంకటరామరాజుగారు. అట్టి మహనీయునికి శ్రీరామరాజు వంటి ఆంధ్ర వీరుడు పుట్టుట వింతకాదు.

శ్రీరామరాజు తల్లి సూర్యనారాయణమ్మ మహాసాధ్వి. ఆ రోజులలో స్త్రీలు, ముఖ్యముగా క్షత్రియ స్త్రీలు, బయటకు కనబడెడువారు కారు. ఎక్కడికైనను బయటికి వెళ్ళవలసి వచ్చినచో పరదాలు వేసిన మేనాలోగాని తెరలు గట్టిన బండ్లలో గాని వెళ్లెడువారు. స్త్రీల మాటలుగాని, అడుగుల చప్పుడుగాని ముందు గదులలోనికి వినబడుట గూడ తప్పుగా నెంచెడువారు. భర్తలకు పగలు కనబడుట కూడా కొన్ని కుటుంబములలో నిషిద్ధము. భర్త భోజనమైన పిదప ఆయాకులోనో, కంచములోనో వడ్డించుకొని భార్య తినుట అప్పటి ఆచారము. భర్త ఎప్పుడైనను పొరుగూరికి వెళ్లినప్పుడు సూర్యనారాయణమ్మ గారు భర్త తిను ఆకులో ఉప్పు కొంచెము ఎక్కువగా వేసి దాచుకొని ఆయన లేప్పుడు ఆ ఉప్పు కొంచెము వేసికొని భోజనము చేసెడి వారట.

సూర్యనారాయణమ్మగారి చదువు ఇంటి వద్దనే నేర్చుకొనిరి. కాని ఆమెకు ఎన్నియో శతకములు, కావ్య భాగములు కంఠోపాఠము. ఆమెకు బాగుగా వయస్సు ముదిరిన తరువాత గూడా సుమతీ శతకము, కుమారీ శతకము, కృష్ణ శతకము, దాశరథీ శతకము, భాస్కర శతకము, నృసింహ శతకము, నారాయణ శతకము, గజేంద్ర మోక్షము, వామనావతార ఘట్టము, ప్రహ్లాద చరిత్ర, రుక్మిణీ కల్యాణము, విజయ విలాసము, ఉత్తర రామాయణము మున్నగు గ్రంథములలోని పద్యము లెన్నియో పుస్తకాపేక్ష లేకుండా ధారాళముగా చదువుచుండుట నేనెరుగుదును. తీరికగా నున్నప్పుడు కుశలాయకము, సీత పెండ్లి, ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణదేవర నవ్వు మొదలైన స్త్రీల పాటలను, అధ్యాత్మరామాయణ కీర్తనలు, రామదాసు కీర్తనలు పాడుకొనుచుండువారు. ఇవికాక పూజా సమయములో పూజా విధాన మంత్రములు, స్తోత్రములు, అష్టోత్తర నామములు

పుస్తకమక్కర లేకుండా ఆమెయే చదువుకొని పూజ చేసికొనెడి వారు. దాన ధర్మములు చేయుటలో ఆమె చేయి పెద్దది. బీదసాదలు వచ్చి అడిగినచో ఎప్పుడు వచ్చినను లేదనకుండా మరల వండియైనను పెట్టి సంతుష్టి పరచి పంపెడువారు. బంధుమిత్రులు ఎక్కువగా వీరి ఇంటికే వచ్చెడి వారట. "వంతనలయందు వేవురు వచ్చిరేని, నన్నపూర్ణకు నుద్దియౌనతని గృహిణి, అతిథులేతేరవడికి రేయైన బెట్టు, వలయు భోజ్యంబులింట నవ్వారిగాగ" అని పెద్దన గారు వర్ణించినట్లు ఆ గృహము నిత్యాగ్ని హోత్రముతో నుండెడిది. ఎవ్వరెప్పుడు వచ్చినను షడ్రసోపేతముగా వారికి భోజనము పెట్టి సంతృప్తి పరచి, ఒక్కొక్కప్పుడు దారి భత్యము కూడా ఇచ్చి పంపెదు వారు. ఈ పుస్తక పఠనాసక్తి, భక్తి భావము సూర్యనారాయణమ్మగారికి ఆమె తల్లినుండి సంక్రమించగా ఈ గుణములు ఆమె సంతానమునకును సంక్రమించినవి.

వీరి సంతానము ముగ్గురు. 1) శ్రీరామరాజు, 2) సీతమ్మ, 3) సత్యనారాయణరాజు.

శ్రీరామరాజు స్వస్తిశ్రీ చాంద్రమాన హేవిళంబి నామ సంవత్సర ఆషాడ శుద్ధ చవితి తత్కాల పంచమీ భానువారము ఘ. 23-30 విఘడియలకు (4-7-1897 సాయంకాలము 4 గంటలకు) మఖా నక్షత్ర చతుర్థ చరణ యుక్త వృశ్చిక లగ్నమందు జనించెను. జనన కాలకేతు మహాదశా శేషము సం.వె.10-రో. 16.

| | | | | |
|---|---|---|---|---|
| శు / బు ర | | రా కు | ర | శు |
| కే | రాశి చక్రము | రా చ శ | అంశ చక్రము | |
| గు కు చ | | ల శ గు | | బు / కే |

(పునం 1 అర్క:, మఖా 4 చంద్ర:, మఖా 3 కుజ:, ఆర్ద్రా 1 బుధ:, పూ.షా. 1 గురు:, కత్తి 3 శుక్ర:, విశా 4 శని:, శ్రవ 3 రాహు:, పుష్య 4 కేతు:)

విశాఖ మండలములోని పాండ్రంగిలో మాతామహుని ఇంట జననము, మాతామహుని పేర శ్రీరామరాజు అను నామకరణము చేయబడెను.



సీతారామరాజు (బాల్యంలో)

సీతమ్మ 1901లో స్వగ్రామమగు మోగల్లులో జన్మించెను.

వెంకట రామరాజుగారు రాజమహేంద్రవరములో స్థిరపడుటకు 1902లో నిశ్చయించుకొనిరి. ఇన్నీసుపేటలో మెయిన్ రోడ్డులో జవ్వాది వారి కొట్లలో ఒక భాగము అద్దెకు తీసికొని స్టూడియో పెట్టుకొనిరి. కొంత కాలము చింతలూరి లక్ష్మీనారాయణ గారను ప్లీడరు గారి ఇంటిలో కాపురముండిరి. ఫొటోగ్రఫీ వృత్తిలో బాగుగనే సంపాదించెడువారు. ఆ రోజులలో నెలకు 100 రూపాయలనుండి 200 రూపాయల వరకు వచ్చెడిది. కాని ఖర్చు కూడా అధికముగనే యుండెడిది. వంటరాజు, పని మనుష్యులు ఉండెడివారు. అవసరమునకు మించి ఖర్చు చేసెడివారు. "ఇదేమిటి బాబూ, ఈ అనవసరపు ఖర్చులెందుకు అని ఎవరైనను అనినచో "పరవాలేదండీ, నాకంటె నా పిల్లలు తెలివైన వాళ్ళు. నేను పందలు తెచ్చుకుంటే వాళ్ళ వేలు తెచ్చుకుంటారు. రేపటికుంటే చాలు, ఎల్లుండికి చూచుకోవచ్చును" అనెడి వారట. అట్లే ఆయన జీవితము ఏ లోటును లేకుండా గడిచినది.

రెండవ కుమారుడగు సత్యనారాయణరాజు 1906లో రాజమహేంద్ర వరములో జననమందెను.

1908 సంవత్సరములో భాస్కరరావు అను వైద్యుల ఇంటిలో కాపురముండిరి. ఆ యేడు గోదావరి పుష్కర ప్రవేశము, బంధువులు చాలా మంది వచ్చిరి. వెంకట రామరాజుగారి ఆదాయము, ఖర్చులు, జీవనము చూచి ఆశ్చర్యపడిరి. ఆ యేడే అట్లతద్దినాడు (కీలకనామ సంవత్సర ఆశ్వయుజ బహుళ తదియ) అకస్మాత్తుగా కలరాసోకి వెంకట రామరాజుగారు స్వర్గస్థులైరి. వెంటనే టెలిగ్రాములీయగా తమ్ములు రామకృష్ణంరాజు, రంగరాజు గారలు వచ్చిరి. శ్రీరామరాజు విద్యాభిలాష గలవాడగుటచే "నాన్నయ్యా, మాకు చదువులు ఎవరు చెప్పించెదరు?" అని యేడ్చెను. పినతండ్రులోదార్చిరి. ఈ విధముగా పచ్చని కుటుంబ జీవితమున విషాదచ్ఛాయలు అలముకొనినవి.

తండ్రి మరణించు సరికి శ్రీరామరాజు రాజమహేంద్రవరములో మొదటి ఫారము చదువుచుండెను. తల్లిదండ్రులును, బంధువులును శ్రీరామరాజును 'చిట్టిబాబు' అని గారముతో పిల్చెడువారు. బాల్యముననే తండ్రిని కోల్పోయిన ఈ బిడ్డలకు ఇక తల్లియే దిక్కు, అయినను విశాల హృదయులగు పినతండ్రి రామకృష్ణంరాజు గారు అన్నగారి కుటుంబమును అనేక విధములుగా ఆదుకొనిరి.

# 5. బాల్యము, విద్యాభ్యాసము

శ్రీరామరాజు బాల్య జీవితము కష్ట పరంపరలతో కొనసాగినది. తండ్రిగారి ఆకస్మిక మరణముతో కుటుంబ స్థిర జీవితము దెబ్బ తినెను. ఒక చోట నిలకడ లేకపోయినది. బంధువులున్న ఊళ్ళలో కాపురము పెట్టుచు చాల ఊళ్లు తిరిగిరి. భర్తృ వియోగ దుఃఖమును దిగమ్రింగి, జ్యేష్ఠుడైన శ్రీరామరాజు కుటుంబమును ఉద్ధరించునని మాతృమూర్తి ఆశించినది. తల్లి మిక్కిలి గారాబముతో పెంచుట వలన శ్రీరామరాజునకు బాల్యమునుండియు పట్టుదల అధికము. తల్లియనిన అమితమైన ప్రేమయు గౌరవమును ఉండెడివి.

యజమాని మరణానంతరము రాజమంద్రిలో కుటుంబమును భరించుట కష్ట సాధ్యమయ్యెను. పట్టణములో ఖర్చు ఎక్కువగును గాన ఏదైనను పల్లెటూరులో కాపురము ఉండవలసినదిగా శ్రీరామరాజు పినతండ్రియగు రంగరాజుగారు సలహా ఇచ్చిరి. అప్పుడు సూర్యనారాయణమ్మగారి చెల్లెలు అగు అప్పల నరసయ్యమ్మగారు ( ఆరోజులలో క్షత్రియ స్త్రీలు అయ్య, అమ్మయ్మ అని పిలువబడెడువారు) భీమవరము తాలూకా కొవ్వాడ గ్రామములో ఉండిరి. అందువలన అచ్చట కాపురముండి తల్లి శ్రీరామరాజును 1909లో భీమవరము మిషన్ హైస్కూలులో ఒకటవ ఫారములో చేర్పించెను. కొవ్వాడనుండి భీమవరమునకు రెండు మైళ్ల దూరము. అప్పటికి రోడ్లు లేవు. వానకాలములో పుంతవెంబడి బురదలో నీళ్లలో అంత దూరము ప్రతి దినము నడువ వలసివచ్చెడిది. అది శ్రీరామరాజునకు కష్టముగా నుండెను. పల్లెటూరి నివాసము గూడ అతనికి ఇష్టము లేకుండెను. అందుచే విరక్తిచెంది చనిపోవు తలంపుతో ఇంటినుండి బడికి పోవుచు 200 గరళపు మాత్రలు గల సీసా పట్టుకొని పోయి ఆ మాత్రలన్నియు నమిలి మ్రింగి వేసెను. ఇంటికి వచ్చునరికి దారుణమైన జ్వరము వచ్చినది. దానితో అతడు మంచమెక్కెను. దాని నుండి కోలుకొనుటకు మూడు నెలల వరకు కఱ్ఱ పట్టుకొని నడువ వలసిన పరిస్థితి ఏర్పడెను. అతడు సూక్ష్మగ్రాహియైనను తండ్రి మరణించుటచే భీమవరములో రెండవ సంవత్సరమునను మొదటి ఫారములో ఉత్తీర్ణుడగుటకు అవకాశములేకపోయినది. అందుచేత అతడు మొదటి ఫారమును మూడవసారి చదువవలసి వచ్చినది. ఈసారి మరల రాజమంద్రిలో 1910లో చేర్పించిరి. అప్పుడు రాజమండ్రిలో అల్లూరి రామరాజుగారు బి.ఏ. చదువుచుండిరి. ఈయనే ఇంతకు పూర్వము చెప్పిన చెవిటి రామరాజుగారు. వీరు తరువాత కాశీకి కూడ వెళ్ళి కొంతకాలము

చదువుకొనిరి. వీరు ఏకసంథాగ్రాహి, వేదాంతియును. యోగాభ్యాసము చేయుచుండెడు వారు. ఇట్టివారి దగ్గరనుండుటవలన చదువు ఎట్లున్నను వేదాంతము పట్ల ఆసక్తి, యోగాభ్యాసమునిన ఉత్సాహము పెంపొందుటకు అవకాశము కలిగెను. హఠయోగ ప్రదీపిక, పాతంజల యోగసూత్రములు మున్నగు పుస్తకములు చదివి క్లిష్ట విషయములు అడిగి తెలిసికొనుటకు వీలు చిక్కెను. మొదటి ఫారము పూర్తి అయినది. ఈ సమయముననే తెలుగు కావ్యములు చదువుట, స్వయముగా పద్యములు వ్రాయుట నేర్చుకొనెను.

ఈ లోగా పినతండ్రియగు రామకృష్ణంరాజు గారు రామచంద్రపురములో మేజిస్ట్రేటుగా నుండిరి. అందువే శ్రీరామరాజును 1911లో అక్కడ రెండవ ఫారములో చేర్పించిరి. ఆ సంవత్సరము మధ్యలో రామకృష్ణంరాజుగారికి బదిలీ యగుటచే వెంటనే కుమారుని చదువు కొరకు తల్లి రామచంద్రపురములో కాపురము పెట్టెను. ఆ మఱుసటి సంవత్సరము 1912లో రామకృష్ణంరాజుగారు కాకినాడలో నుండుటచే శ్రీరామరాజు అక్కడ పిఠాపురము రాజా హైస్కూలులో చేరి మూడవ ఫారము చదివెను. అకుంఠిత త్యాగ ధనులుగా పేరొందిన కాంగ్రెసు నాయకులు మద్దూరి అన్నపూర్ణయ్యగారు కూడ అప్పుడు అదే హైస్కూలులో మూడవ ఫారము చదువుచుండిరి. దివిజనులు మాత్రము వేఱు.

శ్రీరామరాజుకు నాటకములలో వేషములు వేయుట యనిన సరదాగా నుండెడిది. ఆ సంవత్సరము డిసెంబరు 12వ తేదీని 5వ జార్జి చక్రవర్తి పట్టాభిషేక వార్షికోత్సవమును పిఠాపురము రాజా కళాశాలలో జరిపిరి. అప్పుడు పాఠశాల విద్యార్థులు శశిరేఖా పరిణయమను నాటకమును ప్రదర్శించిరి. అన్నపూర్ణయ్యగారు కూడ వేషము వేసిరి. శ్రీరామరాజు శశిరేఖ పాత్రను ధరించి చాల బాగుగా ఒప్పించెననియు, అంతేకాక నారదపాత్ర కూడ బాగుగా ఒప్పించెననియు అన్నపూర్ణయ్యగారు చెప్పిరి. ఈ విషయమును గురించి 1928 జూన్ 19వ తేదీ కాంగ్రెసు పత్రికలో అన్నపూర్ణయ్య గారు ఇట్లు వ్రాసిరి.

"మేమిరువురము ఆ నాటకములో పాత్రలను ధరించితిమి. రాజు స్త్రీ పురుష పాత్రలను రెండింటిని అత్యుత్తమముగ నిర్వహించెను. అతని రూపము, గానాభినయములు సభాసదులను ఆనందపరవశులను చేసినవి. ఆ దివ్య సుందర విగ్రహము ఇప్పటికిని కన్నులకు కట్టినట్లున్నది. ఆ కాలమున ఇతనికి కవిత్వమునందు అభిరుచి హెచ్చుగా నుండెడిది. కొన్ని పద్యములను గూడ అల్లి మనోహరముగ పాడువాడు. నాటకానంతర మితనిలో ఒక గొప్ప మార్పు గోచరించెను. పూర్తిగా పాఠములపై అశ్రద్ధ జనించెను. ఏకాంతవాసమునందు ప్రీతి కలిగెను. నాయందు గల సోదర వాత్సల్యమున

నన్ను మాత్రము తోడ్కొని సముద్రతీరమునకుగాని, కళింగల వైపునకు గాని వెళ్లువారు. ఒకప్పుడు పరిశుభ్రముగా తల దువ్వి తెల్లటి వస్త్రములు ధరించి ఎంతో నీటు గోటులతో నుండు వారు. పాఠములపై శ్రద్ధ చూపక వ్యర్థముగ తిరుగుచున్నందులకు నేనప్పుడప్పుడు మందలింప, ఇది విద్యయా? మన దేశవిద్యయే నిజమగు విద్య. నేను సన్యాసినయ్యెదను. లోకోద్ధరణ కుపకరించు విద్యయే విద్య అని చెప్పెడువాడు. నాకవి పిచ్చియూహలుగా గోచరించినవి. అతనివికావు. నావే పిచ్చి యూహలని 1920 సంవత్సరమున గాని నాకు తెలియలేదు".

1-1-1951 తేదీన కొవ్వూరు వీరమందిరములో రెబ్బాప్రగడ మందేశ్వరశర్మగారు శ్రీరామరాజుగారి చిత్రపటావిష్కరణ అన్నపూర్ణయ్యగారి చేత చేయించిరి. అప్పుడు అన్నపూర్ణయ్యగారు పైని చెప్పిన నాటకపాత్రల విషయమును వివరించి ఇంకను ఇట్లు చెప్పిరి. "మా అన్నగారు ఇంటరులో ఉండడము చేత జార్జిరాజు బొమ్మ కల పతకములు చొక్కాలకు పెట్టుకొనుటకు కొన్ని తీసికొని వచ్చి శ్రీరామరాజు కిచ్చిరి. వానిని వెంటనే అతడు దూరముగా పారవేసాడు. ఒక్కటి మాత్రము గుండె మీద ఉండులాగున ఉంచుకున్నాడు. (కాకినాడ హైస్కూలులో చదువునప్పుడు తీయబడిన గ్రూపు ఫొటోలో శ్రీరామరాజు ఛాతీపై ఒక పతకము ధరించినట్లు కనబడును. దానిని చూపించిరి.) నేను ఎంతో ప్రేమతో ఇస్తే అవి తృణీకరించి పారవేసినందుకు నాకు చాలా కోపం వచ్చింది. అప్పుడు చెప్పేడు. 'ఎందుకురా ఇవి? ఇది బానిస చిహ్నం. ఇది ఒక్కటి ఎందుకు పెట్టుకున్నానో తెలుసా? వారు మన గుండెలమీద ఉన్నారని తెలియడానికి'. నేను చాలా ఆశ్చర్యపడ్డాను. పాఠాలు శ్రద్ధగా చదువకపోతే ఎలాగని కోపపడేవాడిని. 'ఎందుకురా వెధవ చదువు? దేశానికి సేవ చెయ్యాలి కాని' అనేవాడు. 'బి.ఎ. అయినను చదువనిదే సేవ ఏమి చేస్తావు?' అనేవాడిని. దానికి "దేశసేవ చేయడానికి బి.ఎ. ఎందుకురా?" అనేవాడు. షికారుకు వెళ్ళినప్పుడు పక్షులు ఎగురుచుండగా చూచి 'చూచేవా' పక్షులు ఎంత స్వేచ్ఛగా ఎగురుతున్నాయో. మన కటువంటి స్వేచ్ఛ ఉన్నాదా?' అనేవాడు. నేను బి.ఎ. పరీక్ష మూడు నెలలుండగా కాలేజి విడుచుటయా విడువకుండుటయా అని తర్జన భర్జన చేసికొన్నాను శ్రీరామరాజు చర్యలన్నియు జ్ఞప్తికి వచ్చినవి. తక్షణము కాలేజికి వెళ్లుట మానివేసితిని. మహాత్ముడు 51 సంవత్సరముల వయస్సులో కాలేజిలను విడిచి రమ్మని చెప్పినమాట శ్రీరామ రాజు 13 లేక 14 సంవత్సరముల వయస్సులోనే చెప్పెను'.

పాలమూరు వాస్తవ్యులు కలిదిండి భీమరాజుగారు కూడ శ్రీరామరాజు యొక్క నాటకాభిలాషను గురించి చెప్పిరి. అతడు తండ్రి మేనమామల ఊరగు పాలమూరు వచ్చినప్పుడు భీమరాజుగారితో కలిసి నాటకములు వేయుచుండెడు వాడట.

దీనివలన శ్రీరామరాజునకు చిన్నప్పటినుండియు నాటకములు మొదలగు వినోద ప్రదర్శనలయందు అభిలాష, తెల్లవారిపై ద్వేషము, స్వేచ్ఛా భావములు ఎక్కువగా నుండెడివని తెలియుచున్నది. స్వాతంత్ర్య భావములు అమితముగా గల యువకునిగా అతని గురించి అతని సమకాలికులు చెప్పెదురు.

శ్రీ రామరాజునకు నాటకములే కాక తాలింఖానాలపట్ల గూడ ఎక్కువ అభిరుచి యుండెడిది. కాకినాడలో కౌతా రామకృష్ణయ్యగారి తాలింఖానాలో బస్కీలు, వ్యాయామ విద్య నేర్చుకొనెను. దెబ్బ నేర్పుగా కొట్టుట, ఎదుటివారు కొట్టు దెబ్బ తప్పించుకొనుట మొదలగు ఒడుపులు, పట్లు ఇక్కడ నేర్పినారు. ఇవియేకాక మ్యాజిక్కులు చేయుట, మ్యాజిక్కు లాంతరుతో బొమ్మలను చూపుట (తండ్రిగారి ఫొటోగ్రఫీ సామాను ఇంకను అప్పటికి ఉండెడిది) మొదలగున **వెన్నియో** చేసి తోటి విద్యార్థులకు వినోదము కల్గించెడివాడు.

కాకినాడలో చదువుకొనెడి **రోజులలో అతని తల్లి**, చెల్లెలు,తమ్ముడు పాయకరావు పేటలో నుండెడువారు. అప్పుడే అన్నవరము **కొండపై అతనికి 14**వ యేట ఉపనయనము జరిగినది. పాయకరావుపేటలో ఒంటరిగా **జీవించుట కష్టమ**గుట వలన వారి కుటుంబము తరువాత అతని అమ్మమ్మ గారి **ఇంటికి పాంత్ర**ంగి వెళ్లిపోయిరి.

1912 సంవత్సరములో తల్లి పాంత్రంగిలో కాపురముండి కుమారుని విశాఖపట్టణము మిసను స్కూలులో 4వ ఫారములో చేర్పించెను. తల్లి దగ్గరలేనందువలన శ్రీరామరాజు విశేషముగా ఖర్చులు చేసి కాలక్షేపము చేయసాగెను. అందుచే తల్లి విశాఖపట్టణములోనే కాపురము పెట్టెను. ఆ రోజులలో స్త్రీ విద్య చాల అరుదు. అందును క్షత్రియ స్త్రీలు ఘోషా అవలంబించెడు వారు. కావున వారిలో స్త్రీలు పురుషులతో కలసి ఆంగ్ల విద్య నేర్చుకొనుట అపురూపముగా నుండెడిది. శ్రీరామరాజు విశాఖపట్టణములో చదువుచున్నప్పుడు వారి బంధువులు కుకలవాడ జానకయ్యగారు అనువారు ఉండెడువారు. ఆమె కుమార్తె రాజకుమారి అనునామె శ్రీరామరాజుకు సోదరి వరుస. ఆమె కూడ ఆ స్కూలులోనే చదివెడిది. "మీయప్పగారు కూడా చదువుచున్నది" అని తోటి బాలురు ఆక్షేపించుచుండిరి. అందుచే అభిమానము అడ్డువచ్చి అతడు ఆ స్కూలులో

మానివేసెను. అదియును గాక అప్పుడప్పుడు జానకయ్యగారి కూతురుకు **ఉపాధ్యాయులు** ట్యూషను చెప్పు సమయములో శ్రీరామరాజు గూడ తన సంబంధము చెప్పు**కుంట వారి** ఇంటికి వెళ్ళి తాను గూడ కూర్చుండువాడట. కొన్నాళ్ళకు జానకయ్యగారికి **తెలిసి ఆ** సంగతి శ్రీరామరాజు తల్లితో ముచ్చటించిరి. తల్లి ఈ సంగతియంతయు శ్రీరామరాజుతో చెప్పగా తమ బాంధవ్యము తెలిసి పోవుటచే వారి యింటికి పోవుట మానివేసెను. ఇక ఆ పట్టణములోనే చదువుటకు అతనికి ఇష్టము లేకపోయెను. ఈ విషయము అతని తల్లిగారు చెప్పుచుండెడువారు. పిదప ఎ.వి.ఎన్. కాలేజి హైస్కూలులో జేరి నాల్గవ ఫారము చదువు కొనసాగించెను. కాని ఆ సంవత్సరమే అతనికి జబ్బు కూడ చేసినది. అందుచే హాజరు తక్కువయ్యెను. దీనికి తోడు కుటుంబము యొక్క ఆర్థిక పరిస్థితి కూడ బాగుగా లేదు. చదువు చెప్పించుట తల్లికి కష్టముగా నుండెను. అప్పుడు పినతండ్రి రామకృష్ణంరాజు గారికి ఉత్తరము వ్రాయగా "మీరు నా యొద్దకు పంపించండి. నేను చదువు చెప్పించెదను అని వారు జవాబు వ్రాసిరి. అప్పుడు ఆయన నరసాపురములో తహసీల్దారుగా నుండిరి. ఆయన యొద్దకు శ్రీరామరాజును పంపిరి. అక్కడ టైలరు హైస్కూలులో 1913 జులై 2 తేదీని చేరి అతడు 4వ ఫారము చదువు చుండెను.

విశాఖపట్టణములో చదువుకొను రోజులలో అక్కడ ఒక జమీందారిణి (గాణేసరు) కుటుంబము ఉండెడిదనియు, వారు పెరికలు అనియు, ఆ శ్రీమంతుల కుమార్తెను పెండ్లి చేసుకొనుటకు శ్రీరామరాజు ప్రయత్నించెననియు ఒక గాథ ప్రాకినది. ఆ విషయమును గూర్చి అతని స్నేహితులు పేరిచర్ల సూర్యనారాయణరాజుగారు ఇట్లు చెప్పిరి. "చిన్న తనమునుండియు శ్రీరామరాజుగారికి ప్రభుత్వముపై తిరుగుబాటు చేయుసంకల్పము గలదు. అందుకు డబ్బు కావలయును. దొంగతనముగాని, దోపిడిగాని చేయగూడదు. కావున రాణిగారి కుమార్తెను వివాహమాడినచో కావలసినంత ధనము లభించును అని చెప్పుచుండెడివారు. కాని అవి ఏమియు సఫలీకృతము కాలేదు" అని. దీనిని పురస్కరించుకొని స్నేహితుడగు ధనవంతుని సోదరి సీతయను నామెను శ్రీరామరాజు వరించినట్లును ఆమె మరణించిన వెనుక ఆమె పేరు జ్ఞాపకముండునట్లుగా తన పేరును సీతారామరాజుగా మార్చుకొనెననియు ఊహాజనితమైన కల్పిత కథలల్లబడినవి. ఇట్టి కథలన్నియు అసంబద్ధములు, నిరాధారములును. ఏలయన అప్పటికి శ్రీరామరాజు వయస్సు 15 సంవత్సరములు. ఏదో ఊహ మనస్సులో మెదలగా స్నేహితులకు చెప్పియుండవచ్చును. అంతేగాని దాని విషయమై ఏమియు ప్రయత్నము జరిగినట్లు కన్పించదు. ఆ జమీందారిణి కుటుంబమునకు గాని శ్రీరామరాజు కుటుంబ

సభ్యులకు గాని ఈ విషయము ఏమియు తెలియదు. అసలు ఈ రెండు కుటుంబములకు పరిచయము లేదు.

ఇక ప్రధాన విషయము. శ్రీరామరాజుకు చదరంగము, గుఱ్ఱపుస్వారి అనిన చాల ప్రీతి. నరసాపురము వద్ద చించినాడ అను గ్రామమున్నది. ఆ గ్రామ మునసబు గారికి గుఱ్ఱముండెడిది. మునసబుగారి కుమారులతో శ్రీరామరాజుకు స్నేహము. అందుచే శ్రీరామరాజు శని, ఆదివారములలో ఎప్పుడైనను అక్కడకు వెళ్ళి గుఱ్ఱపుస్వారి సరదాలు తీర్చుకొనెడివాడు. ఆ సంవత్సరము రామకృష్ణంరాజుగారి కుటుంబము, శ్రీరామరాజు కుటుంబము అందరు కలిసి మాఘశుద్ధ ఏకాదశికి అంతర్వేది తీర్థమునకు వెళ్ళిరి. అక్కడ నుండియే పినతల్లితో చెప్పి శ్రీరామరాజు చించినాడ వెళ్ళిపోయెను. రామకృష్ణంరాజు గారికి ఈ సంగతి తెలియక అతడు సముద్రములో పడి మరణించెనేమో యని భయపడుచుండిరి. శ్రీరామరాజు సోమవారమునాడు వచ్చి స్కూలుకు వెళ్ళుటకు పుస్తకములు తీసికొనుచుండెను. రెండు రోజులుగా పినతండ్రి ఆదుర్దా పడుచుండిరి. అందుచే కోపముతో అయన అతనిని మందలించవలెనని ఒక చెంపదెబ్బ కొట్టిరి. తల్లిదండ్రులెప్పుడును అతనిని పల్లెత్తుమాట అని యెఱుగరు. అందరి యెదుట బంధ్రొతులు చూచుచుండగా పినతండ్రి తనను కొట్టుట అభిమానియగు శ్రీరామరాజునకు చిన్నతనముగా తోచెను. వెంటనే చదువుకు స్వస్తి చెప్పి ఎటకో వెడలిపోయెను. అప్పుడు శ్రీరామరాజు యొక్క తల్లి, చెల్లెలు, తమ్ముడును తునిలో కాపురముండిరి. అందుచే అతడు ఎక్కడకు వెళ్ళినది తెలిసికొనుటకు రామకృష్ణంరాజుగారు తునిలో నున్న వదినగారికి ఉత్తరము వ్రాసిరి. దగ్గర గ్రామములకు మనుష్యులను పంపిరి. నరసాపురమునకు ఆరుమైళ్ళ దూరములో వెంప అను గ్రామము కలదు. అక్కడ పెదతండ్రి రామచంద్రరాజుగారి ఇంటియొద్ద శ్రీరామరాజు ఉండెను. "నేను తీసికొని వచ్చెదను" అని అయన రామకృష్ణంరాజు గారికి కబురంపిరి. రామచంద్రరాజు గారు సంస్కృత పండితుడు, చదరంగపు ఆటలో నేర్పరి. అయన దగ్గర ఉండిన రోజులలో వాటిలోని మెళకువలను శ్రీరామరాజు నేర్చుకొనెను". తరువాత పెదతండ్రిగారితో కలిసి రామకృష్ణంరాజు గారి పెద్దకుమార్తె వివాహమునకు వెళ్ళి, ఆ నాలుగు రోజులు మాత్రము అక్కడ ఉండి తుని వెళ్ళిపోయెను. అంతటితో పాఠశాల చదువునకు స్వస్తి చెప్పెను.

శ్రీరామరాజునకు చిన్నతనము నుండియు దైవభక్తి మెండు. అతని మాతామహి అచ్యుతయమ్మగారు. ఆమెకు పుత్రులు పుట్టి గతించిరి. నలుగురు కుమార్తెలు మాత్రము ఉండిరి. వారిలో శ్రీరామరాజు తల్లి రెండవ ఆమె. ముసలమ్మగారు వీరి యింటనే ఎక్కువ కాలము ఉండెడువారు. ఆమె ఛాందసముతో గూడిన ఆచారపరురాలు. బజారు

నుండి తెచ్చిన ప్రతి వస్తువును ఆమెకు కావలసినవి. చివరకు చింతపండును ఉప్పును గూడ కడుగుకొని ఎండబెట్టుకొనెడు వారు. ఆమె మట్టుకు మడిగా ఒక్కరును వంట చేసికొనెడువారు. ఆమె నిత్యమును దేవుని పూజ చేసి వంటకములను నైవేద్యము పెట్టి భోజనము చేసెడువారు. ఆమెను చూచి శ్రీరామరాజు నూతి యొద్దకు బోయి స్నానము చేసి నాలుగు సంవత్సరముల ప్రాయము నుండియు దైవ పూజలు ప్రారంభించెను. ఏమి చేసినను తండ్రిగారు పల్లెత్తు మాట అని యెరుగరు. "ముసలమ్మగారు పిల్లవానిని పాడుచేయుచున్నారు (ఛాందసముతో)" అని మాత్రము మాటవరుసకు అనెడు వారట.

తండ్రిగారు పట్టుగుడ్డతోనున్న టోపీని కొనుక్కొనగా శ్రీరామరాజు స్నానము చేసి వచ్చి ఆ కొత్త టోపీని చించి వేసి ఆ పట్టు గుడ్డను కౌపీనముగా ధరించి దేవుని యెదుట కూర్చుండి పూజ, జపము ప్రారంభించెడువారు. తండ్రిగారు ఆ చిన్న వయస్సులో కుమారునకు గల దైవభక్తికి సంతసించి ఊరకుండెడువారు. ఒక రోజున చిన్న రామమందిరమును నిర్మించి నిచ్చెన తెచ్చి తోటి పిల్లలను అందుకొమ్మని వంట వసారా విప్పి వేసి ఆ పెంకు మందిరమునకు వేసెను. సాయంకాలము వంట వేళకు తల్లి వచ్చి ఈ దృశ్యమును చూచి వెళ్ళి తండ్రిగారితో చెప్పగా, ఆయన వచ్చి చూచి, "ఇదేమి పని అమ్మా, చిట్టిబాబూ" అని మాత్రము అనిరి. తండ్రి గారు చావడిలోనికి వెళ్ళిన తరువాత మరల ఎప్పటివలెనే పిల్లలను పెంకులు అందించుమని శ్రీరామరాజే వంట వసారానేసి వేసెను. శ్రీరామరాజునకు నాయకత్వ లక్షణములు సహజముగనేయుండెను. పిల్లలందరును ఆటలకు గాని, ఇంకొక పనికి గాని అతని చుట్టును జేరి అతడేమి చెప్పిన అట్లు చేయుచుండెడువారు. వైశాఖ మాసములో పూజలు చేసి తోటి బాలురనందరను పిలిచి అతడు వారికి వడపప్పు మొదలగునవి పంచిపెట్టెడువాడు. ఈ విధముగా చిన్నతనముననే అలవడిన దైవభక్తి, నాయకత్వ గుణములు దినదినాభివృద్ధి చెంది అతనిని తపస్సంపన్నునిగా, నాయకునిగా చేసినవి.

తునిలోను, తునికి ఆరు మైళ్ళ దూరములోనున్న పెదతల్లిగారి ఊరు గోపాలపట్టణములోను శ్రీరామరాజు కుటుంబము కొంత కాలముండిరి. అక్కడ సీతమ్మవారి కొండ కలదు. ఆ కొండపైనున్న ధర్మలింగేశ్వరాలయములో శ్రీరామరాజు కొంతకాలము తపస్సు చేసెను. అప్పుడు ఒకసారి రెండు నక్కలును, ఒక రోజున ఒక అడవి పందియు అతడు తపస్సు చేయుచుండగా వచ్చి కూర్చుండెనట. వానిని భగవత్స్వరూపములుగా భావించి రెండు పద్యములు ఆశువుగా చెప్పెను. వానిని చిన్నతనములో

తన సోదరునికి చెప్పెను. తనకు జ్ఞాపకమున్నంత వరకు ఆ పద్యముల నివియని సోదరుడగు సత్యనారాయణరాజు చెప్పెను.

సీ॥ శ్రీవసిష్ఠునికడ చిఱుత ప్రాయమునాడె
నేర్చి విద్యలనెల్ల నేర్పుతోడ
తన సతిగూడుక వనమున వసియించి
మునులనెల్లర జూచి మ్రొక్కివారి
దీవనల్ బడసి మర్దించి శత్రులనెల్ల
వేలుగా మన దేశమేల దలచె

◆ ◆ ◆

గీ॥ బ్రాహ్మణోత్తము లెల్లరు ప్రమదమునను
చేయుడు తపములన్ స్థిర చిత్తములను
వచ్చుచున్నాడు శీఘ్రంబె వనమునుండి

◆ ◆ ◆

సీ॥ శ్రీ పార్వతీనాథ చిన్మయ పరమేశ
నందివాహన సాంబ నాగభూష
గంగాజటాజూట అంగజహరయీశ
భృంగీశ సన్నుత మృత్యునాశ

◆ ◆ ◆

గీ॥ శ్వేతవర్ణ శుభాంగోగ్ర భూతనాథ
నీలకంధర నిఖిలేశ నిగమ వినుత
పరమ పురుష జగన్నాథ భక్తవరద
తంత్రి పాండవ నగవాస ధర్మలింగ.

తరువాతి కాలములో పాపికొండలలో తపస్సు చేయుచున్నప్పుడు తప్పించుకొని పోయిన ఒక పెంపుడు ఏనుగు అచ్చట తిరుగుచుండెడిదట. అది అప్పుడప్పుడు వచ్చినప్పుడు దానిని శ్రీరామరాజు ఎక్కుచుండెడివాడట. శ్రీరామరాజు విజయనగరములో నున్నప్పుడు ఒక రాత్రి అతడు నిద్రలో 'హల్ హల్' అని పలువరించుచుండెను. తల్లి అది చూచి "ఏమి నాయనా, పలువరించు చుంటివి?" అని ప్రశ్నింపగా హల్ హల్ అనగా అగుమని అర్థము అని ఆ యేనుగు విషయమును చెప్పి ఆ యలవాటున పలువరించితిని అనెను. ఈ విధముగా అతడు హిమాలయముల వరకును

మహారణ్యములన్నియు తిరిగి ఏనుగులతోడను, పులులు మొదలగు క్రూర జంతువులతోడను చెరలాటలాడిన తపస్సంపన్నుడు.

దైవభక్తితోపాటు చిన్నతనముననే దాన గుణము కూడ అలవడెను. చదువుకొనునప్పుడు చదరంగపు బరిణ ఒకనికి ఇచ్చివేసెను. ఏ వస్తువు ఏ స్నేహితుడు అడిగినను ఇచ్చివేసెడువాడు. "క్రింది తరగతిలోని పుస్తకములు కావలసిన పిల్లలకు అమ్మివేయరాదా?" అని తల్లియనగా "మీరు పిల్లలను అమ్ముకొనుడు, నేను పుస్తకములను అమ్ముకొందును" అనెనట.

శ్రీరామరాజు చదువునకు స్వస్తి చెప్పినప్పటికి వారి కుటుంబము తునిలోనే కాపురముండెను. పత్సవాయి నీలాద్రిరాజుగారు తుని ఆస్థానములో కవి, జ్యోతిష్కుడు. ఆయనను 'కవిరాజు' అని పిలిచెడువారు. కవిరాజుగారి యింటిలో కొలది కాలము శ్రీరామరాజు కుటుంబము కాపురము ఉండెను. అప్పుడు అతడు కవిరాజుగారి యొద్ద జ్యోతిషము, జాతకములు వ్రాయుట, కవిత్వములోని మెలకువలు, హఠయోగము మొదలగునవి అభ్యసించెను. అతనికి ఆంగ్ల విద్యపై ఆసక్తి లేదు. అందువలన దానిపై శ్రద్ధ చూపలేదు. అంతేకాక దానిని బానిస విద్యగా తృణీకరించెను. కాని ఇంగ్లీషులో ధారాళముగా మాట్లాడుట నేర్చుకొనెను.

తునిలో చదువు లేదు, పనియు లేదు. తల్లి బంగారు నగలు, తండ్రి గారి ఫొటో గ్రాఫు సామానులు మొదలైనవి అమ్ముకొని ఆ కుటుంబము కాలక్షేపము చేసెడిది. శ్రీరామరాజు జపముగాని, ఏదియో చదువుటగాని లేనప్పుడు ఏదియో ఆలోచించుచు ఊహా లోకములో విహరించుచుండువాడు. ఎక్కడికిని కదిలెడువాడు కాడు. తమ్ముడే ఒక్కొక్క బంగారు వస్తువును కంసాలి దగ్గరకు తీసికొని వెళ్ళి తూనికవేయించి అతడిచ్చు పైకము తీసికొని రాగా ఖర్చుపెట్టుకొనెడివారు. చదువుమాని వేసిన కుమారుని ఏదైనను ఉద్యోగము సంపాదించి కుటుంబ పోషణకు తోడ్పడవలసినదిగా తల్లిగారు బోధించుచుండువారు. "నాయనా, ఏదియో ఉద్యోగములో ప్రవేశించనిదో ఎట్లు"? అని తల్లి అనుచుండుట కవిరాజుగారు విని. శ్రీరామరాజు జాతక చక్రమును తెప్పించి చూచి, "అమ్మా, ఈ జాతకము ఉద్యోగము చేయునది కాదు. అతనిని వేధించినను అతడిప్పుడేమియు చేయజాలడు. అతనిని ఏమియు అనవద్దు. అతడు కీర్తిమంతుడు కాగలడు" అని ఓదార్చెడువారు. ఒకనాడు ఒక సాధువు వచ్చెను. అతనికి భోజనము పెట్టిరి. భోజనానంతరము ఆ సాధువు శ్రీరామరాజు చేతిని చూచి భవిష్యద్యోగమును చెప్పెను. "ఈయన హస్తమును బట్టి నవఖండమండలాధిపతి యగును. కాని 27వ

సంవత్సర ప్రాంతమున మారక యోగమున్నది. అది తప్పినచో ఢిల్లీ మహారాజగును" అని చెప్పెను.

తునిలో శ్రీరామరాజుకు పేరిచర్ల సూర్యనారాయణరాజుతో స్నేహమయ్యెను. సూర్యనారాయణరాజు మంచి పరాక్రమశాలి. నిర్భీకుడు, ఇద్దరును కలిసి జయపురము, బస్తరుమన్య ప్రాంతములలో తిరిగి తపస్సునకు విప్లవమునకు అనుకూలమగు స్థానములను అన్వేషించి తిరిగి వచ్చిరి. రాత్రి సమయములందు శ్మశానములలోను, శిథిలాలయములోను కొండల పైనను శ్రీరామరాజు ధ్యానము చేయుచుండువాడు. అతనికి కొందరు అనుయాయులైరి. అందరును కలిసి దేవీ పూజలు చేయుచుండువారు. దాట్ల కృష్ణవర్మ మొదలగువారు వారి మేడపైనను ఈ పూజలు చేసెడువారు. శ్రీరామరాజు కాళీ ఉపాసకుడైనను శ్రీరామ భక్తుడు. శివ పూజకుడును గూడ. కృష్ణవర్మ మున్నగు కొందరు క్షత్రియులు ఉద్యమములో పాల్గొనుటకు వాగ్దానము చేసిరి కాని తరువాత వెనుకాడిరి.

శ్రీ రామరాజునకు డబ్బు లక్ష్యములేదు. తల్లిని మభ్యపెట్టి డబ్బు తీసికొని పోవువాడు. కొన్ని రోజులకు స్టేషను మాస్టరు పనిలో ప్రవేశింతునని చెప్పి టెలిగ్రాం కొట్టు పరికరములను తెచ్చుకొని తల్లిని నమ్మించి సంతోషపెట్టుటకు ఇంటి యొద్ద స్వయముగా నేర్చుకొనుచుండెను. అప్పటికే ఏవియో భావి పథకములు ఊహించు చుండవచ్చును. ఆ ఊహలును అతని మనో వ్యథయు ఇతరుల కెట్లు తెలియును? 'ఫలానుమేయా: ప్రారంభా:' అను రీతిని తరువాతి కార్యములను బట్టి తెలిసికొనవలసినదే. ఒకనాడు తల్లితో "ఇంక పరీక్ష ఒక నెల కలదు. టిక్కెట్ల సొమ్ము మన వద్ద కొంత ఉండును. అందుచే ముందు కొంత సొమ్ము డిపాజిట్ కట్టవలయును" అనగా, ఆమె 'ఏ వస్తువు అమ్మియో లేక రామకృష్ణనాన్నయ్యకు ఉత్తరము వ్రాసియో తెప్పించి ఇచ్చెదను' అని చెప్పెను. కాని ఆ పరీక్ష జరుగుననిన రోజుకు అతడు ఎటకో-బహుశ: కాశీకి-వెళ్లిపోయెను. అట్లు వెళ్లుటకు పూర్వమే తమ్మునకు 21 బీజాక్షరములు గల కాళికాదేవి మంత్రము నుపదేశించి, "ఇది ఒక లక్ష వరకు జపము చేయుము. కాళి ప్రత్యక్షమగును. ఏమి కావలయునని అడుగును. విద్య కావలయునని కోరుము" అని బోధించెను. తెల్లవారు జామున లేచి నూతివద్ద స్నానము చేసి 10 రోజులు మాత్రము అతడు అన్నగారు చెప్పినట్లు చేయగల్గెను.

# 6. ఉత్తర దేశ యాత్రలు

శ్రీరామరాజు కర్మిష్ఠి. అందుచే మహారణ్యములలో తపస్సు చేయునప్పుడును ఏ దుంప పిండియో ఉపయోగించి పితరులకు ప్రతి సంవత్సరము మానకుండ ఆబ్దికములు పెట్టుచుండువాడు. బ్రహ్మకపాలములో పిండములు వేయుచో పితరులు స్వర్గమునకు పోవుదురనియు, వారు తరింతురనియు ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. అందుచే శ్రీరామరాజు అచ్చటకు వెళ్ళుటకు తలపెట్టెను. ఆ రోజులలో హరిద్వారము వరకు మాత్రము రైలు గలదు. హరిద్వారము నుండి తల్లికి అతడు ఇట్లు ఉత్తరము వ్రాసెను. "నేను హరి ద్వారము చేరితిని. ఇక్కడ నుండి బ్రహ్మకపాలము 200 మైళ్ళు కలదు. నడచివెళ్ళవలెను. బ్రహ్మకపాలము వెళ్ళివచ్చెదను". మరల బ్రహ్మకపాలము నుండి తిరిగివచ్చిన తరువాత "అమ్మా, బ్రహ్మకపాలములో బాబయ్య, తాతయ్య మొదలగు పెద్దలందరిపేర్లు చెప్పి పితరులకు పిండములు వేసి వచ్చితిని. వారినందరిని స్వర్గమునకు పంపితిని. వారి పేరు చెప్పి మరల ఆబ్దికములు పెట్టనక్కరలేదు. అట్లు చేయుచో మరల స్వర్గము నుండి దిగివచ్చెదరు" అని తల్లితో చెప్పెను. బ్రహ్మకపాలములో నున్నప్పుడే అతడు సన్యాస దీక్షను స్వీకరించి యుండవచ్చును. తల్లిని నొప్పించుట కిష్టములేక నిజమును కప్పిపుచ్చి తన సన్యాస దీక్షను గురించి తల్లితో చెప్పకుండ అతడు అట్లు చెప్పియుండవచ్చును. అప్పటినుండియు ఆబ్దికములు పెట్టుట మానివైచెను. కాని 30-1-1922న అతడు పోలీసు సూపరింటెండెంటు కిచ్చిన వాఙ్మూలములో తాను బ్రహ్మచారినే కాని సన్యాసిని కాదని చెప్పెను. కాషాయ వస్త్రములు ధరించునట్లు గూడ ఎచ్చటను కనబడదు. ఏదియెట్లున్నను 17, 18 సంవత్సరముల చిఱుత ప్రాయముననే బాల తపసియగు శ్రీరామరాజు హరిద్వారమునుండి ఋషీకేశము, బదరీనాథము, కేదారనాథము, గంగోత్రి, యమునోత్రి, బ్రహ్మకపాలము కీకారణ్యములగుండ రానుపోను 400 మైళ్ళు నడచుట యనగా సామాన్యమైన విషయము కాదు. అట్లు బ్రహ్మకపాల యాత్రను ముగించుకొని తిరిగి వచ్చిన శ్రీరామరాజు దీక్షను, సామర్థ్యమును మనము ఊహించుకొన వచ్చును. ఈ యరణ్య పర్యటనానుభవము తరువాత తిరుగుటకు ఎంతయో ఉపయోగపడి యుండవలెను.

బ్రహ్మకపాలమునుండి తిరిగి వచ్చిన తరువాత కొంతకాలమునుండి శ్రీరామరాజు మరల వెళ్ళిపోయెను. ఎక్కడ నున్నదియు ఎవరికిని తెలియదు. కుమారుని కొరకు తల్లి పరితపించెను. "నా కుమారుడు జీవించి యున్నచో ఇంత కాలము రాకపోవునా?



సీతారామరాజు స్వహస్తముతో వ్రాసికొనిన అశ్వశాస్త్రములో ఒక పుట



సీతారామరాజు స్వహస్తముతో
వ్రాసికొనిన 'గజలక్షణాని'లో ఒక పుట

యజమాని (భర్త) లేకున్నను పిల్లల కొరకు జీవించితిని. నా చిట్టిబాబు కూడ లేని జీవిత మెందుకు?" అని ఆమె భావించి చిన్న కుమారుని ఎక్కడనైనను చదువునకు అప్పజెప్పి, కుమార్తెకు వివాహము చేసి ప్రాణత్యాగము చేయవలెనని తలచెను.

నరసాపురము దగ్గరరుస్తుంబాదాలో దంతులూరి వారి కుటుంబ మొకటి యుండెను. దంతులూరి రామచంద్రరాజు అనునాయన విశాఖ జిల్లా తాళ్ళవలస నివాసి. ఏ విషయములోనో సోదరులతో మాట పట్టింపు వచ్చి ఆ ఊరు విడిచి గోదావరి జిల్లాలో నరసాపురము దగ్గరనున్న రుస్తుంబాదా చేరిరి. అచ్చట కొంత పొలము సంపాదించి అచ్చటనే నివాసమేర్పరచుకొని వ్యవసాయము చేయువారంభించిరి. ఆయనకు అయిదుగురు పుత్రులు, నలుగురు పుత్రికలు కలిగిరి. కుమారులు పెద్దవారై వ్యవసాయము బాగుగా వృద్ధి చేసి పలుకబడి సంపాదించిరి. ఆ రోజులలో కుటుంబ సంప్రదాయములను ఎక్కువగా చూచెడువారు. వారి స్థితి గౌరవములు చూచి ఆ సోదరులలో మూడవవారైన దంతులూరి వెంకటపతిరాజునకు తన కుమార్తెనిచ్చి శ్రీరామరాజు తల్లిగారే వివాహము జరిపించిరి. తరువాత కుమార్తెగారింటికి ఒక ఫర్లాంగు దూరములో తల్లియు, చిన్న కుమారుడును కాపురముండిరి. రామకృష్ణంరాజు గారు చేయు సహాయముతో చిన్న కుమారుని నరసాపురము టైలరు హైస్కూలులో 4వ తరగతిలో చేర్పించెను.

శ్రీరామరాజు రెండవసారి చేసిన ఉత్తర దేశయాత్రను గురించిన వివరములు ఎక్కువగా తెలియవు. 1919 సంవత్సర ప్రాంతములో ఈ యాత్ర చేసెను. రెండు సంవత్సరముల తరువాత తిరిగి వచ్చెను. కాశిలో ఒక సంవత్సరము ఉండి సంస్కృతము, శాస్త్రములు నేర్చుకొనినట్లు తెలియుచున్నది. కాశిలో నుండగా వేషభాషలచే బ్రాహ్మణ బాలకునిగానే పరిగణింపబడుచు వారితోడనే నిత్య కర్మానుష్ఠానములను విద్యాభోజనాదులను చేయుచుండెడివాడట. కొంతకాలమునకెట్లో క్షత్రియ బాలుడని తెలిసి తమను మోసగించినందులకు బ్రాహ్మణులు కోపించి అతనిని పట్టుకొని శిక్షించుటకు ప్రయత్నించగా తప్పించుకొని వారిని వీధులన్నియు త్రిప్పి మారువేషమున పారిపోయెనట. ఈ సంఘటనను గురించి శ్రీరామరాజు తల్లి చెప్పుచుండెడువారు.

బస్తరు రాజకుటుంబములో కొన్నాళ్ళు ఉండినట్లును, నాసికాత్ర్యంబకము, పూరిజగన్నాథము, బొంబాయి, బ్రోచి, బరోడా, ఉజ్జయిని, అమృతసర్, ప్రయాగా, బదరీనాథము, కేదారనాథము మొదలగు క్షేత్రములందు గడపినట్లును, అస్సాం, నాగపర్వతములు, ఉత్తర ప్రదేశము, నేపాలు, కాశ్మీరము మొదలగు ప్రదేశములు తిరిగి

హిమాలయములలో కొంతకాలము తపస్సు చేసినట్లును ఈ యాత్ర నుండి తిరిగివచ్చిన తరువాత తల్లితో అప్పుడప్పుడు అతడు చెప్పిన మాటలవలన తెలియుచున్నది. ఈ కాలములోనే అతడు విప్లవకారులనుండి తాంత్రిక సాధకులగు సాధువుల వరకు, సంస్థానాధిపతులనుండి సామాన్యులగు అటవికుల వరకు ఎన్నియో రకముల మనుష్యులను కలిసికొని యుండవచ్చును. జయపురము నుండి అతనిని కలిసికొనుటకు ఎవరో వచ్చుచుండెడి వారని శ్రీరామరాజు తల్లి చెప్పుచుండువారు.

ఈ దేశయాత్రల వలన అతడు అపూర్వమగు లౌకిక జ్ఞానమును సంపాదించెను. ఎన్నియో విద్యలను నేర్చెను. ధనుర్విద్య, గుఱ్ఱపుస్వారి, తుపాకి మొదలగు ఆధునికాయుధములను గురి తప్పకుండ కాల్చుట, కత్తిసాము, బల్లెము విసరుట మున్నగు క్షాత్ర విద్యలును, అశ్వశాస్త్రము, గజశాస్త్రము, వృషభశాస్త్రము, మూలికా వైద్యము, జ్యోతిషము, హస్తసాముద్రికము, వాస్తు శాస్త్రము, రసాయన శాస్త్రము, మంత్రతంత్రములు మున్నగు శాస్త్రములను బాగుగా నేర్చెను. ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ మొదలగు భాషలలో ధారాళముగా మాట్లాడుట అబ్బెను. అన్నిటికంటెను ముఖ్యమైనది కాళికోపాసన, యోగాభ్యాసము. ఒక్కొక్కసారి జపములో కూర్చుండినచో నిశ్చలముగా గంటల కొలది కూర్చుండువాడట. అదృశ్యశక్తి కూడ ఉండెడిదని మన్యపు ప్రజలు చెప్పుదువారు. అది వారి నమ్మకము. యోగశాస్త్రములో కుండలినీ చలనము ననుసరించి కలుగు అనేక శక్తులు చెప్పబడినవి. ఏవైనను శక్తులు అతనికి ఉండెడివేమో నిశ్చయముగా తెలియదు.

చాల రోగములకు పనికి వచ్చు గృహవైద్య గ్రంథమును; వివిధములైన 40 మంత్రములున్న మంత్రపుష్పమాలయు; అశ్వశాస్త్రము గజ శాస్త్రము, వృషభలక్షణములు కొన్ని రసాయనిక ప్రక్రియలు ఉన్న పుస్తకము ఇవి యన్నియు శ్రీరామరాజు స్వయముగా వ్రాసికొనిన చేతి వ్రాత పుస్తకములు భద్రపరుచబడినవి.

ఇంత చిన్న వయస్సులో ఇంత జ్ఞానము కలుగుట సాధ్యమాయనిమనకు ఆశ్చర్యము కలుగును. నమ్మలేము. కాని శంకరాచార్యులు, వివేకానందుడు మొదలగు మహాపురుషుల జీవిత చరిత్రలను తలచుకొనినచో మహా పురుషులు తాము చేయవలసిన పనికి కావలసిన జ్ఞానమంతయు స్వల్పకాలములోనే సంపాదించి భగవన్నిర్ణీత కార్యసాధనానంతరము అల్పాయుష్కులుగానే పరమ పదించుట మనకు తెలియును.

# 7. మన్య ప్రాంతములో నివాసము శ్రీరామ విజయనగరము

ఉత్తరాది యాత్రలోనున్న శ్రీరామరాజు క్రమముగా కుటుంబ బంధములను తెంపివేసికొను తలంపుతో నున్నందున ఈ సారి ఇంటికి ఉత్తరములు వ్రాయలేదు చాలాకాలము తీర్థయాత్రలు చేసి మహారణ్యములు తిరిగి తిరిగి ఒకనాడు, 1917 జూలైలో విశాఖపట్టణము జిల్లా గొలుగొండ తాలూకాలోని కృష్ణాదేవిపేట మీదుగా పోవుచుండెను అక్కడ చిటికెల భాస్కరుడు అను ఒక గృహస్థును అతడు దాహమడిగెను స్ఫురద్రూపియగు ఆ యువతాపసునిచే అక్కడనున్నవారు ఆకర్షింపబడిరి. నూనూగు మీసాల నూత్న యౌవనముతో విలసిల్లు అతని ముఖారవిందమునకు చిఱు గడ్డము నవ్యశోభను చేకూర్చెను. పచ్చని శరీరచ్ఛాయ, నల్లని తీర్చిన కనుబొమ్మలు, విశాల నేత్రములు, కొనదేరి కోటేరువలె నున్న ముక్కు, పలుచని పెదవులు, అంత పొడుగు గాని పొట్టిగాని కాక ఇంచుమించు 5 అ. 4 అం. ఎత్తుగల దేహము కలిగి తెల్లని వస్త్రములు ధరించిన ఒక పవిత్రమూర్తి వారి యెదుట నుండెను. "అయ్యా, తమరెవరు? ఎక్కడకు పోవుచున్నారు?" అని వారు ప్రశ్నించిరి. "నేను సన్యాసిని, నాకు ఒక చోటు అని లేదు. తపస్సు చేసికొనుటయే నా పని" అని అతడు చెప్పెను. అప్పుడు వారు "అయ్యా, తమకు కావలసినది తపస్సు చేసికొనుటయే గదా. తమరు మా ప్రాంతమున నుండి తపస్సు చేసికొనుటకు చాల అనుకూలముగా నుండును. ఇక్కడ ధార పర్వతమున్నది. దానిపై బాగుగా నుండును" అని చెప్పిరి. సరేయని శ్రీరామరాజు ఒప్పుకొనెను. గ్రామస్థులందరును ఆ పర్వతముపై అతడు తపస్సు చేసికొనుటకు ఒక ఆశ్రమమును నిర్మించిరి. ఆ పర్వతముపై ఎప్పుడును మండువేసవిలో సైతము నీటిధార ప్రవహించు చుండును. అందువలనే దానికాపేరు వచ్చినది. దానిపై మామిడి, పనస మొదలగు ఫలవృక్షములు గలవు. అక్కడ కొంతకాలము అతడు తపోనిష్ఠలో గడిపెను.

ఒక దినమున అతడు క్రిందికి రావలయునని తలచెను. కొండనిటారుగా నుండుట వలనను, చెట్లు దట్టముగా నుండుటవలనను, క్రొత్త ప్రదేశమగుటవలనను అది అంత సులువుగా కన్పించలేదు. అతడు దారి తప్పెను. చెట్లకొమ్మలు పట్టుకొని క్రిందికి దుముకుచు ఎట్లో కష్టపడి క్రిందికి దిగి కృష్ణాదేవిపేట చేరెను. కాలు చేతుల నిండ ముండ్లు విరిగెను. అప్పుడు చిటికెల భాస్కరుడు (ఇతడు 1936లో స్వర్గస్థుడయ్యెను)

అతని తల్లి సోమయ్యమ్మ శ్రీరామరాజునకు ముంద్లు తీయించి ఉపచర్యలు చేసిరి. సోమయమ్మ శ్రీరామరాజును నెమ్మదిగా ప్రశ్నించి అతనికింకను తల్లి, తమ్ముడు, చెల్లెలు కలరని తెలిసికొని ఉత్తరము వ్రాయించి వారిని కూడ అక్కడకు రప్పించు ఏర్పాట్లు చేయించెను. ఈ పాటికి తన కుమారుడు ఎక్కడనో మరణించి యుండునని అనుకొనిన తల్లికి కుమారుని యొద్ద నుండి ఉత్తరము రాగానే ఆమె ఆనందమునకు మేరలేదు. చిన్న కుమారుని చదువు మాన్పించి వెంటనే ప్రయాణమయ్యెను. శ్రీరామరాజు తల్లియు, తమ్ముడును, మాతామహియు వెళ్ళిరి. నరసాపురము నుండి తుని వచ్చిరి. అక్కడ నుండి కృష్ణా దేవిపేట 25 మైళ్ళు కలదు. ఆ రోజులలో బస్సులు లేవు. తుని రైలు స్టేషనుకు బండి పంపిరి కాని బండి వాడు వీరిని తెలిసికొనలేకపోయెను. ఎట్లో చివరకు కృష్ణాదేవి పేట చేరిరి. చివరకు వెళ్ళుసరికి శ్రీరామరాజు తల్లి పాదములకు నమస్కరింపగా ఆమె యానందమును పట్టలేకపోయెను. కృష్ణాదేవిపేటకు ఒక మైలు దూరములో నున్న నీలకంఠేశ్వరాలయమువద్ద అప్పుడు వారు కాపురముండిరి.

కొన్ని రోజుల పిదప శ్రీరామరాజు తమ్మునికి జ్వరము వచ్చి జబ్బు పెరిగెను. అందువలన వాతడు మరణించుననే భయముతో వారు ముగ్గురును మరల నరసాపురము వచ్చివేసిరి. తరువాత కొంతకాలమునకు మాతామహికి జబ్బు చేసెను. ఆమెను నరసాపురము నుండి కొవ్వాడ ఇంకొక కూతురు ఇంటికి పంపిరి. అక్కడ ఆమె ఆ జబ్బుతో నుండియే స్నానము చేసి పట్టుపంచె కట్టుకొని కూర్చుండి తులసి తీర్థము పుచ్చుకొని గోదానము కూడ చేసికొని పరమపదించిరి. ఇక్కడ మాతామహి చనిపోయిన విషయము శ్రీరామరాజుకు నిద్రలో దేవి చెప్పినదనియు, అందుపై ధార పర్వతముపై నుండి దిగివచ్చి కృష్ణాదేవి పేటలో వారికి ఆ సంగతి చెప్పి ఆయన నరసాపురము బయలుదేరి వెళ్ళిరి అని చిటికెల భాస్కరుడు చెప్పెను. కొవ్వాడలో బంధువులను చూచి నరసాపురములో తల్లియొద్దను, చెల్లెలియింటి యొద్దను కొన్ని రోజులు గడిపి మరల వెళ్ళిపోయెను. చెల్లెలి యింటివద్ద నున్నప్పుడు బావగారి సోదరులతో సరసములాడుచు ఒకసారి మాటల సందర్భమున విలువిద్య ప్రసక్తి వచ్చి ఒక ఫర్లాంగు దూరములో పొలముల కావలపుంతలో నున్న ఈతచెట్టును చూపి నేను బాణమువేసి ఆ చెట్టును కొట్టెదను చూడుడు' అని విల్లును బాణమును తయారుచేసి వింటికి బాణమును సంధించి నారి లాగి వదిలెను. అది ఎంత దూరము పోవునులే అని అందరు అనుకొనిరట. పిదప చెట్టు దగ్గరకు వెళ్ళి బాణమును తెమ్మని పంపగా బావమరదులలో ఒకరు వెళ్ళి చెట్టుకు, బాణము గ్రుచ్చుకొని యుండుట చూచి ఆశ్చర్యపడి దానిని తీసికొని వచ్చిరట. ఈ విషయమును వారు చెప్పుచుండెడువారు.

కృష్ణాదేవి పేటకు ఒక మైలు దూరములో తాండవనదికి ఎగువన 'చిక్కాలగడ్డ' కలియుచోట గ్రామస్థులు రెండు ఇండ్లు దూలములతో కట్టించియుంచిరి. తల్లిని, తమ్ముని రప్పించి అక్కడ కాపురము పెట్టిరి. అప్పుట ప్రజల సహకారముతో 'శ్రీరామ విజయనగరము' అను గ్రామమును నిర్మింపదలచెను. తల్లికి, సోదరీ సోదరులకు జీవన మార్గమును చూపదలచి వ్యవసాయమునకు అనువగు 30 ఎకరముల భూమినిగూడ తీసికొనెను.

ఈ రోజులలో కుమారునికి వివాహము చేయవలెనని తల్లి తలచెను. కుటుంబ గౌరవమునుబట్టియు, శ్రీరామరాజు తెలివి తేటలు, సుగుణ సంపత్తిని చూచియు ఎన్నియో వివాహ సంబంధములు వచ్చెడివి. కాని సన్యాసిగా జీవితమును గడుప స్థిర నిశ్చయుడైన శ్రీరామరాజు మాత్రము వివాహమునకు అంగీకరించలేదు. ఏ హిమాలయములలోనో తపస్సు చేసికొనవలెనని కోరిక బలముగా నుండెడిది. కాని తల్లిని దుఃఖ పెట్టినచో తనకు మనఃశాంతి లేక తపఃఫలము కలుగదని గ్రహించెను. 'మాతృదేవోభవ' అను ధర్మ విధి ఎప్పుడును తన కళ్ళ ఎదుట నుండెడిది. ఎక్కడకు వెళ్ళినను తల్లి పాదములకు నమస్కరించి ఆశీర్వాదము పొందిగాని వెళ్లెడువాడు కాదు. అట్టి మాతృదేవి తన యొద్దనే యుండవలెను. తాను మాత్రము మట్టిలో నున్నను మట్టి యంటని కుమ్మరి పురుగువలె సంసారములో నున్నను దానితో సంబంధము లేకుండ తపస్సమాధి యందుండవలెను. అందువలన నరసాపురములోనున్న సోదరిని, బావగారిని 1921లో శ్రీరామ విజయనగరమునకు రప్పించెను. బావగారితో "బావా, మీరు, నారాయణ (తమ్ముడు) ఈ భూములు వ్యవసాయము చేసికొనుచుండుడు, సంసారముతో నాకు నిమిత్తము లేకుండ మీరు చూచుకొనుడు. మీ కొఱకే ఈ భూములు తీసికొంటిని. నేను వివాహము చేసి కొనకున్నను తల్లి బాధ తప్పలేదు. మీరు ఈ విధముగా చేసినచో నాకు తపస్సు నిర్విఘ్నముగా సాగును" అని శ్రీరామరాజు అనెను. ఆయన అంగీకరించెను, కాని దీనికిని విఘ్నము కలిగెను. వారు అయిదుగురు సోదరులు. ఆయన మూడవవారు. పెద్ద అన్నగారి దగ్గర నుండి ఒకనాడు ఉత్తరము వచ్చినది. "నాన్నగారు వృద్ధులైపోయినారు. ఇంకను ఇద్దరు తమ్ములకు వివాహము కావలసియున్నది. నీవు సుఖముగా అత్తవారి యింటి వద్దనున్నావు తమ్ములిద్దరకు వివాహముగువరకు బాధ్యత అంతయు నాపైనైది నీవు అక్కడ ఉండుట భావ్యముకాదు" అని నిష్ఠూరముగా వ్రాసిరి. అది చూచి తాను అక్కడ ఉండుట భావ్యము కాదని శ్రీరామరాజుతో చెప్పి బావగారు స్వగ్రామము వెళ్ళిపోవుటచే శ్రీరామరాజునకు తల్లి పోషణకుగాను సంసారబంధము తప్పలేదు.

శ్రీరామ విజయనగరమున శ్రీరామరాజు తల్లికి సోదరునికి తగిన వసతులు సమకూర్చి ప్రజలు అతని యెడ తమకుగల భక్తి గౌరవములను వెల్లడించిరి. తాను తపోనిష్ఠలో నుండుచు బీదలును అమాయికులును అగు మన్య ప్రజల సమస్యలపట్ల శ్రద్ధ వహింపసాగెను. చిన్న పాఠశాలను పెట్టి 10, 12 మంది పిల్లలకు తెలుగు, సంస్కృతము చెప్పెడువారు. అమరము, ఆంధ్ర ప్రబంధములు బోధించుచుండువారు.

శ్రీరామరాజు కృష్ణాదేవిపేట దగ్గరనున్న నీలకంఠేశ్వరాలయమున తపస్సులో గడిపెడువారు. భోజనము చేసెడువారు కాదు. ఏదైనను ఒకటి రెండు పండ్లు, ఒక పావుశేరు పాలు మాత్రము ఆహారముగా తీసికొనెడువారు. తల్లియు, తమ్ముడును వంట చేసికొని భోజనము చేసెడువారు. తల్లి శ్రీరామరాజును భోజనము చేయుమని బ్రతిమాలుచుండును కాని అతడు "అమ్మా, ఈ వేళ మీరు ఉన్నారు కావున భోజనము చేయుదును. మీరు లేనప్పుడు నాకు ఎవరు పెట్టెదరు? నాకు వద్దు" అనుచుండెడువారు.

ఈ సమయముననే శ్రీరామరాజు జిరాల, మల్కనగిరి, జయపూరు, బస్తరు, నాగపూరుల మీదుగా కాలి నడకను నాసికాత్ర్యంబకమునకు బోయెను. పిదప పూనా, బొంబాయి, మద్రాసు, మైసూరుల మీదుగా కృష్ణాదేవి పేట తిరిగి వచ్చెను.

సహజముగా కరుణార్ద్ర హృదయుడైన శ్రీరామరాజునకు ఆ మన్య ప్రజల కష్టములను చూచి హృదయము ద్రవించెడిది. ప్రజలు తమ బాధలు, కష్టములు, సమస్యలు అన్నియు అతనితో చెప్పుకొనెడువారు. అతడు వారికి తగు సలహాలు ఇచ్చి పరిష్కార మార్గములు చూపించి అన్ని విధముల సహాయపడువాడు. జ్యోతిషము తెలియునుగాన ప్రశ్నలు చెప్పుట ముహూర్తములు పెట్టుట చేసెడువాడు. రక్షరేకులు కూడ ఇచ్చెడువాడు. ఆ దగ్గరలోనున్న లమ్మసింగి గ్రామస్థులు రెండు నూతులు తీసికొనిరి నీరు పడలేదు. ఒకనాటి రాత్రి శ్రీరామరాజును బండి మీద తీసికొని పోయి అతడు చెప్పిన ముహూర్త సమయమునకు సరిగా నూయి తీయగా పుష్కలముగా నీరు పడెను.

ఒకరు గృహ నిర్మాణమునకు కావలసిన కలప అంతయు సిద్ధము చేసికొనగా, "మీరు గృహము కట్టలేరు" అని శ్రీరామరాజు ఆయనకు చెప్పెను. మరియొకరికి "మీ పెద్ద కొడుకు కొలది కాలములో చనిపోవును" అని చెప్పెను. అవి అట్లే జరిగెను. ఈ ఉదంతములు శ్రీరామరాజు తల్లి చెప్పుచుండెడువారు. ఎవరికైనను జబ్బు చేసినచో మూలికా వైద్యము, గోసాయి చిట్కాలవంటివి చెప్పి సామాన్య రోగములను నయము చేసెడువాడు. ఒకసారి కృష్ణాదేవి పేట పోలీసు సబ్‌ఇన్స్పెక్టర్ అగు మంథామూర్తి రాజు

పంతులుగారు 5, 3 సంవత్సరములు వయస్సులుగల పిల్లలిద్దరికి ఎక్కువ జబ్బు చేయగా వారు జీవించరని ఆశ వదలుకొని శ్రీరామరాజును తీసికొని వెళ్ళిరి. అతడు వారిని చూచి "పర్వాలేదు రెండు రాగిరేకులు తీసికొని రండు" అని చెప్పి రక్షరేకులు వ్రాసి యిచ్చి ధూపమువేసి వానిని కట్టుమనియు, ఒక మూలికనిచ్చి అది నూరి శరీరమంతయు పూయుడనియు చెప్పెను. వారు అట్లు చేయగా ఆ పిల్లలిరువురును జబ్బు నయమై సుఖముగా లేచిరి. ఈ విషయమును కృష్ణాదేవిపేట గ్రామస్థుడును చిటికెలపెద అప్పన్న కుమారుడును అగు దాలి నాయుడు చెప్పెను. ఇట్టి ఉందంతములు పెక్కు గలవు. శ్రీరామరాజు రామాయణ మహాభారత కథలు, వేదాంత గ్రంథములు, పురాణములు మున్నగునవి చదివి ప్రజలకు చెప్పేదు వాడు. భగవద్గీత అతనికి పఠనీయ గ్రంథము. కావ్యములు అభిమాన గ్రంథములు.

ఈ విధముగా ప్రశ్నలు అడుగుటకు, ముహూర్తములు పెట్టించు కొనుటకు, రక్షరేకులకు ప్రజలు శ్రీరామరాజు వద్దకు తండోపతండములుగా వచ్చెడువారు. విభూతి వైద్యము, తాయెత్తులు తీసికొనుట సర్వసామాన్య విషయము, అతనిని దైవముగా భావించి అతని వద్దకు రిక్త హస్తములతో పోవుట ఇష్టము లేక పాలో పండ్లో తెచ్చియిచ్చెడివారు. అవి తీసికొని అతని **తల్లి**గారు తాను నిత్యము పూజ చేసికొని దేవునికి నివేదన చేసి వచ్చిన వారందరికి ప్రసాదముగా ఇచ్చుచుండెడివారు.

1918 ప్రాంతములో కొంగసింగి**లో మోదుగు చెట్టు** క్రింద మండలము దినములు తపస్సు చేసికొనుటకు చిన్న కుటీరము **వేయించుకొనెను. అచ్చట** పెద్ద పాముల పుట్ట ఉండినను పర్వాలేదని అచ్చటనే వేయించెను. **అచ్చటనున్న తెల్ల** జెర్రెదు చుట్టును నాగేంద్రుడు తిరిగిన జాడలు గ్రామస్థులకు కన్పించె**డివట. పలా**శవృక్షములు బ్రహ్మచర్య సిద్ధికి తోడ్పడునని మన శాస్త్రములు చెప్పును. పితూరి సమయములో గూడ శ్రీరామరాజు మోదుగ బెత్తమునకు వెండి తాపడము చేయించి వాడుచుండెడివాడు. మండలదీక్ష పూర్తియైన పిమ్మట తిరిగి భాస్కరుని యింటికి వెళ్ళెను. ఆ సంవత్సరములోనే ధారల ధారకొండపై మండలదీక్ష పూని నిర్విఘ్నముగా నెరవేర్చుకొనెను. విదవ యోగసమాధిలో రాజరాజేశ్వరి అనుగ్రహము కలిగిననియు, దూరదర్శన దూరశ్రవణాది సిద్ధులు కలిగినట్లును అచ్చటి కొందరు పెద్దలు చెప్పుదురు.

ఇట్లు శ్రీరామరాజు బాలయోగిగా ప్రజలను విశేషముగా ఆకర్షించెను. కృష్ణాదేవిపేట ప్రాంతమున అతని రాకతో మొదట ఆధ్యాత్మిక నైతిక విప్లవమునకు బాటవేయబడెను. కాళికాదేవి ఉపాసకుడగుటచే కొండ జాతులవారిని ప్రత్యేకముగా ఆకర్షింపగలిగెను. అతడు వారికి దైవసమానుడు. అతని వాక్కు వారికి వేదవాక్కు.

# 8. మన్య ప్రజలలో మార్పును దెచ్చుట

మన్య ప్రజలు శ్రీరామరాజుతో తమ కష్టసుఖములను చెప్పుకొనజొచ్చిరి. వారికి తగు సలహాలిచ్చుట అతనికి తప్పలేదు. పోలీసు, ఫారెస్టు మొదలగు శాఖల ఉద్యోగుల వలన వారికి బాధలు ఎక్కువగా నుండెడివి. ప్రజల నుండి కోడిపెట్టలు, నెయ్యి, పాలు, అరటిగెలలు మొదలగు వస్తువులను వారికి డబ్బీయకయే ఆ యుద్యోగులు పట్టుకొని పోయెడువారు. అడవుల నుండి శ్రమపడి తెచ్చుకొనిన కలపకు బెదరించి డబ్బు గుంజెడివారు. అడవులు తరచుగా అంటుకొనెడివి. ప్రజలను బలవంతముగా తోలుకొని పోయి కూలి చెల్లింపక అర్పించుచుండిరి. ఆ రోజులలో కూలి రోజుకు ఆరు అణాలు ఇచ్చెడువారు కంట్రాక్టు పనులలో రెండు అణాలు మాత్రము వారికి కూలి యిచ్చి తక్కిన నాలుగు అణాలు కాజేయుచుండిరి. ఈ విధమైన నిలువు దోపిడికి ప్రజలు విసిగిపోయిరి. కాని ఏమియు చేయలేని నిస్సహాయులు. తహసీల్దారు మున్నగు అధికారులను డోలీలపై కొండలలో వారు మోయవలెను. ఇందుకు తిట్లు, దెబ్బలు మాత్రమే వారికి ప్రతిఫలము.

మన్య ప్రజలు అనాగరికులు, అమాయికులు. అడవులలో దొరకు ఆకులలములు, దుంపలు, పండ్లు తిని బ్రతుకువారు. అవి కూడ దొరకనప్పుడు చింత గింజలను పొడిచేసి అంబలి కాచుకొనియు, అట్లే మామిడి కాయలలోని జీడిని ఎండబెట్టి పొడిచేసి దానితో అంబలి చేసికొనియు త్రాగి జీవితమును గడుపువారు. ఏమియు దొరకనిచో పస్తులుండువారు. అంటు వ్యాధులతో బాధ పడుచుండువారు. వైద్య సదుపాయము లేదు. మలేరియా వ్యాధి ఒక వైపున, జలగలవంటి అధికారులు మరియొక వైపున వారి రక్తమును పీల్చి పిప్పిచేయుచుండిరి. పోలీసులు, ఇతర ప్రభుత్వాధికారులు కోయ స్త్రీలతో అసభ్యముగా ప్రవర్తించినను మగవారు ఏమియు మాట్లాడుటకు వీలులేదు. అట్టి దుర్భర పరిస్థితులలో ఆ ప్రజలు నికృష్ట జీవితమును గడుపుచుండిరి.

ఇట్టి కష్టము లన్నియు వారు రాజుతో చెప్పుకొనసాగిరి. శ్రీరామరాజును వారు 'బాబూ' అని సంబోధించెడువారు. అతడు వారికి ఈ విధముగా సలహాలిచ్చుచుండువారు: "పోలీసువారు గాని, ఫారెస్టువారు గాని ఎవరైనను మీకేమియు భయము లేదు. వారు ఒక రూపాయి మీకిచ్చిననే తప్ప కోడిపెట్ట, నెయ్యి, అరటిగెల మున్నగు వస్తువులను వేనిని ఉచితముగా ఇవ్వవద్దు. అన్ రిజర్వుడు అడవులలో మారు జాతి కలపను మీకు కావలసినంత కొట్టుకొనుడు. టేకు మొదలైన కలపను మాత్రము కొట్టగూడదు. ఫారెస్టువారు మిమ్ములను ఏమైనను అనినచో 'రాజుగారు మమ్ములను కొట్టుకొమ్మన్నారు'

అని చెప్పండి. మీకేమియు భయము లేదు. అడవులు అర్పుటకు కూలి ఈయనిదే వెళ్లకుడు". ఆ విధమైన బోధచే రాజు అండ చూచుకొని ప్రజలు కొంచెము తిరుగబడసాగిరి. అందువలన ఉద్యోగులును భయపడజొచ్చిరి. ఒకనాడు శ్రీరామరాజు దర్శనమునకు ఒక ఫారెస్టరు వచ్చెను. మాటల ప్రస్తావనలో "అయ్యా, ఈ మన్య ప్రజలు పూర్వము వలె లేరు. కొంచెము తిరుగబడుచున్నారు" అని అతడనెను. అప్పుడు శ్రీరామరాజు అతనితో " ఈ ప్రజలు ఇక్కడ పుట్టి పెరిగినవారు. ఎక్కడకు పోదురు? మీరు వారిని చూచియు చూడనట్లు పోనీయవలెను. లేనిచో ప్రమాదము తప్పదు"అని చెప్పెను.

కృష్ణాదేవిపేటలో పోలీసు స్టేషను గలదు. ఒక రోజున ఆ గ్రామములో కొందరు జూదమాడుచుండిరి. శ్రీరామరాజును చూచి అందరును పారిపోయిరి. ఒక కానిస్టేబిలు మాత్రము అక్కడ ఉండెను. అతనిని చూచి శ్రీరామరాజు "ఏమోయి, మీరు ఉండియే ఇటువంటి పని చేయించవచ్చునా?" అని యడిగెను. అక్కడ బాస్టియను అను (భారతీయ క్రైస్తవుడు) నతడు తహసీలుదారుగా నుండెను. డోలీకట్టి మన్య ప్రజలు అతనిని కొండపై మోయుచుండగా వారి భుజములపై కాళ్ళు వైచి పశువులను అదలించినట్లు అదలించి హేళన చేయువాడట. ఈ విధముగా ఒకసారి ప్రజలు శ్రీరామరాజుతో చెప్పుకొనిరి. తహసీలుదారు బంట్రోతులు అప్పుడు అచ్చటనే యుండిరి. శ్రీరామరాజు "అట్లు డోలీ మోయునప్పుడు ఏ కొండ లోయలోనో కాలు జారినదని డోలీతో క్రింద పారవేయుడు" అని వారితో అనెను. ఈ సంగతి బంట్రోతులు తహసీలుదారుతో చెప్పిరి. శ్రీరామరాజునకు గల పేరును, అతనికి ప్రజలలో గల పలుకుబడియు అతడెఱుగును. అందుచే అతడేమియు చేయలేక "రాజు ఇల్లు తగులబెట్టుడు. అప్పుడు ఎటకోపోవును" అని మాత్రము అనెనట. కాని శ్రీరామరాజు ఎప్పుడైనను ఆ గ్రామము వెళ్ళినచో తహసీలుదారు వెంటనే గుఱ్ఱము నెక్కి ఎటకో పోవుచుండెడివాడు. ఈ విధముగా రాజు పేరు చెప్పినచో ఉద్యోగులును భయపడెడువారు.

మన్య ప్రజలకు భయము పోగొట్టుటయు, ఆత్మ విశ్వాసము కలిగించుటయే కాక శ్రీరామరాజు అభ్యుదయకారకములగు అనేక నిర్మాణ కార్యక్రమములను గూడ ఆ కాలమున చేపట్టి విజయవంతముగా నడిపించెను. అందు త్రాగుడు మాన్పించుట, పంచాయితీ కోర్టులు స్థాపించుట ముఖ్యమైనవి.

అప్పటి ప్రజలకు జీలుగు చెట్ల నుండి కల్లు తీసి త్రాగు అలవాటు ఉండెను. కృష్ణాదేవిపేటలో సారా దుకాణము కూడ ఉండెడిది. అప్పటి భీమవరము గ్రామ మునసబు రోజుకు రెండు మూడు రూపాయలు ఖర్చు చేసి త్రాగెడువాడు. ఇది అంతయు

చూచి శ్రీరామరాజు సహించలేక పోయెను. వారిలో త్రాగుడు మాన్పించదలచెను. అతనికి ఎట్టి ఉద్యోగాధికారము లేకున్నను అతని యందు ప్రజలకు అమితమగు భక్తియు, భయమును గలవు. త్రాగుడు మాన్పించుటకు అతడు కొన్ని కట్టుబాట్లు ఏర్పరచెను. ఏ గ్రామములోనైనను ఆ గ్రామ ప్రజలే ఆ కట్టుబాట్లను అవలంబింపజేయునట్లు కట్టడి చేసి వానిని ఆచరింపజేయు బాధ్యతను వారిపైననే పెట్టెను. ఒక్కొక్క గ్రామము తిరిగి ప్రజలను సంఘటిత మొనర్చి జీలుగు చెట్లు కొట్టించి వేసెను. ఎవరైనను కల్లు త్రాగినచో ఒకటి రెండు సార్లు ఒక అణా జరిమానా విధించబడెడిది. మూడవసారి ఆ తప్పిదమును చేసినచో అట్టి వానితో ఎవ్వరును మాటాడరాదు. వానికి నిప్పు నీరు ఈయగూడదు. వానిని కులము వారందరును బహిష్కరించవలెను. ఈ విధముగా రాజు శాసనమునకు బద్ధులై గొలుగొండ తాలూకాలోని 30, 40 గ్రామముల వారు నడువ జొచ్చిరి.

మద్యనిషేధము అమలు జరుపుటతోబాటు పంచాయితీ కోర్టులు గూడ స్థాపించెను. ప్రభుత్వ న్యాయస్థానమునకు ఎవ్వరును పోగూడదు. అయిదారు చోట్ల పంచాయితీ కోర్టులకు కేంద్రములను ఏర్పరచెను. వీనికి శ్రీరామరాజు అధ్యక్షుడు. చిటికెల భాస్కరుడు ఉపాధ్యక్షుడు. ఒక్కొక్క దినమున ఒక్కొక్క కేంద్రమునకు రాజు వెళ్ళి సాక్షులను విచారించి తీర్పులు చెప్పువాడు. కోర్టునకు హాజరు కావలసిన సాక్షులు మున్నగు వారిని పిలుచుటకు ఒక బంట్రోతు ఉండవలయును. వానికి ఏదియో ప్రతి ఫలము ఈయవలెను గదా. అందుచే 'కేసు'నకు పావలా ఫీజు నేర్పరచెను. ప్రజలు తీర్పునకు బద్ధులై యుండవలసినదే. ప్రజలు భక్తితో తీర్పును శిరసావహించెడువారు. ఇట్లు శ్రీరామరాజు మన్యమునకు మకుటములేని మహారాజువలె నుండెను.

ఈ విధముగా నిర్మాణ కార్యక్రమము సాగించుటతో చాల మందికి కష్టముగా నుండెను. మునుపటివలె అమాయిక ప్రజలను దోచుకొనువారి ఆట కట్టెను. మద్యపాన వ్యతిరేక ప్రచారము వలన అబ్కారీ పాటదారునకు నష్టము, పోలీసు, అటవీశాఖ మున్నగు అధికారులు లంచములు గుంజుకొనుటకు జంకుచుండిరి. కుంచెడు ధాన్యమునిచ్చి రెండు కుంచములు వసూలు చేయు వర్తక వ్యాపారులు తమ లాభములు పోయినందుకు బాధపడసాగిరి. రెండు అణాలు కూలి మాత్రమే ఇచ్చి రోజంతయు పని చేయించుకొను కంట్రాక్టరులు భయపడసాగిరి. ప్రజలను బెదరించి వారి వస్తువులను దౌర్జన్యముగా తీసికొనుపోవు అధికారుల విచ్చలవిడి చర్యలు తగ్గినవి. వీని ఫలితముగా రాజుపట్ల ప్రజల భక్తి విశ్వాసములు ఇనుమడించినవి. యమ యాతనలు అనుభవించుచున్న మన్యపు ప్రజలకు అతడు ప్రత్యక్ష దైవమువలె తోచెను.

ఏ హిమాలయములకో పోయి తపస్సు చేసికొనవలెనను ఆకాంక్షను నెరవేర్చుకొనుటకు తల్లి నిమిత్తముగా అవకాశము లేక పోయినది. తల్లితో కలిసి ఈ విధముగా నుండుట చేతను, ప్రజల కష్టసుఖములను చూచుచుండుట చేతను జ్ఞానయోగియైన శ్రీరామరాజు కర్మయోగిగా మారెను. "కర్మణైవహి సంసిద్ధిమాస్థితా జనకాదయః "లోక సంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తు మర్హసిః" అను గీతా వాక్యమును స్మరించుచు ముక్తసంగుడై జనకుని ఆదర్శముగాగొని మానవ సేవయే మాధవ సేవగా అతడు కర్మల నాచరింపబూనుకొనెను.

గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట మున్నగు గ్రామములలోని ముఖ్యులతో సమాలోచనలు జరిపి, చుట్టుపట్ల గిరిజన గ్రామములైన చిక్లింపాడు, లింగాపురం, రామాపురం, గడబపాలెం, రేకపాలెం, అనంత సాగరము, బుడ్డదుపాడు, గింజెర్తి, చిటికాజకొండ, గోకిరి మొదలగు గ్రామములు కాలి నడకనుచేరి అచ్చటి ప్రజల కష్ట సుఖములను తెలిసి కొనెడువాడు. వారికి చేయవలసిన విధులను బోధించుచు భీమవరం, వలసంపేట, చుట్టుబంద, నల్లకొండ, మాకవరం, నడింపాలెం, శరభన్నపాలెం, వెలగలపాలెం, నిమ్మగడ్డ, కంపరేగుల, గాంకొండ, గన్నర్లపాలెం, రంపులు, దోమలగొంది, కత్తిరాళ్లరోడ్డు, తీగలమెట్ట మున్నగు గ్రామముల చుట్టు ప్రక్కల గల రహస్య స్థలములను తిరుగుచు పంజరఘాటీ, రంపులుఘాటు, బూదరాళ్లఘాటు, గంగాదేవిఘాటు, నిమ్మలగొంది మొదలైన స్థలముల దగ్గరగల రహస్య స్థావరములను, అంతాడ ముఠాలోని ఎద్దుమామిడి, సింగధారలొద్దులునుండి దొర్లవరం దరిగల బలభద్రుని పాడులొద్దు, బాల రేవుల వరకుగల కాలి బాటలన్నియు వివరముగా వ్రాసికొని, గ్రామములోని పెద్దలు సానుభూతిపరుల పేర్లను వ్రాసికొని, వారికి సహాయ నిరాకరణోద్యమమునకు సంబంధించిన సూచనలిచ్చు చుండెడివాడు. ఇట్లు మన్యములోని ప్రాంతములన్నియు తిరిగి రహస్య స్థావరములు, దగ్గర దారులు, గుహలు, వాగులు, ఘాటులు మొదలగునవన్నియు పరీక్షించి గుర్తు పెట్టుకొనెడువాడు.

పంచాయితీ కోర్టులు స్థాపించిన పిమ్మట శ్రీరామరాజునకు విశ్రాంతియే లేకుండెను. తెల్లవారు జామున మూడు గంటలకు పూర్వమేలేచి, కాలకృత్యములు తీర్చుకొని, ఏటిలో స్నానముచేసి, ఏటి ఒడ్డునగల రాతి బండపై తపస్సునకు కూర్చుండు వాడు. మధ్యాహ్నము 12 గంటలకు ధ్యానమునుండి లేచి, ఒక పండు, పావుశేరు పాలు ఉప్పుచో తీసి కొనెడువాడు. తరువాత నియమిత కేంద్రమునకు వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారమున మునిగి కోర్టు పని అయిన పిమ్మట రాత్రి ఏపది గంటలకో ఇంటికి

చేరుకొనెడువాడు. పులి తిరుగు ప్రాంతములో కాపురము, అందుచే తల్లి, తమ్ముడు ఏమగుదురోయని అర్ధరాత్రియైనను ఇంటికి చేరువాడు. అయినను ఆలోచనానిమగ్నుడై రాత్రియు ఎక్కువ నిద్ర పోయెడువాడు కాదు. "ఈ నిరంకుశ ప్రభుత్వమును పారద్రోలుట ఎట్లు? ఈ ప్రజలను ఉద్ధరించుట ఎట్లు? గెరిల్లా యుద్ధము చేయక తప్పదు. అమాయకులైన ఈ ప్రజలను వెంట బెట్టుకొని ఎట్లు చేయవలెను? ఊరకుండినచో ఈ నిరంకుశ ప్రభుత్వము క్రింద ప్రజలు ఈ విధముగా కలకాలము బాధ పడవలసినదేనా?" అనుచు, తల్లి "నిద్ర లేకుండ రాత్రి యంతయు ఆ యాలోచనలేమిటి చిట్టిబాబూ" అనినప్పుడు ఆమెను ఊరడించుచు తన యాలోచనలను సూచించెడువాడు.

అతడు ప్రజల దృష్టిలో దైవము, నాటి ప్రభుత్వ దృష్టిలో ద్రోహి.

# 9. ఏజెన్సీలో పూర్వము జరిగిన తిరుగుబాటులు

విదేశీయుల పరిపాలన వలన దేశములోని ఆర్థిక రాజకీయ పరిస్థితి చాల నికృష్టముగా నుండెను. సామాన్య ప్రజలు దారిద్ర్యముతో కుమిలిపోసాగిరి. ఇక మన్య ప్రాంతములలోని ప్రజల దుర్భర పరిస్థితులు వర్ణింపశక్యము కాకుండెను. ఇచ్చటి ప్రజలు అనాగరికులు. తిండి, బట్ట కరువుకు తోడు భయంకరమగు మలేరియా వ్యాధి వారిని పీల్చి పిప్పిచేయుచుండెను. వీనికి తోడు ప్రభుత్వోద్యోగుల దురంతములు. వీని నెదుర్కొనుటకు ఇంతకు ముందుగూడ ఈ కొండ జాతులవారు ప్రభుత్వముపై తిరుగుబాటు చేసిరి. అట్టివే రంపపితూరి, లాగరాయి పితూరి మొదలగునవి. ఇవి యన్నియు స్థానికుల నాయకత్వముననే జరిగినవి. కాని వాని లక్ష్యము వ్యక్తిగతము, పరిమితమునై యుండెను. శ్రీరామరాజు పితూరికిని, వానికిని చాల భేదము గలదు.

1922-24 సంవత్సరముల మధ్య జరిగిన పితూరినిగూడ రంపపితూరి, రంప విప్లవము అని పిలుచుట పరిపాటియైనది. కాని ఇది కృష్ణా దేవిపేట, చింతపల్లి, కొయ్యూరు, మాకవరము, పెద్దవలస, గూడెం కొండలు, అడ్డతీగల, వాని చుట్టునున్న మన్య ప్రాంతములలోను, పోలవరము డివిజనులోని ఇతర ఏజెన్సీ ప్రాంతములలోను జరిగినది. కాని అసలు రంప ప్రాంతమునకు ఎక్కువగా వ్యాపింపలేదు. అయినను 1879 సంవత్సరమునుండి రంప ప్రాంతమునందు తరచుగా ఏదియో యొక తిరుగుబాటు సంభవించుచుండుట వలన సుఖ బోధకముగా నుండుట కొఱకు దీనిని గూడ రంప విప్లవమని చెప్పసాగిరి.

శ్రీరామరాజు విప్లవమునకు పూర్వము ఏజెన్సీ ప్రాంతములో చాల కాలమునుండి ఏదియో యొక కారణము మూలముగా జరుగుచున్న తిరుగుబాటులు చాల గలవు.

**1840 రంప పితూరి** : 19వ శతాబ్ది ప్రారంభంలో పర్వత ప్రాంతములో నున్న రంప మన్సబుదారు (లేక రాజు) క్రింద మైదానములోని కొన్ని గ్రామములను బలవంతముగా ఆక్రమించుకొనెను. ఈ గ్రామములనుండి అతడు తరిమివేయబడెను గాని 1813 సెటిల్‌మెంటు ప్రకారము పర్వత ప్రాంతములో అతని పూర్వికుల ఆస్తితోపాటు పేష్కస్ కట్టనవసరము లేకుండ అవి కూడ అతనికి ఈయబడినవి. అందులకు ప్రతి ఫలముగా క్రిందికి పర్వత వాసులు రాకుండ అతడు చూడవలయును. తరువాత అతడు తన గ్రామములన్నియు కొలుకొల్పినాడు. 1835లో అతడు మరణించినప్పుడు అతనికి

5.

ఒక కూతురును, అనౌరసుడగు పుత్రుడును గలరు. వారిని ప్రభుత్వము పోషించుచు 1849లో ఆ ఎస్టేటును 'కోర్టు ఆఫ్ వార్డ్సు' ఆధీనములో పెట్టినది. పిదప కొన్నిచోట్ల తిరుగుబాటులు లేచినవి. 1845 నాటికి నాయకులైన ముఠాదారులు నిర్బంధింపబడిరి. 1848లో జమీందారిణి ఎస్టేటుపై తన హక్కు వదలుకొనగా ఆమె వైమాత్రేయుడగు సోదరుడు మన్సబుదారుడు నియమింపబడెను.

**1845-48 : గొలుగొండ పితూరి :** విశాఖమండలములోనున్న గొలుగొండ జమీందారీని పన్నుల బకాయిలకుగాను ప్రభుత్వము వశపరచుకొనెను. ఈ పన్నులతో వారికేమియు సంబంధము లేకున్నను, జమీందారీలోనున్న పర్వత ప్రాంతపు ముఠాదారులు ప్రభుత్వ చర్యను ఆత్మ గౌరవమునకు భంగకరముగా తలచిరి. ఒక మామూలు అమీనుకు తాము ఆజ్ఞాబద్ధులమై యుండుట వారికి చిన్నతనముగా తోచెను. అందుచే వారు 19 ఏండ్ల ప్రాయమున్న చిన్న భూపతి అనువానిని తమరాజుగా గద్దెపై నిలిపిరి. 1845 నుండి 1848 వరకు ప్రభుత్వ సైనికులను విజయవంతముగా వారు ప్రతిఘటించ గలిగిరి. వారందరిని క్షమించెదమని ప్రభుత్వము ప్రకటించిన తరువాతగాని ఆ యలజడి సద్దుమణగలేదు.

**1849-50 : జయపూరులో తిరుగుబాటు :** 1849లో జయపూర్ జమీందారీలో ఒక తిరుగుబాటు లేచెను. రాజు యొక్క అవకతవక పాలనకు విసిగి ఒక వర్గము తిరుగుబాటు చేసి ఆయన జ్యేష్ఠ పుత్రుని గద్దె నెక్కించినది. పెద్ద రాజు తన పదవిని వదులుకొన్న పిదప అలజడి అంతమైనది.

**1853 సవరల తిరుగుబాటు :** 1853 మార్చి, నవంబరు మాసములలో పర్లాకిమిడివద్ద పలు ప్రాంతములను సవరలు ఆక్రమించిరి. కాని త్వరలోనే ప్రభుత్వ సైనికులు వారి పంటలను తగులబెట్టియు, వారి పశువులను చెల్లాచెదరుగా పారద్రోలియు వారిని లొంగదీసికొని అణచి వేసిరి. అసంతృప్తి చెందిన పట్టమహాదేవి, బిస్సాయీల ప్రోత్సాహమువలననే సవరలు తిరుగుబాటుకు ఒడిగట్టిరని ప్రభుత్వము భావించినది.

**1855-56 మరల జయపూరు :** రాజు కొడుకు లిద్దరు పోట్లాటకు దిగిరి. మద్రాసు ప్రభుత్వము ఎస్టేటును స్వాధీనము చేసికొనవలెనని ప్రతిపాదించినది. కాని ఆ సమయమున ఉదకమండలములోనున్న డల్హౌసీ ప్రభువు సమ్మతించక పోవుటచే, ఈలోగా రాజు మరణించగా 1863లో గాని ఆ ప్రతిపాదన అమలులోనికి రాలేదు.

**1856-57 మరికొన్ని సవర తిరుగుబాటులు :** 1856-57లో గంజాం జిల్లాలో

మరియొక అలజడి లేచినది. గైల వివాసియగు రాధాకృష్ణ దండసేసుని నాయకత్వమున పర్లాకిమిడి జమీందారిలోని సవరలు తిరుగుబాటు చేసి 50 గ్రామములను తగులబెట్టియు దోచుకొనియు భయోత్పాతము కలుగజేసిరి. కాని శీఘ్రకాలములోనే సైనికులు సవర ప్రాంతములోనికి చొచ్చుకొనిపోయి తిరుగుబాటులను అణచి వేసిరి. గ్రామములను, పంటలను తగులబెట్టి దండసేనుని పట్టుకొని రాజ ద్రోహిగా ఉరి తీసిరి.

**1857-58 : మరియొక గోలుగొండ పితూరి :** ఇది కూడ 1845-48 తిరుగుబాటు వంటిదే. రెండును జమీందారు కుటుంబమును మరల గద్దె నెక్కించుటయే లక్ష్యముగా గలవి. ఇది చిన్న భూపతి భ్రాతృవ్యుడగు సన్యాసి భూపతి నాయకత్వమున జరిగినది. పర్వత ప్రాంతమందలి కొందరు సర్దారుల సహాయముతో కాప్టెన్ ఓవెన్ నాయకత్వమున ప్రభుత్వ సైనిక దళము దానిని సత్వరమే అణచి వైచినది. ఈ తిరుగుబాటు 'సిపాయి తిరుగుబాటు' అని పిలువబడు ఉద్యమము కాలముననే జరిగినది.

**1858 సుబ్బారెడ్డి తిరుగుబాటు :** 1858లో యర్నగూడెమునకు ఉత్తరముననున్న పర్వత ప్రాంతమున చిన్న యలజడి రేగినది. దీనికి 'సిపాయి తిరుగుబాటు'తో పరోక్షముగా సంబంధముండుట వలన కొంత ఆసక్తిదాయకమైనది. ఒక స్త్రీ విషయములో కొందరు ముఠాదారుల మధ్య తగవులాటయే దీనికి మూల కారణము. కాని ఈ వివాదమునకు నాయకుడైన సుబ్బారెడ్డి ఈ విధముగా ప్రకటించెను. నానాసాహేబు అజేయమైన తన సైన్యముతో పురోగమించుచున్నాడనియు, ఆంగ్లేయులను ఎంత ఎక్కువగా వెదిరించిన అంత పెద్ద బహుమతి లభించుననియు ప్రచారము చేసెను. రెండు అల్ప సైనిక దళములు ఈ తిరుగుబాటు దారులను వేటాడి చెదర గొట్టినవి. సుబ్బారెడ్డియు, ఇంకొక ఏడుగురు ముఖ్య నాయకులును పట్టుకొనబడి ఉరి తీయబడిరి.

**1865 గంజాములో ఖోండుల (గోండుల) తిరుగుబాటు :** 1857లో కుట్టియ ఖోండులు ఒక చిన్న తిరుగుబాటును లేవదీసిరి. 1865 నవంబరులో పెద్ద తిరుగుబాటు ఒకటి జరిగినది. రోడ్డు పని చేయుచున్న కొందరు కుట్టియ ఖోండులు ఓఢ్రపాత్రోలు తమ పట్ల చూపు దురుసు ప్రవర్తనకు అసంతృప్తి చెంది పనిని మానివేసిరి. వారిని తీసికొని వచ్చుటకు పంపబడిన ఇద్దరు గ్రామ సేవకులను చంపివైచిరి. ఇది సంకేతముగా భావించి కుట్టియ ఖోండులందరును తిరుగుబాటునకు సన్నద్ధులైరి. తమ ప్రాంతమునుండి ఓఢ్రులను పారద్రోలుటకు వారు బహుధా ప్రయత్నించిరి. ఈ తిరుగుబాటు ముఖ్యముగా సుబమగిరి, మహాసింగి, కలహండి ముఠా ప్రాంతములకే పరిమితమైనది. వారు ఓఢ్ర గ్రామములను తగులబెట్టి, స్త్రీ పురుషులు, శిశువులు అనువివక్ష లేకుండ చేతికి దొరకిన

ఓఢ్ర ప్రజల నందరిని చంపి, ఆస్తులను దోచుకొనిరి. ఓఢ్రులును వారిపై తిరుగబడి ప్రతీకారము తీర్చుకొనసాగిరి. పోలీసు పటాలములు 'కురిపుజ' పై రాత్రి దాడి జరిపి ఖోండులను లొంగదీసి కొనిరి. 1865 సంవత్సరము చివరకు ఈ అలజడి చల్లారినది.

**1879, రంప పితూరి :** ఎనిమిది యేండ్ల అలజడి తర్వాత 1848లో గోదావరి జిల్లాలోని రంప జమీ ముఠాదారులు అంగీకరించిన మన్సబుదారు అచిర కాలములోనే వారిని బాధలు పెట్టి అసంతృప్తికి లోను జేసెను. వారు 1858, 1861, 1862 సంవత్సరములలో చిన్న చిన్న తిరుగుబాట్లు లేవదీసిరి. మన్సబుదారు దుష్కృత్యములు మితిమీరుచు 1879 సంవత్సరమునకు అతడు ఎనిమిది ముఠాలను సొంతము చేసికొని, భూమి పన్నును రెట్టింపు చేసి, ఇతర పన్నులను గూడ అనధికారముగా వసూలు చేయుచు పెద్ద మొత్తమును పొందుచుండెను. ఇది యంతయు ప్రభుత్వము సమ్మతితోనే చేయుచున్నట్లు కనిపించులాగున చేయగలిగెను. ప్రభుత్వాధికారులు ఆ ప్రాంతములో ఏమి జరుగుచున్నది గమనించలేదు. అందుచే ముఠాదారులకు సరియైన రక్షణ లభించలేదు. దానికి తోడు క్రొత్త అబ్కారి నిబంధనలు ప్రవేశపెట్టి, కల్లుపై పన్నువేసి, ప్రజలు త్రాగుటకు గూడ కల్లు గీసికొనకుండ అడ్డు పెట్టిరి. 1879 తిరుగుబాటునకు ఇది తక్షణ కారణమయ్యెను. పోలీసులు కూడ ఈ అబ్కారీ నిబంధనల అమలుకు తోడ్పడుటచే వారియెడ గూడ ప్రజలకు ద్వేషము ప్రబలెను. బయటనుండి మన్య ప్రాంతములోనికి వచ్చు వర్తకులు మన్య ప్రజల అమాయికత్వమును ఆసరాగా తీసికొని వారితో తమకు అనుకూలముగా నుండు కంట్రాక్టులు కుదుర్చుకొని, వానిని ఉల్లంఘించినచో కోర్టులలో దావాలు వేసి తమకనుకూలమైన తీర్పులు పొందుచుండిరి. ఈయన్నిటి వలన మన్య ప్రజలలో అసంతృప్తి, విద్వేషములు పరాకాష్ఠనెంది 1879 మార్చిలో తిరుగుబాటు చేసిరి. వారు ఒక పెద్ద దళముగా నేర్పడి చోడవరము వచ్చి వారి బాధలన్నియు సబు కలెక్టరుతో చెప్పుకొనిరి. వారిని శాంతింప చేయుటకు అతని ప్రయత్నములు విఫలమయ్యెను. సైన్యము రప్పించబడెను. ఈలోగా ఇద్దరు పోలీసు జవానులను బట్టుకొని మన్య ప్రజలు వారి దేవతకు బలి యిచ్చిరి. రంప ప్రాంతమంతయు విప్లవ జ్వాలలు ప్రాకుచుండెను. ఏప్రిల్ నెలలో విశాఖమండలములోని గొలుగొండ ప్రాంతములోను, జూలైలో భద్రాచలములోని రేకపల్లి ప్రాంతములోను ఈ విప్లవ దావానలము వ్యాపించెను. సైనికులతో ప్రత్యక్షముగా తలపడక, అరణ్య ప్రాంతమంతయు బాగుగా తెలిసియుండుటచేత తిరుగుబాటుదారులు (ద్వారబంధం చంద్రయ్య నాయకత్వమున) గెరిల్లా యుద్ధము చేయుచు, పోలీసు స్టేషనులపై దాడి చేయుచు,

అధికారులకు సహాయము చేయు గ్రామములను కొల్లగొట్టి తగులబెట్టుచు స్వేచ్ఛా విహారము సల్పుచు కొన్ని విజయములు సాధించిరి. 1879 సంవత్సరము చివర హైదరాబాదు నుండి హుటాహుటిని సైనిక దళములు రప్పించబడెను. గోదావరి శబరి నదులగట్లపై సైనిక శిబిరములు స్థాపింపబడి నలువైపుల నుండి రంప ప్రాంతమును సైనిక దళములు చుట్టుముట్టెను. పిదప రెవిన్యూబోర్డు ప్రథమ సభ్యుడైన సల్లివాన్ జిల్లాను సందర్శించి, విచారణ జరిపి, మన్సబుదారును పదవీచ్యుతుని జేసి ఇకపైన ముఠాదారులు ప్రభుత్వముతోడనే ప్రత్యక్షముగా వ్యవహరించునట్లు ఏర్పాటు గావించెను. ఆగస్టు చివరకు రంపలో శాంతి నెలకొనెను. రేకపల్లిలో గూడ ప్రశాంత పరిస్థితులు నెలకొల్పి అక్కడక్కడ మిగిలిన తిరుగుబాటు దారులను గొలుగొండ, జయపుర పర్వత ప్రాంతములవైపు పారద్రోలిరి. సైనికులు చాల మంది జబ్బుపడిరి. 1879 సెప్టెంబరు నెలలో సల్లివాన్ దర్బారు జరిపి ముఠాదారులకు సన్నదులు పంచి పెట్టెను. ప్రభుత్వమునకు కొంత పన్ను కట్టుటకును, ప్రభుత్వమునకు విధేయతతో నుండి శాంతిభద్రతలు కాపాడునట్లు ముఠాదారులతో ఒప్పందము కుదుర్చుకొనబడెను. మన్సబుదారును బరంపురములో బంధించి అతని ముఠాను ప్రభుత్వమునకు సాయపడిన ఇద్దరు వ్యక్తులకు పంచిరి.

**1886, గొలుగొండ ఫితూరి :** 1886లో కొందరు కొండదొర పూజారులు కొండ దేవతలు ఫితూరిని ప్రారంభించుమని చెప్పిరని ప్రచారము గావించుచు అరణ్య ప్రాంతమంతయు కొన్ని నెలలు తిరిగిరి. దానితో ప్రేరణ చెందిన సుమారు 30 మందితో గూడిన ఒక దళము గూడెమువెళ్ళి పోలీసు స్టేషనును కొల్లగొట్టి తగులబెట్టినది. పోలీసులు పారిపోయిరి. అక్కడ నుండి లమ్మసింగికి పోవుచుండగా పోలీసులు వారిని చెదరగొట్టి పిదప అందరిని పట్టుకొనిరి. లమ్మసింగి ముఠాదారు తిరుగుబాటుకు సానుభూతి చూపుటచే అతని ముఠాను స్వాధీనము చేసికొని పదవి భ్రష్టుని గావించిరి.

**1891, ఇంకొక గొలుగొండ ఫితూరి :** 1845 సంవత్సరములో జరిగిన తిరుగుబాటులో ముఖ్యుడైన చిన్న భూపతి కుమారుడు శాంత భూపతి. ప్రభుత్వము ఇతనికి కొంత భరణమిచ్చెడిది. అతడు దానితో సంతృప్తి చెందలేదు. రంపఫితూరిలో పాల్గొన్న ఒక విప్లవ కారుని సహాయముతో శాంతభూపతి సుమారు 200 మంది గల దళమును ప్రోగుచేసెను. 1891 మే 22 తేదీన వారు 11 ఏండ్ల క్రితము ఒక విప్లవ నాయకుని కాల్చి చంపిన కానిస్టేబులు ఇంటిపైబడి దోచుకొనిరి. పిదప కృష్ణాదేవిపేట పోలీసు స్టేషనుకు వెళ్ళి అయిదుగురు కానిస్టేబిళ్ళను చంపి, అచ్చట నున్న ఆయుధములు మందుగుండు

తీసికొని భవనమునకు నిప్పు అంటించిరి. తరువాత కొండలలో ఒక నెల వరకు ఎవ్వరికిని కనబడకుండ దాగుకొనిరి. జూన్ 24వ తేదీని వారి నాయకుడు జ్వరము, గ్రహణులతో మరణించగా వారు చెదరిపోయిరి. వారిలో 33గురు పిదప నిర్బంధింపబడిరి. ముఠాదారులెవ్వరును ప్రభుత్వమునకు తోడుపడక పోవుటచే కొయ్యూరు, చిట్టంపాడు, బందవలస ముఠాలు స్వాధీనము చేసికొనబడెను. లమ్మసింగి, కొత్తవీధి, లోతుగెడ్డ ముఠాదారులు పదవుల నుండి తొలగింపబడి వారి వారసులు ముఠాదారులుగా నియమింపబడిరి. గూడెం కొత్తవీధి ముఠాదారగు పోలిలను దొర ఏజెన్సీ వారంటుతో నిర్బంధింపబడి ప్రవాస శిక్ష విధింపబడెను.

**1900, పాలూరు తాలూకాలో ఫితూరి** : పాలూరు తాలూకాలో కొఱ్ఱవానివలస అను కుగ్రామమున 1900 మే నెలలో ఒక విచిత్రమైన సంఘటన జరిగినది. ఆ గ్రామ నివాసియగు కొఱ్ఱ మల్లయ్య అను కొండదొర తనకు దేవతావేశము వచ్చినట్లు నటించి తన చుట్టును నాలుగు లేక అయిదు వేల మందిని ప్రోగుచేసెను. వారందరు వివిధ ప్రాంతములనుండి **వచ్చిన ఏజన్సీ** ప్రజలే. మొదట అతని చర్యలు ప్రమాదకారకములు కానివే. కాని 1900 ఏ**ప్రిల్ నెలలో తాను పంచ పాండవు**లలో నొకని యవతారమనియు, కృష్ణ భగవానుడు తన **చిన్ని కొడుకనియు, బ్రిటిషు**వారిని తరిమివైచి తానే దేశమును పాలింతుననియు ప్రకటించెను. **తన అనుచరులకు** వెదురు కఱ్ఱల నిచ్చెదననియు, అవి తన మంత్రశక్తిచేత తుపాకులుగా మారున**నియు,** ప్రభుత్వము వారి ఆయుధములు నీరు అయిపోవుననియు ప్రచారము చేసెను. వెదురు కఱ్ఱలు కొట్టి తుపాకి రూపములలో చెక్కిరి. మల్లయ్యను ప్రజలిప్పుడు 'స్వామీ' అని పిలుచుచుండిరి. అతడు తన దళమునకు కొవ్వాళ్ల శిక్షణ నొసగెను. పిమ్మట వారు పాచిపెంట గ్రామమును లూటీ చేయుచున్నామని వార్త పంపిరి. మే ఒకటవ తేదీని పరిస్థితిని పరిశీలించుటకు ఇద్దరు కానిస్టేబిలులు రాగా వారిని కొట్టి చంపిరి. మే 7వ తేదీని జిల్లా మేజిస్ట్రేటు కొంత రిజర్వు పోలీసు దళమును తీసికొని స్వామిని, ఇతర ముఖ్య నాయకులను నిర్బంధించుటకు పోయెను. ఇరు పక్షముల మధ్య యుద్ధము జరిగినది. తిరుగుబాటుదారులలో పదకొండు మంది మరణించిరి. కొంత మంది గాయపడి నిర్బంధింపబడిరి. మిగిలిన వారు పారిపోయిరి. 60 మందిపై దొమ్మి నేరము మోపి విచారణకు పెట్టిరి. దానితో అలజడి శాంతించినది.

**1912**, విఫలమైన నవరల **తిరుగుబాటు** : 1912 సంవత్సరములో ఒక ఫారెస్టు రిజర్వుకు హద్దు లేర్పరచుచున్న ప్రత్యేక అటవీ శాఖాధికారిని బెదరించుటకు పర్లాకిమిడి ప్రాంతములోని లేరంగి ముఠాకు చెందిన నవరలు ప్రయత్నించిరి. పరిస్థితులు

విషమముగా పరిణమించినవని మొదట అనిపించినను అధికారులు తక్షణ చర్య తీసికొనుట వలన పరిస్థితిని అదుపులోనికి తీసికొని రాగలిగిరి. తక్కిన సవర గ్రామములలో ఏమియు వ్యతిరేకత లేనందువలనను, సవరలకు ఆ యటవీశాఖాధికారి ఇష్టుడై యుండుట వలనను ముఠా అధికారులు స్వప్రయోజనమునకు ఈ యలజడిని ప్రేరేపించిరని గంజాం కలెక్టరు నిర్ణయించి ఆ యధికారులను తొలగించెను. ఈ చర్యకు ప్రభుత్వము ఆమోదము తెల్పినది.

**1915-16 లాగరాయి పితూరి** : ఇది పెద్ద పితూరిగా పరిణామము చెందకపోయినను ఈ లాగరాయి బృందము చర్యలు 1915-16 సంవత్సరములలో విస్తృతముగా వ్యాపించి మన్య ప్రాంత ప్రజల సానుభూతిని చూరగొనినవి. దొంగతనమునకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను నిర్బంధించగా, కొండపల్లి, లాగరాయిల కోయలు, కమ్మరులు కూడి ఖైదీలకు కాపుగానున్న పోలీసులపై దాడిచేసి ఖైదీలను విడిపించి తుపాకులను తూటాలను స్వాధీనము చేసికొనిరి. అప్పటకు వచ్చుచున్న పోలీసు దళమును మాటుగాచి కొట్టి పిదప ఇండ్లను వదలి పారిపోయి ప్రభుత్వమును ధిక్కరించుచు తిరుగుట మొదలిడిరి. వారిని బంధించుటకు ప్రయత్నించుచున్న పోలీసు దళముతో దాగుడుమూతలాడుచు విస్తారమైన అరణ్య ప్రాంతమున కొండలలో తొమ్మిది నెలలపాటు తిరిగిరి. అప్పుడప్పుడు పోలీసుల నెదుర్కొనుచు, నలుగురిని చంపి, దోచుకొనుట సాగించిరి. 1916 మే నెలలో తాము సాధారణముగా తిరుగుచున్న ప్రాంతపు సరిహద్దులు దాటిరాగా పోలీసులు వారినెదుర్కొని చెదరగొట్టిరి. ఇట్లు నలుమూలలకు చెదరిపోయిన ఈ బృంద సభ్యులు క్రమముగా వేటాడబడి పట్టుబడిరి. కొందరిని గ్రామస్థులు పట్టుకొని అప్పగించిరి. ఈ పితూరి గరమం (గం) డ మంగరాజు నాయకత్వమున జరిగెనని కృష్ణారావుగారు వ్రాసిరి.

# 10. శ్రీరామరాజు విప్లవము

## నాటి ఏజెన్సీ పరిపాలన విధానము

ఏజెన్సీ పరిపాలన విధానములో ' పర్మనెంటు సెటిల్మెంటు' కాలము నుండి చాల మార్పులు తీసికొని రాబడెను. మొదట 1799 (1802?) లో పర్మనెంటు సెటిల్మెంటును ప్రవేశపెట్టు సమయములోనే ఏజెన్సీని ప్రభుత్వ ప్రత్యక్ష పరిపాలన క్రిందకి తీసికొని వచ్చుటకు ప్రయత్నము జరిగెను. ఈ పద్ధతి వలన జమిందారుల నుండి పోలీసు, శాంతిభద్రతల రక్షణ బాధ్యతలు తొలగింపబడి పన్నులను గ్రహించుట మాత్రము శాశ్వతముగా వారి ఆధీనమందుంచబడెను.

గంజాం విశాఖపట్టణము శాసనము 1839 లో అమలులోనికి వచ్చినది. ఈ శాసనము వలన గంజాం విశాఖ జిల్లాలలోని పర్వత ప్రాంతములు రివిన్యూ న్యాయశాఖల అధీనములనుండి తప్పించి మద్రాసు గవర్నరు ఏజెంట్లుగా గంజాం, విశాఖ కలెక్టరులకు అప్పగించబడినవి. ఈ ప్రాంతములందలి సివిల్ క్రిమినల్ న్యాయ నిర్వహణ ఏజెంట్లుగా ఈ కలెక్టరుల పరము చేయబడినది.

నైజాము ఉత్తర సర్కారులను బ్రిటిషు వారికి దత్తము చేసినప్పుడు రంపప్రాంతము బ్రిటిషువారి అధీనములోనికి వచ్చెను. 1860 నవంబరులో చేసికొనిన సంధి ప్రకారము భద్రాచలము, రేకపల్లి తాలూకాలు బ్రిటిషు రాజ్యములో కలుపబడెను. ఈ మూడు ప్రాంతముల పాలన గోదావరి జిల్లా కలెక్టరు అధీనముననుంచబడెను.

ఈ విధముగా 1879 జూలై నుండి మద్రాసు ప్రభుత్వము క్రింద నున్న మూడు ఏజెన్సీ ప్రాంతముల పాలన ప్రభుత్వ ఏజెంట్లుగా ముగ్గురు జిల్లా కలెక్టరుల నిర్వహణలో నుండెను. 1874-1920 సంవత్సరముల మధ్యకాలములో ఈ మూడు ఏజెన్సీ ప్రాంతముల సరిహద్దులలో చాల మార్పులు చేయబడెను. ఈ మూడు ప్రాంతములను ఒకే అధికారి పాలన క్రిందికి తేవలయునని ప్రభుత్వము తలపోసి 1920 ఏప్రిల్‌లో ఒక కమీషనరును నియోగించి వాల్తేరు ప్రధాన కేంద్రముగా 'ఏజెన్సీ డివిజను' అని దానికి నామకరణమొనర్చి డిసెంబరు ఒకటవ తేదీనుండి దాని పాలనను అతనికి అప్పజెప్పిరి.

ఈ మన్య ప్రాంతమంతయు మరల వేర్వేరు సబ్ డివిజనులుగా విభజింపబడినది గంజాం జిల్లాలో బలిగూడ, శ్రీకాకుళం కేంద్రములుగా రెండు, విశాఖజిల్లాలో మూడు

1. గుణుపూరు, బిస్సంకటక్, రాయఘడ ప్రాంతములతో పార్వతీపురము, 2. గూడెం ప్రాంతమంతటితో నరసీపట్నము, 3. పాడువా, పోతంగి, జయపూరు, కోరాపుట్టి, మల్కనగిరి, నవరంగపుర ప్రాంతములతో కోరాపుట్టి కేంద్రములుగాను; గోదావరి జిల్లాలో రెండు. 1. భద్రాచలము, నూగూరు ప్రాంతములతో భద్రాచలము, 2. పోలవరము, చోడవరము, యల్లవరము ప్రాంతములతో పోలవరము కేంద్రములుగాను విభజింపబడెను.

1922-24 సంవత్సరముల మధ్య జరిగిన పితూరికి విశాఖ ఏజన్సీలోనున్న గూడెము తాలూకాలోని గూడెము మాకవరము, పెద్దవలస ముఠాలు కేంద్రములు, గోదావరి జిల్లాలోని పోలవరము ఏజెన్సీలోగల యల్లవరము తాలూకాలోనికిని, విశాఖ గోదావరి జిల్లాలలోని ఏజెన్సీ కాని ప్రాంతములకును గూడ విప్లవము విస్తరించినది.

1920లో ఈ ప్రాంతమంతటిని కలిపి ఏజెన్సీ డివిజనుగా ఏర్పరచి దానికొక కమీషనరును నియమించిరి. కాని మరల 1923లో ఏజెన్సీ డివిజనును రద్దుచేసి గంజాం, విశాఖ, గోదావరి జిల్లాలలోని ప్రాంతములను ఆయా కలెక్టరుల ఆధీనములో నుంచిరి.

# 11. విప్లవ శంఖము పూరించుట

ఆ రోజులలో గూడెములో తహసీల్దారుగానున్న బాస్టియను చాల క్రూరుడు, లంచగొండి, ధనాశపరుడు. జీత్తులమారియగు రోడ్డు ఓవర్సీరు సంతానం పిళ్లె అన్ని విధముల అతని క్రూరకృత్యములలో సహాయపడు వాడు. వీరిరువురును కంట్రాక్టరులకు సహాయులైరి. నర్సీపట్నమునుండి లంబసింగి వరకు ఘాట్ రోడ్డు వేయుటకు ప్రభుత్వము సొమ్ము మంజూరు చేసెను. కాని కంట్రాక్టరులు ఆ ప్రజల అమాయికత్వమును ఆసరాగా తీసికొని కూలి ఈయక వెట్టి చాకిరి చేయించుకొనియో, నామ మాత్రముగా, ఈయవలసిన ఆరు అణాల కూలికి బదులుగా రెండు అణాలు కూలి ఇచ్చియో వారిని నానాబాధలు పెట్టెడువారు. ఈ ఘోరకృత్యములకు బాస్టియను, సంతానంపిళ్లె కంట్రాక్టరులకు పత్తాసుగా నుండెడువారు. అప్పుడు కొన్ని గూడెములుచేరి ఒక ముఠాగా ఏర్పరుపబడినవి. ప్రతి ముఠాదారుడు గూడెములలో పన్నులు వసూలు చేసికొని ప్రభుత్వమునకు పేష్కసు చెల్లించుటయేకాక తన ముఠానుండి కోరినంత మంది మనుష్యులను రోడ్డు పనికి, వెట్టిచాకిరికి పంపించెడువాడు. అట్లు పంపని యెడల బాస్టియను ముఠాదారులను అనేక హింసలు పెట్టువాడు. కూలీలు ఏ మాత్రము వ్యతిరేకించినను వారిని కొట్టెడువాడు. రాత్రి వరకు వారిచేత పని చేయించి వారిని ఊరక ఇంటికి పొమ్మనెడువాడు. వెట్టిచాకిరికి వచ్చుటకు నిరాకరించిన వారిని బాస్టియను తన మకాముకు రప్పించి వారిని దిగంబరులను చేయించి తలక్రిందులుగా వ్రేలాడదీయించి మర్మ స్థానములలో మిరపకారమును పెట్టించి రాక్షసముగా హింసించెడువాడు. తన ఆజ్ఞలను వ్యతిరేకించిన ప్రజలను క్రూరముగా బాధలు పెట్టెడువాడు. తాను కోరిన కోయ స్త్రీలను బలాత్కారముగా రప్పించి అనుభవించెడువాడు. ఈ ఘోర కృత్యములను గూర్చి ఆ కాలమున మన్యములో డాక్టరుగా పని చేసిన తేతలి సత్యనారాయణమూర్తి గారు తన డైరీలో విపులముగా వ్రాసికొనిరి.

ఈ ఘోరకృత్యములన్నియు ప్రజలు శ్రీరామరాజుకు నివేదింపగా అతడు బాస్టియను గురించి పై అధికారులకు తెలియపరచెడివాడు. కాని బాస్టియను మొదలగు ప్రభుత్వోద్యోగులు పంపించు నివేదికలు ఆధారముగా పై అధికారులు శ్రీరామరాజును అనుమానించి నర్సీపట్నం సబుమెజిస్ట్రేటు వద్ద సెక్యూరిటీ కేసు పెట్టిరి. అయినను బాస్టియను అమానుష చర్యలే విప్లవమునకు దారి తీసినవని తెలిసికొని బాస్టియను సంపాదించిన ఆస్తులను తరువాత ప్రభుత్వము స్వాధీనము చేసికొనెను. తనకు

వ్యతిరేకముగా నున్న గ్రామోద్యోగులను, ముఠాదారులను ఏదియో మిషతో అతడు బాధించెడువాడు. బాస్టియను పెదవలస మునసబు అగు ఎండు పడాలును మోసము చేసెను. ఎండు పడాలు కొన్ని రోడ్ల మరమ్మత్తును గుత్తకు తీసికొనెను. బాస్టియను మొదట నూరు రూపాయలను పడాలుకిచ్చి మిగిలిన సొమ్ము పని పూర్తియైన తరువాత ఇచ్చెదననెను. చివరకు పని పూర్తి చేసి సొమ్ము అడుగగా అతనిని ముఠాదారుని చేయించెదనని ఆశగొల్పెను. దానికి సమ్మతించకపోగా అతడు మరమ్మతు చేయించిన రోడ్లు బాగులేవనియు, మరల వానిని బాగుచేయించవలసి వచ్చినదనియు, ఆ నష్టము అతడే భరించవలెననియు చెప్పి పడాలుకు సొమ్ము ఈయలేదు. గాంసోదరులగు గంటం, మల్లుదొరలు నడింపాలెం మొఖాసాదారులు. బాస్టియను వారి భూములను వశము చేసికొనెను. గంటందొర యొక్క 'బట్టపానుకుల' గ్రామ మునసబీని పొగొట్టి ఇంకొకని వద్ద లంచము పుచ్చుకొని మునసబీని అతనికిచ్చెను. గాంసోదరులకు గల గిత్తదూడలలో ఒక దానిని తన ఒంటెద్దు బండికి కావలెనని బాస్టియను కోరెను. దానికి గంటందొర మెత్తబడి అంగీకరించెను గాని మల్లుదొరయు, గంటందొర భార్యయు అంగీకరించలేదు. "ఈవేళ గిత్తనడుగుతాడు, రేపు భార్యనిమ్మని అడుగుతాడు. అట్లు ఇచ్చెదవా? మొదటి నుండి నీవు ఇంతే" అని గంటం దొర **భార్య దెబ్బలా**డెను. అందుచే గంటందొర వాగ్దానము వ్యర్థమయ్యెను. ఇది **కూడ గాంసోదరులపై బాస్టియను** కక్షకు ఒక కారణము. గూడెం ముఠాదారు మొట్టడం వీరయ్యదొరను **ఏజెన్సీ నుండి బ**హిష్కరించి అతడు నిర్బంధ ప్రవాసము నుండి తప్పించుకొని తిరిగి **వచ్చినప్పుడు 'అరెస్టు'** చేయించెను. ఇట్లు బాస్టియను తన అధికార బలదర్పములచే **మన్య గ్రామములలో** అశాంతిని రేపెను.

శ్రీరామరాజు మన్య ప్రజలకు దేశభక్తిని, **అన్యా**యములను ఎదిరించి **పో**రాడుటయు బోధించుచుండువాడు. ప్రభుత్వాధికారులను వారి దారుణ చర్యలను గురించి హెచ్చరించుచుండెడువాడు. ప్రజలలో అశాంతి, అసంతృప్తి రోజు రోజునకు పెరిగిపోవుచుండెను. బానిసతనములో మ్రగ్గుచున్న ప్రజలకు స్వాతంత్ర్యమును కలుగజేయవలెనని శ్రీరామరాజు దీక్షాకంకణ బద్ధుడయ్యెను.

శ్రీరామరాజు నిత్య చర్యలను గురించి కృష్ణాదేవిపేట పోలీసులు ఎప్పటి కప్పుడు పై అధికారులకు నివేదించుచుండిరి. అతనిని కృష్ణాదేవి పేటనుండి ఇంకొక చోటికి పంపివేయుట మంచిదని వారు భావించిరి. ఒకనాడు కానిస్టేబులు, సబ్ఇన్స్పెక్టరు, తహసీలుదారు శ్రీరామరాజు వద్దకు వచ్చిరి. కొంతసేపు శ్రీరామరాజు తహసీల్దారు మాట్లాడుకొనిరి. పిదప శ్రీరామరాజు తన తల్లి పాదములకు నమస్కరించి వారితో కృష్ణాదేవి

పేట పోలీసు స్టేషనుకు వెళ్ళెను. అచ్చట ఏమి జరిగినదియు **తెలియదు.** సాయంకాలమునకు అతడు తిరిగి ఇంటికి వచ్చెను. ఒక బండిపై తల్లిని తమ్ముని **తునిలో** బంధువుల యొద్ద ఉండుమని చెప్పి పంపెను. అతడు మరియొక బండిపై నర్సీపట్నము వెళ్లెను. ఇది ప్రభుత్వము చేసిన ఏర్పాటు అయియుండును. అతనిని ఒక వారము దినములు తహసీల్దారు తన ఇంటి వద్దనే నిర్బంధమునందుంచెను. ప్రతి దినము పండ్లు, పాలు శ్రీరామరాజునకు ఇచ్చుచుండిరి. ఈలోగా ఒకనాడు ఆదివారము తునిలో జరుగు సంత రోజున అతడు తల్లిని చూచుటకు బండిపై తుని వచ్చెను. ఈ సంగతి తెలిసి స్నేహితులు అతనిని చూచుటకు వచ్చిరి. కొంతసేపు అయిన తరువాత తాను ఇంకను ఉండుటకు వీలులేదని తల్లి యొద్దను, స్నేహితుల యొద్దను సెలవు తీసికొని, తల్లిని తాను వచ్చువరకు అక్కడనే ఉండుమని అతడు తిరుగు ప్రయాణమయ్యెను.

శ్రీరామరాజు తలపెట్టిన నిర్మాణ కార్యక్రమము, పంచాయితీ కోర్టుల స్థాపన వలనను, అతడు ఇచ్చు సలహాల వలనను కొందరు ప్రజలకు, అధికారులకు చాల కష్టముగా నుండెను. అందువలన 'రాజు గారు ఇక్కడ ఉన్నచో ప్రజల తిరుగుబాటు తప్పదు' అని ఆకాశరామన్న ఉత్తరము ప్రభుత్వమునకు పంపిరి. అందుపై అతనికి ఈ నిర్బంధమును విధించిరి. కాని శ్రీరామరాజునకు వ్యతిరేకముగా ఎవ్వరును సాక్ష్యము ఈయజాలకుండిరి. అందుచే ఏమి చేయుటకును తోచక ఏజెన్సీ కమీషనరు అతనితో ఇట్లనెను. "అయ్యా, మీరు మీ ఇష్టము వచ్చినట్లు ఉండవచ్చును. ఇక్కడ ప్రజలందరు మీకు పరిచితులైరి. మీరు ఇక్కడనున్నచో ఎప్పుడు ఏమి చేయుదురో యని ప్రభుత్వమునకు గూడ భయమే. అందుచే అడ్డతీగల చుట్టు ప్రక్కల ఎచ్చటనైనను చూచుకొనుడు. అక్కడ మీకు ఇల్లు కట్టించి పంట పండు వరకు మీకు కావలసిన సామగ్రి ప్రభుత్వమే పంపును." దానికి శ్రీరామరాజు సరేయనెను.

1922 జనవరి 30 తేదిని ఏజెన్సీ పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటుకు కృష్ణాదేవి పేట సబ్ఇన్‌స్పెక్టరు ఫిబ్రవరిలో ఫితూరి జరుగునని వదంతి వ్రాసినదని తంతి వార్త పంపెను. డిప్యూటీ సూపరింటెండెంటు అగు ఫ్లైర్సు కృష్ణాదేవిపేట వచ్చి శ్రీరామరాజును ఆ విషయమై ప్రశ్నించి ఒక వాఙ్మూలము తీసికొనెను. తాను ఫితూరి లేవదీయుదునను వదంతిని విని చాలమంది తన వద్దకు వచ్చి అడిగిరనియు, అట్టి వదంతిలో నిజము లేదని తాను చెప్పినను వారు నమ్ముచున్నట్లు కనబడదనియు, తాను సహాయ నిరాకరణ సమావేశములకు కొన్నిటికి వెళ్ళినను ప్రజలకు తాను మద్యము త్రాగవద్దని బోధించుచుంటిని గాని సహాయ నిరాకరణము కాదనియు శ్రీరామరాజు చెప్పెను. ఆ వాఙ్మూలము ఇట్లున్నది.

"నేను కృష్ణాజిల్లా మోగల్లు నివాసిని. నేను ఇచ్చటకు నాలుగు సంవత్సరముల క్రితము వచ్చితిని. కాని ఇందులో రెండు సంవత్సరముల కాలము ఇక్కడ లేను. ఒక సంవత్సరము నాలుగు నెలల క్రితము మరల నేను ఇచ్చటకు వచ్చితిని. తుని ప్రాంతములో నున్న కోటనందూరులో నాకు బంధువులు కలరు. తునిలో కూడ బంధువులున్నారు. నందూరులో భోగరాజు నాకు చుట్టము. అంత దగ్గర సంబంధము కాదు. ఆయనకు నలుగురు కుమారులు అనుకుంటాను. నేను అప్పుడప్పుడు వెళ్ళుచుండేవాడనుకాని బాగుగా తెలియదు. వారు అంతదగ్గర బంధువులు కారు. తునిలోనున్న వారు కూడ అంతదగ్గర కాదు. నా వయస్సు 25 సంవత్సరములు. నేను బ్రహ్మచారిని. సన్యాసిని కాదు. నాకు నాలుగవ సంవత్సరములోనే మోగల్లు వదలి పెట్టితిమి. రాజమండ్రిలో బంగారయ్య స్కూలులో నాల్గవ తరగతి వరకు చదివితిని. తరువాత రామచంద్రపురము నేషనల్ స్కూలులో చేరితిని. నేను నాల్గవ తరగతి చదువుచుండుసప్పుడే మా తండ్రిగారు చనిపోయిరి. ఆయన రైతు, కొంత భూమి ఉండెడిది. నాలుగు సంవత్సరముల క్రితము నేను ఇక్కడకు వచ్చినప్పుడు సుమారు ఒక సంవత్సరము ఉండి తరువాత గూడెము కొండల (శంబరి కొండ) లోనికి పోతిని. కొండపైని ఉంటిని. అచ్చట మూడు నెలలుండి కొన్ని రోజులు పర్వపట్నం మొదలగు ప్రదేశములు తిరిగితిని. పిదప ఒక సంవత్సరము గోదావరి ఎడమ గట్టున నున్న పాపికొండలలో నుంటిని. అచ్చట గ్రామమేమియు లేదు. అడవిలో ఏమి దొరికితే అది తిని ఉండెడివాడను. నేను గ్రామములోనికి పోయి భిక్షమెత్తలేదు. ఇప్పుడు కూడ అట్టి పని చేయను. నా దగ్గరకు ఇప్పుడు వందల కొలది జనము వచ్చుచున్నారు. వారు పాలు, ఫలములు పట్టుకొని వచ్చెదరు. కృష్ణాదేవి పేట మొదలగు అనేక గ్రామముల నుండి వారు వత్తురు. సుమారు ఏడు నెలల క్రితము నేను ఇచ్చట నుండి నాసిక వెళ్ళి నాలుగు నెలలు యాత్రలు చేసి మరల మూడు నెలల ఇరవై రోజుల క్రితము తిరిగి వచ్చితిని. వారము, పదిరోజుల క్రితము నేను ఆలయములను చూచుటకు గూడెము వెళ్ళితిని. ఇంతకు ముందు నేను వానిని చూడలేదు. తిరిగి వచ్చునప్పుడు నేను రంపులు దగ్గర ఆగితిని. అంటాద ముఠాదారును చూచితిని. అతడు తల నొప్పితో బాధపడుచుండెను. నేను వెళ్ళిపోవునపుడు అతనిని లేపి చెప్పితిని. పెద్దవలస కూడ వెళ్ళితిని. నాసిక వెళ్ళునపుడు జరాల (జర్లి), మల్కనగిరి మీదుగా దూరమంతయు నడచియే పోయితిని. కొంత వరకు నేను త్రాగుడు మానుమని ప్రజలకు చెప్పితిని. సాధ్యమైనంతవరకు స్వదేశ వస్త్రములు ధరించుమని కూడ బోధించితిని. త్రాగినచో సాంఘిక బహిష్కరణకు గురియగుదురని సూచించితిని గాని విదేశ వస్త్రములు ధరించినచో సంఘములో వెలివేయబడుదురని నేను చెప్పలేదు.

నేను పంచాయతులు పెట్టి అట్లు చేయమని చెప్పితిని. అడ్డతీగల వెళ్లుట చాల దూరమని చెప్పుటచే వారికట్లు బోధించితిని. ఇక్కడ నాలుగైదు సార్లున్ను, కొంగసింగి, నాగాపురములలోను పెట్టితిని. మొత్తము 12 లేక 16 సార్లు ఈ పంచాయతులు జరిపితిని. కొయ్యూరు, రాజపేట, ధర్మాపురముల వద్ద కోర్టులు పెట్టుటకు ప్రయత్నించితిమి. వారు నన్ను పిలిచిరిగాని చాల దూరమగుటచే వెళ్లలేకపోతిని. నా తల్లిగారును, తమ్ముడును ఇప్పుడు నాతోనే ఉన్నారు. నేను నాసిక వెళ్ళునప్పుడు వారిని ఇచ్చటనే వదలి వెళ్ళితిని. వారికి రైతులు ఆహారము తెచ్చియిచ్చెడువారు. నేను నాసిక వెళ్ళినప్పుడు ఎక్కువ జనము వచ్చెడువారు కాదు గావున వారు బాధలు పడిరని అనుకొందును. ఈ యిద్దరి మునసబు చింతపల్లి నాయుడు, ఇతరులును రెండు మూడు రోజుల క్రితము నన్ను చూచుటకు వచ్చిరి. నేను ఫితూరిని లేవదీయ బోవుచున్నానను వదంతిని వారు వింటిమని చెప్పగా నేనది నిజముకాదని చెప్పితిని. కంగారం (గంగారం) ముఠాదారు నాకు బంధువు కాడు. అతడు కూడ రాజే. నన్ను చూచుటకు కొలది రోజుల క్రితము వచ్చినాడు. అతడు ఒక మంత్రము నేర్చుకొనుటకు వచ్చెను. ఫితూరిని గురించి గాని, ఇంకను దేనిని గురించి గాని అతడు మాటాడలేదు. అచ్చటి ప్రజలు మనుష్యులను తిను పులిని నేను అడవిలో వదలితినని అనుకొనుచున్నారు. అట్టిదేమియు నేను చేయలేదు. ఈ కొంత ప్రజలు నేను ఒక సాధువునని నమ్ముచున్నారుగాని ఇంద్రజాలములో వారికి నమ్మకము లేదు. నేనొక తాయెత్తు ఇచ్చినచో అది ఉన్న చోటికి పులి రాదని వారి నమ్మకము. నాకు తెలుగు, కొంత సంస్కృతము, ఉర్దు తెలియును. నేను ఫితూరి ప్రారంభించబోవు చున్నానని చాలమంది నా దగ్గరకు వచ్చి అడుగుచుందురు. లేదని నేను చెప్పుచున్నను చాల మంది నమ్మరు. ఎందుచేతనో నాకు తెలియదు. సహాయ నిరాకరణము మంచిదో చెడ్డదో నాకు తెలియదు. సహాయ నిరాకరణ సభలకు కొన్నిటికి నేను వెళ్ళితిని. నేను ఇచ్చటి ప్రజలకు త్రాగుడు మానుమని మాత్రమే చెప్పితిని. వారికి నేను సహాయ నిరాకరణము బోధించలేదు.

ఈ వాఙ్మూలమంతయు ప్రభుత్వాధికారి వేయు ప్రశ్నలకు సమాధాన రూపమని గ్రహింపనగును.

పోలీసుల నిఘా ఎక్కువగా నుండుటవలన ఒకసారి 1922 ఫిబ్రవరి 4 తేదీని రంప అసిస్టెంటు కమీషనరుకు ఇట్లు ఫిర్యాదు చేయుచు శ్రీరామరాజు అర్జీని పంపెను.

"మహారాజశ్రీ రంప అసిస్టెంటు కమీషనరు వారి సముఖమునకు ప్రస్తుతం కృష్ణాదేవిపేట కాపురస్థుడు శ్రీ అల్లూరి శ్రీరామరాజు వ్రాయించి దాఖలు చేసుకున్న అర్జీ విన్నపములు.

అయ్యా,

నేను రెండు మూడు మాసముల నుండి కృష్ణాదేవిపేటకు సమీపమందు అడవి ప్రదేశములో ఒక చిన్న యిల్లు కట్టుకొని మా తల్లిగారితోను, మా తమ్ముడితోను అక్కడ ఉండి నేను జపము వగైరాలు చేసుకుంటూ యున్నాను. అలా వుండగా ఈ మధ్యను నేను సదరు ప్రదేశములో ఫితూరీ వగైరాలు చేయుచు తలంపుతో వున్నాననే కారణంచేత నన్ను నరిసీపట్నం రమ్మనమని చెప్పగా నేను నర్సీపట్నం వచ్చి ఇక్కడనే యున్నాను. నేను యీ సాయంత్రము మా తల్లిగారిని చూచుటకు గాను తుని వెళ్ళి తిరిగి 7వ తేదీని వస్తూ యున్నాను. మా తల్లిగారికి మా తమ్ముడికి సంరక్షణ నిమిత్తము యేమయినా యేర్పాటు చేయుమని కోరగా తమరు అడ్డతీగల మకాంలో జమాబందీకి దయ చేసినప్పుడు అక్కడ భూవసతి యేర్పాటు చేస్తామని చెప్పినారు. అప్పటి వరకు నేను నర్సీపట్నములోనే వుండి కాలక్షేపము చేస్తాను. తమ దగ్గరనుంచి నన్ను యెప్పుడు బయలుదేరి రమ్మనమని వర్తమానం చేస్తే అప్పుడు బయలుదేరి వస్తాయున్నాను.

నర్సీపట్నం, చిత్తగించవలెను,
4-2-1922. (సం) శ్రీ అల్లూరి శ్రీరామరాజు వ్రాలు"

ఇది ఫజ్లుల్లాగారికి పంపబడుటచే వినయ ధోరణిలో నున్నది.

శ్రీరామరాజును అడ్డతీగల పంపివేయుటకు నిర్ణయింపబడినది. తునిలో నుండిన తల్లిని, తమ్ముని వెంటబెట్టుకొని అతడు అడ్డతీగల చేరెను. ఆ రోజులలో పోలవరము డిప్యూటీ కలెక్టరు ఫజులుల్లాఖాన్. ఈ ఏజెన్సీ ప్రాంతము అతని అజమాయిషీలో నుండెడిది. అతడు దైవభక్తిపరుడు. శ్రీరామరాజు పినతండ్రి రామకృష్ణంరాజు గారికి మిత్రుడు. అందుచేతను, చిన్న వయస్సులోనున్న శ్రీరామరాజు ఆదర్శములను ఆధ్యాత్మిక ప్రాభవమును చూచి అతనిపట్ల ఆదరాభిమానములు కలుగుట చేతను ఆయన అడ్డతీగల డిప్యూటీ తహసీల్దారుతో చెప్పి అడ్డతీగలకు నాలుగు మైళ్ళ దూరములో జడేరు ఒడ్డుననున్న పైడిపుట్ల గ్రామములో 50 ఎకరముల భూమిని దుచ్చర్తి ముఠాదారు అయిన చెక్కాలింగందొరచే ఇప్పించెను. అచ్చట రెండు పూరిపాకలు వేసి శ్రీరామరాజు తల్లిని కాపురము పెట్టెను. అప్పటి అడ్డతీగల తహసీల్దారు యతిరాజులు నాయుడు శ్రీరామరాజు కుటుంబమునకు కావలసిన ఆహార పదార్థములు పంపించెడివాడు. వ్యవసాయమునకు కావలసిన ఏర్పాట్లు చేయబడెను. పాల కొఱకు రెండు ఆవులను, రెండు జతల ఎడ్లను

గూడ పంపించుటకు ముఠాదారులతో చెప్పి తహసీల్దారు పురమాయించెను.

ఈ విధముగా శ్రీరామరాజును ప్రభుత్వము ఎంతయో గౌరవముగా చూచుచు అతని చర్యలను రహస్యముగా గమనించుచుండిరి. అతడు కాపురమున్న పైడిపుట్ట పై గ్రామములకు పోవు మార్గములో నున్నది. పై గ్రామములకు పోవుచు పోలీసువారు శ్రీరామరాజు కన్పించిన సరియే లేనిచో ఏ మంచి నీళ్లవంకనో వచ్చి కుఱ్ఱవాడైన అతని తమ్ముని చూచి "అన్నయ్య గారు లేరా బాబూ! ఎక్కడకు వెళ్లేరు?" అని అడిగి తెలిసికొనుచు ఉండువారు.

శ్రీరామ విజయనగరములోగాని, పైడిపుట్టలోగాని శ్రీరామరాజు ఎచ్చట కాపురమున్నను ఏటి ఒడ్డు, పులివచ్చు మార్గము అయియుండెను. అట్టి స్థలమే అతనికి అనుకూలముగా తోచెను. పైడిపుట్ట సమీప ప్రాంతములో ఒకనాడు పులి ఒక ఎద్దును చంపినది. శ్రీరామరాజు ఆ సంగతి తెలిసికొని పులి చర్మమునకై 'మాటు' కాయనెంచెను. తహసీల్దారు వద్ద నుండి తుపాకి తెప్పించుకొనెను. ఆ రాత్రి పులి రాలేదు. మరునాడు ఉదయముననే తహసీల్దారు కానిస్టేబులును పంపెను. మర్యాద కొరకు తుపాకి నిచ్చెను కాని ఏమి ప్రమాదము వచ్చునోయని భయము. వెంటనే జవానును పంపినందులకు శ్రీరామరాజు అసహ్యించుకొని "ఈ వేళ కూడ చూడవలయునను కొంటిని. పిరికివాడు' అనుకొని తుపాకి ఇచ్చివేసెను. ఇట్లు శ్రీరామరాజు ఉనికిని, చర్యలను ప్రభుత్వాధికారులు ఒక కంటకనిపెట్టుచునే యుండిరి.

పైడిపుట్టలో నివసించుచు శ్రీరామరాజు ప్రతి దినమును దగ్గరలో నున్న ఏటిలో స్నానము చేయుచు నియమబద్ధజీవితమును గడుపుచుండెను. ఈ రోజులలో అతని దిన చర్యను గురించి అప్పుడక్కడ సబ్ఇన్‌స్పెక్టరుగా నుండి పిదప రిటైరైన శ్రీ అడ్డాల సుబ్బారావు ఇట్లు చెప్పిరి. "రాజు గారు ప్రతి దినము అడ్డతీగల వచ్చి తహసీల్దారును గ్రామ పెద్దలను కలిసికొని మాటాడి వెళ్లువారు. ప్రతి రోజు పోస్టాఫీసుకు వచ్చి తన టపా తీసికొనువారు. తరచు బంగీలతో పుస్తకములు వచ్చెడివి. మా పోలీసు స్టేషనుకు తప్పక వచ్చెడివాడు. ఆయన ఎత్తు 5 అ. 4 అం. ఉండి అందుకు తగిన శరీర సౌష్ఠవము కలిగియుండెను. ఎఱ్ఱటి చాయ, మంచి ముఖ వర్చస్సు కలిగియుండెడివాడు. ఎల్లప్పుడు తెలుగు గ్రంథములు చదువుచుండెడివాడు. జ్యోతిషము, సంస్కృతము, వైద్య శాస్త్రములలో ప్రవేశము కలదు. మేము ఆయన దగ్గరకు వెళ్ళనక్కర లేకుండ ఆయనయే ప్రతి రోజు పోలీసు స్టేషనుకు వచ్చెడివాడు. మేము డ్యూటీలో నున్నప్పుడు మా అందరితోను చాల నెమ్మదిగాను, వినయముగాను మాటాడెడువాడు. ఆయన "హిస్టరీ షీట్‌లో ఈ


విషయము వ్రాసెడి వారము". పోలీసులనుండియే తుపాకిని తూటాలతో నింపుట, కాల్చుట శ్రీరామరాజు నేర్చుకొనినట్లు పెద్దాపురములో నివసించుచున్న షేకు మదీనా అను రిటైర్డు పోలీసు చెప్పెను. బాణములు వేయుట, కత్తిసాము కూడ ప్రతి దినమును అభ్యసించెడువాడు. ఇంటి ముందు ఎదురుగా నున్న చింతచెట్టునకు గురి చూచి బాణములు వేయుచుండువాడు. శాంతభూపతి మేనల్లుడు అతనికి ఒక కజ్జ కత్తియు, యుద్ధమున త్రిప్పుటకు ఉపయోగించు కత్తి ఒకటియు బహూకరించెను. ఆ కత్తిని త్రిప్పుచు శ్రీరామరాజు కత్తిసామును అభ్యసించెను.

(శాంత భూపతి అను నాయన బ్రిటిషు ప్రభుత్వముపై తిరుగుబాటు చేసెను కాని పట్టుబడలేదు. అతడు ఏమైనదియు తెలియదు.)

పైడి పుట్టలో అతనికి సకల సదుపాయములు కలుగజేయబడినను శ్రీరామరాజు దినచర్యలు గురించి ఎప్పటికప్పుడు పోలీసులు పై అధికారులకు రహస్య నివేదికలు పంపుచుండిరి. ఒక రోజున, నాడు 'అరెస్టు' చేయుదురని శ్రీరామరాజునకు అనుమానము తోచెను. అప్పుడు అతడు గాం సోదరుల గ్రామమునకు పోయెను. ఆ రాత్రి 12 గంటలకు గాం సోదరులతో కలిసి తిరిగి వచ్చెను. తక్కిన వారెచ్చటనో యుండి మల్లు దొరను మాత్రము రాజు ఇంటికి పంపెను. రాజు తల్లియు, తమ్ముడును నిద్రించుచుండిరి. దీపము లేదు. మల్లుదొర వారిని లేపి అనాడు పోలీసు వారెవరును రాలేదని తెలిసికొని "అన్నయ్య వచ్చియున్నాడు, తీసికొని వచ్చెదను, దీపము వెలిగించుము" అని రాజు తమ్మునితో చెప్పి వెళ్ళిపోయెను. గాం సోదరులకు ఆ గ్రామమున విరోధులు కలరు. వారు ప్రభుత్వమునకు తెలియజేయవచ్చును. అందుచే వారు కొంచెము సేపు పరుండి తెల్లవారక మునుపే ఇంటికి వెళ్ళిపోయిరి. నాటినుండియు శ్రీరామరాజు తల్లియు, తమ్ముడును గాం సోదరులను ఎఱుగుదురు.

పైకి అణుకువతో నున్నను శ్రీరామరాజు తన సన్నాహమును విరమించలేదు. డిప్యూటీ కలెక్టరు ఫజులుల్లాఖాను ఆదరము చూపుటచే ఇతర అధికారులు గూడ శ్రీరామరాజును గౌరవముతో చూడసాగిరి. తరచుగా శ్రీరామరాజుతో ఫజులుల్లా వేదాంత గోష్ఠి జరుపువాడు. 1922 జూలై 27 తేదీని తిమ్మాపురం బంగళాలో ఫజులుల్లాఖాను అకస్మాత్తుగా మరణించెను. ఆయన జీవించియుండగానే గండకీనది నుండి సాలగ్రామము, లింగము తెచ్చుకొనుటకు గాను నేపాళము వెళ్ళవలెనను మిషపై ఫజులుల్లాకు అర్జీ పెట్టుకొని అతని నుండి అనుమతి సంపాదించి శ్రీరామరాజు పోలీసు నిఘా నుండి తప్పించుకొనెను. ఆ సమయముననే దుచ్చర్తి ముఠాదారైన చెక్కా

లింగందొరకు తాను నేపాళము వెళ్ల నిశ్చయించుకొనినందున తనకు పైడిపుట్టలో ఇప్పించిన 50 ఎకరముల భూమిలో తన హక్కులన్నియు వదలుకొనుచున్నట్లు 14-6-22 తేదీ గల ఈ ఉత్తరము వ్రాసెను.



శ్రీ రామరాజు ఫజులుల్లాసాహెబుతో ఇట్లు చెప్పెనట. "నీవు ఫలానా తేదీ వరకు బ్రతికెదవు. నీ జీవితాంతము వరకు నేను తిరుగుబాటు చేయను" అని. అట్లే ఫజులుల్లాఖాను మరణించిన పిమ్మట కొలది రోజులలోనే శ్రీరామరాజు తిరుగుబాటు ప్రారంభించెను.

శాంతముగా సాగిపోవు జీవితములో విప్లవ సమర సన్నాహము అంతరాయము కలుగజేయుటకు ఇష్టపడక కుమారుని గెరిల్లా యుద్ధ నిశ్చయమును గూర్చి విని శ్రీరామరాజు తల్లి ఇట్లు అనును. "నాయనా, ఈ పని నీ కెందుకు? ప్రభుత్వమును జయించుట కష్టము కాదా? బ్రిటిషు ప్రభుత్వము వచ్చిన తరువాత రోడ్లు, రైళ్లు వేయించి అనేక సదుపాయములు చేసిరి. యుద్ధ ప్రయత్నము విరమించుకొమ్ము" దానికతడిట్లనెను. "అమ్మా, నేను క్షత్రియుడనై జన్మించితిని. క్షత్రియుడు చేయవలసిన పనియేమి? క్షతము నుండి రక్షించువాడు క్షత్రియుడు అని చెప్పిరి. ఏ హిమాలయములకో పోయి తపస్సు చేసికొందమన్న మీరు అడ్డు వచ్చిరి. అందుచే ఇట్లుండవలసి వచ్చినది. ఈ మన్య ప్రజల కష్టములు చూచుచుండగా నాకు మనశ్శాంతి లేకున్నది. తినుటకు వారికి సరియగు తిండి సంవత్సరమంతయు నుండదు. వారికేమియు దొరకనప్పుడు మామిడి జీడి అంబలి, చింతగింజల అంబలి కూడ త్రాగుచుందురు. మన్య ప్రాంతమున గూడ తాండవించు బ్రిటిషు ప్రభుత్వ నిరంకుశత్వము సహింపలేకుండ నున్నాను. నాకు మూడే మార్గములు

కలవు. ఒకటి, హిమాలయములకు బోయి తపస్సు చేసికొనుట. అట్లు చేయుటకు వివాహము చేసికొనకున్నను మీ అక్షేమము వచ్చినది. మీరు విచారించుచున్నచో తపస్సు వలన ఫలితము శూన్యము. అందుచే ఆ పని మానవలసి వచ్చినది. ఇక రెండవది. ఇచ్చట ఉండి, ప్రజలతో సంబంధము పెట్టుకొనుటచే వారి కష్టములు చూచి సహింపజాలకున్నాను. అందుచే శివాజీవలె గెరిల్లా యుద్ధము చేయక తప్పదు. బ్రతికి యున్నచో ఈమన్య ప్రాంతమునకు స్వాతంత్ర్యము చేకూర్చి ప్రజల కష్టములు తీర్చెదను. మూడవది, అట్లు చేయలేనిచో స్వర్గమునకు బోదును. నా జాతకమున గూడ అట్లున్నది.

'హతోవా ప్రాప్స్యసే స్వర్గం జిత్వావా భోక్ష్యసే మహీమ్,
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః॥'

అని కదా కృష్ణుడు అర్జునునికి బోధించెను. అందుచే విజయమో వీరస్వర్గమో ఇదియే నా నిశ్చయము".

కాని మాతృహృదయము ఎట్లు ఒప్పుకొనును? అనేక విధముల చెప్పి చూచినను కుమారుడు వినుటలేదు. ఆ ప్రయత్నము మానుమని ఆమె పరి పరి విధముల చెప్పి దుఃఖించెను. కాని అతడు ఒప్పుకొనలేదు. ఎట్లైనను తల్లిని ఒప్పించి గెరిల్లా యుద్ధమునకు దిగవలయునని అతని సంకల్పము. అందుచే అనేక విధముల తల్లికి నచ్చజెప్పుటకు ప్రయత్నించెను. భగవద్గీత తెచ్చి చదివి బోధించుచుండువాడు. "జాతస్య హి ధ్రువో మృత్యుః" పుట్టినవాడు గిట్టకమానడు. కీర్తియే స్థిరముగా నుండునది. ఎందరో చక్రవర్తులు, మహారాజులు గతించిరి. మనము మాత్రము స్థిరముగా నుందుమా? నా తండ్రియే యున్నచో నేను చేయు పనికి ఎంత సంతోషపడెడువారో! మీరు ఆశీర్వదించుచో నాకు తప్పక విజయము కల్గును. మీరును, తమ్ముడును నన్ను విడిచి పోనక్కరలేదు. నాతోడనే ఉండవచ్చును. మీకు భయము లేదు. ఏ కొండ గుహలోనో ఉండవచ్చును. ఎక్కడకు వెళ్ళినను మిమ్ములను డోలీలపై తీసికొని పోవుటకు ఏర్పాటు చేసెదను" అని అతడు తల్లికి అనేక విధముల బోధించినను ఆమె ఒప్పుకొనలేదు. చివరకు తమ్ముడినైనను తనతో విడిచి పెట్టుమని శ్రీరామరాజు అనెను. దానికి తల్లి "నీతో పాటు అతనిని గూడ చంపజూచు చున్నావా? మేము మాత్రము ఎప్పటికైనను పోయెదము" అనెను.

శ్రీరామరాజునకు ఆమె మాటలు చాల వ్యథ కలిగించెను. తల్లి అపజయమునే కోరుచున్నది. తల్లి సంతోష పూర్వకముగా ఆమోదింపకున్నచో జయించుట కష్టము అని కొన్ని దినములు ఆమెకు భగవద్గీత బోధించెను. ఎన్ని విధముల చెప్పి చూచినను తన కుమారుడు యుద్ధమునకు దిగుటకు తల్లి సంతోషముగా ఒప్పుకొనలేదు. చివరికి

ఇష్టము లేకున్నను గెరిల్లా యుద్ధమునకు దిగుటకు అతడు నిశ్చయించుకొనెను.

1922 ఆగస్టులో చింతపల్లి పోలీసు స్టేషనుపై దాడితో విప్లవము ప్రారంభమయ్యెను. విప్లవము ప్రారంభించుటకు ముందే 1922 జూన్‌లో శ్రీరామరాజు తన తల్లిని తమ్ముని నరసాపురము పంపి వేసెను. ఆ సందర్భములో గూడెము డిప్యూటీ తహసీల్దారగు బాస్టియనుకు అతడు ఇంగ్లీషులో ఈ ఉత్తరము వ్రాసెను.

To
Mr. Bastian,
Deputy Tahsildar of
Goodem Taluqa.

Sir,

Yesterday after you went from me, I told my mother to be prepared for journey and came to you in the evening. When I returned home taking leave from you, in the night, I heard that she had neither taken her meals from the last morning in spite of fear and/confusion, nor prepared for journey. So I was to stop my journey for last nght. Today I am sure to send her at 10 or 11 A.M. I too start at the same time.


Hoping to be excused.

Yours obediently,
(Sd) Sri Allury Sreerama Raju

గూడెం తాలూకా డిప్యూటి తహసీల్దారు బాస్టియను గారికి,

అయ్యా,

నిన్న నావద్దనుండి మీరు వెళ్ళిన తరువాత ప్రయాణమునకు సిద్ధముగా నుండుమని మా తల్లిగారితో చెప్పి ఆ సాయంత్రము మీ దగ్గరకు వచ్చితిని. మీ దగ్గరనుండి సెలవు తీసికొని రాత్రి ఇంటికి వచ్చునప్పటికి భయముతోను, ఆందోళనతోను ఆమె ప్రొద్దుటి నుండి భోజనము చేయలేదనియు ప్రయాణమునకుగూడ సిద్ధము కాలేదనియు వింటిని. అందుచేత గత రాత్రి నా ప్రయాణముకూడ ఆగిపోయినది. ఈ వేళ 10, 11



సీతారామరాజు బాస్టియన్‌కు వ్రాసిన లేఖ

గంటల ప్రాంతములో ఆమెను పంపించగలవని దృఢముగా నమ్ముచున్నాను. ఆ సమయమునకే నేను కూడ వెళ్ళెదను.

క్షమించెదరని ఆశించుచు,
భవదీయుడు,
(సం) శ్రీ అల్లూరి శ్రీరామరాజు.

పైడిపుట్టలో నుండగా శ్రీరామరాజు రెండు మూడు రోజులు ఇంటికి రాలేదు. పోలవరం డిప్యూటి కలెక్టరుగారి దగ్గరకు వెళ్ళియుండ వచ్చునని అనుకొనిరి. అది మహారణ్యము. తల్లికి భయమువేసినది. కుమారుడు వచ్చిన తరువాత "నాయనా, నీవు రెండు మూడు రోజులు మమ్ములను ఈ మహారణ్యములో విడిచిపెట్టియున్నచో మేము ఉండలేము" అని తల్లియనెను. అప్పుడు అతడు "అమ్మా మీకేమియు భయములేదు. నేను ఒక చీటి (తాయెత్తు) ఇచ్చెదను. అది మీ యొద్ద ఉంచుకొనుడు. పులి వచ్చినను మిమ్ములను తొంగిచూచి పోవును. అంతేగాని మీజోలికిరాదు" అని చెప్పెను. కాని తన కుమారుడు శక్తి సంపన్నుడని ఆ తల్లికి తెలిసినను ధైర్యము చాలినదికాదు. "నాయనా మేము ఉండజాలము. ఒక వేళ ధైర్యము వహించి ఎట్లనో ఉండెదమన్నను నీవు పితూరి మానవు. నీతో ఉన్నచో నీకును మాకును బాధలేకాని అంతకంటె ప్రయోజనములేదు. మమ్ములను ఎట్లయినను కాలువ క్రిందికి (డెల్టా ప్రదేశమైన నర్సాపురం తాలూకాలో కూతురున్న చోటికి) పంపివేయుము" అని తల్లి పట్టుపట్టెను. అతనికేమి చేయుటకును తోచలేదు. తల్లిని విడిచిపెట్టినచో ఆమె తనకై విలపించుచుండును. అందుచే తహసీల్దారుతో చెప్పి రాజమండ్రి వరకు వారికి బండి కట్టించి తాను కూడ గుఱ్ఱముపై వారివెంట వేటమామిడి గ్రామము వరకు వెళ్ళి సాగనంపి కడసారి వీడ్కోలు చెప్పి అతడు అక్కడ ఉండిపోయెను. రాజమండ్రి నుండి తల్లి రెండవ కుమారునితో పడవపై ప్రయాణముచేసి నరసాపురం చేరుకొని అక్కడికి మూడు మైళ్ళ దూరముననున్న కూతురు ఇంటికి ఒక ఫర్లాగు దూరమున ఒక చిన్న యిల్లు వేసుకొని శ్రీరామరాజు తల్లియు తమ్ముడును కాపురముండిరి. అప్పటి నుండి శ్రీరామరాజుకు కుటుంబము తోడను, ఆత్మీయులతోడను సంబంధము ఇంచుమించు తెగిపోయెను. 1923లో అతని సోదరియగు సీతమ్మగారి భర్త దంతులూరి వెంకటపతి రాజు చనిపోయెను. అప్పటికే తీవ్రమైన పోరాటములో మునిగియున్న శ్రీరామరాజు దుఃఖనిమగ్నయైయున్న సోదరిని చూచుటకు గూడ వెళ్ళలేక పోయెను.

శ్రీరామరాజు తల్లియు తమ్ముడును వెళ్లిపోయినట్లు ప్రభుత్వమునకు (ఏజన్సీ కమీషనరుకు) వెంటనే తెలిసినది. అతనిని మరల నిర్బంధము నందుంచిరి. తల్లి తన దగ్గరనేయున్నచో శ్రీరామరాజు పితూరీకి దిగడని యోచించి ప్రభుత్వము వారు అతనికి ఇతర విధములుగా ఎట్లో నచ్చజెప్పి తల్లికి ఉత్తరము వ్రాయించిరి. ఆ ఉత్తరమునందు ఇట్లున్నది. "నన్ను ప్రభుత్వము నిర్బంధించినది ఇక్కడ వ్యవసాయ ప్రయత్నము చేయుచున్నారు. నారు కూడ పోయించినారు. కావున మీరు వెంటనే బయలు దేరి రావలయును" ఆ తరువాత కొన్ని దినములకు ఇంకొక ఉత్తరము కూడ వచ్చినది.

ఆ సమయమున డిప్యూటి కలెక్టరుగానున్న శ్రీరామరాజు పినతండ్రి యగు రామకృష్ణంరాజుగారు ఆరు నెలలు సెలవు తీసికొని భీమవరంలో నుండిరి. శ్రీరామరాజు తల్లి ఆయన దగ్గరకు వెళ్ళి ఉత్తరములు చూపించి సలహా అడిగెను. ఆయన కోపముతో ఇట్లనిరి. "మీకు మనస్సు స్థిరములేదు. అక్కడ అడవులలో ఉండలేక వచ్చినారు. మరల ప్రయాణమా? అక్కడ మీకు ఏ కష్టము వచ్చినను ఎవరు చూచెదరు? నా మాట విని ఇక్కడనే ఉండండి. లేనిచో మీ యిష్టము. ఇక్కడ మీకేమియు ఇబ్బంది లేకుండ నేను కనిపెట్టి చూచుచుందును". దానిపై ఆతల్లి "నిజమే, అక్కడకు వెళ్ళినచో నేడుకాకున్న రేపైనను నాకుమారుడు పితూరికి దిగకమానడు. అప్పుడు ఉభయులము కష్టపడవలసి యుండును." అని యోచించి శ్రీరామరాజు వ్రాసిన రెండు ఉత్తరములకును సమాధానము వ్రాయక ఊరకుండెను. అప్పుడు అతడు తల్లికి కడపటి ఉత్తరము ఇట్లు వ్రాసెను. "అమ్మా, నా ఉత్తరములకు ఒకదానికిని మీరు సమాధానము వ్రాయలేదు. మీకు వచ్చుట ఇష్టము లేదనుకొందును. అందుచే నేను చివరకు ప్రభుత్వమును ఒప్పించి నేపాళ దేశము తపస్సు చేసికొనుటకు వెళ్ళుచున్నాను. నమస్కార శతములు. నన్ను ఆశీర్వదింపుడు. ఇదియే నా కడపటి లేఖ".

1922 ఆగస్టులో విప్లవ యుద్ధము ప్రారంభమగుటతోడనే శ్రీరామరాజు తల్లికి, తమ్మునికి పోలీసు కావలా ప్రారంభమయ్యెను. ఒకరోజు నర్సాపురం నుండి పోలీసు సబిఇన్‌స్పెక్టరు, కానిస్టేబులుతోగూడ బయలుదేరి శ్రీరామరాజు తోబుట్టువుగారి ఇంటికి వచ్చెను. పై గ్రామమునకు వెళ్ళుచు మార్గవశమున అచ్చటికి వచ్చినట్లుగా చెప్పెను. శ్రీరామరాజు బావగారు ఆ సమయమున ఇంటియొద్దనే ఉండిరి. సబ్‌ఇన్‌స్పెక్టరు కుశల ప్రశ్నలు వేయుచు "అయ్యా, మీ అన్నయ్యగారి అత్తవారు ఏయూరు? మీ బావమరదులు ఎందరు? శ్రీరామరాజుగారు ఎక్కడనున్నారు? వారు ఏమి చేయుచుందురు? ఎప్పుడైనను ఉత్తరములు వ్రాయుచుందురా?" అని అడిగెను. "ఈ మధ్యనే ఉత్తరము వ్రాసిరి"

అని బావగారు చెప్పగా, "ఏది, వారి దస్తూరి చూడవలయునని యున్నది. ఒకసారి ఉత్తరము ఇమ్మనండి" అని సబ్‌ఇన్‌స్పెక్టరు అడిగెను. ఇది యంతయు వినిన శ్రీరామరాజు తల్లికి తన కుమారుడు పితూరికి దిగియుండునని అనుమానము తోచెను. అందుచే ఉత్తరములు పిల్లలు చింపివేసిరి అని చెప్పెను. సబ్‌ఇన్‌స్పెక్టరు వెళ్ళిపోయెను.

శ్రీరామరాజు పినతండ్రి రామకృష్ణంరాజు గారు డిప్యూటి కలెక్టరుగా నుండి సెలవుపై భీమవరంలోనున్న సమయములో సబ్‌ఇన్‌స్పెక్టరు ఆయన వద్దకు వెళ్ళి తాను శ్రీరామరాజు వ్రాసిన ఉత్తరమిమ్మనగా తల్లి గారు భయపడిరనియు, మీరు వెళ్ళి తీసికొనిరావలయునని చెప్పి ఆయనను పంపెను. శ్రీరామరాజు వద్దనుండి తల్లి వచ్చునపుడు అతని విల్లు, బాణములు తీసికొని వచ్చెను. అతని పుస్తకములు ఒక ట్రంకు పెట్టెనిండ నుండెడివి. గొలుగొండ తాలూకాలోని గ్రామములలో అతడు పంచాయితీ కోర్టులు స్థాపించినప్పుడు ఆయా గ్రామస్థులందరును ఆయా పంచాయితీ తీర్పులకు కట్టుబడియుండునట్లుగా వ్రాసికొని సంతకములు, వ్రేలి ముద్రలతోనున్న కాగితముల కట్టగూడ ఆ పెట్టెలో కన్పించెను. అది ప్రభుత్వమునకు దొరకినచో వారందరును బాధపడవలసివచ్చును. అది గ్రహించి రామకృష్ణంరాజుగారు ఆ కాగితముల కట్ట, విల్లు, బాణములు వెంటనే తగులబెట్టించిరి (పిమ్మట శ్రీరామరాజు అపజయమునకు విల్లు, బాణములు తగుల బెట్టుటగూడ కారణమై యుండవచ్చునని తల్లి దుఃఖించెడివారు). నాటి నుండియు శ్రీరామరాజు తల్లికి, తమ్మునకు పోలీసు కాపలా కొనసాగెను. సర్కిల్ ఇన్‌స్పెక్టరు, తహసీల్దారు వేర్వేరుగా ఒకటి రెండుసార్లు వచ్చి "రాజుగారేమైనను ఉత్తరము వ్రాయుచుండిరా? ఇల్లు సోదా చేయవచ్చునా?" అని యడిగిరి. చేసికొనవచ్చునని శ్రీరామరాజు తల్లి చెప్పినను ఎప్పుడును సోదా చేయలేదు.

14-1-1923 వ సంక్రాంతి రోజున శ్రీరామరాజు బావగారు చనిపోయిరి. పిమ్మట అతని తల్లిగారికి అక్కడ నుండుట ఇష్టములేక ఆమె చెల్లెలి గ్రామమగు భీమవరం తాలూకాలోని కొవ్వాడ వెళ్ళిపోయిరి. అక్కడ కొంతకాలముండి పిదప స్వగ్రామమైన మోగల్లు చేరిరి. ఎచ్చటనున్నను తల్లికి, తమ్మునికి పోలీసు కాపలా తప్పలేదు. రాత్రింబగళ్ళు 24 గంటలును ఉండునట్లుగా ఇద్దరు పోలీసు జవానులను ప్రభుత్వము నియమించెను. ఆ జవానులు ఇట్లు కోరుచుండెడివారు. "అమ్మా, పై అధికారులు ఎవరు వచ్చినను ఇప్పుడే ఎక్కడికో వెళ్ళేరు అని చెప్పండి. బాబూ, మీరు ఎప్పుడు ఊరికి వెళ్ళినను మాకు ముందుగా చెప్పండి" అని, రెండు మూడు రోజులకు వెళ్ళినను ప్రమాదములేదు, అను ధైర్యముచే పోలీసువారు రెండు మూడు రోజులకొకసారి వచ్చుచుండెడివారు. శ్రీరామరాజు

తమ్మునికి కొవ్వాడలో నుండగా అకస్మాత్తుగా ఒకసారి ఊరికి వెళ్ళవలయునని బుద్ధిపుట్టినది. తణుకు తాలూకా పెనుమంట్రలో పినతండ్రి రంగరాజుగారి కుమార్తెయు, అలమూరులో పెదతండ్రిగారి కుమార్తెయునుండిరి. అతడు ఆ గ్రామములు ఎన్నడును చూడలేదు. అప్పుడు బస్సు సౌకర్యములు లేకపోవుటచే 20 మైళ్ళు అయినను నడచియే పోవలయును. అతడు మొదట పెనుమంట్ర వెళ్ళెను. తరువాత ఒకటి రెండు రోజులకు పోలీసువారు వచ్చిరి. ఈ సంగతి తెలిసికొని, "అమ్మా అట్లు చేసినచో మా ఉద్యోగములు పోవును" అని శ్రీరామరాజు తల్లితో చెప్పి ఒక జవాను పెనుమంట్ర వెళ్ళెను. అక్కడ నుండి తమ్ముడు అలమూరు వెళ్ళినట్లుగా తెలిసికొనెను. అక్కడకు అలమూరు మూడు మైళ్ళున్నది. అచ్చటకు వచ్చి చూచిన తరువాత ఆ జవాను ప్రాణము కుదుటబడినది. "బాబూ, ఈ విధముగా ఎప్పుడును చెప్పకుండ రాకండి" అని చెప్పి అక్కడకు సుమారు నాలుగు మైళ్ళ దూరములో నున్న పెనుగొండ పోలీసు స్టేషను నుండి ఒక జవానును తీసికొని వచ్చి శ్రీరామరాజు తమ్ముని చూపించి ఆ జవాను భీమవరము వెళ్ళిపోయెను. అంతవరకును అతనిదే ఫూచీ అయి యుండెను. అల్లే ఫలానా రోజున తెల్లవారు జామున బయలుదేరి వెళ్లెదడనగా పెనుగొండ కానిస్టేబులు తొలిరోజు రాత్రికి వచ్చి పరుండి మరునాడు తెల్లవారు జామున బయలుదేరి శ్రీరామరాజు తమ్మునితో భీమవరము వచ్చి పిదప భీమవరము కానిస్టేబిలును తీసికొనివచ్చి అప్పగించి అతడు పెనుగొండ వెళ్ళిపోయెను. ఇట్లు శ్రీరామరాజు తల్లిని, తమ్ముని ఇద్దరు పోలీసు జవానులు అహర్నిశలు కావలా కాయుచుండిరి. ఈ విధముగానే విప్లవ యుద్ధము ముగిసిన తరువాత గూడ కొంతకాలము వరకు వారికి పోలీసు కావలా ఉండెడిది.

# 12. విప్లవ ప్రారంభము

మన్యము విప్లవమునకు అధికారుల ఘాతుక చర్యలే ముఖ్య కారణములు. పోరాటము ప్రారంభించుటకు అనుకూలపరిస్థితులు గోచరమైనవి. అట్టి అవకాశము రాగానే శ్రీరామరాజు కార్యాచరణకు పూనుకొనెను.

మన్య ప్రాంతమునకు రాజు కావలెననెడి తలపుతో అతడు పోరాటమును ప్రారంభించి యుండవచ్చునని ఏజెన్సీ కమీషనరు అగు హొపెల్ ప్రభుత్వమునకు నివేదించెను. ఈ యభిప్రాయమునే ఇతర అధికారులు గూడ వల్లించిరి. ప్రభుత్వమునకు హొపెల్ ఇట్లు ఒక నివేదిక పంపెను. "శ్రీరామరాజు బ్రిటిషు రాజ్యము రెండు సంవత్సరములలో అంతము కాగలదనియు, అంత వరకు ఎట్టి సేనలకైనను పోరగాని గూడెము కొండలలో తాను ఉండి విప్లవమును నడిపించవచ్చునని తలచినట్లు కనబడుచున్నది. అప్పుడు బ్రిటిషువారిని భారతదేశము నుండి తరిమివేసి, స్వరాజ్యమును ప్రకటించి తానే గూడెము ఏజెన్సీకి రాజు కావలెనని **తల**చియుండవచ్చును". ఇట్లు ఆ యధికారి విప్లవాశయములకు స్వార్థపరత్వమును **ఆపా**దించెను. ఈ విషయమును అప్పటి **తాత్కాలిక ప్రధానకార్యదర్శి ఇట్లు చర్చించెను. "శ్రీరామ**రాజు పలుకుబడి, ఆకర్షణ శక్తి ఈ విప్లవమునకు ముఖ్య కారణములుగా గనబడుచున్నవి. ఇతని బోధనలు, నాయకత్వము లేనిచో కేవలము ప్రజలను **ఆకర్షించు కారణములు** మాత్రమే ఇంతటి గందరగోళమును సృష్టింపజాలవు".

శ్రీరామరాజు మన్య సీమకు రాజు కావలెననెడు స్వార్థ బుద్ధితో అనాగరికులు అమాయకులునగు మన్యపు ప్రజల ఆర్థిక దుస్థితిని ఆధారము చేసికొని వారిని పవిత్రత పేరిట రెచ్చగొట్టినట్లు నాటి ప్రభుత్వము, విదేశ రచయితలు వ్రాసిరి. 'సిపాయి కలహము' పేరిట 1857 ప్రథమ స్వాతంత్ర్య సమరమునకు గూడ ఇట్టి సంకుచిత స్వభావము ఆపాదింపబడినది.

శ్రీరామరాజు కూడ ఆ దినములలో తన గ్రంథములపై "శ్రీమన్మహారాజ రాజాధిరాజు శ్రీ అల్లూరి శ్రీరామరాజు. శ్రీరామ విజయనగరం" అని నాగరి లిపిలో తన పేరును వ్రాసికొనువాడు. అట్లు వ్రాసికొనిన మను చరిత్రయు, ఆంధ్రనామ సంగ్రహమును ఉన్నవి. దీనివలనను అతనికి రాజు కావలెనను వాంఛయున్నట్లు పైకి కనబడుచున్నది. కాని అది వాస్తవముకాదు. విప్లవమునకు ముందుగాని, తత్సమయములో గాని, అతని

చర్యలు అట్టి స్వార్థపరతనుగాని, సంకుచిత మనస్సుగాని సూచింపవు. **అట్టి బిరుదులు** పెట్టుకొనుటవలన అతని దృఢ స్వాతంత్ర్య వాంఛయు, అట్టి బిరుదులను **తగిలించుకొనిన** బ్రిటిషురాజునకు మనమేమియు తీసిపోమనియు సూచించుటకేగాని అందు లౌకికాసక్తి ఉన్నట్లు ఏమియు కనిపింపదు. కానిచో మన్య ప్రాంతమునకో, ఆంధ్ర దేశమునకో, భారత దేశమునకో రాజని వ్రాసికొని యుండవచ్చునుగదా. ప్రజారంజనము వలన రాజై వారి హృదయపీఠములనధిష్ఠించి వారి శ్రేయఃప్రేయములను గూర్చి సర్వదా చింతించుచు రాజాధిరాజుగానే కాని లౌకికమైన పదవిని అతడు ఆశించినట్లు మాటలలోగాని, చేతలలోగాని ఎచ్చటను కన్పించదు. జీసస్ క్రీస్తు గూడ యూదుల రాజనిన లౌకిక పదవి కాదుగదా. అదియునుగాక సుక్షత్రియ వంశమున బుట్టెను గావున "స్వధర్మమపిచావేక్ష్య నవికంపితు మర్హసి॥ ధర్మ్యాద్ధియుద్ధాచ్ఛ్రేయో న్యత్ క్షత్రియస్యన విద్యతే॥" అను గీతావచనము ప్రకారము తన ధర్మ విధికి జ్ఞాపికగా అట్టి ఉపపదములను తన పేరు ముందు జేర్చుకొని యుండవచ్చును.

1857 స్వాతంత్ర్య సమరమునకు సిపాయిల అసంతృప్తి కారణమైనట్లు, శ్రీరామరాజు విప్లవమునకు మన్యప్రజల నికృష్టస్థితి కారణమైనది. మన్య ప్రజలందరు శూరయోధులై శ్రీరామరాజు నాయకత్వమున విప్లవవీరులై అతనిని అనుగమించిరి.

శ్రీరామరాజు దేశ స్వాతంత్ర్యమునకు నాందిగా మొదట ఏజన్సీని స్వతంత్రము చేయవలెనని ఎంచెను. 13, 14 ఫిరంగులు ఉండి అవి వ్యూహము ప్రకారము ఆయా చోట్ల ఉంచిన యెడల విశాఖ పట్టణము, తూర్పు గోదావరి జిల్లాలలోని మన్య ప్రాంతమును స్వతంత్రము చేయుటకు సరిపోవుననియు, అప్పుడు ఈ మన్యము కేంద్రముగా బయటి తాలూకాలకు స్వాతంత్ర్యము కల్పించ వచ్చుననియు అతడు అనెడివాడు. మన్య ప్రాంతపు స్వాతంత్ర్యము దేశస్వాతంత్ర్యమునకు నాంది కావలెనని అతని యాశయము.

అతడు మొదట ముగ్గురు నాయకత్వమున యుద్ధము చేయ సంకల్పించెను. తునిలో పేరిచెర్ల సూర్యనారాయణరాజు అను విద్యార్థి మిత్రుడు ఉండెడివాడు. అతడు పిరికి కంతలేని వీరుడు. నమ్మిన వారికి ఆత్మ త్యాగము చేయుటకు వెనుదీయనివాడు. నిరంతర వ్యాయామస్థిరసంధిబంధుడు. చదువుకొనుచున్న రోజులలోనే ఒకసారి అతడు పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టరును కొట్టెను. "తోవాం" ఎస్టేటు తగవులలో తుని దాట్ల వెంకట సూర్యనారాయణ జగపతిరాజు (పెదబాబు) గారి పక్షమున పోరాడి ఎదిరికి సింహ స్వప్నమై ఆ ఎస్టేటును తునిదాట్ల వారికి స్వాధీనపరచుటకు తోడ్పడెను. ఇంకొకసారి మెర్ల రామన్న



మను చరిత్ర అట్టపై సీతారామరాజు స్వహస్తముతో వ్రాసికొనిన పేరు

అనునాయుప నల్లపరాజు అచ్యుత రామరాజు గారికి పాకల గరువులోనున్న 200 ఎకరముల భూమిని జప్తుకు తీసికొని వచ్చిరి. రామన్నకు స్వాధీనము కాకుండ చేయుటకు అచ్యుత రామరాజు దీనిని పేరిచర్ల సూర్యనారాయణ రాజుకు బినామిగా వ్రాసెను. ఈ రాజును చంపిన గాని తమకు భూమి స్వాధీనము కాదని భావించి అతనిని చంపుటకు ఏడుగురు రౌడీలు పంపబడిరి. రాత్రి రాజు నిద్రించుచుండగా రౌడీలు రాజును కొట్టిరి. రాజుకు దారుణమైన దెబ్బలు తగిలెను. డొక్కలో ఈటెపోటు, వీపుమీద 16 కత్తి పోట్లు, తలమీద నిలువుగా కర్ర కత్తిదెబ్బ, అడ్డముగా కర్ర కత్తిదెబ్బ, తల వెనుక కత్తిదెబ్బ, కుడి చెంప మీద బలమైన కత్తిదెబ్బ. చెంపతెగి వ్రేలాడుచుండెను. రాజు చనిపోయెనని కొట్టినవారు వెడలిపోయిరి కాని రాజులేచి వ్రేలబడిన చెంపను పైకెత్తి కట్టి, భార్య అందించిన కత్తిపీట పట్టుకొని రౌడీలను తరిమెను. కాని వారు పారిపోయిరి. ఈ దెబ్బల వలననే సూర్యనారాయణ రాజుకు "నరకుల రాజు" అను బిరుదనామము వచ్చినది. వేరొక సమయమున డెంకాడ పూసపాటి వారికిని వెలమలకును భూమి తగాదా వచ్చినది. ఇద్దరికిని జరిగిన దెబ్బలాటలో పూసపాటివారి పక్షమున సూర్యనారాయణరాజు పోరాడి వెలమలను తరిమివైచెను. ఇట్లు ప్రతిష్ఠ కొరకు ప్రాణమును తృణప్రాయముగ త్యాగము చేయు వీరుడు సూర్యనారాయణరాజు. ఈయన ప్రస్తుతము విశాఖ జిల్లా చోడవరం తాలూకా కొదూరు గ్రామ మందలి ఒక ఎకరము మెరక పొలములో పూరిపాక వేసికొని జీవించుచున్నారు.

సూర్యనారాయణ రాజు కొరకు శ్రీరామరాజు తన తమ్ముని పంపెను. ఆయన వచ్చెదనని చెప్పెను. కాని ఏ కారణముననో రాలేదు. శ్రీరామరాజు పినతండ్రియైన రంగరాజుగారి కుమారుడు వెంకట కృష్ణంరాజు. ఈయన డాక్టరుగా ఉద్యోగము చేసి, ఇప్పటి ఖమ్మం జిల్లా చర్లవద్ద స్థిరపడి, 1974 లో మరణించిరి.

శ్రీరామరాజు, సూర్యనారాయణ రాజు, వెంకట కృష్ణంరాజు ఈ ముగ్గురును మూడు జట్లుగా విడిపోయి ఒకేసారి మూడు స్టేషనులు కొట్టవలయునని ఊహింపబడినది. కాని అది సాగలేదు. శ్రీరామరాజు మొదటి నుండి చివరివరకును అసహాయుడుగనే యుద్ధము చేయవలసి వచ్చినది. పరిస్థితులు ప్రతి కూలములు, సాధన సంపత్తి శూన్యము అయినను "క్రియా సిద్ధిస్సత్వే భవతి మహతాం నోపకరణే' అనురీతిని అతడు యుద్ధము సాగించెను. బ్రిటిషు ప్రభుత్వముతో అసహాయ యుద్ధము సామాన్యము కాదుగదా.

కాని శ్రీ రామరాజునకు ప్రాణములు సైతము పణముగా పెట్టి పోరాడువీరులు, సాహసులు అగు సహచరులకు కొదువలేదు. అట్టివారిలో గాం సోదరులు ముఖ్యులు.

వీరిలో పెద్దవాడగు గాంగంటన్న (గంటం) దొర మకరం ముఠాలోని 'బట్ల పనుకుల' గ్రామ మునసబు. రెండవ వాడు గాంమల్లన్న (మల్లు) దొర. వీరు శ్రీ రామరాజునకు రెండు భుజములవలె నుండిరి. నేతాజీ సుభాష్ చంద్రబోసుకు షానవాజుఖాన్ ధిల్లానులవలె, భగత్‌సింగ్‌కు సుఖదేవుదత్తులవలె ఈ గాం సోదరులు శ్రీరామరాజునకు పోరాటమున అండదండలుగా నిల్చిన వీరాగ్రగణ్యులు.

శ్రీ రామరాజును కాల్చివేసిన తరువాత అతిక్లిష్ట పరిస్థితులలో గూడ అత్యద్భుత సాహసముతో పోరాటమును సాగించి యుద్ధ భూమిలో వెన్నుచూపకుండ అనుచర బృందముతో అసువులు బాసిన యోధుడు గంటందొర.

గూడెం ముఠాదారు మొట్టడం వీరయ్య దొర శ్రీ రామరాజు అనుచరులలో మరియొక యోధుడు. వీరయ్యదొర తండ్రి సోబీలను దొర లాగరాయిపితూరితో సంబంధము కలిగియుండెను.

పెదవలసగ్రామ నాయకుడు కంకిపాటి ఎండుపడాలు (బొజ్జిపడాలు) ఈ యుద్ధములో వీరమరణము పొందిన ఇంకొక యోధుడు. ఇతడు శ్రీరామరాజు అనిన అత్యంత పూజా భావముతో మెలగు భక్తుడును, గొప్ప విలుకాడును, తుపాకిని గాల్చుటలో నేర్పరియును.

'అగ్గిరాజు' అని పేరు మ్రోసిన వేగిరాజు సత్యనారాయణరాజు అపూర్వ సాహసి. ఇతడు భీమవరము తాలూకా కుముదవల్లి వాస్తవ్యుడు (జన్మస్థలం - లింగరాజుపాలెం). ఈ వీరవర్యుడు అండమాను ప్రవాసములో మరణించెను.

ఈ వీరులు శ్రీరామరాజు ప్రారంభించిన మహావిప్లవమునకు పంచ ప్రాణముల వంటివారు.

పెదవలస ముఠా దారైన సంకోజిముక్కుడు సింగన్నపల్లిలో నుండెను. ఇతడు విప్లవవీరుడుగా, ప్రచారకుడుగా పని చేసెను. ఇతడు చివరకు పట్టుపడి 12 సంవత్సరములు శిక్షననుభవించెను.

గోకిరి ఎఱ్ఱేసు గనర్లపాలెము నివాసి. ఇతడు గొప్ప విలుకాడు. సాముగరిడీలు తెలిసినవాడు. మాకవరము ముఠాకు చెందినవాడు. ఇతడు గూడ పట్టుబడి 12 సంవత్సరములు శిక్షననుభవించెను. రాయవెల్లూరు జైలులోనున్నప్పుడు కాంగ్రెసు సత్యాగ్రహులు తనను కలిసికొనగా వారికి శ్రీరామరాజు చరిత్ర చెప్పుచు, "మా అయ్యగారు ఆకసమునకెగిరిపోయిరి. ఎవరును చంపలేదు" అని చెప్పుచుండువాడట.

బొంకుల మోదిగాడు అను చింతపల్లి నివాసి కూడ సాహసియగు విప్లవవీరుడు. ఇతడు కొయ్యూరు ముఠాకు చెందినవాడు.

ఇట్టి వీరుల సహాయముతో, మట్టి నుండి మహావీరులను తయారు చేసి శాలివాహనునివలె సైన్యమును సృష్టించుకొని శ్రీరామరాజు సమరమునకు ఆయత్తుడయ్యెను.

మొత్తము 150 మంది విప్లవకారులుండిరి.

ఇక శ్రీరామరాజు సమర్థుడైన సైన్యాధ్యక్షుడు. ఎత్తునకు పై ఎత్తులు వేయుటలో ఇతనికి గల చాతుర్యమును, తన సైన్యమున సమైక్యమును క్రమ శిక్షణను పాటించుటలోగల నియమబద్ధతయు సాటిలేనివి. అనుచరులలో ఎవ్వరు తప్పుచేసినను శిక్ష విధించెడువాడు. క్రమ శిక్షణను పాటించుటలో ఇతడు మల్లుదొర పట్ల గూడ ఒకప్పుడును అభిమానము చూపలేదు. అతడు విప్లవ సైన్యములోని ప్రతివ్యక్తి చరిత్రను వ్రాసికొని ఎవరు ఏ తేదీని సైన్యములో చేరినది, ఎప్పుడు విడిచి పెట్టినది, ఎప్పుడు నిర్బంధింపబడినది లేక మరణించినది మొదలగు వివరము లన్నియు వ్రాసియుంచు కొనెడువాడు. అనుమతి లేనిదే ఎవ్వరును బయటకు పోవుటకు వీలులేదు. విప్లవకారులు తెలుపు ఎరుపు రంగులుగల నిక్కరు, చొక్కా ధరించెడు వారు. తిరుగుబాటు చేసినచో జైలు శిక్షయో, ఉరిశిక్షయోపడునని ముందే చెప్పెడువాడు. అందుకు సిద్ధపడిన వారే విప్లవదళములో చేరెడువారు.

వారి వారి సామర్థ్యములను బట్టి హోదాలు నిర్ణయింపబడెడివి. ఏ సైనికునకు, ఏ ఆయుధము ఈయబడినది వివరములు వ్రాయబడి ఉండెడివి. విప్లవకారులలో కొందరు కత్తియుద్ధమున ప్రవీణులు. కొందరు తుపాకిని గురిపెట్టి కాల్చుటలో నేర్పరులు. ధనుర్విద్యలో కౌశలముగల వారు కొందరు, సాహస కార్యములు చేయుటలో, గూఢచారి చర్యలలో గణనీయులు మరికొందరు. వారినందరిని వారి సామర్థ్యములనుబట్టి జట్లుగా విభజించి దేశకాల పరిస్థితులను బట్టి వారికి ఆయా ప్రత్యేక కార్యములు అప్పజెప్పబడెడివి. స్త్రీలకు ముఖ్యముగా ఆహార పదార్థములు సేకరించుట, గూఢాచారి చర్యలు అప్పగించబడెను. సైనిక శిబిరములకు నిగూఢ స్థావరములు, పోరాటమునకు అనువగు స్థలములు నిర్దేశింపబడెను. ప్రజల పట్ల భారతీయోద్యోగుల పట్ల, ప్రవర్తించవలసిన విధానము విప్లవ సైనికులకు బోధింపబడి వారి వ్యక్తిగత ప్రవర్తన విషయమున కట్టుబాట్లు విధింపబడెను. గృహస్థుల వద్ద ఒకటి రెండు రోజులకు ఆహార సామాగ్రి గైకొనవచ్చును. తుపాకులున్నచో బలాత్కారముగానైనను తీసికొనవచ్చును. భారతీయోద్యోగుల జోలికి

పోగూడదు. ప్రజలను బాధింపగూడదు. ఇట్టి నియమములను శ్రీరామరాజు తన అనుచరులకు విధించెను. ఎప్పుడైనను తనను ఆకస్మికముగా నిర్బంధించి జైలునందుంచి నచో యుద్ధ ప్రయత్నమంతయు వ్యర్థమగును. అందుచే అట్టి పరిస్థితి సంభవించినచో ఆ జైలు బ్రద్దలుగొట్టి విడిపించుటకు, అట్టి సమయములో గెరిల్లా యుద్ధమును ప్రారంభించి సాగించుటకును శిక్షణయు, ఏర్పాట్లును చేయబడెను.

మన్య ప్రాంతమంతయు పర్వతారాణ్యమయము. పెనుగొండలు, అగాధములగు లోయలు, కొండవాగులు, క్రిక్కిరిసిన వృక్షములు, గుబురు కొనిన పొదలు గలిగి ఘాతుకమృగములకు నెలవులై, పాముల కిరవులై, అచ్చటచ్చట విసరివేయబడినట్లు కుగ్రామములు గలిగిన ప్రాంతము లీయరణ్యములు. ఆ గ్రామములకు దారులు కాలిబాటలు. అరణ్యములలో ఈ బాటల వెంటబోవుట తేలికకాదు. దట్టమైన యడవిని ప్రవేశించినంతనే అన్నివైపులకు చీలిపోవుచు ఎన్నియో బాటలు కనబడును. బాగుగా పరిచయముండి తెలిసిన తప్ప సరియగు బాట తెలియదు. ఒక్కొక్కప్పుడు ఒకేచోట చుట్టును తిరుగుచుండవచ్చును. దారి తప్పి ఎచ్చటికోపోవచ్చును. ఒక్కొక్కసారి త్రోవ కనిపింపదు. పట్టపగలు కూడ సూర్యరశ్మి చొరని ఆ కీకారణ్యములు భీతి గొల్పుచుండును. ఇక రాత్రులు గాఢాంధకారమే. చీకటి రాత్రులు చెప్పనక్కరలేదు. వర్షాకాలమున కాళరాత్రులే. అట్టి భయంకర రాత్రులలో గూడ శ్రీరామరాజును, అతని సహచరులును అయడవులలో ఒక్కొక్కప్పుడు ఒంటరిగా గూడ సంచరించుచు ప్రయాణించెడువారు. మన్యప్రాంతమున ప్రతియంగుళము విప్లవదళమునకు కరతలామలకము.

వ్యూహములను పన్ని కొండలలో, అడవులలో తన సైన్యమును నడిపించుచు గెరిల్లా యుద్ధమును సాగించుటలో శ్రీరామరాజు అపూర్వ చాతుర్యమును చూపెను. ధైర్య సాహసములు అతనికి వెన్నతో బెట్టిన విద్య. చతుర్విధోపాయములను అవసరమును బట్టి ప్రయోగింపగల రాజనీతి చతురతయు అతనికి గలదు. అతడు కత్తి యుద్ధమునందును, తుపాకిని కాల్చుటలోను, విలువిద్యయందును మేటియగు సైన్యాధ్యక్షుడు, తన మాటను సుగ్రీవాజ్ఞగా పాటించు అనుచరవర్గము అతనికి గలదు. అట్టి యుదాత్త నాయకత్వమున భీరులు గూడ వీరులైరి.

దేశమంతయు అసంతృప్తితోనున్న ప్రజలలో విప్లవ వాతావరణము నెలకొని యుండెను. జలియన్ వాలాబాగ్ దురంతమారణకాండతో దేశ ప్రజల రక్తము ఉడుకుచుండెను. బార్డోలీ బీభత్సములు, చీరాల పేరాల ఉద్యమము ఇంకను ప్రజలు మఱువలేదు. మహాత్ముని స్వరాజ్య నినాదము ప్రజల హృదయములలో ప్రతి

ధ్వనించుచుండెను. కాని మన్యప్రజలకు ఈ దేశ పరిస్థితులు అంతగా తెలియవు. అట్టి సమయమున శ్రీరామరాజు తన విప్లవ సన్నాహములు పూర్తి చేసికొనెను. మహారాష్ట్ర సింహమైన లోకమాన్య బాలగంగాధరతిలకు 'స్వరాజ్యము నా జన్మహక్కు' అని గర్జించి దేశ ప్రజలను మేల్కొలిపినట్లు మన్యసింహమైన శ్రీరామరాజు అధర్మము నశింపజేయుటకు 'విప్లవము మన జన్మహక్కు' అని గర్జించి మన్య ప్రజలను మేల్కొల్పి విప్లవ శంఖమును పూరించి బ్రిటిషు ప్రభుత్వముతో తలపడుటకు సన్నద్ధుడయ్యెను. అతడు ధారపర్వతమును జేరి గంటందొర మొదలగు నాయకులను రప్పించి చర్చించి విప్లవ ప్రారంభమునకు ముహూర్తము నిర్ణయించెను. విప్లవకారులందరిని శరభన్న పాలెములో జేర్చి సభజేసి వారిచే ప్రమాణములు చేయించి, సంతకములు వ్రేలిముద్రలు తీసికొని తరువాత పితూరికి బయలుదేరెను.

ఈ పితూరిలో విప్లవకారులు శత్రువులకు తమ రాకను తెలుపుటకు ఒక విచిత్ర పద్ధతి నవలంబించిరి. ఒక చీటిలో తమ రాక సమయమును తెల్పుచు వ్రాసి దానికి ఒక మిరపకాయను గూడ జోడించి బాణమునకు గట్టి అది చేరవలసిన స్థలమునకు పంపించెడువారు. ప్రభుత్వాధికారులకు ఉత్తరములు గూడ అట్లే పంపించెడువారు. అది ఎక్కడ నుండి ఎట్లు వచ్చినదో తెలిసెడిది కాదు. ఇదియే అల్లూరి సీతారామరాజు మిరపకాయ టపాగా ప్రసిద్ధి చెందినది. ఈ మిరపకాయ టపాయని ప్రభుత్వాధికారులు భయపడెడువారని ప్రజలు చెప్పుకొందురు.

# 13. చింతపల్లి పోలీసు స్టేషనుపై దాడి

1922వ సంవత్సరము ఆగస్టు 22వ తేదిని మన్యమున విప్లవము ప్రారంభమయ్యెను. ఆనాడు రంపచోడవరం ఏజన్సీలోని చింతపల్లి పోలీసు స్టేషనుపై మెరుపుదాడి చేయబడినది. ఆత్మ రక్షణకు, రణరంగమున వీని యోగమునకు తుపాకులు అవసరము. తాను జరుపనున్న దీర్ఘమైన పోరాటమునకు ఆయుధములు సేకరించుట ఆరంభించెను.

1922 ఆగస్టు 19వ తేదీని (దుందుభినామ సం॥ము శ్రావణ బహుళ ఏకాదశి శనివారము) మహా రుద్రాభిషేకము చేసి శివ జాగరణ చేసి చింతపల్లి పోలీసు స్టేషను దోపిడి అని అనుచరులకు తెలియజెప్పెను.

గాంతోదరులు, ఎండుపడాలు, గోకిరి ఎర్రేసు మొదలగు ముఖ్యానుచరులు వెంటరాగా సుమారు 300 మంది అనుచర వర్గము నాటు తుపాకులు, కత్తులు, బల్లెములు, విల్లంబులు మొదలగు ఆయుధములతో చింతపల్లి పోలీసు స్టేషనుపై దాడి చేసిరి. ఆ సమయమున స్టేషనులో ముగ్గురు జవానులు మాత్రము ఉండిరి. సబ్‌ఇన్‌స్పెక్టరు లేడు. దాడికి ముందే నర్సీపట్నం వెడుతున్న సబ్‌ఇన్‌స్పెక్టరు "లంబసింగి' ' ఘాటు వద్ద ఎదురుపడగా శ్రీరామరాజు అతనితో బ్రిటిష్ వారిని తరిమివేయుటకు ఆయుధముల కొరకు మీ స్టేషనుకే వెళ్ళుచున్నాను అని చెప్పగా అతడు మారుమాటాడక చల్లగా ప్రక్కనుండి తప్పుకొని జారుకొనెను. స్టేషనులో నున్న పోలీసులు నిశ్చేష్టులై ప్రతిఘటించుటకు సాహసించరైరి. ఆయుధాగారపు తాళపు చెవులు అడుగగా వారు ఇచ్చుటకు అంగీకరించలేదు. అప్పుడు విప్లవకారులు వారిని ఏమియు హింసించక స్తంభములకు కట్టివేసి దొరికిన ఆయుధములను తీసికొని వెళ్ళిపోయిరి. స్టేషను ఆయుధాగారములో 11 తుపాకులు, 1390 తుపాకి గుండ్లు, 5 కత్తులు, 14 బాయొనెట్లు మొదలగు వానిని విప్లవకారులు స్వాధీనపరచుకొనిరి. వశపరచుకొనిన ఆయుధములన్నిటిని స్టేషను డైరీలో వ్రాసి శ్రీరామరాజు ఇంగ్లీషులో సంతకము చేసెను. తాను దాడి జరిపిన అన్ని స్టేషనులలోను ఇట్లే చేసెడివాడు.

విప్లవకారులు మరలిపోవుచుండగా ఈర్రి అప్పలస్వామి, మద్ది పైడయ్య అను జవానులు వారికి ఎదురైరి. వారి వద్ద గల ఒక తుపాకిని తూటాలను గూడ విప్లవకారులు వశపరచుకొని వారిని వదలివేసిరి.

ఏజన్సీ కమీషనరు అగు F.W. స్టీవర్టు సెప్టెంబరు 11వ తేదీని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరములతో నివేదిక పంపుచు చింతపల్లి స్టేషను ముట్టడిలో శ్రీరామరాజు "గాంధీకి జై" అను నినాదము చేసినట్లును దానికి సహాయ నిరాకరణ వాదుల ప్రచార ప్రభావము ఉండవచ్చుననియు వ్రాసెను. గూడెము తాలూకాకు రాజు కావలెనను తీవ్ర వాంఛయే ఈ తిరుగుబాటుకు శ్రీరామరాజును పురిగొల్పినదనియు, అంతకంటే కారణము కనబడదనియు ఒకవైపు నివేదించుచునే, మరి యొక సహాయ నిరాకరణ వాదుల ప్రభావముండవచ్చునని అభిప్రాయపడుటచే ఈ దాడిని స్వాతంత్రోద్యమ చర్యలలో భాగముగా ప్రభుత్వాధికారులు పరిగణించినట్లు తెలియుచున్నది.

# 14. కృష్ణాదేవిపేట స్టేషన్ ముట్టడి

చింతపల్లి విజయముతో విప్లవకారులకు ఉత్సాహము వెల్లివిరిసినది 23వ తేది ఉదయము వారు శరభన్నపాలెం చేరిరి. అక్కడ ముఠాదారు వారికి ఆహార పదార్థములు మున్నగు సౌకర్యములు సమకూర్చెను. అక్కడి దేవాలయమున శ్రీరామరాజు కొంతసేపు విశ్రమించెను. పిదప తన సైన్యముతో అతడు కృష్ణదేవి పేట వైపు సాగిపోయెను. గ్రామము సమీపించగనే విప్లవకారులు డప్పులు కొట్టియు, కొమ్ము బూరలూదియు గాలిలోనికి తుపాకులు ప్రేల్చియు తమ రాకను ఉద్ఘోషించిరి. పోలీసులకు వార్త పంపిరి. పోలీసులు భయపడి స్టేషనును విడిచి పారిపోయిరి. అప్పటి రామాలయమున రాజు విడిసి గంటందొరను, మల్లుదొరను ఇంకొకనిని స్టేషనకు పంపెను. కాని అచ్చటనున్న సబ్ఇన్స్పెక్టరు స్టేషనులోనికి వచ్చినచో కాల్చి వేయుదునని వారిని బెదరించెను. ఈ వార్త శ్రీరామరాజునకు చేరుటతోడనే ఇంకొక ఆరుగురిని తుపాకులతో పంపెను. వీరినందరిని చూడగనే **సబ్ఇన్స్పెక్టరు** స్టేషను విడిచి పారిపోయెను. స్టేషను విప్లవకారుల వశమైనది.

ఈ ముట్టడిని గురించి అప్పటి పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ అగు ఎఫ్. ఆర్మిటేజ 1922 సెప్టెంబరు 15వ తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి R.A. గ్రాహంకు పంపిన నివేదికలో ఇట్లు వ్రాసెను. "ఫితూరి దారులు వచ్చుచున్నారని విని అంతకు ముందు రాత్రియే గ్రామస్థులు చాలామంది పొలములోనికి పోయి దాగుకొనినట్లు తెలియుచున్నది. ఫితూరిదారులు పగలు 11 గంటల ప్రాంతములో వచ్చిరి. గ్రామము సమీపించగానే వారు డప్పులు కొట్టి కొమ్ము బూరాలు ఊది, తుపాకులు ప్రేల్చిరి. గ్రామములో త్రొక్కిసలాట ప్రారంభమయ్యెను. ఫితూరిదారులు "గాంధీకి జై", 'చక్రవర్తి వచ్చుచున్నాడు' అని అరచుచు వెళ్ళినట్లు వార్త అందినది. మూడు దుకాణముల నుండి సొమ్ము, సరుకులు తీసికొనుట తప్ప ఏమియు లూటీ జరగలేదు. 'పోరాడుదురా లేక ఆయుధములు వదలి వేయుదురా' చెప్పుడని శ్రీరామరాజు పోలీసులకు వర్తమానము పంపెను. అప్పుడు పోలీసులు స్టేషను విడిచి పారిపోయిరి. రాజు, ఫితూరి దారులు అనుసరించగా, స్టేషను లోనికి ప్రవేశించి తాళములు పగులగొట్టి ఆయుధములను తూటాలను తీసికొనెను. పోలీసుల నివేదికను బట్టి స్టేషనులో ఒక హెడ్‌కానిస్టేబులు, ముగ్గురు నలుగురు జవానులు మాత్రమే ఉండిరనియు, వారిని ఫితూరిదారులు బంధించిరనియు ఉన్నది. కాని అది నిస్సందేహముగా అసత్యమే. వారు ప్రతిఘటించలేదు.

తక్కిన స్టేషనులలో గూడ ఇట్లే జరిగియుండవచ్చును. ఆయా స్టేషనులలోని పోలీసుల వలన మనకు నిజము ఎప్పటికిని తెలియదు. రాజు పట్టుబడినప్పుడు మాత్రమే మనకు నిజము తెలిసికొనుట సాధ్యమగును". పోలీసుల మీదకంటే శ్రీరామరాజు నిజాయితీపై ప్రభుత్వాధికారులకు గూడా ఎంత గౌరవము!

ఇచ్చట విప్లవకారులకు 7 చిన్న తుపాకులు, కొన్ని మందుగుండు పెట్టెలు మాత్రము దొరకినవి. వానిని వశపరచుకొని ఆ రాత్రికి కంఠారం గ్రామము చేరి విశ్రాంతి తీసికొనిరి.

ఈ దాడిని గురించి మరికొన్ని వివరములు కూడ తెలిసినవి. శ్రీరామరాజు విప్లవ దళములతో వచ్చుచున్నాడని తెలిసి పోలీసులు ముందుగానే స్టేషనును, వారి కుటుంబములతో పోలీసు లైనును ఖాళీ చేసి పారిపోయిరి. సబ్ఇన్‌స్పెక్టర్ కె.యల్. నారాయణ కూడా స్టేషనులో లేదు. మంచాల నారాయణమూర్తి అను పోలీసు జవాను తల్లి మాత్రము స్టేషనులో ఉండెను. స్టేషనులోని ఆయుధాల పెట్టెలో సొమ్ము ఉన్నదని అనుకొని ఆమె దానిని పెరటిలో గోతిలో కప్పిపెట్టెను. రాజు రాగానే 'మీ దర్శనము చేసికొని తరించుటకు వేచియుంటిని అని విన్నవించుకొనెను. విప్లవకారులు ఆమెను ఏమియు చేయలేదు. స్టేషను నిర్మానుష్యముగా ఉన్నదని రాజు స్టేషను డైరీలో వ్రాసి వెళ్ళిపోయెను. తరువాత ఆ పోలీసు జవాను తల్లి చూపిన సమయోచిత బుద్ధికి ప్రభుత్వము బహుమతి నిచ్చెనని తెలియుచున్నది. ఈ వివరములు రిటైర్డ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. అప్పలస్వామి నాయుడు (విజయనగరం మాజీ మున్సిపల్ ఛైర్మన్) వలన తెలిసినవి అని యర్రమిల్లి నరసింహారావుగారు రచించిన గ్రంథములో వ్రాసిరి.

కృష్ణాదేవి పేట విజయముతో ప్రభుత్వ వర్గములలో కలవరము బయలుదేరెను. విశాఖపట్టణము జిల్లా మేజిస్ట్రేటు హెండర్సన్ ఆగష్టు 25వ తేదిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపిన నివేదికలోని కొన్ని వివరములు ఇట్లు ఉన్నవి. "చింతపల్లి, కృష్ణదేవి పేట స్టేషనుల నుండి ఆయుధములు దోచుకొనుట తప్ప, ఇంకెట్టి విధమగు దోపిడి, హింస జరుగలేదు. దీనిని బట్టి కేవలము దోపిడి చేయుటయే వీరి లక్ష్యము కాదని తెలియుచున్నది. ఈ తిరుగుబాటు ఆశయములు ఇంకను తెలియుట లేదు. నిర్బంధము నుండి రెండవసారి పారిపోయిన వీరయ్య దొరను ప్రత్తిపాడు సబ్ జైలు నుండి రక్షించుటకు కావచ్చును. గోదావరి జిల్లాలోని సహాయ నిరాకరణవాదులతో వీరికి సంబంధము కలదని చెప్పుదురు. కాని అట్టి సాక్ష్యాధారమును చూపు సంఘటనలు ఇంత వరకు జరుగలేదు.'

జిల్లా మేజిస్ట్రేటు పంపిన సమాచారము వలన ఈ దాడులను అరికట్టుటకు ప్రభుత్వము వెంటనే పూనుకొనెను. అత్యవసర చర్యలు గైకొనవలసినదిగా పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్‌కు ఆజ్ఞలు పంపబడినవి. అతడు వెంటనే నర్సీపట్టణములో డిప్యూటీ ఇన్‌స్పెక్టరు జనరల్‌ను, ఏజన్సీ కమీషనర్‌ను సమావేశపరచి ముందు కార్యక్రమమును నిర్ణయించెను.

# 15. రాజవొమ్మంగి స్టేషనుపై దాడి - వీరయ్య విడుదల

విప్లవ వీరులు పురోగమించుచు ఆగస్టు 24వ తేదీని అర్ధరాత్రి సమయమున రాజవొమ్మంగి చేరుకొని అచ్చటి పోలీసు స్టేషనుపై దాడి చేసిరి. అంతకు ముందు చింతపల్లి, కృష్ణాదేవి పేట పోలీసు స్టేషనులపై జరిపిన దాడుల గురించి ఆగస్టు 24వ తేదీని ఏజన్సీ కమిషనరు ప్రభుత్వమునకు తంతి వార్త పంపి యుండుటచే, మన్యములోని పోలీసు స్టేషనులకు హెచ్చరికలు చేయబడినవి. అందుచే ఈ ముట్టడిలో విప్లవకారులు కొంత ప్రతిఘటన నెదుర్కొనవలసి వచ్చినది. స్టేషనులో ఇద్దరు హెడ్‌కానిస్టేబిల్స్, 4 గురు జవానులు కలరు. అడ్డతీగల నుండి వచ్చిన ఇంకొక ఇద్దరు జవానులు కూడ ఆ సమయమున అచ్చట ఉండిరి. పోలీసులు 36 కాల్పులు కాల్చినట్లు ప్రకటించిరి. కాని ఎవ్వరికిని ఒక్క గుండు కూడ తగులకపోవుటచే పోలీసులు నిజముగా ప్రతిఘటించి రాయని ప్రభుత్వమునకు గూడ సందేహము కలిగినది. ఈ స్టేషను నుండి 8 తుపాకులు, 825 తూటాలు, కొన్ని పోలీసు దుస్తులు విప్లవకారులు సంపాదించిరి.

రాజవొమ్మంగి స్టేషనుపై దాడి చేయుటకు ముఖ్య కారణము ఆయుధములను సేకరించుటయేగాక మొట్టదం వీరయ్యదొరను జైలు నుండి విడిపించుతలంపు యుండెను. వీరయ్యదొర అంతకు పూర్వము గూడెం ముఠాదారు. 1891వ సంవత్సరమున కాంతభూపతి నాయకత్వమున మన్యములో జరిగిన పితూరిలో వీరయ్యదొర తండ్రియగు సాబిలనుదొర పాల్గొని యుండుటచే అతనిని మన్యము నుండి ప్రభుత్వము బహిష్కరించినది. పిదప 1915-1916లో జరిగిన లాగరాయి పితూరితో సంబంధము గలదని వీరయ్య దొరను గూడ ప్రభుత్వము మన్యము నుండి బహిష్కరించి అతని యాస్తినంతయును వశపరచుకొనెను. 1917లో ఏజన్సీ వారంటుతో అతనిని విజయనగరములో నిర్బంధించిరి. తరువాత ఎట్లో అతడు తప్పించుకొని మన్యము చేరి ప్రజల సహకారముతో రహస్య జీవితమును గడుపుచుండెను. గూడెం తాలూకా ప్రజలకు తనపై అత్యంతమైన అభిమానము కలదని హేపెల్ మన్యము విప్లవమును గూర్చి ప్రభుత్వమునకు పంపిన తన నివేదికలో పేర్కొనెను. అట్టి రహస్య జీవితము గడుపుచున్న వీరయ్యదొరను పోలీసులు పట్టుకొని మరల నిర్బంధించి విచారణకు

అజ్ఞపొందిరి. అతనిని విచారించుటకు రాజవొమ్మంగి స్టేషనులో నిర్బంధించిరి. ఈ విషయము శ్రీరామరాజునకు తెలియును. చాల కాలము నుండి ఎట్టి విచారణలేకయే వీరయ్య దొర నిర్బంధముననుభవించు చుండెననియు శ్రీరామరాజు తెలిసికొని విచారణకు పూర్వమే అతనిని నిర్బంధము నుండి విడిపించుటకు కృతనిశ్చయుడయ్యెను. ఈ దాడిలో మొదట వీరయ్య దొరకు విముక్తి కల్గించెను. అప్పటి నుండియు ఇతడు గూడ విప్లవ దళములో చేరి గాంసోదరులతో పాటు శ్రీరామరాజునకు ముఖ్యానుచరుడయ్యెను.

ఇట్లు మూడు రోజులలో వరుసగా మూడు పోలీసు స్టేషనులపై విజయవంతముగా దాడులు జరిపిన వార్తలు ఆంధ్రదేశమంతయు వ్యాపించినవి. జాతీయ వాదులు ఈ విప్లవ గమనమును ఆసక్తితో, ఉత్సాహముతో పరికింపసాగిరి. ఈ దాడులలో విప్లవకారులకు మొత్తము మీద 26 తుపాకులు, 2500 తూటాలు, బాయొనెట్లు, కత్తులు ఇతర సామగ్రి దొరకినవి.

తంతి ద్వారా నర్సీపట్టణము నుండి 24వ తేదీని వార్త అందగానే ఏజన్సీ జిల్లా సూపరింటెండెంటు అగు సాండర్సు, విశాఖపట్టణము జిల్లా సూపరింటెండెంటు అగు మార్టిన్, ఏజన్సీ కమీషనరు స్టీవర్టు హుటాహుటిని నర్సీపట్టణము బయలుదేరి 25వ తేదీ ఉదయమునకు అచ్చటకు చేరిరి. కాని నర్సీపట్టణము ప్రశాంతముగా నుండెను. రాజమండ్రి నుండి, విశాఖపట్టణము నుండి, పార్వతీపురము నుండి, కోరాపుట్టి నుండి రిజర్వు పోలీసులు రప్పింపబడిరి. తెల్ల ఉద్యోగులు విప్లవమును రూపుమాపుటకు నాలుగు ప్రక్కల నుండి మన్యములో వాలిరి. బ్రెమెన్ హేర్, స్కాట్ కవర్టు, డావసన్, కీన్, కింగ్, హ్యూం, ఫోర్బెస్, హైటర్, బార్విక్ మొదలగు ఆఫీసర్లు రంగము లోనికి దిగి పోలీసు బలగముతో మన్యము నలుమూలలు విప్లవకారుల జాడలకై గాలించుట మొదలిడిరి. ఏజన్సీ కమీషనరు, పోలీసు సూపరింటెండెంటులు తమ పర్యవేక్షణ క్రింద విప్లవ ప్రతీకార చర్యలను తీసికొనుచు ప్రతి దినమును మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపుచుండిరి.

రాజవొమ్మంగి స్టేషనుపై దాడి తరువాత విప్లవకారులు విజయోత్సాహముతో వాయువ్య దిశగా నున్న గూడెం కొండలను 26వ తేదీకి చేరుకొనిరి. అచ్చట ఆగి శ్రీరామరాజు దేవీ పూజ జరుపుటకు సన్నాహములు చేయసాగెను.

# 16. ఒంజేరి ఘాట్ వద్ద పోరాటము

గూడెం కొండలలో ఈశాన్య దిశనున్న కిల్లంకోట చేరి అచ్చట నుండి విప్లవకారులు తూర్పు దిశగా గంగరాజు మదుగుల వైపు సాగిపోయిరి. 'శీఘ్ర ప్రయాణములు, వర్షములలో తరచుగా తడియుచుండుట మూలమున విప్లవకారులలో చాలమంది జ్వరముతో బాధపడుచుండుటచే వారి బలము తగ్గిపోయి, వారు 80 మంది కంటె ఎక్కువ ఉండియుండరు. అందుచే ఇంకను ఎక్కువ మందిని తమలో చేర్చుకొనుటకు ప్రయత్నించుచు వారు తిరుగుచుండవచ్చును. ఇక పోలీసు స్టేషనుల నుండి ఆయుధ సామగ్రిని చేజిక్కించుకొనుట వారికి దుర్లభము. ఎక్కడైనను వారికి ప్రభుత్వ బలముతో తలపడుట తప్పదు. మన్యమంతయు గాలించి వారిని ఏరివేయుటకు ఇదియే అదను' అని ప్రభుత్వాధికారులు వ్యూహములు పన్నిరి.

విప్లవకారులు గూడెం నుండి కిల్లంకోట మీదుగా కొండకంబేరు వైపు పోవుచున్నట్లు సెప్టెంబరు 2వ తేదీని వర్తమానమందినది. బ్రిమెన్ హీర్ చింతపల్లి మీదుగా బయలు దేరెను. స్కాట్ కవర్ట్ లోతుగెడ్డవైపు ప్రయాణమయ్యెను. 2వ తేదీని స్కాట్ కవర్టును సాండర్సు, బ్రిమెన్ హీర్‌లు లోతుగెడ్డలో **కలిసికొనిరి.** అచ్చట నుండి స్కాట్ కవర్టు గూడెం మీదుగా ధారకొండ పంపబడెను. **బ్రిమెన్ హీర్ కప్పల్**, ఒంజేరి, లొద్దిలి మీదుగా పాడేరు చేరవలయును. కోరాపుట్ రిజర్వును **పాడేరు పంపిరి.** దానవ్ కృష్ణదేవి పేట మీదుగా నర్సీపట్నం వెళ్ళెను. స్టీవర్టు పెద్ద బలగము**తో చింతపల్లిలో** మకాంవేసి అన్నివైపుల నుండి సమాచారము ప్రోగు చేయుటకు ప్రయ**త్నించుచుండెను.**

ఒంజేరి వద్ద కొండలలో 1½ మైళ్ళ పొడవు గల ఘాటురోడ్డు గలదు. బ్రిమెన్ హీర్ నాయకత్వమున 30 మంది పార్వతీపురం రిజర్వు పోలీసులు, డిప్యూటీ తహసిల్దారు బాస్టియన్, ఒక డాక్టరు, కొంత పోలీసు బలగము విప్లవకారులను వేటాడుటకు సెప్టెంబరు 3వ తేదీన ఘాటులో పోవుచుండెను. పోలీసు బలగము లోయకు కుడివైపున కొండవాలు లో నున్న దారిని నడచుచుండిరి. దానికి కొంచెము కుడివైపున నిట్టనిలువుగా నున్న ఇంకొక దారి కలదు. అది ఒంజేరి గ్రామము పోవుటకు దగ్గరిదారి. జమాదారును తక్కిన రిజర్వుతోను, మిగిలినవారితోను ఘాటు దారిని సాగిపొమ్మని, బ్రిమెన్ హీర్ 5 గురు జవానులను వెంట బెట్టుకొని అడ్డదారి బట్టెను. కొంత దూరము వారి పురోగమనము సాగినది. అప్పుడు మధ్యాహ్నము 2 గంటలైనది. శ్రీరామరాజు కొండపై భాగమున తన ముఖ్యానుచరులతో గూడి బ్రిమెన్ హీర్ తదితర సైనికుల గమనమును పరిశీలించు

చుండెను. విప్లవకారులు కనబడినచో వారిని ఎట్లైనను బంధించవలెనను **పట్టుదలతో** బ్రెమెన్ హీర్ కొండ ఎక్కుచుండెను. ఇంతలో శ్రీరామరాజు ఆజ్ఞతో విప్లవకారులు నుండి కాల్పులు ప్రారంభమయ్యెను. పోలీసులు ఎదురు కాల్పులు చేసిరి, అంతకు ముందే 20 మంది జవానులతో కొండపైకి 60 గజముల ఎత్తునకు పోయియున్న జమాదారు కూడ తూర్పు వైపు నుండి విప్లవకారులపై కాల్పులు ప్రారంభించెను. కాని ఆ యరణ్య యుద్ధములో విప్లవకారుల ధాటికి పోలీసు బలగము నిలవలేకపోయెను. వారు ధైర్యము కోల్పోయిరి. వెంటనే జమాదారు తన దళముతో బ్రెమెన్ హీర్‌ను దైవమునకు వదలి పలాయనము చిత్తగించెను. బాస్టియన్, డాక్టరు, ఒకరిద్దరు జవానులు మరియొక మార్గమున దట్టమైన పొదలను చాటు చేసికొని పడుచు లేచుచు ప్రాణాపాయమునెట్లో తప్పించుకొనెను. బ్రెమెన్ హీర్‌కు కాలిమీద, చెవిపైన గాయములు అగుటచే అతడు పోరాటమును విరమించెను. అతని బలగము అంతయు చెల్లాచెదరయ్యెను. అతడు లమ్మసింగి మీదుగా ఒక హెడ్ కానిస్టేబుల్, 11 గురు జవానులతో 4వ తేదీ తెల్లవారు ఝామున 3 గంటలకు నర్సీపట్నం చేరుకొని తన వారికి తన సాహస గాథ వినిపించెను. మందుగుండు అయిపోవుటచే తాము విధిలేక వెనుతిరుగవలసి వచ్చినదని వారు చెప్పుకొనిరి. మరునాడు బాస్టియన్ మొదలగువారు గూడ నర్సీపట్నం చేరుకొనిరి. ఈ పోరాటములో ఒక పోలీసు చనిపోయెను. అతని శవమును లమ్మసింగికి తెచ్చిరి.

ఈలోగా స్కాట్‌కవర్డు లోతుగడ్డ నుండి 3వ తేదీని గూడెము చేరుకొని అచ్చట నుండి 5వ తేదీ తెల్లవారు జామున చింతపల్లి చేరుకొనెను. 6వ తేదీ రాత్రి విప్లవకారులు నర్సీపట్టణముపై దాడి చేయనున్నారని స్టీవర్ట వార్త పంపెను. రాత్రి అంతయు పోలీసు బలగము తమ ఆయుధాలతో సిద్ధముగా నుండిరి. కాని ఎట్టి సంఘటనయు జరుగలేదు.

ఒంజేరి పోరాటము తరువాత విప్లవకారులు కొత్తపాలెం ఘాటు ద్వారా శరభన్నపాలెం, మాకారం గ్రామములు చేరుకొనిరి. స్కాట్ కవర్డు, దానన్, కీన్‌లు 10, 11 తేదీలలో కృష్ణదేవిపేట చుట్టు ప్రక్కల మన్య ప్రాంతమంతయు గాలించిరి. విప్లవకారులు కరక, నరుగుడు అడవుల మధ్య నున్న గంటావారి కొత్తగూడెం వైపు వెళ్ళుచున్నారను వార్త చేరగనే దానన్, హ్యూం, ఫోర్బెస్ మొదలగు పోలీసు ఉన్నతోద్యోగులు ఆ అడవులన్నియు గాలించిరి. కాని విప్లవకారుల జాడ తెలియలేదు. కృష్ణదేవి పేటకు 2 మైళ్ళ దూరములో విప్లవకారులు మకాం వేసినను మకాం ముఠాలోని గ్రామస్థులు ఎవ్వరును విప్లవకారుల ఆచూకి తెలుపకుండిరి. 11వ తేదీ తరువాత విప్లవకారుల జాడ తెలియకపోవుటచే స్కాట్ కవర్డు నర్సీపట్నం తిరిగిపోయెను. అతడు తాము ఇదివరలో

3వ తేదీన లోతుగడ్డ నుండి గూడెం తిరిగి వచ్చుచు పట్టుకొనిన వీరయ్య దొర ఆనువాని నుండి వినిన విషయములు ఏజన్సీ కమీషనరు అగు స్టీవర్టుకు చెప్పెను.

స్టీవర్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సెప్టెంబరు 12, 13 తేదీలలో పంపిన ఉత్తరములలో ఇట్లు వ్రాసెను. "ఒకప్పుడు పొడుగాటి గెడ్డముతో వృద్ధునివలెను, మరి యొకప్పుడు యువకుని వలెరాజు కనిపించుననియు, అతడుకృష్ణదేవిపేట ప్రాంతము లలో ప్రజలచే దైవసమానుని వలె ఎంచబడుననియు, వీరయ్యదొర స్కాట్ కవర్డుకు చెప్పెను. తాము వెళ్ళు మార్గములో గల గ్రామముల నుండి ఒకటి రెండు రోజులకు సరిపడు ఆహార పదార్థములనే తీసికొనును గాని రాజు గ్రామములను దోచుకొనుటకు అనుమతింపడు. బహుశః ఇందువలననే ప్రజలలో అతని పలుకుబడి పెరిగినది. కాని దోపిడికి అలవాటుపడిన గాంగంటయ్య వంటి అనుచరులు రాజుపై అసంతృప్తిని ప్రకటించుటకు అవకాశము కలదు. అప్పుడు వారు రాజును వదలిపోవుదురు. మన్య ప్రాంతమున నున్న ఇంత పోలీసు బలగమును చూచి దోపిడి దారులు కూడ భయపడుదురు." ఇట్లు సహజముగ దానంతట అదే ఈ విప్లవము అణగారి పోవునని ఏజన్సీ కమీషనరు ఆశయము !

నర్సీపట్నం నుండి లమ్మసింగికి వెళ్ళు మార్గములో శ్రీరామరాజు విప్లవదళమునకు సహాయపడుచున్నదాయనునట్లు ఒక పెద్దపులి కూడ తిరుగుచుండెడిది. అది అనేకసార్లు ప్రభుత్వ బలగమునకు అడ్డు తగిలినది. పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ అగు ఆర్మిటేజి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి 21-9-1922న పంపిన ఉత్తరములో "నరమాంసము రుచి మరగిన ఒక పెద్దపులి పెద్ద బెడదగా పరిణమించినది. నిన్న సాయంత్రము స్టీవర్టు ఘాటు నుండి క్రిందికి వచ్చుచున్నప్పుడు అతని కారును అటకాయించి పంజాతో కొట్టినది. అతడెట్లో తప్పించుకొని బయటపడెను. ఘాటు వెంబడి ఆహారము మొదలగునవి రాత్రిపూట సరఫరా చేయుట ప్రమాదకరము. పగలే రక్షణ నిచ్చి వానిని పంపవలెను" అని వ్రాసెను.

పులి యొక్క ఆగడములు గురించి వినిన ప్రభుత్వ సేనానులు కలవరపడుటయు, శ్రీరామరాజు నాయకత్వమున విప్లవకారులు నిర్భయముగా రాత్రులందు సంచరించు టయు చూచిన మన్య ప్రజలలో రాజు యొక్క మంత్రశక్తిని గూర్చి వింత వింత వదంతులు వ్యాపించినవి. అతనికి అదృశ్య శక్తి కలదనియు, క్రూర మృగములను గూడ శాసించు శక్తి గలదనియు ప్రజలు నమ్మెడివారు. ఆ భీకరారణ్య ప్రాంతములో మన్యము బెబ్బులి యగు శ్రీరామరాజు ఆకస్మికముగా చేయు దాడులొకవైపు, క్రూరమృగముల వలన భీతి

మరియొకవైపు కలవరపెట్టుచుండ, ఏ క్షణమున ఎటు ఉండి ఏ ప్రమాదము ముంచుకొని వచ్చునోయని ప్రభుత్వ సేనానులు హడలి పోవుచుండిరి.

విశాఖపట్నము జిల్లా మేజిస్ట్రేట్ అగు సి.ఎ. హెండర్సన్ గవర్నరు అంతరంగిక కార్యదర్శి అగు ఇ.సి. స్మిత్‌కు మన్యం పరిస్థితులు తెల్పుచు 9-9-1922న ఇట్లు వ్రాసెను. "ఈ ప్రాంతమంతయు దట్టమైన పొదలతో, పుట్టలతో నిండి ఎచ్చటనైనను విప్లవకారులు దారికాచి కొట్టుటకు అనుకూలముగా ఉన్నది. రవాణా పనులు సులభముగాదు. దీనికి తోడు లమ్మసింగి, కృష్ణదేవిపేట పరిసరములలో నరభక్షకులైన రెండు మూడు పెద్ద పులులు తిరుగుచున్నవి. విప్లవకారులు రాత్రులందు మాత్రమే అతివేగముగా పోవుచు మన మోటారు వాహనములకు గూడ సాధ్యము కాని దూరములు ప్రయాణించుచున్నారు. వారు పోవుదారులు గూడ మనకు తెలియనివి, ప్రమాదభరితమైనవి. ప్రజలు గాని ముఠాదారులుగాని విప్లవకారుల సమాచారమందించుటలో ప్రభుత్వమునకు ఏమియు సాయపడుటలేదు. అయినను ఆందోళన పడనక్కరలేదు. త్వరలోనే ఈ తిరుగుబాటును అణచివేయుదుము."

ఈ విధముగానే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి 16-9-22న ఉత్తరము వ్రాయుచు అర్మిటేజి తమ అవస్థల నిట్లు విన్నవించుకొనెను. "మన్య ప్రాంత గ్రామములు అడవులలో అచ్చటచ్చట విసరివేయబడినట్లున్నవి. ఇచ్చటి ప్రజల నుండి సమాచారము సేకరించుట బహుకష్టసాధ్యముగా ఉన్నది. విప్లవకారుల యెడ సానుభూతి వలననో లేక వారు పిదప బాధింతురను భయము వలననో గాని ప్రజలెవ్వరును వారి ఆచూకి తెలియచేయరు. దట్టమైన అడవులలో పగలు దాగుకొనుచు, రాత్రులందు వేగముగా ప్రయాణము చేయుచు, అవసరమైనప్పుడు మార్గములో గల గ్రామముల నుండి ఆహారము మున్నగునవి సేకరించుకొనుచు నిలచినచోట నిలువక సంచరించుచున్న విప్లవకారుల దాగుడు మూతలు వారికన్ని విధముల అనుకూలముగా ఉన్నవి."

సెప్టెంబరు 13వ తేది మధ్యాహ్నము అడ్డాకుల ప్రాంతమున హ్యూం ఇద్దరు మనుష్యులను పట్టుకొనెను. వారిని సోదా చేయగా వారి చేతి సంచిలో ఒక ఉత్తరము దొరకినది. అది శ్రీరామరాజు తనకు తోడుగా యుద్ధములో చేరుమని తునిలో ఉన్న తన స్నేహితుడు పేరిచర్ల సూర్యనారాయణరాజుకు వ్రాసినది. అందు ఈ విధముగా వ్రాసెను., "సోదరా, యుద్ధము మొదలిడితిని. మనసేన నాలుగుచోట్ల బ్రిటిషు సేనను ఓడించినది. దైవానుగ్రహము వలన మనకు విజయము లభించినది. మన పూర్వ స్నేహమును పురస్కరించుకొని వెంటనే నా దగ్గరకు రమ్మని నీకు నా ప్రార్థన. బ్రిటిషు

వారికి మరణము ఆసన్నమైనది. ప్రతివాడు వాని కాలము, కర్మము పరిపక్వము చెందగానే ఎక్కడున్నను మరణించవలసినదే. ఎంత పోషించినను ఈ శరీరము ఎప్పుడో ఒకప్పుడు నశించవలసినదే. మనుష్యులు శాశ్వతముగాదు. కీర్త్యపకీర్తులు, పుణ్యపాపములు మాత్రము శాశ్వతములు. యుద్ధము చేయుట క్షత్రియ ధర్మము. "ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోన్యత్ క్షత్రియస్య నవిద్యతే" అని గీతావాక్యము. జయాపజయములు, సుఖ దుఃఖములు, శీతోష్ణములు మున్నగు ద్వంద్వ ప్రకృతుల యందు సమభావము కలిగి యున్నవాడు ముక్తిని బొందును. "హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీం' ' అని గదా భగవద్గీత బోధించుచున్నది. ఈ అంశములన్నిటిని జాగ్రత్తగా ఆలోచించి దేశ క్షేమమునకు యుద్ధము అనివార్యమని తలచియే ఈ యుద్ధము ప్రారంభించితిని. ఈ యుత్తరమందగానే నీవు నా యొద్దకు వచ్చెదవనియే గాఢముగా నమ్ముచున్నాను. నీతో మరి ఎవరైనను వచ్చుచో దయయుంచి తీసికొని రమ్ము. నీవు ఒకసారి ఇక్కడకు వచ్చి నా సన్నాహములు, ఏర్పాట్లు చూచిన తరువాత నీకు నచ్చకపోయినచో నీవు తిరిగి వెళ్ళిపోవచ్చును. మన పూర్వ స్నేహమును జ్ఞప్తికి తెచ్చుకొనవలెను. పేకేటి వారబ్బాయి కూడ ఉన్నచో తప్పక తీసికొని రమ్ము. మిత్రులందరికి నా అభివందనములు. ఇట్లు శ్రీ అల్లూరి శ్రీరామరాజు.[1]

కాని విధి వశమున ఈ లేఖ తునిలో నున్న సూర్యనారాయణ రాజునకు చేరకుండగనే ప్రభుత్వాధికారుల వశమైనది. పిదప పోలీసులు సూర్యనారాయణరాజును గృహ నిర్బంధములో నుంచిరి. తరువాత కృష్ణదేవి పేట జైలులో పెట్టి 15 రోజుల పాటు చాల హింసించిరి. "నా శరీరము అంతయు ముక్కలు ముక్కలుగా చీల్చినను నా వలన మీరేమియు తెలిసికొనలేరు" అని సూర్యనారాయణరాజు చెప్పెను. కోర్టులో విచారణ చేసి ఆయనకు 6 మాసములు శిక్ష, రు. 100లు జరిమానా విధించిరి.[2]

ఈ ఉత్తరమందు అసందర్భ ప్రలాపముగాని, అర్థరహిత భావములు గాని మనకు కన్పించవు. శ్రీరామరాజు యొక్క అనాసక్తతయు, స్వాతంత్ర్య పిపాసయు, నిస్స్వార్థ దేశభక్తియు, నిరంతరావేదనయు, స్థిర విశ్వాసము మాత్రమే ఇందు గోచరించును. కాని భారతీయతత్వ మెరుగనట్టి, భగవద్గీత పేరైనను విననట్టి బ్రిటిషు పోలీసు ఉద్యోగికి అవి ఎట్లు తెలియును? మన్యసీమలో యుద్ధ చర్యల పర్యవేక్షణాధికారియగు హాపెల్‌కు ఆ లేఖ అయోమయముగాను, పిచ్చివాని వ్రాతవలెను తోచెను. ప్రభుత్వమునకు తాను పంపిన నివేదికలో దీనిని గురించి ఇట్లు వ్రాసెను. "ఈ తిరుగుబాటును లేవదీయుటలో రాజు యొక్క లక్ష్యము ప్రభుత్వాధికారులచే హింసింపబడుచున్న గిరిజనుల ఉద్ధరణగా

పైకి కనబడును. కాని వారెవ్వరును పై అధికారులకు ఎట్టి ఫిర్యాదు చేయలేదు. తుని రాజులకు వ్రాసిన లేఖ హ్యూమ్ వశపరచుకొనినాడు. మానసికారోగ్యముగల వాడెవ్వడును అటువంటి ఉత్తరము వ్రాసి యుండడు. మనస్సు వశము తప్పి పిచ్చి పట్టబోవు వ్యక్తి యొక్క మనస్థితిని అది సూచించుచున్నది. బ్రిటిష్ వారికి చెందు దేనిపట్లనైనను విస్ఫారణముగా ద్వేషము వహించు ఉన్మాది ఈ రాజు అని దానివలన స్పష్టమగుచున్నది. హాస్యాస్పదముగా తోచినను రాజు యొక్క పరమలక్ష్యమును, పేరాసయు గూడెం పర్వత ప్రాంతమునకు తనను రాజుగా నొనర్చు కొనుటయే[13] అని హూపెల్ శ్రీరామరాజును పిచ్చివానిగా జమకట్టి అవహేళన చేయుచు వ్రాసెను.

# 17. దేవీపూజ

1922 సెప్టెంబరు 21వ తేదీని (భాద్రపద బహుళ అమావాస్యనాడు) గూడెము దగ్గరనున్న గాలి కొండలపై శ్రీరామరాజు కాళీపూజ జరుపుటకు సన్నాహము చేయుచుండెను. ఈ వార్త మన్య సీమలోని ప్రజలను ఆనందమును ముంచెత్తినది. దురాలోచనయేగాని, దూరాలోచన చేయని ప్రభుత్వ దళాధినేతలకు తమ విజయోత్సవమున మునిగి పూజ సన్నాహములలో అదమరచియున్న విప్లవ వీరులను వారి నాయకునితోపాటు సులభముగా చుట్టుముట్టి పట్టుకొనవచ్చునని తట్టినది. ఆ సమయమున సాండర్సు, టాల్బట్‌లు కోరాపుట్‌రిజర్వు దళముతో పెదవలస గ్రామమున బస చేసి యుండిరి. దేవీపూజ వార్త అందినతోడనే సాండర్సు గూడెం పోవుటకును టాల్బట్ పెదవలసలో పర్యవేక్షకుడిగా నుండుటకును నిశ్చయింపబడెను. సాండర్సు కొంత బలముతో 17వ తేదీని గూడెంకు బయలుదేరెను.

దూరదృష్టియగు శ్రీరామరాజు ప్రభుత్వ సైనికుల గమనములను పసికట్టుచునే యుండెను. వారి యత్నములను విఫలము చేయుటకు యుక్తులను పన్నుచుండెను. 18వ తేదీని పెదవలసలో టాల్బట్ పర్యవేక్షణలోని సైనికులు వంటల హడావిడిలో నుండగా విప్లవకారులు వారిని హఠాత్తుగా చుట్టుముట్టి బెదరగొట్టిరి. టాల్బట్‌కు దిక్కు తోచలేదు. పిదప ముందే చేసికొనిన ఏర్పాటు ప్రకారము ఒక వేగులవాని ద్వారా పెదవలస శిబిరము అపాయ స్థితిలో నున్నదను వార్తను గూడెం వైపునకు పయనించుచున్న సాండర్సుకు తెలియజేయబడెను. ఈ దుర్వార్త విని అతడుకలవరపాటు చెందెను. ముందునకు పోవుటకు మనసొప్పక టాల్బట్‌ను రక్షింపవలెనని సైన్యముతో అతడు వెనుదిరిగి పెదవలస చేరుకొనెను. అప్పటికే అచ్చటి సైనిక శిబిరము అల్లకల్లోలముగా ఉండెను. ఒంజేరిలో బ్రైమెన్ హీర్ పరాభూతుడైన కొలది దినములకే ఈ దాడిలో గూడ విప్లవకారులు విజయము పొందుటతో ప్రభుత్వ సేనానులు ఏమియు తోచక నిశ్చేష్టులైరి. సామాన్య సైనికుల మనస్సులను భీతి ఆవరించినది.

తాము నిశ్చయించుకొనిన ప్రకారము సెప్టెంబరు 21వ తేదీని విప్లవ వీరులు కాళీపూజను నిర్విఘ్నముగా జరుపుకొనిరి. విజయలక్ష్మి మరియొక మారు విప్లవ సారథియగు శ్రీ రామరాజును వరించినది.

# 18. స్కాట్ కవర్డు, హైటరుల దుర్మరణము

ప్రభుత్వము పరాజయ పరంపర నెదుర్కొనవలసి వచ్చినది. పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్, ఏజన్సీ కమిషనరు నర్సీపట్నములో మకాము చేసిరి. చింతపల్లిలో ఉన్న డిప్యూటీ ఇన్‌స్పెక్టరు జనరల్ పర్యవేక్షణ క్రింద ప్రభుత్వ బలగము పని చేయుటకు ఏర్పాట్లు గావింపబడినవి. అడ్డతీగలలో ఉవ్‌లింగ్; కొయ్యూరులో డానన్; కృష్ణదేవిపేటలో ఫోర్బెస్, కీనీలు; గొర్తెరులో హ్యామ్; పెదవలస, గూడెం, చింతపల్లి ప్రాంతములలో సాండర్సు, టాల్బట్, స్కాట్ కవర్డు, హైటరు, చాడ్విక్‌లు; లమ్మ సింగిలో మార్టిన్, నియమింపబడిరి. ప్రతి సేనాని క్రింద 30 లేక 40 మంది సైనికులు పని చేయుదురు. వీరందరును చాల అనుభవము గలవారే.

జిల్లా అధికారులు పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ ప్రభుత్వమునకు నివేదికలు పంపుచునే యుండిరి. ప్రతిదినము ఏదో ఒక అపజయమును గూర్చిన వార్తయే మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చేరుచుండెను. ఈ నివేదికల వలన ప్రభుత్వమునకు పోలీసుల యందే నమ్మకము పోయినది. అందుచేతనే ప్రధాన కార్యదర్శి గ్రాహం సెప్టెంబరు 16వ తేదీని ఒక నోట్‌లో ఇట్లు వ్రాసెను. "పోలీసుల నుండి వాస్తవ విషయములు మనకు ఎన్నడునురావు. రాజు పట్టుబడిన తరువాత అతని నుండి మాత్రమే ఈ విషయములు మనము తెలిసికొనుటకు సాధ్యమగును".

ప్రభుత్వమునకు ధైర్యము సడలినట్లు దీనివలన మనకు స్పష్టమగుచున్నది. వారి యధికారుల మాటల యందే ప్రభుత్వమునకు నమ్మకము కుదురుట లేదు. పోలీసు స్టేషనులను గూడ రక్షించుకొనజాలని దుస్థితి వలన రవియస్తమించని బ్రిటిష సామ్రాజ్యాధినేతలకు తలవంపులు కలిగినవి. శ్వేతసేనానులు ఎట్లయినను విప్లవ కారులను వేటాడి పట్టుకొని తమ పరువు నిలుపుకొనుటకు వ్యూహములు పన్నుటలో తలమున్కలగుచుండిరి.

సెప్టెంబరు 16వ తేదీ రాత్రి స్కాట్ కవర్డు, హైటరులు నర్సీ పట్నము నుండి నాగాపురము చేరుకొనిరి. ఒక గంట ముందే విప్లవకారులు అచ్చట నుండి మాయమైరి. కొయ్యూరు వరకు వెంబడించిరి గాని వారు దొరకలేదు. హైటరు కృష్ణదేవి పేట తిరిగి వెళ్ళెను. సార్జెంట్ స్టోన్ నాయకత్వమును బళ్ళారి ప్రత్యేక దళము రాజవొమ్మంగి

పంపబడెను. 17వ తేదీవి విప్లవకారులు పెదవలసకు 5 మైళ్ల దూరములో నున్న దొక్కలూరులో తప్పించుకొనిరి. 19వ తేదీని చింతపల్లి నుండి 7 మైళ్ల దూరములో నున్న సంకాడ గ్రామమున వారున్నట్లు తెలిసి కింగను అచ్చటికి పంపిరి. స్కాట్ కవర్టు, హైటరులు 20వ తేదీని చింతపల్లి చేరుకొనిరి. 21వ తేదీని సాండర్సు వారిని మరల దేవరపల్లి వద్ద కలిసికొనెను. ఎంత పట్టుదలతో కష్టపడి గాలించినను విప్లవకార్ఖుల ఆచూకి తెలియకపోవుటచే కవర్టు, హైటరులు చింతపల్లికి తిరిగిపోయిరి. కాని వెంటనే విప్లవకారుల సంచార వార్త అందుటచే వారిద్దరును దమనపల్లి వైపు హూటాహూటిని ప్రయాణమైరి.

సెప్టెంబరు 24వ తేదీని విప్లవ దళము ఆహార పదార్థముల కొరకు దమనపల్లి గ్రామమునకు వచ్చునని బ్రిటిష్ సైనికాధికారులకు తెలిసినది. అందుచే కవర్టు, హైటరులు కొంత సైన్యముతో అచటకు చేరుకొనిరి. ఈ రోజుతో విప్లవకారులకు భూమిపై నూకలు చెల్లినవని అనుకొనుచు వారిని తుదముట్టించుటకు కృతనిశ్చయులై కవర్టు హైటరులు ముందుకు పోసాగిరి. మధ్యాహ్నమయ్యెను. వారు నడచు మార్గమునకు రెండు ప్రక్కలను దట్టమగు అడవి కలదు. ఏటవాలు దారి వెంబడి నాలుగు మైళ్ళ దూరము వారల్లే పోయిరి. రంపులు గ్రామమునకు ఆవల మొగలిదొడ్డి ఘాటు వెంబడి చేతులలో పిస్తోళ్లు మెరయుచుండగా వారుపోసాగిరి. కొండలలో పొదలమాటున పొంచియుండి తుపాకులు బారుచేసి విప్లవవీరులు వారిని గమనించుచునే యుండిరి. అంతకు ముందే వారు దారి ప్రక్కనున్న కొండలపై బండరాళ్లు ఒక క్రమములో పేర్చి యుంచిరి. అనువగు స్థానములో నున్న ఒక రాయికి త్రాడుగట్టి లాగినచో అది కదలగానే దానినానుకొనియున్న మిగిలిన రాళ్ళన్నియు క్రిందికి ఒకదాని వెంబడి మరియొకటి దొర్లి క్రింద దారిపై బడును. ఆ దారిలోనున్న వారు వాని క్రిందబడి నలిగిపోవుదురు. ఇట్టి విద్యయందు గంటందొర మంచి ప్రవీణుడని చెప్పుదురు.

ముందు వెనుకల నల్లసైనికులు, మధ్య కవర్టు హైటరులు ప్రాణములు అరచేతిలోపెట్టుకొని ఆ మృత్యుగహ్వరములో నడుచుచుండిరి. గాముకొండకు, ధార కొండకు మధ్యగల లోయలోనికి వచ్చిరి. క్రింద లోతుగెడ్డ కాల్వ, పైన కొండ ఉన్నది. ఆంగ్ల సేనానులు అడుగుల చప్పుడు కూడ కానీక ఊపిరి బిగబట్టి అప్రమత్తులై అటునిటు పరిశీలించుచు మెల్లగా సాగుచుండిరి. ఇంతలో ఒక్కసారిగా కొండ లోయలు ప్రతిధ్వనించునట్లు పై నుండి బండరాళ్ళు ధడ ధడ మను శబ్దముతో క్రిందికి దొర్లింపబడి నవి. ఢప్ ఢమ్మని తుపాకులు ప్రేలినవి. తెల్లదొరలిద్దరును నేలగూలిరి. వీరితో బాటు మరి యిద్దరు నల్లవారు కూడ నేలకొఱిగిరి. వారి శవములు రక్తపు చేరులలో తేలినవి.

ప్రాణములతో మిగిలిన సైనికులు కకావికలైరి.

ఆనాటి ఈ పోరాటమును గురించి ఒంగోలు వాస్తవ్యులును, రిటైర్డు డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటును అగు శ్రీ జయరాం నాయుడు కొన్ని వివరములను ఈ క్రింది విధముగా తెలియజేసిరి.[1]

3-10-1922న విడుదల చేసిన ప్రభుత్వ ప్రకటనల వలన గూడ ఇంకను కొన్ని వివరములు తెలియుచున్నవి.

స్కాట్ కవర్టునకు ఒక మిరపకాయ టపా వచ్చినది.

"ప్రియమైన స్కాట్ కవర్టు,

మీరు నా కొనము గాలిస్తున్నట్లు, నాకు దగ్గరలో ఉన్నట్లు తెలియుచున్నది. ఇక్కడకు వచ్చి మాతో పోరాడుతారా? లేక మమ్ములను మీ వద్దకు రమ్మంటారా? పుట్టుకచే ఇంగ్లీషు వాడివి గనుక న్యాయమును వాస్తవమును తెలుపుము.

అల్లూరి శ్రీరామరాజు" అని.

దీనిని చూడగానే కవర్టు, హైటరులు విప్లవకారులను తాము పట్టుకొనినట్లుగానే భావించి మద్యమెక్కించి ఆనందముతో గంతులు వేసిరి. తమ వద్ద గల 303 తుపాకుల సహాయమున వారిని తుదముట్టించుట సులభమని తెల్లదొరలు తలచిరి. వెంటనే స్కాట్ కవర్టు రాజునకు జాబు పంపెను.

"ప్రియమైన రాజా,

నిజమైన భారతీయుడవైతే మాతో పోరాటమునకు అక్కడ ఆగవలెను. మేము రేపు ఉదయము 9 గంటలకు అక్కడకు వస్తాము.

స్కాట్ కవర్టు" అని.

పోలీసు దళము యుద్ధ స్థలమును చేరుటకు 6 మైళ్ళు నడచి పోవలెను. తెల్లవారుసరికి శ్రీరామరాజు, గంటందొర, మల్లుదొర, ఎండుపడాలు గోకిరి ఎర్రేసు మరి పదిమందితో ఘాటుదారికి సరిగాపైని కీలకస్థానములలో సర్దుకొని వేచియుండిరి. ఇద్దరు దొరల నాయకత్వమున 28 మంది సైనికులు నడచుచుండిరి. ఘాటుదారి ఇరుకుగా రాళ్ళతో నుండుటచే ఒకరి వెంబడి ఒకరు ఒకే వరుసలో నడువవలయును. ముందు నడచుచున్న 5 గురు జవానులు ఎట్టి అపాయము లేకుండగనే దాటిరి. విప్లవకారులలో

గోకిరి ఎఱ్ఱేసు గొప్ప విలుకాడు. ఇతడు 50 గజముల దూరమున నున్న అర్ధణాకాసును గూడ గురిచూచి బాణముతో కొట్టగల విలుకాడని ప్రసిద్ధి వహించెను. తెల్లసేనానులు సరిగా క్రిందికి రాగానే ఎఱ్ఱేసు స్కాట్ కవర్టును గురిచూచి కాల్చెను. గుండు అతని ఛాతిలోనికి సరాసరి దూసుకొని పోయినది. అతడు వెంటనే కూలి వాగులోనికి దొర్లిపోయెను. ఇంతలో హైటరు రైఫిల్‌ను ఎత్తి గురి చేయబోయెను. కాని ఎఱ్ఱేసు మరియొకసారి హైటరు ఎడమ కణతపై గురిచూచి కాల్చెను. కాని కవర్టు, హైటరులను ఎండపడాలు చంపెనని అచ్చటి ప్రజలు చెప్పుచున్నారు.[1]

(స్కాట్ కవర్టు హైటరుల శవములను నర్సీపట్నము తీసికొని వెళ్ళిన పిదప 26-9-22వ తేదీని జరిపించిన శవ పంచాయితీలలో స్కాట్ కవర్టుకు "కుడి భుజము మీద ఒక గుండు దెబ్బ, అది ఎడమ ఛాతీ గుండా వచ్చినట్లు, ఎడమ ఛాతీపైని ఒక గుండు దెబ్బ ఉన్నవి" అనియు; హైటరుకు ఎడమ శిరము మీద ఒక గుండు దెబ్బయున్నది' అనియు ఉన్నవి.)

బళ్ళారి దళమునకు చెందిన ఒక ముస్లిం హెడ్ కానిస్టేబుల్ హైటరు పడిపోకుండ పట్టుకొనుటకు ప్రయత్నించెను. ఇంతలో రాజు కేక వినిపించెను. "ఇంగ్లీషు వానిని ముట్టుకోకు. వాని గతికి వానిని విడిచిపెట్టు లేదా నీకును వాని గతి పడుతుంది" అని. ఆ హెడ్ కానిస్టేబుల్ హైటరును వదలలేదు. వెంటనే అతడును మరియొక తుపాకి కాల్పుతో కూల్చబడెను. తక్కిన సైనికులు కకావికలై పారిపోయిరి. ఈ గందరగోళములో ఇద్దరు పోలీసులు విప్లవకారుల వశమైరి. వారి వద్ద 303 తుపాకులు రెండు గలవు. రాజు ఈ పోలీసులను తమ వశములో నుంచుకొని భోజన సదుపాయములు చేసి మర్యాదగా చూచి వారి నుండి 303 తుపాకులు కాల్చు పద్ధతిని నేర్చుకొనెను. ఈ పోరాటమున స్కాట్ కవర్టు హైటరుల తుపాకులు, స్కాట్ కవర్టు క్రాస్ బెల్టు, రాజు వశమయ్యెను. అప్పటి నుండి రాజు క్రాస్ బెల్టు ధరింపసాగెను. కాని "ఆ సైనికాధికారులను చంపునప్పుడు శ్రీరామరాజు గారు తపో దీక్షలో నున్నారు. వారికి తెలియదు" అని చిటికెల భాస్కరుడు చెప్పెను. ఇది ఎంత వరకు నిజమో తెలియదు.

పారిపోవుచున్న మిగిలిన పోలీసుదళము కొండల దిగువనున్న పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ అగు ఆర్మిటేజి, కీనును చూచిరి. ఆర్మిటేజికి అభిమానపాత్రుడు స్కాట్ కవర్టు ఇతని మరణమునకు ఆర్మిటేజి దుఃఖించెను. ఈ మరణములకు కారకులగు సీతారామరాజులపై కసి తీర్చుకొనుటకు అతడు మదరాసు నుండి నర్సీపట్నములో వాలెను. కృష్ణదేవి పేట చేరి 100 రైఫిల్సుతో మొగల్ దొడ్డి ఘాటు వద్దకు బయలుదేరెను. అతనితో

అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్ అగు కీన్ కూడా ఉండెను. తిరుగుబాటు దారులతో పోరిపైనను మృతకళేబరములను తెచ్చుటకు వారు ప్రయత్నించిరి. ఆ చోటికి పోవలెననిన మూడు కొండలను దాటవలెను. ఆ మూడు కొండల శిఖరములపైనను రాజు అనుచరులలోని వీరులను కాపు పెట్టెను. ఆర్మిటేజి అంతాడ ఘాటువద్ద ముక్కోణ ప్రాంతమునకు చేరెను. కొండ శిఖరములపై నుండి విప్లవకారులు తుపాకులు కాల్చిరి. ఒక సైనికుడు చచ్చెను. ఒక గుండు ఆర్మిటేజి టోపీకి తగిలి దూసికొని పోయెను. పిదప సైనికులలో ఎవ్వరును ఆ శవములను సమీపించుటకు సాహసించనైరి. అపాయకర పరిస్థితులను గ్రహించి వెంటనే ఆర్మిటేజి తన బలగముతో వెనుదిరిగి రిక్తహస్తములతో కృష్ణదేవిపేట చేరుకొనెను. మరునాడు స్టీవర్టు వచ్చెను. పోరాటమును గురించి వినెను. కాని అతడును సాహసించజాలకపోయెను. శవములను తెచ్చుటకు రాజు నొద్దకు మధ్యవర్తులను పంపి ప్రాధేయపడిరి. 500 జరిమానాగ చెల్లించబడిన తరువాత మృతకళేబరములను తీసికొని పోవుటకు రాజు అంగీకరించి పోరాటమును విరమించెను. ఆ సొమ్ము చెల్లించి శవములను గ్రామస్థులచే తెప్పించి నర్సీపట్నము శివార్లలో 26వ తేదీ ఉదయాన వానిని పూడ్చి వానిపై సమాధులు నిర్మించిరి.

3-10-1922 తేదీని ప్రభుత్వము ఈ పోరాటమును గురించి చేసిన ప్రకటనలో కవర్డు, హైటరులను ఇట్లు ప్రశంసించినది. "స్కాట్ కవర్డు అతి శక్తిమంతుడైన అధికారి. మన్య ప్రాంతములను గురించి అతనికి విశేష జ్ఞానము గలదు. విప్లవకారులను వెంటాడుటలో చాలా చొరవ చూపెను. హైటరు తాత్కాలిక పోలీసు సూపరింటెండెంటు. అతడు మొదట మలబారులో నియమింపబడి సమర్థుడైన ఉద్యోగిగా పేరు పొందెను. యుద్ధము ప్రారంభములో సైన్యములో చేరి 1914లో ఏడెన్‌లోను, 1916-17లలో వాయువ్య సరిహద్దు రాష్ట్రములలోను, 1919లో ఆఫ్ఘన్ యుద్ధ మందును పాల్గొనెను. అట్టి సమర్థులైన ఈ యిద్దరి మరణము అతి విషాదకరము."

అమాయికులగు మన్యం ప్రజలను అడవి మృగములవలె కాల్చి చంపతలపెట్టిన ఈ తెల్లదొరలు తుదకు తామే నేలగూలిరి. నాటి ప్రభుత్వము వారికి నర్సీపట్నమున గోరీలు కట్టించి వారి ప్రభుత్వ భక్తికి కృతజ్ఞత వెల్లడించినది. ఆ సమాధులే నేటికిని శ్రీరామరాజు వీర కృత్యములకు ప్రజల సాక్ష్యములుగా నిలిచియున్నవి. వారి సమాధులపై వారి జ్ఞాపక చిహ్నములు ఇట్లు చెక్కబడెను.

"Pray for the soul of Christopher William Scott-Coward, Asst. Supdt, Indian Police, born 29th May 1895, who was killed in ambush on the

Damanapalli Ghaut on 24th September 1922 during the rebellion in the Gudem hills. He was a renowned shikari and a fine leader of men. R.I.P. This memorial has been erected by his brother officers.[1]

("1895 మే 29వ తేదీని పుట్టి గూడెం కొండలలో తిరుగుబాటుసమయమున 1922 సెప్టెంబరు 24వ తేదీన దమనపల్లి ఘాటు వద్ద మాటుకాచి చంపబడినట్టి ఇండియా పోలీసు శాఖలో అసిస్టెంటు సూపరింటెండెంటు అగు క్రిష్టొఫర్ విలియం స్కాట్ కవర్ట్ యొక్క ఆత్మ కొరకు ప్రార్థించుడు. అతడు ప్రసిద్ధుడైన వేటకాడును, సమర్థుడైన మానవ నాయకుడును. అతని ఆత్మకు శాంతి కలుగుగాక.")

In memory of Lionell Neville Hayter, eldest son of Harry Hayter of Wallington, Surrey, who was killed in ambush on the Damana palli Ghaut on 24th September 1922, during the rebellion in the gudem Hills. He was born on 11th September 1890 and after having served in the British and Indian armies from 1914 to 1920 was serving temporarily as an Asst. superintendent in the Indian Police." This memorial has been erected by his brother officers.[2]

("గూడెం కొండలలో తిరుగుబాటుసమయమున 1922 సెప్టెంబరు 24 తేదీని దమనపల్లి ఘాటు వద్ద మాటు కాచి చంపబడినట్టియు, సర్రే రాష్ట్రములో వాలింగటన్ నివాసియైన హారీ హైటరు యొక్క జ్యేష్ఠ పుత్రుడును అగు లయొనెల్ నెవిల్ హైటరు జ్ఞాపకార్థము. అతడు 1890 సెప్టెంబరు 11 తేదీని పుట్టి 1914 నుండి 1920 వరకు బ్రిటిష్ మరియు ఇండియా సైన్యములలో పనిచేసి, ఇండియా పోలీసు శాఖలో అసిస్టెంటు సూపరింటెండెంటుగా తాత్కాలికముగా పనిచేయు చుండెను.")

నర్సీపట్నమున తెల్లదొరల స్మారక చిహ్నములు వెలసినవి. కాని వారి ప్రక్క ఒకే రణరంగమున మడిసిన భారతీయులైన సైనికులకు స్థానము లేకపోయినది. ఆ సమాధులు ఆంగ్లరాజ భక్తికి, ఆత్మ త్యాగమునకు ప్రతీకలుగా నాటి ప్రభుత్వము వెలకొల్పి సంతృప్తినందినది. దానినే నేడు స్వతంత్ర భారతీయుడు స్వాతంత్ర్య దీపకళికను జాజ్వల్యమానముగా నొనరించిన భారత యోధుల దేశభక్తికి, వీరత్వమునకు చిహ్నముగా గుర్తించి మన్యము వీరులకు జోహారులర్పించుచున్నారు. విప్లవ నాయకుడగు శ్రీరామ రాజునకు ఇంద్రజాలిక శక్తులు గలవనియు, మేఘ యుద్ధమున అతడు అసమానుడ నియు వార్తలు దేశమును వ్యాపించెను.

ఈ పోరాటములో ఆరు 303 రైఫిల్సు, 300 తూటాలు, కవర్లు హైటరుల "ఆటోమేటిక్ పిస్తోళ్ళు"తో పాటు ప్రభుత్వ సేనాముల ధైర్యము గూడ విప్లవకారుల వశమైనది.

ఈ ఘోరపరాజయము తరువాత పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ దారుణమైన విప్లవకారులను వశపరచుకొనుట రిజర్వు పోలీసులకు అసాధ్యమనియు, వారిని అరికట్టుటకు అడవి యుద్ధములలో ఆరితేరిన సైన్యము అత్యవసరమని ప్రభుత్వమునకు విన్నవించెను.

# 19. ప్రభుత్వ సన్నాహములు

ఎన్నియో యుద్ధములలో పాల్గొని ఆరితేరిన కవర్టు, హైటరుల మరణముతో విప్లవకారుల శక్తి వెల్లడియైనది. పోలీసు ఇన్‌స్పెక్టరు జనరలు గూడ విప్లవము నణచుటకు పోలీసు బలము చాలదనియు, రాజు తెలివితేటల ముందు వారునిస్సహాయులన్నియు, అరణ్యములోయుద్ధము చేయుటయందు ప్రవీణులైన సైనికులుకావలెననియు వ్రాయుటచే ప్రభుత్వము మిక్కిలి ఆందోళన చెందినది. మలబారు స్పెషలు పోలీసులను ఏజన్సీకి పంపుటకు ప్రభుత్వము నిశ్చయించినది. ఈ స్పెషల్ పోలీసులు అంతకు ముందు సంవత్సరమున మలబారులో చెలరేగిన మాప్పిల్లా తిరుగుబాటును అణచివేయుట యందు పొందిన శిక్షణ, అనుభవము, ఏజన్సీలోని దుర్గమారణ్యములలో జరుగు యుద్ధమునకు పనికి వచ్చునని ప్రభుత్వము తలచినది. మదరాసులో పోలీసు డిప్యూటీ కమీషనరుగా నుండిన A.J. హాపెల్‌ను ఏజన్సీ పోలీసు బలగమునంతకును అధిపతిగా నియమించిరి. అతడు ఏజన్సీ ప్రాంత పరిస్థితులను బాగుగా ఎఱిగినవాడు.

మదరాసు రాష్ట్ర ప్రభుత్వ హోం సభ్యుడు సర్ ఆర్థర్ నాప్ సెప్టెంబరు 30వ తేదీని వచ్చి అధికారులతో చర్చలు జరిపి రెండు పటాలముల మలబారుస్పెషల్ పోలీసులను రప్పించి హాపెల్‌కు "ఏజన్సీ ఆపరేషన్స్ కమాండర్" అను హోదానిచ్చి అతని అధీనమున బెట్టెను. హాపెల్ అక్టోబరు 1వ తేదీని ఛార్జి తీసికొనెను. రాజు అనిన మన్యం ప్రజలలో ఎంతయో గౌరవాభిమానములు పెరిగి పోయినవనియు, విప్లవకారుల ఆచూకి తెలిసికొనుట చాల కష్టమనియు అతడు గ్రహించెను. అందుచే గూఢచారిదళము, సరఫరా, రవాణా, వైద్యదళము మొదలగునవి సమర్థముగా పని చేయునట్లు ఏర్పాట్లు గావించెను. పిదప తక్కిన అధికారులతో సంప్రదించి వ్యూహములు పన్నెను., ఒక సార్జెంటు, 5గురు హెడ్‌కానిస్టేబిల్లు, 50 కానిస్టేబిల్స్ ఉన్న దళములు ఒక్కొక్క దానితో ఘాటుల ఎగువను, లమ్మసింగిలో మార్టిన్, చింతపల్లిలో చాడ్విక్, పెదవలసలో హ్యూంల పర్యవేక్షణలోను; ఘాటుల దిగువను కృష్ణదేవి పేటలో కీన్, శరభన్న పాలెంలో ఫోర్బ్స్, గొలుగొండలో కీరన్స్ నాయకత్వములలోను ఉండునట్లు నియమించెను. ఇట్లు ఆరుగురు బ్రిటిష్ ఆఫీసర్లు, ఆరుగురు సార్జెంట్లు, 28 మంది హెడ్ కానిస్టేబుల్లు, 280 మంది జవానులతో దళములు ఏర్పరుపబడెను. జాన్ నర్సీపట్నములో నుండును. స్వీని ఘాటుల దిగువను, సాండర్సు ఘాటుల ఎగువను పర్యవేక్షించుచుండురు. కొంతమంది సబ్ ఇనస్పెక్టరులతో అబ్దుల్ అజీజు, నిత్యానంద పట్నాయకు అను ఇనస్పెక్టరులు స్వీనేకు, పధి అను

ఇనస్పెక్టరు సాండర్సుకు సహాయకులుగా నుందురు. మలబారు స్పెషల్ పోలీసుల 2 పటాలములలో ఒకటి స్వీనే ఆధీనములోను, రెండవది సాండర్సు ఆధీనములోను ఉండును.

మదరాసు నుండి మిలటరీ అధికారులు ఎప్పటికప్పుడు పూనాలోని దక్షిణ ప్రాంత సైనిక కార్యాలయమునకు పరిస్థితిని గురించి వార్తలు పంపించుచుండిరి. వైర్‌లెస్ ట్రాన్స్ మీటరుల సహాయమున విప్లవకారుల గమనములను గురించిన వార్తలను ఎప్పటికప్పుడు వివిధ శిబిరములకు పంపించు ఏర్పాట్లు చేయబడినవి. అడవిదారులలో ఉపయోగించుటకు కంచర గాడిదలను, జయపురపు రాజా నుండి ఏనుగులను సేకరించిరి. సైనికులకు తక్షణ వైద్య సదుపాయములు కలిగించుటకు నర్సీపట్నములో వైద్యశాల ఏర్పాటు చేయబడెను. ఎప్పటికప్పుడు సమాచారము సేకరించి చేరవేయుటకు గూఢ చారులు నియమింపబడిరి.

విప్లవకారులు తెల్లదొరల మీదనే పగబట్టుటచే తగు రక్షక దళములేని తెల్లదొరలు బయటకు పోరాదని ఉత్తరువులీయబడెను. పితూరీదారులను, పితూరికి తోడ్పడిన వారిని, పితూరిని అణచుటకు సాయపడని వారిని వెనువెంటనే విచారించి శిక్షించుటకు వాల్తేరులో అడిషనల్ సెషన్సు జడ్జిగా ఎల్.హెచ్. అరంటును నియమించిరి.

విప్లవకారులకు తోడ్పడు మన్యం ప్రజలపై అన్ని రకముల ఒత్తిడులు తేబడినవి. విప్లవకారుల జాబితా నొకదానిని తయారు చేసి వారిలోని వారెవ్వరికిని ధనవస్తు రూపముననను, మరేవిధముగను ప్రజలు సహాయపడరాదని ప్రతి గ్రామమందును ప్రకటింపబడెను. విప్లవకారులకు భోజనము పెట్టినగాని, వసతినిచ్చినగాని అట్టివారు కఠినముగా శిక్షింపబడుదురు. గ్రామస్థులు ఈ నియమములను అతిక్రమించినచో అదనపు పోలీసు సిబ్బంది నెలకొల్పబడుననియు, దానికగు ఖర్చు ఆ గ్రామమే సామూహికముగా భరించవలెననియు ప్రకటింపబడెను. ఇక ముఠాదారులు విప్లవకారుల ఆచూకీ తీసి సమాచారమును పోలీసు స్టేషనులకు తెలుపవలెను. అట్లు సహకరించని ముఠాదారుల ఆస్తులను వశపరచుకొని వారిపై కేసులు పెట్టవలెనని ఆజ్ఞలు జారీ చేయబడెను. దీనితో గ్రామస్థులపై కేసులు పెట్టి వారిని వాల్తేరు తీసికొనిపోయి న్యాయస్థానములలో విచారణకు పెట్టుట పోలీసులకు నిత్యకృత్యములైనవి. ఈ విధముగా ప్రభుత్వ ప్రతీకారయత్నములు ప్రారంభమయ్యెను.

# 20. అడ్డతీగల ముట్టడి

అడ్డతీగలపై జరిపిన దాడి అద్భుతము, అత్యంత సాహసోపేతము. ఇది ముందే తెలియపరచి చేసిన దాడి. 1922 అక్టోబరు 2వ తేదీని కృష్ణదేవి పేట నుండి చింతపల్లి తపాలును తీసికొని వెళ్ళు ఇద్దరు పోలీసు జవానులు రంపులు వద్ద విప్లవకారుల కంటబడిరి. వారు ఆ ఉత్తరములు పోలీసుల వద్ద నుండి స్వాధీనపరచుకొనిరి. పిదప తూరుమామిడి, లక్కవరపు పేట గ్రామములు సెప్టెంబరు 28, 29 తేదీలలో కొల్లగొట్టబడెననియు, రంపులు గ్రామ మునసబు ఇల్లు అక్టోబరు 3 తేదీని దోచుకొనబడెననియు 6వ తేదీని పోలీసులకు వార్త అందినది. గూడెము ముఠాదారు సాయముతో అప్పటి స్కూలు మాస్టరు లచ్చుమయ్య నలుగురు విప్లవ కారులను పట్టుకొని ప్రభుత్వమునకు అప్పగించెను.

7వ తేదీని ప్రభుత్వ గూఢచారి సబిన్‌స్పెక్టరు కామయ్య తూరు మామిడి, లక్కవరపు పేటల వద్ద విప్లవ కారులను గురించి ఆరా తీయుచుండగా, విప్లవకారులు అతనిని బంధించి దావరాతిపాలెము దిగ్గన ఘాట్‌లో మకాము చేసియున్న శ్రీరామరాజు వద్దకు తీసికొనిపోయిరి. రాజు అతనిని మందలించి నీతులు గఱపి విడిచిపెట్టెను. ప్రభుతోద్యోగులగు సబిన్‌స్పెక్టరులను పోలీసు జవానులను విప్లవకారులు అనేక పర్యాయములు బంధించినను శ్రీరామరాజు వారికి ఏ విధమైన హానియు చేయక, తమ పనికి భంగము వాటిల్లకుండ వారిని కాపలాలో నుంచి ఆహారాదుల నొసగి, పిదప తమ పనులు పూర్తికాగానే విడుదల చేసి గౌరవముగా సాగనంపుచుండువాడు. తనకెంత యపకారము చేసినను, చేయు తలంపుకల్గెనని వినినను శ్రీరామరాజు అట్టివారితో గూడ ఎప్పుడును దూషణ సంభాషణ చేయక తనచేజిక్కిన వారికి నీతులు బోధించి పంపుచుండెడివాడు.

సాండర్సు, కింగ్, కోల్‌బ్రూకులు పెద్దవలస, చింతపల్లి శిబిరములను స్థాపించుటకును; స్విన్, కీన్, ఫోర్బ్సులు కృష్ణాదేవిపేట, గొలుగొండ, శరభన్నపాలెము శిబిరములను స్థాపించి స్థిరపరచుటకును నిశ్చయింపబడినది.

అక్టోబరు 8వ తేదీని విప్లవకారులు ఆహార పదార్థముల కొరకు శరభవరము వచ్చిరనియు, పిదప వారిలో ఒక జట్టు శ్రీరామరాజు నాయకత్వమున దేవరపల్లిని

దోచుకొనిరనియు, ఇంకొక జట్టు గంటందొర నాయకత్వమున కొడిసింగికి వెళ్ళి అక్కడి నుండి మరల దేవరపల్లిలో రాజును కలిసికొని, ఆ రాత్రికి అక్కడ మకాము చేసి మరునాడు చింతపల్లికి మూడు మైళ్ల దూరములో నున్న లింతాడ చేరిరనియు వార్త వచ్చెను. ఆ సమయముననే చింతపల్లిలో నున్న చార్విక్‌కు యుద్ధమునకు రమ్మని శ్రీరామరాజు వార్త పంపెను. కాని అతని నెదుర్కొనుటకు చార్విక్‌కు ధైర్యము చాలదయ్యెను.

భేతాళ పూజ చేయుటకు విప్లవ కారులు 9 తేదీని గూడెము బంగళాలో ఆగిరని చింతపల్లి నుండి 12 వ తేదీకి ధారకొండ చేరి అచ్చట రహదారి బంగళాలో మకాము చేసి ముఠాదారు నుండి ఆహార పదార్థములు సేకరించిరి. వారి మాటల వలన వారు గుర్తేడు, అడ్డతీగల, రంపచోడవరముల వైపుపోయి పాపికొండల మీదుగా బస్తరు పోదురని తెలిసెను. అచ్చట నుండి పెద్ద సైన్యములతో తిరిగివచ్చి స్వరాజ్యమును స్థాపించగలరని తలచుచున్నట్లు హోపెల్ 15-10-1922 రిపోర్టులో వ్రాసెను. విప్లవ కారులు రామవరము వైపు వచ్చుచున్నారనియు, అడ్డతీగల పై ఏ క్షణముననైనను దాడి జరుగవచ్చుననియు అడ్డతీగల తహసీల్దారు తంతివార్త పంపెను. గోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అగు దాసన్ అడ్డతీగలకు బయలుదేరెను. అప్పుడు అడ్డతీగలలో నున్న ప్రభుత్వం బలగము ఇనస్పెక్టరు పెర్లాకి పర్య వేక్షణలో నుండెను. స్టేషనులో నున్న మామూలు సిబ్బందికి తోడు ఇనస్పెక్టరు ఉప్లింగు 20మంది సైనికులతో కాపలా ఉండగా రాజు తాను అడ్డతీగల దోచుకొనగలనని భావించనచో అది ఆశ్చర్యకరమైన విషయమనియు, అట్లు రాజు సాహసింప జాలడనియు ఏజెన్సీ కమీషనరు స్టీవర్టు నర్సీపట్నము నుండి 16 తేదీని ప్రభుత్వమునకు ధైర్యముగా ఆత్మ విశ్వాసముతో నివేదిక పంపెను.

16 వ తేదీని దాసన్ పెద్దాపురము నుండి ఒక తంతి వార్తను పంపెను. తానును, గోదావరిజిల్లా మేజిస్ట్రేటు అగు బ్రాకెన్ కారులో ఏలేశ్వరము వెళ్ళుచుండగా విప్లకారులు అడ్డతీగలకు రెండు మైళ్ళ దూరములో నున్నారని ఉదయము 7 గంటలకు సమాచారము అందినది. అప్పుడు జిల్లా మేజిస్ట్రేట్ ఏలేశ్వరమునకును, దాసన్ వెనుదిరిగి హుటాహుటిన ఇంకను ఎక్కువ మంది సిబ్బంది, రవాణాల కొరకు కాకినాడకునుపోయిరి. విప్లవకారులను బంధించుటకు హడావిడి అంతయు చేసిరి. కాని జరుగవలసినది జరిగిపోయినది. 16వ తేదీని అడ్డతీగల పోలీసు స్టేషనుపై దాడి జరగనే జరిగింది. ఆ విషయమును దాసన్ తంతి ద్వారా హోపెల్‌కు తెలిపెను. ఆ దాడిని గురించి మాటలలోనే విందము.

"విప్లవకారులు 13 వ తేదీని గుర్తేడులో నుండిరనియు, అడ్డతీగల వైపు వచ్చుచున్నారనియు అడ్డతీగల సబ్‌మేజిస్ట్రేట్ నుండి అక్టోబరు 15 వ తేదీ తెల్లవారు

జామున 4 గంటలకు నాకు తంతి వార్త వచ్చింది. అతడు రక్త గ్రహిణితో బాధపడుచుండెను. అయినను అతడు 'కాంపు' లోనున్న జిల్లా మేజిస్ట్రేట్ బ్రాకెన్‌ను కలిసికొనుటకు కారులో వెళ్ళెను. అదనపు సిబ్బంది కొరకు రాజమండ్రికి కూడా తంతి సందేశమంపెను. రాజానగరములో బ్రాకెన్‌ను కలిసికొని ఇద్దరును కారులో అడ్డతీగలకువెళ్ళిరి. అడ్డతీగలకు రెండు మైళ్ళలో విప్లవకారులున్నారని సమాచారమందెను. రాజమండ్రి నుండి సిబ్బందిరాగానే బ్రాకెన్ తిమ్మాపురమువైపు సాగిపోయి 16 వ తేదీ తెల్లవారు జామున 2 గంటలకు అచ్చుటకు జేరెను. అడ్డతీగలపై దాడి జరిగినదని అతనికి వార్త వచ్చింది. 16 తేదీ ఉదయము అతడు అడ్డతీగల ప్రయాణమైపోయెను. నేను కూడా కొంత సేపటికి అచ్చుటికి జేరితిని. బ్రాకెన్ పోలీసు స్టేషనులో నున్నాడు. అంతయు మరల ప్రశాంతముగా ఉండెను. 15 వ తేదీ రాత్రి 10 గంటలకు విప్లకారులు తమపై బడినారని సెర్గాకు తెలిసికొనెను. తన వద్ద ఆరుగురు జవాన్లు, ఒక హెడ్ కానిస్టేబుల్, పదిమంది రిజర్వు పోలీసులు మాత్రము ఉండిరి. జవానులు, ఇద్దరు రిజర్వు పోలీసులు వెంటనే పారిపోయారు. తెలివైవాడు గావున అతడు స్టేషను ఆవరణను దాటి కొంత దూరములోనున్న పొడుగాటి గడ్డిలో పరుండి అవకాశము కొరకు ఎదురు చూచుచుండెను. విపవకారులు 20 మంది ఉండిరి. తుపాకి కాల్చుట వలన లాభము లేదని తలచి అతడు గ్రామములోనికి బోయెను. విప్లవకారులు స్టేషనులోనికి 5 సార్లు తుపాకులు ప్రేల్చి, స్టేషనులో ఎవ్వరును లేకపోవుట చూచి గ్రామములోపలికిబోయిరి. సెర్గాకును, అతని సిబ్బందిని గ్రామస్థులు కనబడకుండ దాచిరి. పిదప బ్రాకెన్ వచ్చుచున్నాడని తెలిసికొని, రాజు మూడు మైళ్ళ దూరములో గల పైడిపుట్టవైపు పోయెను. ఉదయమే సెర్గాకు స్టేషనును మరల ఆక్రమించుకొనెను. 9 గంటలకు బ్రాకెన్, 11 గంటలకు నేనును అచ్చుటికి చేరితిమి, తుపాకులు గాని, తూటాలుగాని, ఖజానాగాని ఏమియుపోలేదు."

ఈ సంగతినే 17 వ తేదీని ఏలేశ్వరము తాలూకా మేజిస్ట్రేటు స్టీవర్టుకు తంతి వార్తను ఇట్లు పంపెను. "గత రాత్రి అడ్డతీగల లూటీచేయబడినది. పోలీసులు పారిపోయిరి. ఆయుధ సామాగ్రి ఏమియుపోలేదు. ఖజానా రక్షింపబడినది. తాలూకా ఆఫీసులోని సల్లమందు పెట్టె, భోషాణము బ్రద్దలు గొట్టబడినవి. ఏమియు పోలేదు. ఇద్దరు తాలూకా గుమాస్తాలు నిర్బంధింపబడిరి. రక్షింపబడిరి. విప్లకార్థులు చోడవరమువైపు వెళ్ళుచున్నారు." 'అడ్డతీగల సబిన్‌స్పెక్టరు పెద్దాపురము నుండి 18 వ తేదీ సాయంత్రము స్టీవర్టుకు ఇట్లు తంతినంపెను. 'గతరాత్రి శ్రీరామరాజు అడ్డతీగల స్టేషనును లూటీ చేసెను. మనుష్యుల్ని

లేకపోవుటచే ఏమియుపోలేదు. " దీని అర్థమేమియో ఏజెన్సీ కమిషనరుకు తెలియలేదు. అందుచే అట్టికుశల వార్తను పంపిన తెలివైన అధికారిపై అతడు చర్య తీసికొనదలచెను. ఈ దాడిలో తుపాకులు, మందుగుండి సామాను దొరకలేదు. కొంత నల్లమందు తీసికొని విప్లవకారులు వెళ్ళిపోయిరి.

విప్లకారుల వేగము అసమానమనియు, మూడురోజులలో ఆ దుర్గమారణ్య ప్రాంతములలో 70 మైళ్ళు ప్రయాణము చేసిరనియు, అంత తక్కువ కాలములో పైనుండి అదనపు సిబ్బందివచ్చి సహాయపడుట అసంభవమనియు, ఈ దాడిలో ఏమియు నష్టము జరుగకుండ దాటుట చాల అదృష్టమనియు హోపెల్ నివేదించెను.

శ్రీరామరాజు పైడిపుట్టలోగలడని అధికారులకు తెలియును,. కాని తమ సైన్యముతో వారు అచ్చటికిపోయి విప్లవకారులను బంధించుటకు ఎందుకు ప్రయత్నించలేదో వారికే తెలియవలెను. ఇంతకును అడ్డతీగలలో విప్లవకారులకు ఆయుధములు ఏమియు లభ్యము కాలేదని వారు సంతృప్తి నొందిరి. పిదప విప్లవకారులు చోడవరము చేరుచున్నట్లు వార్తలు వచ్చు చుండుటచే దానిని రక్షించుటకు సన్నాహములు చేయసాగిరి.

చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి స్టేషనులను మాత్రము విప్లవకాలులు హఠాత్తుగా దోచియుండిరి. కాని తరువాతి దాడులన్నింటని శ్రీరామరాజు ముందుగా ప్రభుత్వమునకు తెలియపరచియే జరిపించెను.

అడ్డతీగల దాడిని గురించి సదావర్తి ఆదినారాయణ అను పోలీసు గూఢచారి ద్వారా అధికారులు ముందే హెచ్చరింపబడిరి. అతడు పట్టుబడి నప్పుడు అతనితో శ్రీరామరాజు ఇట్లు చెప్పెనని తెలియుచున్నది. "నేనుపైడిపుట్టకు వెడతాను. అక్కడ పంచాంగము చూచి ముహూర్తము పెట్టి అడ్డతీగలకు గాని రంపచోడవరమునకుగాని వెడతాను. ఈ సంగతిని మీ అధికారులకు రిపోర్టు చెయ్యి." ఈ వార్త వినిన తహసీల్దారు మరల ఆదినారాయణను పైడిపుట్ట వెళ్ళి చూచి రమ్మనెను. అతడు పైడిపుట్ట వెళ్ళి రాజును కలువగా, అడ్డతీగల స్టేషనుపై తాను దాడి చేయగలనని రాజు అతని ద్వారానే కబురు పంపించెను. ఈ వార్త అధికారులకు పంపబడినది. అప్పటికే స్టేషనును రక్షించుచున్న పెర్లాకు బయట నుండి సైన్యములు తెప్పించుటకు ప్రయత్నము చేసెనుగాని అది నెరవేరలేదు. 15 వ తేదీ రాత్రి విప్లవకారుల తుపాకి మ్రోతలు విని పెర్లకు ప్రాణరక్షణకై దాగికొనెను.

ఈ దాడి సమయమున అక్కడ హెడ్‌కానిస్టేబులుగా పనిచేసి తరువాత సబిన్‌స్పెక్టరుగా రిటైర్ అయిన అద్దాల సుబ్బారావుగారు (నిడదవోలు) ఇట్లు తెలియపరచిరి.

"జిల్లా మేజిస్ట్రేటు అడ్డతీగలకు 5 మైళ్ళ దూరమున తిమ్మాపురములో మకాము చేసియుండెను. మా స్టేషనులోనున్న రిజర్వు పార్టీ ఇన్‌స్పెక్టరు స్టేషనులోనున్న మందుగుండు పెట్టెను జాగ్రత్త చేసికొనవలసినదిగా తహసీల్దారుకు కబురు చేసెను. కానివారు దానిని తీసికొని వెళ్ళలేదు. మమ్ములను ఆయుధములు, మందుగుండు తీసికొని మా యిష్టము వచ్చినచోట దాచుకొన వచ్చునని కబురుచేసినారు. ఇందుకు కారణము ఆయుధములు విప్లవకారుల వశము కాకుండ చేయుటయే. పోలీసు స్టేషను సిబ్బంది వారి కుటుంబములను ఏలేశ్వరము మొదలగు ప్రాంతములకు భయకంపితులై పంపివేసిరి. ఆనాటి ఆందోళన ఈనాడు వర్ణించుట కష్టతరము. మా ఇండ్ల తలుపులు బాహాటముగా తీసియుంచితిమి. రాజు గారు కబురు పంపిన టైముకు తనఅనుచరులతో వచ్చి ముందుగా స్టేషనుపై కాల్పులు సాగించిరి. స్టేషను పైకప్పు జింకు రేకులగుటవలన ఆ ధ్వనితో గ్రామమంతయు దద్దరిల్లిపోయింది. నేను స్టేషనుకు దగ్గరలో ఉన్న పూటకూళ్ళముసలమ్మ ఇంటిలో తూటాలు జాగ్రత్తగా పట్టుకొని దాగుకొని యుంటిని. భయాందోళన వలన నిద్ర పట్టలేదు. అనుచరులను నాలుగు రోడ్లమీద కాపలయుంచి శ్రీ సీతారామరాజు మరికొంత మంది అనుచరులతో స్టేషనులోనికి వెళ్ళెను. వారు ఊరిలోని ప్రజల మీదకు రానేలేదు. తెల్లవారు జామున మూడు గంటలవరకు స్టేషనులోనే యుండిరి. ఈలోపున జిల్లా మేజిస్ట్రేటు అడ్డతీగలలోనేమి జరుగుచున్నదో చూచి రావలసినదిగా నాకిరెడ్డి రుద్రయ్య అనునతనిని సైకిలుపై పంపెను. విప్లవకారులు అతనిని రాజు ఎదుట హాజరు పరిచిరి. 'రాజుగారు చెప్పిన టైముకు వచ్చినారనియు, రిజర్వు పార్టీ, ఇన్‌స్పెక్టరు మొదలైనవారు పారిపోయినారనియు, మీరు తిమ్మాపురములో ఉన్నట్లు తెలిసినదనియు, మీ రాకకు ఎదురు చూస్తున్నాననియు' మేజిస్ట్రేటుకు చెప్పవలసినదిగా రుద్రయ్యకు రాజు ఆజ్ఞాపించెను. ఈ సంభాషణ నాకు అక్షరాలవినిపించినది. తెల్లవారుజామున మూడు గంటలకు రాజు జడయేరు ఒడ్డున తన కుటీరమునకు వెళ్ళిపోయెను. మేము కనిపెట్టి వెంటనే స్టేషనులో ప్రవేశించితిమి. మరునాడు ఉదయము అధికారులందరు వచ్చి రాత్రి జరిగిన విషయములు తెలిసకొనిరి. సీతారామరాజు జడయేరులో స్నానము చేయుచున్నాడని వార్త అందినది. కాని రాజు దగ్గరకు వెళ్ళుటకు ఎవ్వరును సాహసింపలేదు."

19వ తేదీన స్పీసి రిపోర్టు పంపుచు అగ్నతీగలలోని అధికారులందరును రాజుపై సానుభూతి కలవారేయని వారిపై నిందమోపెను.

ఇట్లు శ్రీరామరాజు అగ్నతీగలలో మరియొక విజయమును సాధించెను. స్వహస్తముతో ఆసుపత్రి పుస్తకములో సంతకము చేసెను. తాను మరునాడు మధ్యాహ్నము మూడు గంటల వరకు పైడిపుట్టలో ఉండెదననియు, పోరాటమునకైనను సరే లేక ఒకసారి మాటాడుటకైనను సరే రావలసినదిగా మేజిస్ట్రేటుకు కబురు పంపెను. కాని అది శత్రు సమాగమమో, మిత్ర సమాగమో నిశ్చయించుకొనజాలక మేజిస్ట్రేటు దానికి అంగీకరించలేదు. ఈ విధముగా ప్రతీకార చర్యలు జరుపుటకు తెల్లదొరలు పన్నిన వ్యూహములు శ్రీరామరాజు తేజము ముందు మంచుతెరలవలె విడిపోయినవి.

# 21. రంపచోడవరము స్టేషనుపై దాడి

విప్లవకారులు రంపచోడవరమువైపు వెళ్ళుచున్నారని విని దానిని రక్షించుటకు ప్రయత్నములు గావింపబడెను. నర్సీపట్నము రోడ్డు. రాజమండ్రిల మీదుగా కొంత బలగముతో జాన్ పోలవరము పంపబడెను. రంపచోడవరమును కాపాడుటకు, గుజ్జపు జారీ ఘాటుమీదుగా భద్రాచలము ఏజన్సీలోనికి విప్లకారులు పోకుండ ఆపుటకును ప్రభుత్వం బలమును సన్నద్ధము చేసిరి. స్కోని 16 వ తేదీన కొయ్యూరు చేరెను. కాని అతని కూడా ఉన్న సగము మంది జవానులు జ్వరములతో పడియుండిరి.

18వ తేదీ రాత్రి అడ్డతీగలకు వాయువ్య దిశనున్న పంత్రపాలు గ్రామమున ఆహారాదులు సంపాదించుకొని విప్లవకారులు రంపచోడవరము వైపు సాగిరి.స్కోని తన బలగముతో 18 వ తేదీ మధ్యాహ్నమునకు కుంభవర్షములో కొయ్యూరు నుండి అడ్డతీగల చేరుకొనెను. జాన్ 17 వ తేదీ రాత్రి 10 గంటలకు పోలవరము, 18 వ తేదీని దేవీపట్నము చేరుకొని అక్కడ నుండి రంపచోడవరము సాయంత్రము 7-30 గంటలకు చేరెను. విప్లవకారు కొరకు ఊరిబయట రాత్రి యంతయు మాటుకాసిరి. కాని విప్లకారుల జాడలేదు. అందుచే మరువాడు తెల్లవారుజాముననే అతడు తిరిగి దేవీపట్నము వచ్చి అచ్చట నుండి కూనవరము, లక్కవరముల మీదుగా గుజ్జపు జారీ ఘాటును చేరెను. అక్కడ మాటు కాయవలెనని జాన్ ఊహ.

కాని శ్రీరామరాజు ఇవి యన్నియు ఎప్పటికప్పుడు తెలిసికొనుచునే యుండెను. అనుకొనిన ప్రకారము అతడు 60 మంది సహచరులతో అక్టోబరు 19 వ తేదీ సాయంత్రము 4 గంటలకు రంపచోడవరము చేరెను. అడ్డతీగల నుండి 22 మైళ్ళదూరములో చోడవరము ఉన్నది. విప్లవకారులు చోడవరము తాలూకా కచేరి వద్దకు వచ్చి తపాకులు పైకి పేల్చిరి. కాల్పుల ధ్వనిలో తాలూకా ఆఫీసు ఆవరణ దద్దరిల్లెను. ప్రజలు తండోపతండములుగా రాజు వెనుక నడచి తమ ఆనందమును ప్రకటించిరి. శ్రీరామరాజు తహసీల్దారును సబిన్స్పెక్టరును పిలిపించి వారితో ముచ్చటించెను. స్టేషను నిర్మానుష్యముగా నుండెను. విప్లవకారులకు ఆయుధము లేమియు లభ్యము కాలేదు. అంతకు ముందే అవి సురక్షిత ప్రదేశములకు చేర్చబడినవి. సాయంత్రం 5 గంటలకు శ్రీరామరాజు అనుచరులతో చోడవరము నుండి వెడలిపోయెను.

1922 నవంబరు 4 తేదీని కృష్ణదేవీపేట బజారులో పెంటడు అను ఒక విప్లవకారుని ప్రభుత్వ సైనికులు పట్టుకొనిరి. అతడు మాకవరము వద్ద విప్లవకారుల

దళమును విడిచిపెట్టి తప్పించుకొంటినని చెప్పెను దానిని నమ్మక అతడు రాజు పంపిన గూఢచారియై యుండవచ్చునని ప్రభుత్వాధికారులు తలచిరి. అయినను చోడవరము దాడిని గురించి అతని వాఙ్మూలము అసక్తికరముగా నున్నదని నవంబరు 6 తేదీని ప్రభుత్వమునకు పంపిన నివేదికలో కలదు. వాడు ఇట్లు చెప్పెను. "విప్లవకారులు చోడవరముపై దాడి చేసినపుడు మప్పిలోనున్న ఒక హెడ్ కానిస్టేబులు, 5 గురు జవానులు తహసీల్దారు గుమాస్తా బయటకి వచ్చి రాజుగారికి సాష్టాంగ ప్రణామము చేసిరి. తహసీల్దారు కూడా రాజుగారిని చూచుటకు వచ్చి సాష్టాంగపడి అరటిపళ్లను అర్పించిరి."

చోడవరమును విప్లవకారులు 19 వ తేదీ సాయంత్రము కొల్లగొట్టిరని 20వ తేదీ పోలవరము సబిన్‌స్పెక్టరు ఏజెన్సీ కమీషనరుకు తంతి వార్త పంపెను. రంపచోడవరము సబిన్‌స్పెక్టరు గూడ శ్రీరామరాజు, ఫితూరిదారులు 19 తేదీ సాయంత్రము చోడవరమును లూటీ చేసిరనియు, కాని ప్రాణ నష్టముగాని ఆస్తి నష్టముగాని జరుగలేదనియు తంతినిచ్చెను.

ఈ విషయములో అక్టోబరు 23 వ తేదీని అధికారులు ప్రభుత్వమునకు పంపిన నివేదికలో ఇట్లు ఉన్నది. "రాజమండ్రి ఇనస్పెక్టరు యొక్క రిపోర్టు నకలును డిప్యూటీ సూపరింటెండెంటు పంపినాడు. అందులో విషయములు పొందుపరుపబడినవి. సుమారు 60 మంది ఫితూరీదారులు 19 తేదీ సాయంత్రము 4 గంటలకు రంపచోడవరము వచ్చిరి. వారు తహసీల్దారు ఆఫీసుకు వెళ్ళిరి. వారి నాయకుడగు శ్రీరామరాజు తహసీల్దారుకు కబురంపి ఆయనతో రాజకీయ విషయములు ముచ్చటించెను. ఫితూరి రెండు సంవత్సరములు సాగుననియు, రక్తపాత మగుననియు రాజు చెప్పెను. ఆంగ్లేయులతో పాటు భారతీయులు గూడ ఉండుటవలన తెల్లవారిని కాల్చి వేయుటలో ఇబ్బందిగానున్నదని రాజు విచారమును వెలిబుచ్చెను. ఊరి చుట్టును కాపలా పెట్టి అప్పుడు రాజు పోలీసు స్టేషనుకు వెళ్ళెను కాని ఏమియు దొరకినట్లు లేదు. తరువాత అతడు రెస్టుహౌసులో విశ్రాంతి తీసికొని సాయంత్రము 5-30 గంటల ప్రాంతములో అడ్డతీగలకు వెళ్లుదారిలో 4.5 మైళ్ళ దూరములోనున్న బందపల్లికి తిరిగి పోయెను. రేంజరు సామాను విప్లవకారులు పట్టుకొనిరి గాని రాజు ఉత్తరువుతో దానిని విడిచి పెట్టిరి."

స్టీవర్టు అక్టోబరు 21 తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపుచు ఇట్లు వ్రాసెను. "19 తేదీని ఫితూరిదారులు చోడవరము లూటీచేసినట్లును, ఏమియుపోనట్లును పోలవరము సబిన్‌స్పెక్టరు నాకు తంతిద్వారా తెలిపినాడు, ఫితూరీదారులు పోలవరము

మీద కూడా దాడి చేయు ప్రమాదము ఉన్నందున, అట్టి ప్రమాద సూచనలు కానవచ్చినచో కరెన్సీ నోట్లు అన్నియు తగులబెట్టి, వెండిని రాజమండ్రి ట్రెజరీకి సాధ్యమైనంత శీఘ్రముగా పంపవలెనని ఆ డిప్యూటీ తహసీల్దారుకు తంతి ద్వారా ఉత్తర్వు పంపితిని. అచ్చట ఎంత డబ్బు ఉన్నదో సరిగా తెలియదు. ఎక్కువ ఉండకపోవచ్చును. వివరములకు తంతి నిచ్చితిని."

భద్రాచలము, పోలవరములలో ఎప్పుడు ఎక్కడ దాడి జరగునోయని అధికారులు భయపడుచుండిరి. శ్రీరామరాజు సైన్యముతో భద్రాచలము పోవుటకు స్టీమరులో ప్రయాణము చేయునేమోయని రాజమండ్రి లోని స్టీమరు కంపెనీలకు పితూరిదారుల నెవ్వరిని తీసికొనిపోరాదని కట్టడి చేసిరి. రేవులలో పోలీసు కాపలాగూడ పెట్టిరి. రాజు భద్రాచలము ఏజెన్సీ లోనికి పోయినచో ఇచ్చట నుండి సైనికులను పంపుట అసాధ్యము కాగలదనియు, అప్పుడు తన కేంద్ర స్థానమును మార్చుకొనవలసివచ్చుననియు, అట్టి అవసరము ఏర్పడదని భావించుచున్నానియు హోపెల్ అంతకుముందు ప్రభుత్వమునకు రిపోర్టు పంపెను.

శ్రీరామరాజు యుద్ధవిధానమును, చాణక్యతంత్రమును గూర్చి హోపెల్ 24 వ తేదీని పంపిన నివేదికలో ఇట్లు వ్రాసెను. 'రాజుకు అత్యంత సమర్థమగు గూఢచారి దళము కలదని స్పష్టమగుచున్నది. మన బలగము బయలుదేరిన వెంటనే దాని గమనములు, వార్తలు అతనికి చేరును. అతనిని గురించి మనకు చేరు వార్తలన్నియు మనలను తప్పుదారి పట్టించుటకు అతడు పంపుచున్నట్టివే. మన వార్తాహరులు అడ్డగింపబడి ఉత్తరములు తీసి కొనబడుచున్నవి. అందుచే ఉత్తరములు సంకేతములతోనో, ఫ్రెంచి భాషలోనో వ్రాయవలసియున్నది. అతని యుద్ధస్థావరములు అతి పటిష్ఠమైనవి, తెలియకుండ దాడి చేయుటకు అవకాశము లేనట్టివి. దుర్గమమగు ప్రదేశములలో అతడు తన శిబిరమును నిర్మించుకొనును. వానిని సర్వదా విప్లవకారులు రక్షించుచుందురు. ఒక వేళ దాడి జరిగినచో సులభముగా తప్పించుకొని పోవుటకు వీలుగానుండి నట్టి స్థలములనే అతడు ఎంచుకొనును. ఒక సైనిక దళముతోనే అతనితో తలపడుట పొరబాటు కాగలదు. రెండు మూడు దళములు ఒక్కసారే దాడిలో పాల్గొని విప్లవకారులను తప్పించుకొనజాలని స్థితిలో నుంచి ఎదుర్కొనినచో మనకు జయము కలుగుటకు అవకాశము ఉండగలదు".

విప్లవకారులు అడ్డతీగల, చోడవరము స్టేషనులపై విజయవంతముగా దాడి చేయుట తో వారి పలుకుబడి విపరీతముగా పెరిగిపోయినదనియు, ప్రభుత్వ ప్రతిష్ఠ

దిగజారిపోయినవదనియు, బల ప్రదర్శన చేయనిచో ప్రజల దృష్టిలో చులకన అగుదుమనియు బ్రాకెన్ అక్టోబరు 21, 26 తేదీలలో ప్రభుత్వమునకు పంపిన నివేదికలలో విన్నవించుకొనెను.

ఇట్టి అభిప్రాయములను హాపెల్ మొదలగు ప్రభుత్వాధికారులు వెల్లడించుటలో ఆశ్చర్యము లేదు. ముందుగా హెచ్చరిక చేసియే శ్రీరామరాజు అడ్డతీగల, రంపచోడవరము స్టేషనులను ముట్టడించెను. వారిని అవమార్గముల బట్టించుచుండెను.

# 22. ప్రభుత్వ వ్యూహములు, సన్నాహములు

చోడవరము నుండి శ్రీరామరాజు బందపల్లివైపు సాగిపోయెను. అతడు 5 పోలీసు స్టేషనులపై నిరాఘాటముగా దాడి జరుపుటతో ప్రభుత్వములో కలవరము పుట్టెను. ఒంజేరిలో ట్రెమెన్‌హీర్, సాండర్సులు పరాభూతులైరి. అనేకవిధ యుద్ధములలో నారితేరియున్న స్కాట్ కవర్టు, హైటరులు ఒక్క దెబ్బతో అంతకపురికి పంపబడిరి. విప్లవకారుల మార్కికత నెఱుగ గోరిన ఆర్మిటేజి మన్యం బెబ్బులుల దెబ్బ నుండి కొద్దిలో తప్పించుకొనెను. ప్రకటముగా దేశకాలములను సూచించి ధర్మ యుద్ధమునకు రమ్మని పిలిచినను, తమ వెనుక అంత బలగమున్నను ప్రభుత్వం సేనానులు లావొక్కింతయులేక ప్రాణములు తావులు దప్పి ధైర్యము విలోలము కాగా అప్పటికదియే మేలని దాగుకొనిరి.

శ్రీరామరాజు శక్తిని గురించియు, విప్లవకారుల సాహసకృత్యముల గురించియు ఆంధ్ర ప్రజలెల్లరుకథలుగా జెప్పుకొని ఆనందింపసాగిరి. చోడవరము తహసీల్దారుతో చెప్పి, మాటల ప్రకారము శ్రీరామరాజు రెండు సంవత్సరముల పోరాటమునకు సంసిద్ధుడయినట్లు తెలియుచున్నది. ప్రభుత్వము కూడ ఈ విప్లవమునకు కారకుడగు శ్రీరామరాజును ఒంటరిగా నున్నప్పుడు ఎట్లయినను బంధింపవలెనని ప్రభుత్వ సేనానులు పట్టుదలతో గూఢచారి దళములను ముమ్మరము చేసి గ్రామముల వెంట తిరుగసాగిరి.

ప్రభుత్వ సేనానులు ఆర్మిటేజి నాయకత్వమున మన్య ప్రాంతమంతయు క్రమ్ముకొని వేయికండ్లతో గాలించుచుండినను విప్లవకారుల విజృంభణము తగ్గకుండుట వలన జిల్లా మేజిస్ట్రేటు కలవరపడసాగెను. అతడు ప్రభుత్వమునకు నివేదిక పంపుచు, "పరిస్థితివిషమించినది, ప్రభుత్వ గౌరవ ప్రతిష్ఠలకు తలంపులైనవి, విప్లవ నాయకుని పలుకుబడి పెరుగుచున్నది. ప్రజలందరును అతనిని అభిమానించుచున్నారు. అడ్డతీగల, చోడవరములపై దాడులు ప్రతిష్ఠను భంగపరచినవి" అని విన్నవించుకొనెను.

అక్టోబరు 23 తేదీని ఒక మలబారు పోలీసు దళముతో సాండర్సు మర్రిపాకల మీదుగా రామవరము చేరుకొనెను. అంతకు ముందే విప్లవకారులు ఆ గ్రామమున బస చేసిరి. విప్లవకారులు చాటునుండి పోలీసులపై కాల్పులు సాగించిరి. పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపిరి. కాని విప్లవకారులు రాళ్ళవెనుక దాగి యుండుటచే వారికి పరిస్థితి అనుకూలముగా నుండెను. వారికి ఏమియు గాయములు తగులలేదు. మలబారు పోలీసులలో ఒకడు గాయపడెను. సాండర్సు వెన్ను చూపించక తప్పలేదు. ఒకనిని పోగొట్టుకొనుటతో సరిపోయినది. అంతవరకు అదృష్టమే అని ప్రభుత్వాధి కారులు

తృప్తిపడిరి. విరోధులు తమకు కనబడకపోయినను మలబారు పోలీసులు స్థైర్యముతో క్రమశిక్షణతో విప్లవకారులపై ఎదురు కాల్పులు జరిపినారని ప్రభుత్వము అక్టోబరు 30 తేదీని వెలువరించిన ప్రకటనలో వారిని శ్లాఘించినది.


సంఘటనను గూర్చి తరువాత సాండర్సు తన నివేదికలో ఇట్లు వివరించెను. "ఈ ఉదయము 9 గంటలకు నేను పితూరిదారుల జాడ ననుసరించి పోయితిని. ఒక మైలు దూరములో మొదటి ఘాటు పైననే వారు మాటు వేసిరి. వారు నిటారుగానున్న ఘాటు మీద పైన నుండుటచే వారి స్థావరము వారికి అనుకూలముగా నుండెను. ముందు పోవుచున్న సైనికులపై కాల్పులు జరుగగానే తక్కిన బలగముతో నేను వారికి సాయపడుటకు ముందుకు పోయితిని. కాని కాల్పులు అధికమయ్యెను. ఫితూరిదారులు రాళ్ళవెనుక దాగుకొని యుండిరి. ముందు పోయిన సైనికులకు ఆరుగురు కనబడినట్లు చెప్పిరి కాని పితూరి దారులు ఎంత మంది ఉండిరో తెలియుటకు అవకాశము లేదు. నేను ఒక తూటా కాల్చితిని. పొద వెనుక నుండి 50, 60 గజముల దూరములోన్న నాపై ఎవరో కాల్చిరి. నేను ఆపొద మధ్యకు గురిపెట్టి కాల్చితిని. అంత కంటె ఏమియు జరుగలేదు. రెండు ప్రక్కలను పెద్దపెద్ద రాళ్ళతో మూసియున్న 60, 70 గజముల పొడవుగల ఒక ప్రదేశమును ఎంచుకొని ముఖ్య దళముతో ఘాటుకు అవల ఎత్తుగానున్న కొండ వెనుక నుండి పితూరి దారులు కనబడురేమోయని వేచియుంటిని గాని వారు ఇంకను ముందుకు పోయి మమ్ములను అడ్డగించు నుద్దేశముతో నుండిరి. దళములో నున్న సభ్యులందరిని కూడ దీసికొని రాళ్ళమధ్య సురక్షిత ప్రదేశములో నుంటిమి. ఒక సైనికునికి కాలిలో గాయమగుట వలన తప్ప పెద్ద నష్టమేమియు జరుగలేదు. అయితే చాల మందు గుండు మాత్రము అనవసరముగా ఖర్చు చేసితిమి. మా స్థావరము అనుకూలముగా లేనందున సాధ్యమైనంత త్వరలో అక్కడ నుండి తప్పుకొనుట మంచిదని తలచితిని. క్రిందనున్న ఏరును దాటి అవతలనున్న ఏటవాలు దారిని చేరుకొని శిబిరమునకు తిరిగి వచ్చితిమి. మా దళ సభ్యులందరు క్రమ శిక్షణతో ప్రవర్తించిరి. కలవరపడకుండ స్థయిర్యముతో తిరుగుముఖము పట్టితిమి." ఈ భావమే ప్రభుత్వ ప్రకటనలో ప్రతిబింబించినది. ఎంత కొద్ది మంది నున్నను ఎంతో మంది యున్నట్లు శత్రువులను భ్రమింప జేయుచు తగుస్థానములను ఎంచుకొని యుద్ధము చేయుట అను విప్లవకారుల వ్యూహమొకటి ఇందు తెలియుచున్నది.

ఏడవ విప్లవకారులు అక్టోబరు 24 తేదీని పలకజీడి గ్రామములో కనపడిరి. వారు 26 తేదీని మంప గ్రామమును చుట్టుముట్టి ఒక గూఢచారి దళపు సబినస్పెక్టరును

పట్టుకొనిరి. 27న బాలరేవు వద్ద మరియొక సబిన్‌స్పెక్టరు పట్టుబడెను. ఇంకొక సబిన్‌స్పెక్టరు మా కంటబడినచో చంపివేయుదుమని బెదరించి విప్లవకారులు వారినిద్దరిని ఏమియు చేయక విడిచి పెట్టిరి. ఈ సమాచారమందగానే సాండర్సు బయలుదేరి 29 తేదీని కొయ్యూరు చేరెను. అప్పుడు విప్లవకారులు దొడ్డవరమునందున్నట్లు తెలిసెను. మరునాడు వారు కొయ్యూరుకు కృష్ణాదేవి పేటకు మధ్యనున్న చింతలపూడి ఘాటువద్ద మాటుకాసిరని వార్త వచ్చెను. కాని చింతలపూడి వద్ద వారినెదుర్కొనవలెనని తలచితి ననియు, కాని విప్లవకారుల గమన వేగమును అందుకొనలేక అట్లు చేయలేకపోతిననియు, తన సైనికులు చాల అలసి యుండుటచే ముందుకు సాగుట అనాలోచిత చర్య యగునని కొయ్యూరుకు మరలి వచ్చితిననియు సాండర్సు తన వైఫల్యమును అశక్తతను ప్రభుత్వము నకు నివేదించుకొనెను.

30 తేదీని విప్లవకారులు కృష్ణాదేవి పేట స్టేషనకు సంబంధించిన ఇద్దరు గూఢచారి కానిస్టేబులులను, రాజవొమ్మంగి స్టేషనుకు సంబంధించిన ఇద్దరుకానిస్టేబుళ్లను పట్టుకొని చింతలపూడి తీసికొనిపోయి వారిని పరిశోధించి విడిచి పుచ్చిరి. తపాలు తీసికొని పోవుచున్న 747 నంబరు కానిస్టేబిలును గూడ పట్టుకొనిరి.

ఆ తపాలా పత్రములలోని రాజవొమ్మంగి స్టేషను హౌసు జనరల్ డైరీలో తనకు సంబంధించి వ్రాసిన భాగమునకు క్రింద '60 మంది జనము, 30 తుపాకులు మాత్రమే ('only 60 men, and 30 guns') అని వ్రాసి 'అల్లూరి శ్రీరామరాజు' అని ఇంగ్లీషులో సంతకము చేసెను.



ఆ సాయంకాలము ఎర్రబండ్లపై మలబారు ప్రత్యేక పోలీసు దళమునకు గాను కొయ్యూరు వచ్చు ఆహారపు దినుసులను విప్లవకారులు అర్థగించి పట్టుకొనిరి. నవంబరు 2 తేదీని విప్లవకారులు మాకవరము దగ్గరనున్న గాదిగుమ్మ గ్రామములో నుండిరి. అచ్చట నుండి శ్రీరామ రాజు ఫోర్బ్సుకు ఒక సందేశమంపెను. తాము ఎచ్చటనున్నది తెలిసికొనుటకు గూఢచారులను పంపనక్కరలేదనియు, తానే తన ఉనికిని గురించియు తమ చలనములను గురించియు అతనికి ఎప్పటికప్పుడు తెలుపుచుందుమనియు, అతనికి

వారితో యుద్ధము చేయవలెనను తలంపు ఉన్నచో మాకవరము వద్ద అతనిని కలిసికొనగలమనియు ఆ సందేశపు సారాంశము. కాని ఫోర్బ్సు వారిని ఎదుర్కొని యుద్ధము చేయుటకు ఎట్టి ప్రయత్నము చేయుటకును సాహసించలేదు.

శ్రీరామరాజుకు జ్వరముగా నుండి కొన్ని రోజులు విశ్రాంతి తీసికొనవలసి యుండెననియు, కాని గాంసోదరులు శరభన్న పాలెము పైబడుటకు తహతహ లాడుచున్నారనియు, గాంసోదరులును తక్కిన చాలమంది విప్లవ కారులును రాజుతో విసుగుచెంది అతనితో దెబ్బలాడుచున్నారనియు ప్రభుత్వాధికారులకు అప్పుడప్పుడు పట్టుబడిన ప్రజలు చెప్పుచుండిరి. ఇట్టి మాటలను నమ్మి ప్రభుత్వాధికారులు మోసపోవుచు విప్లవమును అణచి వేయుట సులభమని తలచుచుండిరి.

1922 నవంబరు 3 తేదీని విప్లవకారులు మాకవరములో బసచేసిరి. అప్పుడు వారికి నిత్యానంద పట్నాయకు అను ఇనస్పెక్టరు పట్టుబడెను. ఈ సంఘటనను గురించి హాపెల్ నవంబరు 5 తేదీని ప్రభుత్వమునకు పంపిన దైనిక నివేదికలో ఇట్లు కలదు. "ఇనస్పెక్టరు చెప్పినది ఆసక్తిదాయకముగా నున్నది. అతడు తన వంట వానితో మాకవరములో బసచేసినాడు. ఈ సంగతి తెలిసి గాంసోదరుల నేతృత్వములో పదిమంది విప్లవకారులు అతనిని చుట్టుముట్టి బంధించి, తుపాకి మడమలతో పొడిచి అక్కడికి మూడు మైళ్ళ దూరములో నున్న గార్సుగులు గ్రామమునకు తీసికొనిపోయి రాజు ముందు నిలబెట్టిరి. రాజు ఖాకీలాగు, చొక్కా ధరించి ఒక మంచము మీద కూర్చుండి యుండెను. అతని చేతిలో ఒక 303 తుపాకి కలదు. అతనికి దగ్గరలోనే ఒక ఇంటి వరండాలో నున్న ఇంకొక మంచముమీద తక్కిన 303 నంబరు తుపాకులు ఉన్నవి. అతడు కూర్చుండిన మంచముపై సుమారు 300 బాణములు ఉన్నవి. కొన్ని ధనుస్సులు కూడ నున్నవి. రాజు మొదట ఇనస్పెక్టరును తిట్టి బెదరించెను. చాల మంది అమాయకులైన గ్రామ మునసబులపై దౌర్జన్యము చేసి హింసించుచున్న నీవు మరల పట్టుబడిన యెడల చంపివేయుదుమని ఇనస్పెక్టరును హెచ్చరించెను. తరువాత అతని దుస్తులు, సంచి సోదా చేయబడినవి. అందులో కీన్‌కు, ఫోర్బ్సు వ్రాసిన ఒక ఉత్తరము మాత్రము దొరికినది. దానిని చదివి తిరిగి ఇచ్చి వేసిరి. ఇనస్పెక్టరు నోటు పుస్తకమును అతని వంటవాడు తెలివిగా దాచి వైచెను. అందుచే అది కనబడలేదు. పిదప రాజు ఇనస్పెక్టరును కృష్ణదేవిపేట, శరభన్న పాలెము, కొయ్యూరు మొదలైన శిబిరములలో ప్రభుత్వ బలముఎంత ఉన్నది తెలిసికొనుటకు ప్రశ్నించెను. చివరకు మరియొక హెచ్చరిక చేసి అతనిని ఏమియు హింసించక వదలివేసిరి. అతడు కృష్ణదేవి పేటకు తిరిగి వచ్చెను."

ఇంత వరకు విప్లవకారులదే పైచేయిగా నుండెను, వారు ఎక్కడికేగినను విజయము వరించుచుండెను.

6వ తేదీని ఇంకొక రెండు మలబారు పోలీసు దళములు నర్శీపట్నము చేరినవి. ఇప్పుడు మొత్తము నాలుగు దళములైనవి. ఒక్కొక్క దళము ఇద్దరేసి అధిపతుల నాయకత్వమున పని చేయుచుండెను. సాండర్సు, కోల్ బ్రూక్, హరామ్క, ఫోర్బెస్, స్కోని, కీస్, జాన్, ఫార్బెలు వానికి నాయకత్వము వహించిరి. చింతపల్లి, కృష్ణాదేవిపేట, కొయ్యూరు ప్రధాన కేంద్రములుగా మలబారు ప్రత్యేక పోలీసు దళము పని చేయును. ఏవిధముగానైనను విప్లవకారులను ఘాటు దిగువకు సమ ప్రదేశమునకు సాండర్సు తరుము గలిగినచో వారిని సులువుగా పట్టుకొనవచ్చునని ప్రభుత్వాధికారులు నిర్ణయించిరి. తదను సారముగా సాండర్సు, కోల్ బ్రూక్ చింతపల్లి పోయిరి. స్కోని కృష్ణాదేవిపేట వెళ్ళి అచ్చటి నుండి 9 వ తేదీని శరభన్న పాలెము చేరుకొనెను.

ఈ లోగా శ్రీరామరాజు 7 వ తేదీని కొంత సిబ్బందితో ధారకొండ చేరి అచ్చట దేవాలయములో పూజ నిర్వర్తించెను. ఆరలోవ రిజర్వు అడవిలో నర్శీపట్నం కృష్ణాదేవిపేట రోడ్డు ప్రక్క మాటుగాసి అటువచ్చు అధికారులను సైన్యమును కాల్చి చంపుటకు సిద్ధమగుచున్నట్లు వదంతులు బయలుదేరినవి. దార్బ్లే ఆ ప్రాంతమునకు మలబారు పోలీసు దళముతో పంపబడెను కాని విప్లవకారుల ఆచూకి లభించలేదు. రంపులుకు, దమన పల్లి ఘాటుకు మధ్యనున్న గాముకొండ అను పెద్దకొండపై లోపలో వారు బసచేసిరని స్కోనికి వార్త అందినది. సాండర్సు 12 తేదీకి దమనపల్లి చేరి ఆ వార్తను ధ్రువపరచెను. రాజు, ఇంకను కొందరు విప్లవకారులు జ్వరముతో పడియున్నారని సమాచారమందినది.

ఇదియే మంచి అదనుగా భావించి విప్లవకారులను బంధించుటకు బ్రిటిషు సేనానులు వ్యూహము పన్నిరి. సాండర్సు దమనపల్లి పోవును. స్కోని శరభన్నపాలెమునకు వెళ్ళి సాండర్సుతో ఎప్పటికప్పుడు సంప్రదించు చుండవలెను. జాన్ తన సిబ్బందితో లారీలలో కృష్ణాదేవిపేట చేరుకొని అక్కనుండి నడింపాలెము గుండ రంపులు ఘాటునకు వెళ్ళవలెను. సాండర్సు తన దళముతో ఘాటు ముఖమును అడ్డగించగా, రంపులుఘాటు ద్వారా విప్లవకారులు తిరిగి వెనుకకు వెళ్ళకుండ జాన్ అడ్డగించును. అప్పుడు కంపరేగులనుండి స్కోని వారిని ఎదర్కొనును. ఇది వారి ఆశయము. కాని ఈ వ్యూహమును అమలులో పెట్టకుండగనే వదిలి వేయవలసి వచ్చినది.అప్పటికే విప్లవకారులు 13 తేదీని గాంకొండను వదలి వసివాడవైపు పోవు చున్నట్లు వార్త అందినది.

18 తేదీని శరభన్నపాలెము ప్రాంతములో స్కాట్ కావించిన దాడిలో కిమిడి అచ్చిగాడు అను విప్లవకారుడు పట్టుబడెను. ఇతడు విప్లవకారులలో ఒక ముఖ్య సభ్యుడు. కృష్ణాదేవిపేట దాడి చేసిన వారిలో ఇతడు కూడ ఉండెను.

శ్రీరామరాజుకు కొందరు విప్లవకారు దళ సభ్యులకు జ్వరముగా నుండుటచే విశ్రాంతి తీసికొనదలచి ప్రభుత్వ సేనల దృష్టిని మరల్చుటకు అతడు ఒక పన్నాగము పన్నెను. ఎక్కువమంది విప్లవకారులు గాంసోదరుల నాయకత్వమున సరగుడు కొండలకు పంపబడెను. ఒక చిన్న దళముతో శ్రీరామరాజు గాంకొండలదగ్గర ఘాటులలో సురక్షిత ప్రదేశమున ఉండెను. ఇక గాంసోదరులతో వెళ్ళిన దళము రాత్రులు ప్రయాణము చేయుచు, పగలు కీకారణ్యములో దాగుకొనుచు బూదరాళ్ళ ఘాటు మీదుగా కిమిలిగెడ్డ చేరుకొనిరి. విప్లవకారులను సరుగుడు కొండలుదాటి రానీయ కుండ చేయుటకు ప్రభుత్వ సేనానులు సర్వదా ప్రయత్నించిరి. కాని ఆ గాఢారణ్యములలో ప్రయాణించుట బహుకష్ట సాధ్యము. పైగా తుపాను గాలులు, కుండపోతగా వర్షము. స్కాట్, కీన్‌లు తమ సైనిక దళములతో గూడ తడిసి ముద్దలై రాత్రి అంతయు బయలులో గడుపవలసివచ్చెను. అతికష్టము మీద సరుగుడు ప్రాంతము చేరుకొనిరి. కాని 19వ తేదీనే కొండలుదాటి విప్లవకారులు వేలంగి మీదుగా అన్నవరము వైపుపోయినట్లు స్కాట్‌కి తెలిసినది. అప్పుడు సరుగుడు, నాగుకొండలను పూర్తిగా చుట్టుముట్టి విప్లవకారులు తిరిగి ఘాటులవైపు మరిలిపోవునట్లు చేయవలయునని 23 తేదీనాటికి సకల ప్రయత్నములు చేయబడెను. కాని విప్లవకారులు 25వ తేదీన కొండలు వదలి పల్లపు ఊళ్ళగు లింగధార, బొరాక, అచ్చంపల్లి, తోటపల్లి, ఏలేశ్వరమునకు పదిమైళ్ళదూరములోనున్న గోకవరములను చుట్టి చాల వేగముగా ప్రయాణించిరి. వారు ఏలేశ్వరమును సమీపించక పెద్దగూడెంగి మీదుగా మరల కొండలలోని తమ స్థావరములలోనికి పోయిరి. ప్రభుత్వ సన్నాహమంతయు నిష్ఫలమయ్యెను.

విప్లవకారులు ప్రభుత్వసైనిక వలయమును ఛేదించి, 26 తేదీ రాత్రి కొయ్యూరు నుండి జడ్డంగి పోవు హ్యూము సేనానిని తప్పించుకొని సింగంపల్లి గ్రామమున ఆహారాదులను సేకరించుకొని కొయ్యూరువైపు పోయి, ఈ సమాచారమంతయు వైర్లెస్ ద్వారా తెలిసికొని సాండర్సు కొయ్యూరు పోవుమార్గము లన్నిటిని కాయుటకు సిబ్బందిని పంపెను. 26వ తేదీ రాత్రి విప్లవకారులు రేవల్లులోనున్నారని వార్త అందగానే అక్కడకు సాండర్స్ బయలుదేరుచున్నంతలో వారు మంపచేరుకొనిరని మరల వార్త వచ్చెను. ఆ రాత్రి రేవల్లు దారికాచిరి. కాని విప్లవకారుల జాడకానరాలేదు. 28వ తేదీని వారు గూడపల్లి పెయిరని

అచ్చటికి చేరునప్పటికి వారు ఘాటు పైనుండి అడవులలోనికి పోయి అంతాడవైపు పోయిరి. అడవులలో దాగుకొని రాత్రి ప్రయాణించి పనసలపాడు మీదుగా కొండలుదాటి విప్లవకారులు గంగాదేవి ఘాటుకు పోయిరి. ప్రభుత్వ సైనికులు తిరిగి తిరిగి అలసిపోవుటచే వారు కృష్ణాదేవిపేటకు తిరిగిపోక తప్పలేదు. ఇట్లు విప్లవకారులు ప్రభుత్వ బలగమును మన్యములోని అడవులు కొండలు త్రిప్పుదు ముప్పుతిప్పలు పెట్టిరి.

నరుగుడు కొండల లోనికి ప్రభుత్వ సైనికాభియానము ఇట్లు అంతమైనది. ఈ విషయము హ్యాపెల్ తన నివేదికలో ఇట్లు వ్రాయినాడు: "నిజముగా మాకు అదృష్టము లేదు. ఎన్ని ప్రయత్నములు చేసినను విప్లవకారులు మరల తప్పించుకొనినారు. రాజు అంతరంగిక సేవకుడైన వెంకట స్వామి అను విప్లవకారుని పట్టు కొనుట యొక్కటియే మాకు విజయముగా మిగిలినది" అరణ్య ప్రాంతమున సంతత యానములతో ప్రభుత్వ దళములలో చాలామంది జ్వర పీడితులైరి. వారు కృష్ణాదేవిపేట, కొయ్యూరు, పెదవలసల లోని తమ శిబిరములకు తిరిగి వచ్చిరి.

29వ తేదీని విప్లవకారులు మాకవరము ప్రాంతములో నుండిరి. ఆ రాత్రి వారు జానంగి వెళ్ళి గొలుగొండకు పోవు దారిలో నున్న శివలింగము ఘాటుపైగడిపిరి. 30 తేదీ రాత్రి వారు అనంత సాగరము, వెలగలపాలెము, కొత్తమల్లంపేట, జోగంపేట, గ్రామములు లూటీ చేయబడినవనియు ఒక నాటకము పందిరిని చుట్టుముట్టిరనియు వార్తలు ప్రభుత్వ మునకు చేరెను. తరువాత వారు గొలుగొండ చేరి టెలిఫోను తీగలను చాలవరకు పాడుచేసి ధారకొండ వైపు పోయిరి.

30 తేదీని వారు జోగంపేట పోవునప్పటికి అక్కడ ఒక వీధినాటకము వేయు చుండిరి. గొలుగొండ రెవిన్యూ ఇనస్పెక్టరు కందుకూరి నారాయణరావు గూడ అప్పుడు అచ్చట నుండెను. శ్రీరామరాజు నాటకము పందిరి లోనికి వచ్చి అతనితో చాలసేపు మాట్లాడెను. అతడు పితూరి దారులకు సహాయపడినట్లు నేరము మోపి కోర్టులో విచారించి ప్రభుత్వము అతనిని శిక్షించినది. టి.జి. రూథర్‌ఫర్డు విశాఖపట్నము ఏజన్సీ గవర్నరుగా నుండగా అతని కోర్టులో నారాయణరావుపై ఈ నేరములు మోపబడినవి:-

ముద్దాయి నారాయణరావు 1922-23 సంవత్సరములలో పితూరి జరుగుచున్న గొలుగొండ ఫిర్కాకు రెవిన్యూ ఇనస్పెక్టరుగా నుండిరి. పితూరి దారుల ఉనికిని గూర్చి ఎప్పటికప్పుడు తెలుపుచుండవలసినదనియు వారిని పట్టుకొనుటకు అవసరమగు చర్యలు తీసికొనవలసినదనియు, ఎన్నో సార్లు ప్రభుత్వము ఉత్తరువులు పంపినది. 30-11-1922

నాటి రాత్రి శ్రీరామరాజు నాయకత్వమున పితూరి దారులు కొత్తమల్లంపేట వద్ద **టెలిఫోను** తీగలను త్రెంపివైచి జోగంపేట గ్రామమును జేరి అచ్చట గ్రామస్థులు **వేయుచున్న** నాటకమును చూచిరి. అచ్చటనున్న ముద్దాయి నారాయణరావు శ్రీరామరాజుతో చాలసేపు మాటాడెను. ప్రభుత్వ సేవకుడై యుండి విప్లవకారులతో గూడి కుట్రచేసి వారికి యూనిఫారములు సరఫరా చేయుట మొదలగు సహాయములు చేసి ప్రభుత్వముపై యుద్ధము చేయుటకు వారికి తోడ్పడెను. వారి ఉనికిని గూర్చి గాని తమ సంభాషణ సారాంశము గూర్చిగాని ప్రభుత్వమునకు బుద్ధిపూర్వకముగా తెలుపక విధి నిర్వహణను నిర్లక్ష్యము చేసి నేరము చేసినాడు.

కోర్టు రికార్డులను బట్టియు, ఇతర ప్రభుత్వ పత్రములను బట్టియు ఆయన పితూరి దారులకు చేసిన సహాయము ఇట్లు తెలియుచున్నది. శ్రీరామరాజు కోరికపై నారాయణరావు అడ్డాకుల గ్రామ కరణము పణతుల లక్ష్మీనారాయణయు, గ్రామ మునసబు అనమలపూడి వద్ద రాజును కలిసికొనిరి. శ్రీరామరాజు ముద్దాయికి 200 రూపాయిలనిచ్చి తమ అనుచరులకు కొన్ని ఖద్దరు యూనిఫారములు పంపుమని కోరెను. నారాయణరావు నర్సీపట్నము వచ్చి బట్టలను తయారు చేయుటకు చాల ప్రయత్నించెను. కాని కుదరలేదు. అప్పుడు లక్ష్మీనారాయణగారి సోదరుడును, సహాయ నిరాకరణ వాదియునైన పణతుల చిదంబరము గారి సహాయముతో తుని తాలూకా అల్లిపూడి గ్రామస్థుడును సహాయ నిరాకరణవాదియునైన రాళ్ళపల్లి కాశన్న వద్దకు వెళ్లి దుస్తులు తయారు చేయించిరి. తయారు చేసిన దుస్తులను కాశన్న, చిదంబరము గారలు తీసికొని వెళ్లి రాత్రివేళ చిన జోగంపేట దగ్గర అడవిలో శ్రీరామరాజునకు అప్పగించిరి. పిదప రూథర్ ఫర్డు రిపోర్టుపై ప్రభుత్వము కాశన్న, చిదంబరము గార్లపై నేరములు మోపుచు పబ్లిక్ శాఖ 1-7-1924 తేదీ గల జి.వో. 457ను జారీ చేసి వారిని కోర్టు కెక్కించినది.

ఇట్లు శ్రీరామరాజు ఎక్కడ కేగినను ప్రజల సానుభూతియే కాక ప్రభుత్వోద్యోగుల సానుభూతియు లభించుచుండెడిది.

భారతీయులగు పోలీసు అధికారులకు శ్రీరామరాజు ఎట్టి హానియు తలపెట్టలేదు. మందలించి విడిచి పెట్టువాడు. ఇక సామాన్య ప్రజల పట్ల అమితమైన కరుణ చూపెడువాడు. అందుచే భారతీయోద్యోగులకు అతని పట్ల అభిమానము ఏర్పడెను. ఒకసారి గూఢచారిశాఖ సబిన్‌స్పెక్టరు అబ్దుల్ రహమాన్ అనునతడు విప్లవకారులకు చిక్కి రాజు వద్దకు తీసికొనిపోబడెను. సంభాషణలో అతడు రాజు కృత్యములను తప్పు పట్టి పోరాటము మానుమనెను. రాజు కోపముతో తనకు పిరికి మందు పోయువాడు

తన మన్ననకు అనర్హుడని అతనిని ఎట్టి హాని చేయకయే వెంటనే పంపివేసెను. మరియొక సారి కృష్ణాదేవి పేట దగ్గర బుక్కలూరు వద్ద ఐ.ఎస్. ప్రసాదరావు అను సబిన్స్పెక్టరును (జయరాంనాయుడు మేనల్లుడు) విప్లవకారులు పట్టుకొని రాజువొద్దకు గొంపోయిరి. అతడు రాజును పొగడి రామాయణ మహా భారతములలోని పద్యములు చదువగా సంతోషించి రాజు కూడ కొన్ని పద్యములు చదివెను. అతనిని స్నేహ భావముతో జూచి భోజనాదులు పెట్టిరి. గ్రామస్థులకు ఎట్టి ఇబ్బంది కలుగజేయనని అతని వద్ద నుండి హామీని పొంది రాజు అతనిని విడిచి పెట్టెను. మూడు రోజులు రాజుకు అతిథిగానున్న ఈ సబిన్స్పెక్టరును అధికారులు అనుమానించిరి. ఇంకొక సందర్భమున గూఢచారి శాఖలో పనిచేసిన జి.ఎ. కరీం (మద్రాసు) రాజు ధైర్య సాహసములను ఇట్లు వర్ణించెను. "ప్రాణములకు తెగించి నేను రాజును మారు వేషమున కలసితిని. ఇతడు దేశభక్తి పూరితుడు, కార్యదీక్షాపరుడు, అపూర్వసాహసోపేతుడు, న్యాయదీక్షావలంబి, అసత్యము నెఱుగనివాడు. తన ఆయుధములు పటిష్టము కావని తెలిసినను అతిశక్తిమంతమైన సామ్రాజ్యముతో యుద్ధము చేయుటకు పూనుకొనెను. జీవిత లక్ష్యము పట్ల అతనికి గల విశ్వాసమట్టిది. ఇట్టి వీరుని న్యాయస్థానములో హాజరుపరచవలసినది. కాని క్రూరుడగు ఒక ఉద్యోగి ఇతనిని కాల్చివేయుట విచారకరము.

# 23. పెదగెడ్డ పాలెములో అపజయము

విప్లవకారులను వారి స్థావరములలోనే ఎదుర్కొనుట అపాయకరమని బ్రిటిషు సేనానులు నిశ్చయించుకొనిరి. అందుచే గ్రామములలో వారి రాకను నిరీక్షించుట శ్రీరామరాజును హఠాత్తుగా ఎదుర్కొనవలెనని వారు అదను కొరకు చూచుచుండిరి. అట్టి సమయము డిసెంబరు 6వ తేదీని లభించినది.

5వ తేదీని విప్లవకారులు దావనూరు గ్రామమును లూటీ చేయుచున్నారని వదంతులు వ్యాపింపగా ప్రభుత్వపు బలగము స్క్వీని, కీన్‌ల నాయకత్వమున లారీలలో అచటికి బయలుదేరినది. కాని ఆ ముఠాదారు తనకు అట్టి సంగతి తెలియదనియు, సామగిరిలో విప్లవకారులు ఉన్నారని వదంతిగానున్నదనియు చెప్పెను. కాని అప్పటికి పోయినను విప్లవకారుల జాడ తెలియలేదు. పైగా అచ్చటి గ్రామస్థులు విప్లవదళమును గురించి తమకేమియు తెలియదనియు, అసలు పితూరిని గురించి తాము విననే లేదనియు చెప్పిరి. విప్లవకారుల యెడల సానుభూతిచే వారట్లు నటించుచున్నారని ప్రభుత్వాధికారులు గ్రహించిరి. కాని ఏమియు చేయలేక నర్సీపట్నమునకు తిరిగిపోయిరి.

జాన్, చార్లీ, ముగ్గురు భారతీయ అధికార్లు, 56 గురు నాన్ కమీషన్డు ఆఫీసర్లు, జవానులతో డిసెంబరు 6వ తేదీని తెల్లవారు జామున కృష్ణదేవి పేట నుండి లారీలలో బయలుదేరి ఒక అరగంటలో గొలుగొండ చేరిరి. అక్కడి నుండి ధారమఠము వెళ్ళిరి. అక్కడ కొండమీదనున్న దేవాలయములో తరచుగా శ్రీరామరాజు పూజలు చేయుచుండెను. విప్లవకారులు క్రితమురాత్రియే నిమ్మగెడ్డ వైపు వెళ్ళిరనియు, వారు ఒక మైలు దూరములో నున్న రామన్నపాలెము (రమణపాలెము?)లో ఆ రాత్రి గడిపిరనియు తెలిసి ప్రభుత్వ సైన్యము రామన్నపాలెము వెళ్ళగా, అంతకు అరగంట ముందే పెదగెడ్డపాలెము వైపు వెళ్లిరని ఆ గ్రామస్థులు చెప్పిరి. నిమ్మగెడ్డకు తూర్పుగా ఒక మైలు దూరములో పెదగెడ్డపాలెము ఉన్నది. ఊరికి అరమైలు దూరములో ఒక సమతల ప్రదేశము కలదు. దానికి ఒక ప్రక్క ఎత్తుగా పెరిగిన వరి (?) చేలు, ఇంకొక ప్రక్క చింత చెట్ల తోపు, ఎదురుగా దట్టమైన అడవులతో పెనుగొండలు. ప్రభుత్వ సేనలు దగ్గరకు వచ్చి వేసినట్లు విప్లవకారులకు ఉప్పు అందినది. అందుచే వారు దగ్గరలో నున్న వరిచేలలో దాగుకొనిరి. ప్రభుత్వ సైన్యము ఆ ప్రదేశము చేరినది. విప్లవకారులు అచ్చట దాగుకొనియున్నట్లు వారికి తెలియదు. కావున వారు ముందుకు సాగుచుండిరి. హఠాత్తుగా చేలలో నుండి విప్లవ కారులు తుపాకులు ప్రేల్చిరి. వెంటనే ప్రభుత్వ సైనికులు ఎదురు

కాల్పులు జరిపిరి. కొంతసేపు పోరాటము జరిగినది. ఇంతలో విప్లవదళములో ఒక భాగముకొండల వైపునను పరుగిడెను. తుపాకులను వెనుకకు దిరిగి కాల్చుచు వారు ముందునకు పరుగిడుచుండిరి. ప్రభుత్వ సైనికులు వారిని వెన్నాడుచు కాల్చుచుండిరి. విప్లవ దళము పరుగునబోయి అనువగు కొండనెక్కెను. అంతలో చేలలో దాగిన మిగిలిన విప్లవకారులు తుపాకులు కాల్చుచు వెనుక నుండి యుద్ధమునకు దిగిరి. ముందు వెనుకల పోరాటము సాగుచుండుటచే ప్రభుత్వ సైన్యము రెండుగా చీలి యుద్ధము చేయుచుండెను. ప్రభుత్వ సైనిక బలము, వారి ఆయుధముల ముందు విప్లవ కారుల బలము ఆయుధములు ఏపాటివి? అందుచే వెనుక పోరాడుచున్న విప్లవ దళముకూడ పరుగిడుచు లోతైన గెడ్డలో నుండి అడవిలోనికి పారిపోయి కొండలనెక్కెను. అందరేకమై తుపాకులు గాల్చుచు మరల రెండుగా పిదప నాలుగుగా చీలి నలుదిక్కుల కొండలపై చేరి యుద్ధము సాగించిరి. శత్రువులు కొండలనెక్కి నిప్పులు గ్రక్కుచు మీదికి వచ్చునంతలో విప్లవ కారులు కొండల నుండి లోయలలోనికి దిగి అదృశ్యమగువారు. శత్రువులు లోయలు దిగి చూచినంతనే మరల విప్లవకారులు కొండగుట్టలపై కనుపించువారు. అచ్చటి నుండి జట్లు జట్లుగా విడిపోయి నలుదిక్కుల నుండి పై నుండి తుపాకులను గాల్చుచుండిరి. విప్లవకారులు ఉన్నది 20 మందియే గాని ఎటు చూచినను కనిపించుచుండిరి. అర్జునిని యస్త్రబలము వారి నావహించినట్లుండెను. ఇట్లు కొండలపై నెక్కుచు, లోయలలో దిగుచు, ఒక మారు కలియుచు, ఇంకొక మారు విడిపోవుచు, కూర్చుండి, నిలిచి, పరుగిడి తుపాకులు గాల్చుచు విప్లవకారులు విచిత్ర యుద్ధవిద్యాపాటవమును జూపిరి. లెవిస్ శతఘ్ని నుపయోగించి ప్రభుత్వ దళము అగ్నిగోళములను గురిపించువరకు వారు చలింపక అతివీర భయంకరులై పోరు సాగించు చునే యుండిరి. కాని ఆ శతఘ్ని విడుచు అగ్ని వర్షమున తడియుచు విప్లవకారుల శరీరములు దహించుకొని పోయెను. కొందరు మరణించిరి. కొందరు గాయపడి స్పృహదప్పిరి. శక్తిగలవారు ఆ శరీరములను మోసికొని పరుగిడి సురక్షిత ప్రదేశములకు దీసికొనిపోయిరి. ఆ తొందరలో కొన్ని మృత దేహములను అచ్చటనే వదలి తప్పించుకొనిరి. ప్రభుత్వ సైనికులు ఆ కొండలను గాలించిరి. కాని విప్లవకారుల జాడ కనిపించలేదు. దొరకిన మృత శరీరములను బట్టించుకొని జాన్ గ్రామములో ప్రవేశించి, ఆ శరీరములను వీధులలో నీడ్చుచు తమ విజయమును ప్రకటించెను. ఆ దృశ్యమును జూచి గ్రామస్థులు భయపడునట్లు కోలాహలమొనర్చుచు సూరేగిరి. పిదప కృష్ణాదేవి పేటకు తిరిగి పోయిరి.

ఈ పోరాటమున విప్లవకారులలో నలుగురు చనిపోయిరి. ఒకడు గాయపడి పట్టుబడెను. ఒకనిని పట్టుకొనిరి. పెక్కుమంది గాయపడి తప్పించుకొనిరి. 2 తుపాకులు,

ఒక ఆటోమెటిక్ పిస్టలు, 300 మందుగుండ్లు, 4 బేయొనెట్లు, ఇతర ఆయుధములు మాత్రమే కాక శ్రీరామరాజు సంచియు ప్రభుత్వ వశమైనవి. ప్రభుత్వ పక్షమున నష్టమేమియు జరుగలేదని 6 తేదిని ప్రభుత్వమునకు పంపిన తంతివార్తలో తెలియజేయబడినది.

జాన్ తిరిగి వచ్చిన తరువాత స్వీని తన సిబ్బందితో విప్లవకారులను వెంబడించి పట్టుకొనుటకు లారీలలో బయలుదేరిపోయెను. ఈ దళములో స్వీనితో పాటు కీన్, సార్జెంటు గుడ్హెల్, ముగ్గురు భారతీయ ఆఫీసర్లు, 50 మంది జవానులు ఉండిరి. విప్లవకారుల కొరకు వారు ఆ చుట్టు ప్రక్కల ప్రాంతమంతయు గాలించిరి. స్వీని మొదట కొండపై నున్న గొల్లాపురము వెళ్లెను. అప్పట విప్లవకారులెవ్వరును దొరుకకుండిరి. వారు లింగాపురము వైపు పోయిరని వినెను. ధారకొండకు దగ్గరగా నుండుటచే అది వారికి అనువైన ప్రదేశము. కాని లింగాపురమున గూడ వారి జాడ తెలియలేదు. కొండలెక్కుట, దిగుట, ఘాటు మార్గములలో ప్రయాణము, ఏరులను దాటుట మొదలగు అత్యంత గహన ప్రయాణ మొనర్చుచు, విప్లవకారుల జాడనెట్లైనను తెలిసికొనవలెనను పట్టుదలతో కొండలు, గుట్టలు, ఏరులు, వాగులు, మూల మూలల వెదకుచు ప్రభుత్వ సైనికులు సాగుచుండిరి. పగలంతయు జాన్ సైన్యముతో పోరాడి, చాల నష్టపోయి, అలసి యుండుటచే అంతలోనే ప్రభుత్వ సైన్యము రాదని రాత్రి ఎక్కడనో సురక్షితమను కొనిన స్థావరములో విప్లవకారులు ఆదమరచి విశ్రాంతి తీసికొనుచుందురనియు, అప్పుడు వారిని పట్టుకొనుట సులభమనియు స్వీని ఆశ. అట్లే జరిగినది.

పట్టుదలతో స్వీని దళము వెన్నెల రాత్రిలో చాల సేపటి వరకు వెదకుచునే యుండిరి. చివరకు అర్ధరాత్రి సమయమున విప్లవకారుల స్థావరమును కనుగొనిరి. వారొక యేరు దగ్గర కొండరాళ్ళ మధ్యలో విశ్రాంతి తీసికొనుచుండిరి. కొందరు నిద్రించుచుండిరి జాన్ ఆ పగలు చేసిన యుద్ధ ప్రదేశమునకు 5 మైళ్ల దూరమున ఈ స్థావరముండెను. విప్లవకారుల కాపలాను ఛేదించి ప్రభుత్వ సైనిక దళము ప్రధాన శిబిరమును ప్రవేశించెను. విప్లవకారులందరును మేల్కొనిరి. రాళ్ల మధ్య యుద్ధము ప్రారంభమయ్యెను. ప్రభుత్వ సైనికులు పేళ పేళార్భటులతో గుండ్ల వాన కురిపించిరి. అది అతి భయంకరమగు రాత్రి యుద్ధము. నిర్విరామముగా ఒక గంటసేపు రెండు పక్షములవారును కాల్పులు సాగించిరి. ప్రభుత్వ సైనికుల ఆయుధశక్తి ముందు విప్లవకారులు నిలువలేకపోయిరి. అయినను వారిలో కొందరు వెనుకకు తిరిగి కాల్పులు సాగించుచు కొండపైకి ఎక్కిరి. ప్రభుత్వ సైనికులు వారిని అనుసరించిరి. ఇంతలో

వెనుకనుండి విప్లవకారులు కాల్పులు జరిపిరి. వారు వెనుదీయక పౌరుషముతో పోరాడ సాగిరి. కాని ప్రభుత్వ శతఘ్నుల అగ్ని వర్షము ముందు శ్రీరామరాజు అనుచరదళమునకు ఆ యుద్ధమున నిలిచిపోరాడుట దుర్ఘటమయ్యెను. అప్పటికే విప్లవకారులలో ఎనిమిది మంది హతులైరి. ఎందరో గాయపడిరి. శ్రీరామరాజు పరుండిన ప్రక్కమీద ఎన్నియో గుండ్లు పడి అది జల్లెడవలె తూట్లుపడెను. కాని అతనికి గాయములేమియు తగులలేదు. అతడు మిగిలిన సహచరులతో తప్పించుకొనెను. స్పృహ తప్పిన వారిని మోసికొని పోయిరి. వారు గ్రామమునకు పోవు త్రోవలో కాచియుందురేమోయని స్కీనీ భయపడి పోరాటమాపి వేరొకదిక్కునకు పరుగిడెను. యుద్ధము ముగిసినది. యుద్ధభూమి యంతయు రక్తసిక్తమైనది.

ఈ యుద్ధమున విప్లవకారులలో ఎనిమిది మంది హతులైరి; నలుగురు బంధింపబడిరి; చాలమంది గాయపడిరి; రాజు తప్పించుకొనెను. 9 పోలీసు తుపాకులు, 303 తుపాకులు రెండు, 748 తుపాకి తూటాలు, 303 తుపాకులలో నుపయోగించు 162 తూటాలు, 17 బాయినెట్లు, 6 కత్తులు,కొన్ని నాటు తుపాకులు, రాజుయొక్క పరుండు ప్రక్క, సంచి, స్కాట్ కవర్టు యొక్క ఆటోమేటిక్ పిస్టలు, ఇంకను అనేక చిల్లర వస్తువులు ప్రభుత్వ సైనికులకు దొరకినవి. ప్రభుత్వ పక్షమున జమాదారు కేశవన్ నాయరు అనునతనికి పొట్టపై పెద్దగా గాయము అయినది. ఒక సిపాయి కొద్దిగా గాయపడెను. జవానులు అందరును ధైర్యసాహసములతో ప్రవర్తించిరి అని 7వ తేదీని ప్రభుత్వమునకు పంపిన తంతి వార్తలో తెలియజేయబడినది.

ఈ పెదగొర్లపాలెము పోరాటములో విప్లవవీరులు చాల నష్టపోయిరి. ఇదియే వారికి మొదటి పెద్ద అపజయము. కాని శ్రీరామరాజు ఇంకను పట్టుబడలేదు. అతని ముఖ్యానుచరులు బంధింపబడలేదు. ఏమైనను ఈ అపజయము ప్రజలలో విప్లవకారుల అజేయశక్తి పట్ల సందేహములు ఏర్పడసాగెను.

పెదగొర్లపాలము యుద్ధము జరిగిన మరునాడు జాన్, కీప్, కోల్ బృూకు ధారకొండ ప్రాంతము దావనూరు వరకు గాలించిరి. కాని విప్లవ కారుల జాడ కానరాలేదు. తరువాత పట్టుబడిన ఖైదీల వాఙ్మూలములను బట్టి శ్రీరామరాజు, గాంసోదరులు, ఎండుపడాలు ఆ మరునాడు ధారకొండపై ఒక దుర్గమ ప్రదేశములో దాగిరని తెలియుచున్నది. తరువాత రోజున కరక రిజర్వు అడవిలోకి ప్రవేశించి పగలెల్ల దాగుకొనిరి. 8వ తేదీరాత్రి కొయ్యూరు, పలకజీడుల మీదుగా మఠం భీమవరము చేరుకొనిరి. గ్రామములకు దూరముగా రాత్రులే ప్రయాణము చేయుచుండిరి. వారి ధైర్యము దిగజారినదనియు మలబారు స్పెషల్ పోలీసులనిన భయపడుచున్నారనియు ఖైదీలుచెప్పిరి. విప్లవకారులు మఠం భీమవరము,

గుర్తేడు, ధారకొండల మధ్యను దూరముగా నున్న దుర్గమ ప్రదేశమును ఎంచుకొని స్థావరము ఏర్పర్చుకొని ఒక నెలరోజుల పాటు దాగుకొనియుండిరి. 14 తేదీని దావరాతి పాలెము గ్రామ మున్సబు పోలీసు తుపాకీతో నున్న ఒక విప్లవకారుని పట్టుకొనెను. 15వ తేదీని కొత్తపాలెము గ్రామస్థులు చేతులు, కాళ్ళలో గాయపడిన మరియొక పితూరిదారుని పట్టుకొనిరి. ఇంతకు మించి క్రిస్మస్ వరకు విప్లవకారులను గురించి ఎట్టివార్తయు లభించలేదు.

పిదప గంటందొర నాయకత్వమున 30 మంది విప్లవకారులు కాక మూరు గ్రామమును లూటీచేసి గుర్తేడు, ధారకొండల మధ్యనున్న నేల జర్తి, కొండ జర్తిల వైపుగా పోయిరని 26వ తేదీని చింతపల్లి నుండి సౌందర్స్ వార్త పంపెను. ఆ తరువాత విప్లవకారుల జాడ తెలియలేదు. వారు ధారకొండలలోనే ఉండి యుండవచ్చునని ప్రభుత్వ సేనానులు తలచిరి. అందుచే ఆ ప్రదేశ మంతయు గాలించి అచ్చట నుండి వారిని తరిమివేయవలెనని ప్రభుత్వము నిర్ణయించినది. 21 తేదీని గాంసోదరులు, ఇంకను 25 మంది విప్లవకారులతో శ్రీరామరాజు గూడెము దగ్గరనున్న నంగులు గ్రామము వద్ద కనబడినట్లు వార్త అందెను. వెంటనే కోల్‌బ్రూకు, కింగ్‌లు నంగులు నుండి ఎఱ్ఱజర్ల వరకు వారిని అన్వేషించుచు పోయిరి. 23న నవర పల్లిలో నుండిరనియు 24న బాలరేవు చేరి పుణకూరు ఘాటు దిగి మంప వైపు పోయిరనియు సమాచారమందినది. కింగ్, కోల్ బ్రూకులు ఆ ప్రాంతములకు వెళ్ళిరిగాని విప్లవకారుల జాడ తెలియకపోవుటచే వారు 27న కొయ్యూరు తిరిగి వచ్చిరి.

డిసెంబరు 29 తేదీని ఏజన్సీ కమీషనరు అగు జె.ఆర్. హ్యగ్గిన్సుచే పితూరి దారులను పట్టుకొనిన వారికి బహుమతులిచ్చెదమని ఒక ప్రకటన చేయబడెను. శ్రీరామరాజును పట్టుకొనిన వారికి రు. 1500/-లు, గాంసోదరులకు చెరియొక రు. 1000/- ఇతర ముఖ్యమైన పితూరి దారులను పట్టుకొనినచో రు. 50/-లు బహుతులు ప్రకటింపబడెను. ఈ ప్రకటన వలన ఫలితమేమియు కనబడనందువలన తరువాత శ్రీరామరాజును పట్టుకొనిన వారికి రు. 10,000/-లు వరకు బహుమతి హెచ్చింపబడెను. పిదప కొన్ని నెలల వరకు ఒకరిద్దరు విప్లవకారులు పట్టుబడుట తప్ప డిసెంబరు 6 యుద్ధము తరువాత శ్రీరామరాజు జాడ తెలియలేదు. అతడు తప్పించుకొని పారిపోయి యుండునని భావించబడెను.

విప్లవ వీరులకు పెదగెడ్డపాలెము పోరాటమున హెచ్చు నష్టము కలిగినను వారు ధైర్యము కోల్పోలేదు. విప్లవము ప్రారంభించినది మొదలు కొని ఇచ్చట తప్ప తక్కిన

అన్ని పోరులందును వారిదే విజయము. శ్రీరామరాజు సాగించిన విప్లవోజ్జృంభణము ఆంధ్రదేశమును ఉత్సాహోద్వేగములతో జొంపెరి వోవునట్లు చేసినది. వార్తా పత్రికలన్నియు ఈ వార్తలను ప్రముఖముగా ప్రకటింపసాగినవి. ఈ విప్లవ ప్రభావము జాతీయవాద శక్తుల మీద గూడ కన్పించసాగెను. ఈ పోరాటమును బందిపోటుల పోరాటమని ప్రభుత్వాధికారులు ఘోషించుచున్నను, వారి ననుసరించి కొందరు రాజకీయ నాయకులు గూడ అట్టి అనాలోచిత వ్యాఖ్యానములే చేసినను దేశమున నమ్మువారులేరు. పెద్దా పురము, పిఠాపురము, తుని ప్రాంతము లందలి ప్రజలు మనస్ఫూ విప్లవము పట్ల అభిమానము ప్రకటింపసాగిరి. రాష్ట్ర యువత శ్రీరామరాజు సాహస కృత్యములకు ఆనందించి ఉత్తేజముతో ఉఱ్ఱూతలూగ సాగినది. ఈ విప్లవదావానలము ఆంధ్రదేశ మంతయు అలము కొనునేమోయను సంశయము ప్రభుత్వమునకు పట్టి పీడింపసాగినది.

అప్పటి వరకు జరిగిన సంఘటనలను సమీక్షించుచు హాపెల్ 1923 జనవరి 27 తేదీని ప్రభుత్వమునకు పంపిన తన నివేదికలో ఇట్లు సంక్షేపించెను:

"(1) విప్లవకారులు 5 పోలీసు స్టేషనులపై దాడి చేసిరి.

(2) ఆరు 303 రైఫిళ్ళు, 27 తుపాకులు, 10 కత్తులు, 38 బాయొనెట్లు, 2495 మందుగుండు తూటాలు, 300 (303) మందుగుండ్లు, 2 ఆటోమెటిక్ పిస్తోళ్ళు, పోలీసు దుస్తులు తీసికొని పోబడినవి.

(3) ఇద్దరు బ్రిటిషు ఆఫీసర్లతో గూడ మొత్తము ఏడుగురు పోలీసు ఆఫీసర్లు చంపివేయబడిరి; నలుగురు గాయపడిరి.

(4) 35 మంది పోలీసు ఆఫీసర్లు పట్టుకొనబడి తాత్కాలిక నిర్బంధము తరువాత విడిచి పెట్టబడిరి.

(5) చాల చోట్ల టెలిఫోను తీగలు త్రెంపబడినవి. ప్రభుత్వమునకు సంబంధించిన తపాలు అర్థగింపబడి ధ్వంసము చేయబడినది.

(6) గ్రామస్థుల నుండి బలవంతముగా ఆహార సామగ్రి మొదలగునవి తీసికొని పోబడినవి. కాని చాల వరకు వానిని గ్రామాధికారులు, గ్రామస్థులు స్వచ్ఛందముగానే ఇచ్చిరి.

(7) విప్లవకారులతో అయిదుచోట్ల యుద్ధము జరిగినది. 12 మంది విప్లవకారులు చంపబడుటయు, అయిదుగురిని పట్టుకొనుటయు జరిగినది.

(8) వేర్వేరు సమయములలో వేర్వేరుచోట్ల 27గురు విప్లవకారులు పట్టుబడిరి."

# 24. అన్నవరము సందర్శనము

1923 జనవరి 26వ ఏజెన్సీ కమీషనరు అగు జె.ఆర్. హిగ్గిన్సు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపుచు ఇట్లు వ్రాసెను. "శ్రీరామరాజు తన దళముతో గూడెము ప్రాంతములోని కొండలలో దాగుకొని యుండవచ్చును. గ్రామ ప్రజలు విప్లవకారుల ముఠా యొక్క చర్యలతో నిస్సందేహముగా విసిగిపోయిరి. అయినను నిజమైన సమాచారమును అందించుటకు వారు ఇంకను ఇచ్చగించుట లేదు. పి. లక్ష్మయ్య, సనసల కన్నయ్య అనునిద్దరు పితూరిదారులు ఈవారములో పట్టుబడిరి. ఇది శుభసూచకమే. గ్రామస్థులలో కొంత మార్పు వచ్చినట్లు కనపడుచున్నది."

దాని తరువాత, ఏజెన్సీలోని చాల మంది గ్రామ మునసబులు విప్లవకారులను గురించిన వార్తలను పైకి పొక్కకుండ ప్రయత్నించుచు ప్రభుత్వమునకు ఏమియు తెలియజేయుటలేదనియు, గూడెము ప్రాంత మంతయుకొండలలో గుర్తేడు, వాలమూరుల వరకు విప్లవకారులు స్వేచ్ఛగా తిరుగుచున్నారని స్వీని, హ్యూమ్‌లు తెలియజేసిరనియు, అందుచే అటువంటి గ్రామాధికారులను శిక్షించుటకు ఒక మేజిస్ట్రేటును నియమించవలెననియు జనవరి 30 తేదీని హాపెల్ నివేదించెను. శ్రీరామరాజు దళమును వెనుకకు రాకుండ కొండదారులన్నియు మూసివేయుటకు సర్వవిధముల ప్రయత్నించుచుమనియు ఈ దెబ్బతో వారుతప్పించుకొనలేరని ఆశించుచున్నానియు గూడ అతడు ఆశ వెలిబుచ్చెను.

ఫిబ్రవరి 3వ తేదీని పోలీసు ఇనస్పెక్టర్ జనరల్ నర్సీపట్నము వచ్చి అధికారులతో సంప్రదించి ఒక ప్రణాళికను సిద్ధము చేసెను. వారు విప్లవకారులను చుట్టుముట్టెదరు. విప్లవకారుల జాడ తెలియగానే వారిని విడువక వెన్నంటుచునే యుందురు. వారిని పట్టుకొనుటకు వీలుకానిచో తమ సైనిక దళములలో దేనివైపునకైనను వారిని పారద్రోలు టకు ప్రయత్నింతురు. ఈ వ్యూహము వలన అన్ని ప్రభుత్వ దళములను ఒకదానికొకటి సమాచారము తెలియజేసికొనుచునుందురు. కొండల నుండి క్రిందికి వచ్చు దారులన్నియు సైనికులు కాపలా కాయుచుందురు. విప్లవకారుల జాడ తెలిసినచో స్వీని వారిని తరుము కొని వెళ్ళును. హ్యూమ్ పెద్దవలస నుండి గూడెము వెళ్ళును గాని అంతకు కొన్ని గంటల ముందే విప్లవకారులుతప్పించుకొని పోయిరి. ఆ ప్రాంతములో నున్న గ్రామస్థులు, గ్రామాధికారులు విప్లవకారులకు ఆశ్రయమిచ్చుచున్నారనియు, సరియగు సమాచార మును ప్రభుత్వమునకు పంపుట లేదనియు పిదప కొందరిపైనేరము మోపబడి శిక్షింప

బడిరి. 8 మంది గ్రామాధికారులు, 10 మంది గ్రామస్థులు ట్రైమస్ హీర్‌దే అట్లు శిక్షింప బడిరి.

విప్లవకారులు ఆ ప్రాంతమంతయు తిరుగుచునేయుండిరి. హ్యాపెల్ నివేదిక ప్రకారము, వారు 14వ తేదీని వంగసారి. 15న లోతుగెడ్డ, 20న ఒంచలము, .21వ లచ్చింపురము మొదలైన గ్రామములు సంచరించి కోరుకొండవైపు వెళ్ళినట్లు ప్రభుత్వమునకు సమాచారము అందినది. తరువాత వారు పూర్తిగా అదృశ్యమయిరి. వారు గ్రామస్థులకుకూడా తెలియకుండా రాత్రులందే ప్రయాణించుచుండిరి. చాల రోజులవరకు వారి జాడ తెలియలేదు, అందుచే పరిస్థితులను సమీక్షించుచు ఎంతయో ఆశతో 27వ తేదీని హ్యాపెల్ ప్రభుత్వమునకు ఇట్లు వ్రాసెను. "ఘాటీ క్రింద నున్న గ్రామములకు చెందిన విప్లవకారులందరును రాజును విడిచిపోయిరి. వారు మరల తిరిగి ఆ దళములో చేరకపోవచ్చును. గూడెము, పెద్దవలస ముఠాలకు సంబంధించిన ఆ గ్రామస్థులే ఇంకను 25 మంది వరకు రాజును అంటి పెట్టుకొని యున్నారు. వారిలో రాజుతో పాటుగా గాంసోదరులు, ఎండుపడాలు కూడ ఉన్నారు. కాని రాజుకు కూడ ప్రజలలో పరపతి తగ్గిపోయినది. ఈ మధ్య అందిన సమాచారమును బట్టి, ఇంత వరకు వెళ్ళియుండనిచో, త్వరలోనే అతడు దేశమును వదలి వెళ్ళిపోవచ్చును. ఎండుపడాలుకు పెద్దవలసలో కొంత ఆదరణ ఉన్నది. కాని, ఘాటీపై నున్న గ్రామములలో గాంసోదరులకు ఏమియు పరపతిలేదు. వారనిన ప్రజలకు భయము, అసహ్యము మాత్రమే. ఇంకను క్రొత్తవారు విప్లవదళములో చేరుదురను భయమే మాత్రమును అవసరము లేదు. ఆయుధములను, మందుగుండును చేకూర్చుకొనుట వారికి ఇక అసాధ్యము. ఇక విప్లవమనునది మనుటకు అవకాశము కనబడదు. అందుచే ఇప్పటి పరిస్థితులను బట్టి ఇంత పెద్ద యెత్తున బలగము నుంచి ఇంత ఖర్చు పెట్టుట సమర్థనీయము కాదు. డిసెంబరు 6వ తేదీ పోరాటము తరువాత ఈ ముఠా పెద్దవలస,గూడెము, ధారకొండ, గుర్తేడు, మరం భీమవరముల మధ్యనున్న కొండలలో దుర్గమ ప్రాంతమునకు పోయి యున్నారు. పూర్తిగా మారకపోయినను 8 మంది గ్రామాధికారులను, 10 మంది గ్రామస్థులను శిక్షించిన తరువాత ప్రజల మనస్సులలో కొంత మార్పు వచ్చినది. ఇక వారి విధులు వారు గుర్తెరిగి ప్రభుత్వమునకు సహాయపడునట్లు చేయుటకు కొంత పోలీసు సిబ్బందిని నియమించి వారికగు ఖర్చును గ్రామస్థుల వద్ద నుండి వసూలుచేయవలెను. విప్లవకారులు అందరును పట్టుబడునంత వరకు అట్లు జరగవలయును. గూడెము, పెద్దవలస, కృష్ణాదేవి పేటలలో ఒక్కొక్క శిబిరము వద్ద 50 మంది సిబ్బంది

నుండి, తక్కినవి వారి సర్వపట్నము కేంద్రముగా నుంచవలయును విప్లవకారులను బంధించుటకు సాధ్యమైన ప్రయత్నమంతయు చేసితిమి. కాని మూడు నెలల క్రితము పరిస్థితి ఎట్లున్నదో ఇప్పుడును అట్లె ఉన్నది. మనము లక్ష్యమును చేరలేక పోయితిమి. మనకు అదృష్టము కలిసి వచ్చిన తప్ప ఇంకొక మూడు నెలలు పోయిన తరువాత అయినను పరిస్థితిలో మార్పు వచ్చుననుటకు తగిన కారణము నాకేమియు కనిపించుట లేదు".

ఇందు హాపెల్ ఆ దుర్గమ పర్వత ప్రాంతములలో విప్లవకారులకు దీటు కాలేని తమ అసహాయతను ఒప్పుకొని సత్యమును ఎంత నిష్కల్మషముగా వెలిబుచ్చినాడు!

1923 మార్చి నెల మొదటివారము వరకు విప్లవకారుల జాడ తెలియకపోవుటచే వారందరు శ్రీరామరాజును విడిచి వెళ్ళిపోయిరనియు, వారు మరల తిరిగి కలిసికొను అవకాశము లేదనియు ప్రభుత్వము భావించినది. అందుచే ప్రభుత్వము హాపెల్ చేసిన ప్రతిపాదనలను ఆమోదించినది. మార్చి నెల చివరకు వైర్లెస్ పరికరములు మిలిటరీకిని, రెండు మలబారు ప్రత్యేక పోలీసు దళములు వాని స్వస్థలములకును తిరిగి పంపించి వేయబడి అదనపు పోలీసు సిబ్బందిని గ్రామములో నియమించి వారిని పోషించు భారము గ్రామస్థులపై పెట్టిరి. పితూరి దారులపై సానుభూతి చూపించు వారు, వారికి సహాయమందించువారు గల గ్రామములపై పన్ను విధించుచుండిరి. ఇదియే "ప్యూనిటివ్ టాక్సు" అను పేర పిలువబడెను. ఏప్రియల్ ఒకటవ తేదీని ఏజన్సీ చర్యల అధికారిగా హాపెల్ స్థానే జాన్ నియమింపబడెను.

ఈ లోగా మార్చి 10వ తేదీని విప్లవకారులు లాగరాయి దగ్గర నున్న అనంత గిరి గ్రామమును లూటీ చేసిరి. 16వ తేదీని ఇద్దరు విప్లవ కారుల పట్టుబడిరి. 27 తేదీని నరుగుడు కొండల ప్రాంతమున నున్న సుందర కోటను లూటీ చేసి వారు వాతంగి వైపు వెళ్ళినట్లు వార్త అందినది. అవి యన్నియు నీలి వార్తలే గాని, శ్రీరామరాజు, అతని ముఖ్యానుచరులు జీవించి యున్నట్లును, వారి నాయకత్వమున పై చర్యలు జరుగుచున్నట్లును ప్రమాణభూతమైన వార్తలేదు. విప్లవకారులందరు చెదరిపోయి యుండవచ్చును. అక్కడక్కడ కనబడు విప్లవకారులు రాజుతో అసంతృప్తి చెంది తమ ఇష్టము వచ్చినట్లు లూటీ చేయుచున్నారనియు, డిసెంబరు 6వ తేదీ యుద్ధముతోనే మన్యం విప్లవము అణగిపోయినదియు ప్రభుత్వాధికారులు తలచుచుండిరి కాని శ్రీరామ రాజు అన్నవరము సందర్శనము వారి యభిప్రాయములు సరియైనవి కావని నిరూపించి, వారి ఆశలన్నియు వమ్ము చేసినది.

ఏప్రిల్ 18 తేదీని జాన్ తనకు అందిన సమాచారమును ప్రభుత్వమునకు ఇట్లు నివేదిక పంపెను. "నిన్న ఉదయము సుమారు 10 గంటలకు అన్నవరము పోలీసు స్టేషను నుండి నాకొక తంతి వార్త వచ్చినది. కొందరు సహచరులతో రాజు ఉదయము 6 గంటలకు అన్నవరము వచ్చి పోలీసు స్టేషనులో మకాము వేసిరి అని. మధ్యాహ్నము రెండు గంటలకు మరల ఒక తంతి వచ్చినది. విప్లవకారులు ఉదయము 8-35 గంటలకు శంఖవరము వైపు వెళ్లిపోయిరనియు, పోలీసు స్టేషనులో ఆయుధములు మొదలైనవి ఏమియు ఉంచకపోవుట వలన ఏమియు పోలేదనియు తెలియజేయబడినది. విప్లవ కారులు నాగులకొండల నుండి రాత్రియంతయు ప్రయాణము చేసి యుండవచ్చును. అంతకు ముందు రోజు వారు అచ్చట నున్నారని నాకు ఆలస్యముగా వార్త వచ్చినది. ఈ సమాచారమును వరుగుడు కొండల ప్రాంతముననున్న ఛార్టీకి అందజేసితిని. డిసెంబరులో యుద్ధము తరువాత రెండుకంపెనీల మలబారు పోలీసులు, వైర్లెస్ సాధన ములు మొదలగునవి పంపించి వేయబడుట వలన విప్లవకారులు ధైర్యము పుంజు కొనినట్లు కనబడుచున్నది. రాజు, గాంసోదరులు, ఎండుపడాలు, బుద్ధయ్య దొర మున్నగు ముఖ్యులందరు ఇంకను వారి దళములో చెక్కు చెదరకుండ నున్నారు."

అన్నవరము గోదావరి మండలమున ఒక పెద్ద గ్రామము. సమీపములోనే అడవులున్నవి. చుట్టును కొండలు, సింహాచలమువలెనే అన్నవరము గూడ ఒక కొండపై సత్యనారాయణస్వామి కోవెలయున్న తీర్థభూమి. గ్రామము సరసనే పంపానదియను ఏరొకటి కలదు. ఆ యేరుదాటి 17వ తేదీ ఉదయము 5 గంటలకు శ్రీరామరాజు నలుగురు విప్లవకారులతో పోలీసు స్టేషనుకడకు వచ్చెను. ఇంకను మసక చీకటి యున్నది. స్టేషనులో 10, 15 మంది పోలీసు జవానులు నిదురించుచునే యుండిరి. విప్లవకారులలో నున్న మల్లుదొర నిద్రించుచున్న పోలీసులను కాలితో తన్నుచు, రాజుగారు వచ్చినారు లెమ్మని లేపుచుండెను. పోలీసులు అదరిపడి లేచి నిల్చుండి భయముతో వణకుచుండిరి. మల్లుదొర ఇనస్పెక్టరును తీసికొని రమ్మని వారిని పంపెను. శ్రీరామరాజు కుర్చీలో కూర్చుండగా మిగిలినవారు పహరా నిచ్చుచుండిరి. ఇనస్పెక్టరు ఆలస్యము చేయుట చూచి మల్లుదొర అతని ఇంటికి పోయెను. తలుపులు బిగించి యుండెను. భయపడు చున్న ఇనస్పెక్టరును బెదిరించి ఏమియు భయము లేదు అని రాజు గారి దగ్గరకు తీసికొని వచ్చెను. అతనిపై తనకేమియు కోపము లేదని అతనిని స్వస్థపరచి ఆయుధము లెక్కడ దాచినారని యడిగెను. ఇనస్పెక్టరు దీనవదనముతో అధికారులు తీసికొని పోయిరని చెప్పెను. స్టేషను అంతయు గాలించినను విప్లవకారులకు అక్కడ ఆయుధము లేమియు

దొరుకలేదు. పిదప దైవ దర్శనార్థము కొంత మెట్ల నెక్కుట మొదలిడెను. శ్రీరామరాజు తమ యూరు వచ్చినాడని వినగానే ప్రజలు తండోప తండములుగా ఆతనిని జూచుటకు వచ్చిరి. ఈ వార్త ఉదయమే ఎట్లు ప్రాకినదో చుట్టు ప్రక్కల వారును చాలమంది పరుగున వచ్చిరి. ఆలస్యము చేసినచో అధికారులకు తెలిసి వచ్చి తమనే కాక అమాయక ప్రజలందరిని కాల్చెదరని భావించి వృథా రక్తపాతమగుటకు నిష్టము లేక శ్రీరామరాజు వెనుతిరిగి ప్రజల వైపు వచ్చెను. వారు ఉత్సాహానందములతో, జయ ఘోషలొనర్చుచు ప్రత్యక్ష దైవసందర్శనమువలె భక్తితో ఆయన దర్శన స్పర్శన భాగ్యములచే పవిత్రము గావలెనని ఆయన మార్గమునకు అడ్డుపడిరి. కొందరు సాష్టాంగపడిరి. కొందరు పాదములంటి నమస్కరించిరి. దగ్గరకు వచ్చుటకు వీలులేనివారు దూరము నుండియే దర్శించి నమస్కరించిరి. కొందరు వారి వారి కోర్కెల ననుసరించి మ్రొక్కిరి. సత్రమును శుభ్రపరచి నీళ్ళు జల్లి ముగ్గులు పెట్టి శ్రీరామరాజు నాహ్వానించిరి. పూలు జల్లిరి, హారతులిచ్చిరి. పాలు, పండ్లు, ధనము మొదలగు కానుక లిచ్చిరి. సత్రము రాజ దర్బారువలె నుండెను. ధర్మాసనా సీనుడైన బాల సన్యాసి ముఖమున "ఇదం బ్రాహ్మమిదం క్షాత్రం" అనునట్లు బ్రహ్మవర్చసము, క్షాత్ర తేజము తొలుకాడుచుండెను. మధుర కంఠస్వరముతో ఆయన చెప్పు మాటలను ప్రజలు పరవశులై నిశ్శబ్దముగా ఆలకించిరి. కొందరు ఆంధ్రాంగ్ల భాషలలో రాజు ఆశయములను గూర్చి ప్రశ్నించి తెలిసికొనిరి. అప్పుడక్కడనున్న దంగేరు వాస్తవ్యులు చెరుకూరి నరసింహమూర్తిగారితో జరిపిన సంభాషణ వలన రాజు స్వాతంత్ర్య సాధన లక్ష్యము మనకు అవగతమగును. నరసింహమూర్తిగారి అత్తవారిల్లు అన్నవరమగుటచే ఆయన 16 తేదీని అక్కడ నుండిరి. 18వ తేదీ ఉదయము రైలుబండిలో కాకినాడ వెళ్ళిరి. అచ్చట "ఆంధ్ర పత్రిక విలేకరి ఆయనను కలిసికొని రాజుగారితో చేసిన సంభాషణను పత్రికకు పంపిరి. ఈ సంభాషణ 1923 ఏప్రిల్ 21 తేదీ (శనివారము) నాటి "ఆంధ్రపత్రిక ప్రకటించినది. శ్రీరామరాజు ఖద్దరు ఖాకీనిక్కరు, ఖద్దరు చొక్కా ధరించెను. పైన నొకరుమాలు వేసికొనెను. రెండు అడుగుల పొడవు గల పేముబెత్తము చేతిలో నుండెను. పాదములకు చెప్పులు లేవు. యోగులవలెనే తలవెంట్రుకలను బాగుగా పెంచెను. గయలో జరిగిన కాంగ్రెసు మహాసభకు స్థూల శరీరము పోలేదుగాని ఆత్మపోయినదని రాజుగారు చెప్పి అచ్చట జరిగిన సంగతులను చెప్పిరని నరసింహమూర్తిగారు చెప్పిరి. అందుకు తగిన ఏర్పాట్లు రాజు చేసి యుండెను. కేవలము గాంధిగారి అహింసా సిద్ధాంతము వలనలాభము లేదనియు, తన సిద్ధాంతము వలన స్వాతంత్ర్యము తప్పక రెండు సంవత్సరములలో సిద్ధించగలదనియు రాజు చెప్పెను.

శ్రీరామరాజు అన్నవరము సందర్శనము గూర్చి శ్రీజయరాం నాయుడు (కొత్త పట్నం) అను నాయన ఇట్లు వ్రాసిరి. "రాజు మొదట పోస్టాఫీసుకు వెళ్లెను. పోస్టుమాస్టరు, గుమాస్తాలు రాజుకు నమస్కరించిరి. పై అధికారులకు టెలిగ్రాము ద్వారా సమాచారము తెలుపకుండుటకుపోస్టుమాస్టరుపైన, గుమాస్తాలపైన పితూరిదారులు తుపాకులతో కాపలా ఉండిరి. తరువాత పోలీసు స్టేషనుకు వెళ్ళి రాజు సబిన్‌స్పెక్టరును, పోలీసులను కలిసెను. పితూరిదారులు తుపాకులుబారు చేసి కాపలా కాసిరి. తరువాత డిప్యూటీ తహశీల్దారు వద్దకు వెళ్లెను. పితూరిదారులు కాపలా కాయుచునే యుండిరి. కాని రాజు మాత్రము వారిపట్ల గౌరవమును ప్రదర్శించుచుండెను. పోస్టుమాస్టరు, సబిన్‌స్పెక్టరు, డిప్యూటీ తహశీల్దారు రాజును వారి ఇండ్లకు గొనిపోయిరి వారి భార్యలు వెండిపళ్లెము లలో రాజుపాదములు కడిగి ఆ జలమును తమ తలలపైన, బిడ్డలపైన జల్లుకొని రాజు ఆశీర్వాదములను పొంది పవిత్రులైరి. తరువాత రాజు అనుచర బృందముతో కొండపైకి వెళ్ళి సత్యనారాయణ స్వామి దర్శనము చేసికొనెను."

శ్రీరామరాజు సత్రవునూతి వద్ద స్నానము చేసి సంధ్యావందనము, జపము మొదలగువాని నాచరించెను. రెండు గంటలు అచ్చట గడిపి నమస్కార పూర్వకముగా ప్రజల వద్ద సెలవు గైకొని అచ్చట నుండి పయనమై నాలుగు మైళ్ల దూరములో నున్న శంఖవరము వెళ్లెను. ఆ గ్రామ ప్రజలు ఆయనకు ఖద్దరు వస్త్రములు, పండ్లు, మిఠాయిలు, ధనము ఇచ్చి సత్కరించిరి. ఆ సమయమునకు ఇది వరకు యుద్ధము నందు చెదరి పోయిన విప్లవ కారులు శంఖవరము చేరి రాజును కలిసికొనిరి.

ఇంతలో జిల్లా కలెక్టరుకు ఈ వార్త యంతయు తెలిసి అన్నవరము వచ్చెను. శ్రీరామరాజునకు జరిగిన సత్కారమునకు అతడు కుపితుడై అన్నవరము, శంఖవరము ప్రజలపై నాలుగు వేల రూపాయలు సాముదాయిక జరిమాన విధించెను.

'ఒకమారు మాట్లాడుటకు శంఖవరము రావలెను, ఆరుగంటల వరకు నేనచ్చటనే యుండెదను' అని శ్రీరామరాజు కలెక్టరుకు మిరపకాయ టపాను వెదురు గొట్టములో పెట్టి పంపించెను. కాని కలెక్టరు విప్లవనేత విశాలహృదయము నర్థము చేసికొని ఆయాహ్వానము నంగీకరించు సాహసము చేయలేదు.

పెద్దగెడ్డపాలెము సంఘటన తరువాత విప్లవము దాదాపు అణగిపోయినట్లు అధికారులు ప్రభుత్వమునకు వార్తలు పంపుచుండిరి. కాని శ్రీరామరాజు తన అనుచరులతో అన్నవరములో ప్రత్యక్షమై నిరాటంకముగా పోలీసు స్టేషనను సోదా చేయుటతో విప్లవకారుల శక్తి పట్ల ప్రజల విశ్వాసము మరల బలపడసాగినది. ప్రభుత్వము కల్లోల పడసాగెను.

ఈ అన్నవరము ఉదంతమును 1923 ఏప్రిల్ 19 తేదీ 'హిందూ' పత్రికలో చూచి ప్రభుత్వము గోదావరి జిల్లా మేజిస్ట్రేటుకు ఆ సమాచారము వాస్తవమైనదా, అయినచో రాజుతో నలుగురు అనుచరులు మాత్రమే ఉన్నప్పుడు పోలీసులు వారిని ఎందులకు నిర్బంధించుటకు ప్రయత్నించలేదో వివరించవలసినదని ఏప్రిల్ 21 తేదీని 'మెమో' పంపెను.

ఏప్రిల్ 25వ తేదీని పంపిన తన నివేదికలో జాన్ ఇట్లు వ్రాసెను. "ఇంకను విప్లవకారుల జాడ తెలియరాలేదు. అన్నవరము సంఘటన తరువాత రాజు ప్రతిష్ఠ అపారముగా పెరిగి పోయినది." ప్రభుత్వము అడిగిన సంజాయిషీకి గోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంటు ఇనస్పెక్టరు జనరలుకు ఏప్రిల్ 29 తేదీన ప్రత్యుత్తర మిచ్చుచు ఇట్లు వ్రాసెను "రాజును నిర్బంధించుటకు ప్రయత్నించుట పోలీసు సిబ్బందికి సాధ్యమే కాని, ఆ పరిస్థితులలో అప్పటి తాత్కాలిక సబినస్పెక్టరు, పోలీసు సిబ్బంది అట్లు చేయవలెనని ఆశించుట వారి శక్తికి మించిన పనియని తలతును. విప్లవకారులందరి చేతులలోను తుపాకులున్నవి. పోలీసుల చేతులలో నేయాయుధమును లేదు. గ్రామస్థులందరును రాజు పక్షమున నుండిరి. సబినస్పెక్టరుకు ఎవ్వరును సానుభూతినైనను చూపలేదు. అంతేకాక తక్కిన విప్లవకారులందరును ఊరి బయట కాపలా యుండిరని ఊరిలో చెప్పుకొనుచుండిరి. ఇది నిజము కాదని తరువాత తెలిసినది. కాని ఇంతకు పూర్వము ఏ గ్రామమునకు రాజు వెళ్ళినను ఊరి బయట విప్లవకారులు కాపలా కాయుచుండిరి. అందుచే ఈ తాత్కాలిక సబినస్పెక్టరు అట్టి వదంతిని నమ్మి నందులకు నేను అతనిని నిందించబోను."

# 25. చెదురుమదురు సంఘటనలు

ఏజెన్సీ కమీషనరగు జె ఆర్ హగ్గిన్సు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మే 4వ తేదీన పంపిన ఉత్తరములో ఇట్లు వ్రాసెను. "గాంగంటం దొర,గోకిరి యెర్రేసు, ఇంకొక ఇద్దరు విప్లవకారులు శరభన్న పాలెము సారా దుకాణము వద్ద సారా త్రాగుచుండిరి. ఆ సమయమునకు పెదవలస నుండి ఒక పోలీసు పటాలము అక్కడకు వచ్చినది. కాని గ్రామస్థు లెవ్వరును విప్లవకారుల ఆచూకి ఈయక పోవుటచే వారక్కడ ఉన్నట్లే పోలీసుకు తెలియలేదు. ఇంకొక పోలీసు దళము కృష్ణాదేవి పేట నుండి విప్లవకారుల వార్త తెలిసి వచ్చిరి. కాని వారు వచ్చునప్పటికి అంతకు ముందే వారు పారిపోయి తమ దళముతో కలిసిరి. గ్రామస్థులు సమాచారము అందించక నిర్లక్ష్యము చేయుటచే విప్లవకారులలోని ఒక ముఖ్యులున్న ఆ దళమును పట్టుకొనుటకు లభించిన చక్కని అవకాశమును జారవిడుచుట చాల దురదృష్టకరము."

మే 3వ తేదీని విప్లవకారులు ఒక గూఢచారి జవానును పట్టుకొని శిబిరమునకు తీసికొనిపోయి ప్రశ్నలడిగి వదలి పెట్టిరి, విప్లవకారులతో ఇంకొకరాజు చేరినాడనియు, పాతరాజుతో సమముగా ఈ క్రొత్తరాజుకూడ ఆజ్ఞలు ఇచ్చుచున్నాడనియు, అతడు గాంమల్లయ్యకు గూడ ఆజ్ఞాలు జారీ చేయుచున్నాడని ఆ జవాను తనపై అధికారులకు దెలిపెను. ఈ క్రొత్త రాజును గురించి పోలీసు వారు ఆచూకీ తీయసాగిరి. ఈలోగా విప్లవకారులు నిరాటంకముగా ఊరినుండి యూరికి తిరుగుచునే యుండిరి. పోలీసు దళముల సమాచారమందగానే వారిని వెంటాడుచుండిరి. కానివేసవి గాడ్పులకు తట్టుకొనలేక విప్లవకారుల అతివేగప్రయాణములను అందుకొనలేక రోగ గ్రస్తులగు చుండిరి. విప్లవదళము ఇంతలో కనబడి అంతలో మాయమగుచుండెను.

తరువాత కొన్ని వారముల వరకు విప్లవకారుల జాడ తెలియలేదు. మే 31వ తేదీని గాంగంటయ్య నాయకత్వమున కొయ్యూరులో కనిపించిరి. విప్లవకారులలో ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పజెప్పినందులకు ఆ ముఠాదారును శిక్షించుటకు వారు అచ్చటకు వెళ్ళిరి. వారు కొయ్యూరులో ఒక గూఢచారి సబిన్స్పెక్టరును, పోలీసు జవానును పట్టుకొనిరి. ఈ సాయంత్రమే పుల్లనిటివు పన్ను వసూలు చేయుటకు అచ్చటకు వెళ్లిన గూడెము డిప్యూటీ తహసీల్దారును కందర్ప మూర్తన్న పంతులును, ఆయన జవానును గూడపట్టుకొనిరి. విప్లవకారులు ఆయనను, ఆయన జవానును కొట్టి ముఠాదారు చావడిలో

విడదియున్న గంటం దొర దగ్గరకు తీసికొనిపోయిరి. గంటందొర ఆయనను గౌరవించి మర్యాద చూపెట్టెను. ఆయన బాస్టియనువలెకాక, ప్రజలను హింసింపక బాగుగానే చేయుచున్నాడని వింటిననియు, బంజేరి నుండి గురితప్పెనదనియు, ఏదియో యొక రోజున పాత్తంగి వెళ్లి వానిని చెప్పి, తన అనుచరులు ఆయనపై చేయి చేసికొనందుకు క్షమింపుడని సాష్టాంగపడి పిదప విడిచి పెట్టెను. అప్పటికే ఆలస్యమైనందున మలబారు పోలీసులు రాగలరని అనుమానముతో సబిన్‌స్పెక్టరును గూడ హెచ్చరించి వర్షిపట్నం చేరుకొనిరి. గంటం దొర అనుచరులతో కొయ్యూరు నుండి విశ్రాంతి గృహమును తగులబెట్టిరి. పోలీసులకు వార్త తెలిసిన వెంటనే వారిని అడ్డగించుటకు ప్రయత్నించిరి గాని వారి జాడ తెలియలేదు.

జూన్ నెల ప్రారంభమున ఏజన్సీ చర్యల అధికారిగా సి.యు.స్వీని. బాధ్యతలు స్వీకరించెను. అతని క్రింద ఆరుగురు బ్రిటిషు ఆఫీసర్లు, ఆరుగురు భారతీయ ఆఫీసర్లు, 350 మంది జవానులు పనిచేయుదురు. ఈ బలగమును ఏజెన్సీలో న్ను 8 శిబిరములకు ఇద్దరు ఆఫీసర్లు, 40 మంది జవానులు ఒక్కొక్క దానియందు ఉండునట్లు పంచుదురు. సగము మంది శిబిరమునందే యుండి తక్కిన సగముమంది విప్లవకారుల కొరకు చుట్టుప్రక్కల గాలించుదురు. ఇట్లు స్వీని పథకమును తయారుచేసికొని విప్లవకారుల కొరకు గాలింపు మొదలిడెను. వార్తలు సేకరించు గూఢచారి దళమునకు ఇన్స్‌పెక్టరు కనకరాజును చింతపల్లి వద్దను, ముస్తఫాఆలీఖానును కృష్ణాదేవిపేటలోను నియమించిరి.

పోలీసులకు ఆచూకి ఇచ్చి ఎవరైనను ప్రభుత్వమునకు సహాయపడుచున్నట్లు విప్లవకారులకు తెలిసినచో, అట్టి వారిని కొట్టి వారికి ప్రభుత్వము ఇచ్చిన బహుమతిని లాగుకొని పోవుచుండిరి. అందుచేప్రభుత్వ బహుమతులను అందుకొనుటకు గ్రామస్థులు విప్లవదళములో చేరుచుండిరి. అందుచే విప్లవకారులకు బుద్ధిపూర్వకముగా సహాయము చేసిన గ్రామములపై తప్ప తక్కిన గ్రామములపై విధించిన ప్యూనిటివు పన్నును రాజు, అతని ముఖ్యానుచరుల బంధింపబడినతోడనే తొలగించుదుమని అన్ని గ్రామములలో ప్రకటించుమని వార్తాహర దళమును స్వీని ఆజ్ఞాపించెను. జూన్ 19 తేదీని పెదవలస నుండి స్వీని పంపిన నివేదికలో ఇట్లు కలదు. "విప్లవకారులు గ్రామము నుండి వెళ్లిపోయిన తరువాత గాని సమాచార మందుట లేదు. వార్తలు ఆలస్యముగా చేరు చున్నవి. ఇట్లు ఎందులకు జరుగుచున్నదో నేను తెలిసికొందును. కాని రాజు తమ పయన ములను గురించి ప్రభుత్వమునకు వార్తలందించు విషయంలో ముఠాదారులతోనూ,

గ్రామాధికారులతోనూ నిష్పందేహముగా ఒక ఒప్పందమునకు వచ్చినట్లున్నది. రాజే ఆ వార్తలను చెప్పి వ్రాయించి పంపించుచున్నట్లు గూడ వదంతులు ఉన్నవి".

జూన్ 10 తేదీని విప్లవకారులు ధారకొండ వచ్చి వెళ్ళినట్లు ఆ ముఠాదారు ప్రభుత్వమునకు వార్త పంపెను. అచ్చట నుండి కొండ కంబేరు మీదుగా మల్కనగిరి పోయెదమని వారు చెప్పినట్లు అతడు వ్రాసెను. తన అనుచరులతో మల్కనగిరి చేరిన తరువాత శ్రీరామ రాజు అచ్చటి డిప్యూటీ తహసీల్దారును పిలువనంపెను. గత్యంతరము లేక ఆయన వారి యెదుట బడెను. ఈ ఉదంతమును గూర్చి జూన్ 13 వ తేదీని ప్రభుత్వమునకు పంపిన నివేదికలో డిప్యూటీ తహసీల్దారు ఇట్లు వ్రాసెను.

"రాజు కోరికపై మేము తాలూకా ఆఫీసుకు వెళ్ళితిమి. అక్కడ వరండాలో కుర్చీపై రాజు కూర్చుండెను. చుట్టును సాయుధులగు అనుచరులు ఉండిరి. పోలీసు ఇనస్పెక్టరును పిలిపించెను. తుపాకులు, మందు గుండు స్టేషనులో ఉన్నవా? అని అతనిని రాజు ప్రశ్నించెను. లేవని నేను సమాధానము చెప్పితిని. శిక్ష విధించిన ఖైదీలను కోరాపుట్టికి ఎట్లు తీసికొని వెళ్ళుచున్నారు. పోలీసులను తన్ని ఖైదీలు పారిపోగలరు అని యనెను. రాజు తలపాగాను, పొడుగుపాటి చొక్కా, నిక్కరు ధరించెను అవి ఎఱ్ఱని ఖద్దరు దుస్తులు, మేజోళ్ళు, బూట్లు వేసికొనెను. అతనికి బాగుగా పెరిగిన గడ్డము గలదు. ప్రక్కన మఱియొక క్షత్రియుడు గలడు. పొడగరి శరీరచ్ఛాయ నలుపు, అతడు కూడ ఎఱ్ఱ ఖద్దరు దుస్తులనే ధరించెను. రాజు ఆఫీసులో అరగంట కూర్చుండెను. తెలుగులోనే మాటాడెను. తన సాహస కృత్యములను గూర్చి గొప్పగా చెప్పెను. గాంధీజీని గురించి చాల గౌరవముగా మాటాడెను. కాని హింస అవసరమని నుడివెను. ప్రభుత్వముపై తన అవిశ్వాసమును ప్రకటించెను. తనపై జరిగిన ఆరవ దాడిలో తాను ఎట్లు తప్పించుకొనెనో ఊహించు కొనమనెను. తనను తుపాకి గుండ్లు ఏమియు చేయజాలవని చెప్పెను. తన శరీరమును గుండ్లు ఛేదించలేవని చెప్పెను. రిజర్వు దళముతో పోరాటమునకు తాను సిద్ధపడి వచ్చినతిననియు అది జరుగనందులకు తాను నిరుత్సాహపడితిననియు అనెను. సుముహూర్తమున జూన్ 13వ తేదీని ధారకొండవైపున సైన్యముతో పోరాడగలననియు, అట్లు వీలు కానిచో ఇంకొక 15 రోజుల వరకు తాను బయటకు రానినియు చెప్పెను. రాజమంత్రి మున్నగు ప్రాంతములకు వెళ్ళి మరి కొంతమంది సహచరులను సేకరించి ప్రభుత్వ సైన్యముతో పోరు సాగించగలనని చెప్పెను. పంజాబు నుండి తనకు సహాయము రాగలదని వెల్లడించెను. తరువాత రాజు చెరువులో స్నానము చేసి ప్రార్థన చేసికొనెను. అనుచరులు వంటలు చేసికొనిరి. కొందరు స్కూలులోను, రహదారి బంగళాలోను

నిద్రించిరి. మరికొందరు గ్రామములో అన్ని వైపులను కాపలా యుండిరి. రాజు, అతని అనుచరులు,ఉదయము 5 గంటలకు ధారకొండ వైపు పోయిరి. ఏదో కొంత ఆహార సామగ్రిని సేకరించుట తప్ప ప్రజలను హింసించుట గాని ప్రభుత్వ ఆస్తులకు నష్టము కలిగించుటగాని వారు చేయలేదు"

ఇదంతయు శ్రీ రామరాజు మనఃస్థితిని, అతని అంతిమలక్ష్యమును, అతడు అవలంబించు పద్ధతిని తెలుపుచున్నది.

ఈ ఉదంతమును గూర్చియే ప్రభు భక్తి పరాయణుడగు జయపురపు మహారాజు మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జూన్ 16 తేదీని ఇట్లు ఉత్తరము వ్రాసెను. "14 తేదీ రాత్రి జయపురములోనున్న నా తిల్దారు నుండి తంతివార్త వచ్చినది. అల్లూరి సీతారామరాజు మల్కనగిరి వచ్చెననియు, అతడు 'బోయపారగుడా'కు వెళ్ళవచ్చుననియు ఆ వార్త అదృష్టవశమున స్కాట్ బ్రౌన్ జయపురములోను, హగ్గిన్స్ నందపురములోను ఉన్నను నా యాజ్ఞలకు ఎదురు చూడకుండ సర్వవిధముల స్కాట్ బ్రౌన్ యొక్క సూచనలను పాటించుమని దివానును ఆజ్ఞాపించితినని బ్రౌనుకు తంతి వార్తనంపితిని. విచక్షణగాని, దయా దాక్షిణ్యములు గాని లేకుండ దుస్సాహసియగు ఈ బందిపోటు దొంగ ఎందుకింత ప్రాణ నష్టము కలుగజేయుచున్నాడో ఆశ్చర్యముగానున్నది. అతనికి ఆహార సామగ్రి అయిపోయి యుండవచ్చును. అందుచేతనే నైరాశ్యముతో ఇట్టి సాహస కార్యములకు దిగినాడు. మేమును, హాపెల్ ఈసారియైనను అతడు బంధింపబడునని ఆశించుచున్నాము. హగ్గిన్సు కూడ దగ్గరలోనే ఉండుట వలన ఈసారి రాజును పట్టుకొనుటకు మంచి అవకాశము కాగలదు."

జయపుర సంస్థానాధీశుడు బ్రిటిషు ప్రభుత్వమునకు నమ్మిన బంటు. విశాఖ మన్యప్రాంతమునానుకొనియున్న తన సంస్థానము గూడ అచ్చట జనించిన విప్లవ ఝంఝూ మారుతము విస్తరించి వీచునేమోయను భయముతో విప్లవమారంభమైనది మొదలు ఏనుగులను, మనుష్యులను ప్రభుత్వ సైన్యమునకు సహాయముగా బంపుచునే యుండెను. పిదప సైనికులకు బహుమానముగా నిచ్చుటకు 50 వేల రూపాయిలను గూడ పంపించెను.

జూన్ 17వ తేదీని 60 మంది అనుచరులతో 30 తుపాకులతో గూడెము వచ్చి బంగళాలో బస చేసినట్లు గూడెము స్కూలు టీచరు స్వీపికి వార్త పంపెను. కాని సైనికులెవరును రాలేదు. ముఠాదార్లు విప్లవకారుల రాకపోకలను పోలీసులకు తెలుప

చుండిరి. కాని విప్లవకారులు తిరిగి వెళ్ళు సమయమును వారు వచ్చిన సమయముగా నివేదిక పంపుచుండిరి. ఈ రిపోర్టునైనను శ్రీరామరాజుతో సంప్రదించి పోలీసుల బాధల నుండి తప్పించుకొనుటకు లాంఛన ప్రాయముగా మాత్రము పంపుచుండిరి. జూన్ 21 తేదీని గాంపోదరుల నాయకత్వమున ఒక విప్లవదళము ఈతదుబ్బులు గ్రామము చేరినది. విప్లవదళముల సమాచారమును పోలీసులకు అందించి నలుగురు విప్లవకారులను పోలీసులకు అప్పజెప్పిన గ్రామ మునసబును, అతని కొడుకును తమతో ఈడ్చుకొని పోయి కొట్టిరి. ఆ నలుగురు విప్లవకారులను పట్టించియిచ్చినందుకు ప్రభుత్వము నుండి పొందిన రు. 600/-లను తమ కిమ్మని వారిని చితకబాది, మునసబుది ఒక చెవి కూడ కోసివేసిరి.

జూన్ 24వ తేదీ రాత్రి విప్లవకారులు కొయ్యూరు వెళ్ళి ఊరుచుట్టును కాపలా పెట్టి ముఠాదారును, గ్రామ మున్సబును పట్టుకొని కొట్టి ఆహార సామగ్రిని పట్టుకొని కృష్ణాదేవి పేటవైపు వెళ్ళిపోయిరి. అంతదూరము ప్రయాణించినను వారి వార్త పోలీసులకు ఒక్కమాట గూడ అందలేదు. మరల జులై 7వ తేదీని 100 మంది సాయుధులైన అనుచరులతో శ్రీరామ రాజు దుచ్చర్తిలో కనిపించెను. వారు బూదరాళ్ళ, దొడ్డవరము, మాలమాకారము, బందమామిడి మున్నగు గ్రామములలో తిరుగుచు ఆహార సామగ్రిని సేకరించుకొనుచుండిరి. విప్లవకారుల ఆచూకి తీయుటకు ప్రత్యేక పోలీసులు విశ్వప్రయత్నము చేయుచున్నట్లు నటించుచు వారిని సమీపించుటకు ధైర్యము చాలక చుట్టును తిరుగుచుండిరి.

జులై 9 తేదీని కింగ్ కొంత పోలీసు దళముతో విప్లవకారుల జాడననుసరించి వెంబడించెను. వారు చోడవరము గ్రామము వెళ్ళిరని తెలిసి అచ్చటకు పోయెను. అక్కడ విప్లవకారులతో కొంత మందిని చూచి వారిపై తుపాకులతో కాల్చెను. కాని వారు అడవిలోనికి బోయి మాయమైరి. వారిని వెంటాడుచు కింగ్‌తో నున్న దళము కుంభవర్షములో ప్రయాణించి తేమలో నిద్రించుచు 35 మైళ్ళు రెండు రోజులు ప్రయాణించిరి. కాని విప్లవకారులు వారిని తప్పించుకొని అడవుల మధ్యకు బోయిరి. కొంత కాలము వారు కన్పించలేదు.

జులై 29 తేదీని కొన్ని బండ్లు ప్రభుత్వ సైనికులకు రేషను తీసికొని వచ్చుచుండెను. ఆ సమయముననే అగ్గిరాజు 80 మంది సహచరులతో విప్లవకారుల వార్తలను ప్రభుత్వమునకు చేరవేయుచున్న రౌనూరు పటేలును శిక్షించుటకు బయలుదేరెను.

కాని దారిలో ఆహార పదార్థములతోనున్న బండ్లు అతని కంటబడెను. వెంటనే మిలిటరీ రేషను తీసికొనిపోవుచున్న ఆ బండ్లను అడ్డగించి 600 శేర్ల బియ్యమును సంగ్రహించి అగ్గిరాజు తన సహచరులతో అదృశ్యమైపోయెను. మరల ఆగస్టు 4 తేదీని పెదవలస శిబిరమునకు తపాలు తీసికొనిపోవుచున్న ఇద్దరు పోలీసు జవానులను బంధించి ఒక గంట తరువాత విడిచిపెట్టిరి. వారి వద్ద గల ఆహార పదార్థములను తాను తీసికొనినట్లును, పెదవలస స్థావరముపై ఒక నెలలో తాను దాడి చేయగలననియు శ్రీరామరాజు ఒక పోస్టల్ రశీదు వెనుకవైపున వ్రాసి పంపెను. నర్సీపట్నము నుండి కృష్ణాదేవి పేట మీదుగా రంపులు ఘాటీగుండ ఆహార సామగ్రి పెదవలస శిబిరమునకు చేరవేయబడితిది. ఈ శిబిరమునకు పీటర్ సన్ కమాండర్ పరిహాస ధోరణిలో శ్రీరామరాజు అతనికి ఒక చీటి ఇట్లు వ్రాసెను.

"ప్రియమైన పీటర్సన్,

నా సహచరుడు అగ్గిరాజు జ్వరముతో బాధపడుచున్నాడు. అతని కొరకు రెండు రొట్టెలు మీ వారి నుండి తీసికొంటిని. దానికి ప్రతిఫలముగా మీకొక బుట్ట పండ్లు పంపుచున్నాను. నన్ను గురించి చెడుగా భావించరని తలచెదను.

శ్రీరామరాజు

పెదవలస నుండి ఒక పోలీసు దళము విప్లవకారులను వెదకుటకు పంపబడినది. యర్ల మామిడికి ఒక మైలు దూరములో 7, 8 మంది అనుచరులతో వారికి శ్రీరామరాజు కనబడెను. తుపాకులు కాల్చిరి గాని వారిని పోలీసు దళము పట్టుకొనలేక పోయినది. వారు అంతలోనే అదృశ్యమైరి.

ఆగస్టు 11 తేదీని గాం గంటందొర నాయకత్వమున ఒక విప్లవ దళము కృష్ణాదేవిపేటకు 6 మైళ్ళ దూరములోనున్న కొమ్మిక గ్రామమునకు వెళ్లి ఆ రాణి నుండి ఆహార సామగ్రి సేకరించెను. తరువాత ఈ విషయము ప్రభుత్వమునకు తెలిసి ఈ వార్త ప్రభుత్వమునకు తెలుపనందుకు రాణి గుమాస్తా రామజోగిరావును నిర్బంధించి 'కేసు' పెట్టిరి. తరువాత కోర్టు అతనికి 6 నెలలు కఠిన శిక్ష విధించినది.

ఆగస్టు 20 తేదీని గాంసోదరుల నాయకత్వమున 30 మంది విప్లవకారులు దామనూరు గ్రామము నుండి ఆహార సామగ్రి సేకరించుకొనినట్లును 23 తేదీ రాత్రి మాలమాకారము గ్రామములో కొందరు విప్లవకారులు నిద్రించినట్లును ప్రభుత్వమునకు

ఆలస్యముగా తెలిసినది. ఆ వార్తలు తెలియజేయనందులకు ఆ గ్రామాధికారులను శిక్షించుటకు చర్యలు తీసికొనబడెను. అట్లే అనేక గ్రామములలో విప్లవకారులు తిరుగుచున్నను ఆ వార్తలు వెంటనే ప్రభుత్వమునకు తెలియజేయనందులకు ఆ గ్రామాధికారులను, ముఠాధికారులను శిక్షించుటకు ఏజెన్సీ వారంట్లు జారీ చేయబడెను. కొందరు తొలగింపబడిరి మరికొందరిపై కోర్టులో 'కేసు'లు పెట్టబడినవి. 29, 30 తేదీలలో విప్లవకారులు కొయ్యూరు, నిమ్మలపాలెము, బోర్ల గొంది, తాళ్ళపాలెము, గంగవరము మొదలగు గ్రామములలో తిరుగుచున్నను ఆ గ్రామాధికారులు, గ్రామస్థులు ప్రభుత్వమునకు వెంటనే తెలుపకపోవుటచే వారిని శిక్షించుటకు చర్యలు తీసికొనబడెను. ఈలోగా అగ్గిరాజును గురించి ప్రభుత్వము కొంత సమాచారమును సేకరించినది.



సీతారామరాజు మాతృమూర్తి



సీతారామరాజు సోదరి



సీతారామరాజు సోదరుడు

# 26. అగ్గిరాజు

1923 సెప్టెంబరు 7 తేదీని స్పెషల్ ప్రభుత్వమునకు ఇట్లు నివేదించెను. "విప్లవకారులతో చేరిన అగ్గిరాజును గూర్చి కొంత సమాచారము లభించినది. అతడు క్షత్రియ కులజుడు. 25 సంవత్సరముల వయస్సు ఉండును. 5 అ. 5 అం. ఎత్తు ఉండును. అతడు విశాఖ జిల్లాలోని లింగరాజుపాలెము గ్రామవాసి. పది సంవత్సరముల క్రితము కృష్ణా జిల్లా భీమవరము తాలూకాలోని కుముదవల్లి గ్రామము వెళ్ళి స్థిరపడినాడు. అతని అసలుపేరు వేగిరాజు సత్యనారాయణరాజు. అతని తండ్రి పేరు వెంకట నరసింహరాజు. అతడు నాలుగు నెలల క్రితము కుముదవల్లి వదలి ఎచటికో పోయినాడు. అతనిని గురించి ఇంకను లింగరాజుపాలెము వద్ద వివరములు సేకరించబడుచున్నవి.'

ఈ నారాయణరాజు పేద కుటుంబములో పుట్టెను. తండ్రి చిన్న నాడే మరణించెను. అతడు నాల్గవ తరగతి వరకు చదువుకొనెను. మంచి బలిష్ఠుడు. ధైర్య సాహసములు, ధర్మ బుద్ధియు గలవాడు దేశాభిమాని. మొదటి నుండియు దేశాటనమునిన ప్రీతి, ఒక మారు కాశీకి పారిపోయెను. తరువాత గాంధీ మహాత్ముని సహాయ నిరాకరణోద్యమములో పాల్గొని ఖద్దరుధారి అయ్యెను. కుముదవల్లిలో నుండగా భీమవరము కాంగ్రెసు శిబిరమున వాలంటీరుగా చేరి శివరాత్రి నాడు జరుగు గునుపూడి రథోత్సవమున మహాత్ముని పటమును రథముపై అలంకరింపజేయుటకు కాంగ్రెసు వాదులగు అడవి బాపిరాజు, ముష్టి లక్ష్మీనారాయణ, అల్లూరి వెంకట నరసింహరాజు (ఆకివీడు) మొదలగు వారితో కలిసి పనిచేసి, జస్టిస్ పార్టీ వారితో పోటీ పడిన ఉత్సాహవంతుడు. అహింసావాదులగు జాతీయవాదులను పోలీసులు బాధించుటచూచి సహింపజాలక పోయెడివాడు. వారి అత్యాచారములను జూచి కినుక వహించెడువాడు. ప్రతీకార వాంఛ రేకెత్తినది. అహింసా విధానము నచ్చక ఆ యుద్యమము నుండి పిదప విరమించుకొనెను. నల్లవారి దేశద్రోహము, సహాయముల మూలముననే తెల్లవాడు మనల నేలుచు దోచుకొనుచున్నాడను భావము అతని మనస్సున దృఢముగా నాటుకొనినది ఒకనాడు తన బాల్యమిత్రునితో కలకత్తాబోవుటకు నిశ్చయించుకొని ఎవ్వరును అనుమానించకుండునట్లు వారు వేర్వేరుగా ప్రయాణించి కటకములో గలిసికొనుటకు ఏర్పాటు చేసికొనిరి. ఆ కాలమున భీమవరమునకు రైలు మార్గము లేదు. కావున నారాయణరాజు నిడదవోలు వరకు నడచివెళ్ళి రైలు ఎక్కెను. అవి శ్రీరామరాజు మన్యము యుద్ధపు రోజులు. బండిలో ప్రయాణికులు శ్రీరామరాజును

గురించి వింత కథలు చెప్పుకొనుచుండిరి. ఆయన అన్నవర ప్రవేశమును గురించిన ముచ్చటలు నారాయణరాజు చెవిని బడెను. అతని ఒడలు ఉప్పొంగెను. రైలు అన్నవరము స్టేషనులో ఆగగానే అతడు బండి దిగెను. అన్నవరములో శ్రీరామరాజు గాని, విప్లవకారులు గాని లేరు. అంతకు ముందు రెండు రోజుల క్రితమే వారు ఆయూరు నుండి వెళ్ళిపోయిరి. నారాయణరాజు నిరుత్సాహపడక అడవుల బడి శ్రీరామరాజును వెదకికొనుచు ముందుకు కదలెను. ఎక్కడనో ఒక చోట కలియకపోరని అతని ఆశ. అట్లే ఒకనాడు అడవులలో నొకచోట అతడు విప్లవకారులను చేరుకొనెను. శ్రీరామరాజు అతని ఆకారమును చూడగానే అతని స్వభావమును గ్రహించి తన ముఖ్యానుచరులలో నొకనిగా జేసుకొనెను. అతడు తీవ్ర స్వభావము గలవాడు. తొందరపాటు ఎక్కువ. మిలిటరీ గుడారములకు నిప్పు పెట్టి నాశనము చేయుటయందు ఎక్కువ మక్కువ చూపెడివాడు. అందుచే అతనికి "అగ్గి రాజు" అను పేరు వచ్చెను.

ఏజన్సీ ప్రాంతమంతయు టెలిఫోన్ సౌకర్యములు ఏర్పరుపబడెను. టెలిఫోను తీగలు కత్తిరించుట పౌరుషచర్య కాదని శ్రీరామరాజు తన అనుచరులను మందలించెడివాడు. అయినను అప్పుడప్పుడు విప్లవకారులు వానిని త్రెంపివేయు చుండెడువారు.

ప్రభుత్వ సైనికులు మన్నె ప్రాంతమంతయు శిబిరము లేర్పరచుకొని విధి విరామము లేకుండ తిరుగుచుండిరి. కాని విప్లవకారులు ఎప్పుడు ఎటనుండి పైబడుదురోయను భీతితో నుండువారు. ఎచ్చటనుండియో శ్రీరామరాజు అనుచరులతో వచ్చి ప్రభుత్వ సైన్యముపైబడి చెదరగొట్టి అంతలో మాయమయ్యెడివాడు. ఈ గెరిల్లా యుద్ధ ప్రావీణ్యమునందు అతడు శివాజీని పోలును. ఎప్పుడైనను తాను ఓడినను ఆ ప్రదేశమును వదలి యడవుల జొచ్చి, కొండల ప్రాకి, కోనలు దిగి, గుట్టలు దాటి, గుహలందు దాగి, ఎండలో వానలో తిరిగి తిరిగి శత్రువులనోడించుటకు అనువగు తావులకు జేరుకొనువాడు. జయించినను ఓడినను రాణాప్రతాపునివలె ఒక తావు నుండి ఇంకొక తావునకు బోవుచు తగు సమయము కొరకు నిరీక్షించెడువాడు. ప్రభుత్వము పెట్టు బాధలు లెక్కగొనక సహించుచు శ్రీరామరాజు ఆజ్ఞలను మన్నెప్రజలు సంతోషముతో శిరసావహించుచుండిరి. ప్రభుత్వ సైన్యములను తప్పుదారులను బట్టించి శ్రీరామరాజు అనుచరులకు సర్వవిధముల సహాయము చేయుచుండిరి. ప్రజల యొక్క ఈ సహాయ నిరాకరణమును తుద ముట్టింపనెంచి ప్రభుత్వము పోలీసు ప్యూనిటివ్ పన్ను మాత్రమే గాక అనేక నిర్బంధములను విధించినది. గోదావరినది పొడవున ముఖ్యమగు రేవులలోను,

మన్యప్రాంతమునకు దగ్గరగానున్న రైలు స్టేషనులలోను, మన్యములో విక్రయించుటకు ఆహార పదార్థములను గొనిపోవు వర్తకులను నిర్బంధించిరి. ఈ పదార్థములను వారు విప్లవకారులకు అందజేయుటకే కొనిపోవుచున్నట్లు ప్రభుత్వము అనుమానించెడిది. మన్య ప్రజలకు గూడ ఆహారము దొరకనీయక పోయినచో త్వరలోనే లొంగివత్తురని ప్రభుత్వము తలంపు. దీనికి ప్రతీకారముగా ప్రభుత్వ సైనికుల కొరకు బండ్లపై బోవు ఆహార సామగ్రిని విప్లవకారులు దోచుకొని ప్రజలకు అందజేసెడివారు. సాయుధులగు పోలీసులు కాపలా కాయుచున్నను వారిని తుపాకులతో చెదరగొట్టి అగ్గిరాజు ఆ బండ్లను తోలుకొనిపోయెడివారు. తరువాత అధికారులు బండి చక్రముల జాడను బట్టిపోవువారు. కాని ఆ జాడలు కొంత దూరము తరువాత కనిపించెడివి కావు. బండ్లను ఎక్కడికి తీసికొనిపోయిరో తెలిసెడిది కాదు. అగ్గిరాజు చర్యలు విచిత్రముగా నుండెడివి.

గ్రామములపై పోలీసు ప్యూనిటివ్ పన్ను విధింపబడెడిది. అట్టి గ్రామ ప్రజలను ఊరు వదలి కొండలపై నివసింపుడని శ్రీరామరాజు శాసించువారు. అనంతరకాలములో చీరాల పేరాల ప్రజలు దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారి వలె శ్రీరామరాజు ఆజ్ఞను మన్యపు ప్రజలు పాలించెడివారు. అధికారులు పన్నులడగవచ్చుననంతనే ప్రజలు కొండలపైకి పారిపోవువారు. వర్షాకాలములో చాల బాధలు పడువారు, ప్రభుత్వాధికారులు గ్రామములలో మిగిలిన కొందరు మనుష్యులను నిర్బంధించి వారిపై నేరము లారోపించి ప్రజలచేతనే బలవంతము చేసి సాక్ష్యమిప్పించెడివారు. అట్టి సాక్షులపై తక్కిన ప్రజలకు ఆగ్రహము కలిగి అంతఃకలహములు కలుగకుండ శ్రీరామరాజు ఆ సాక్షులను ప్రజల మధ్యనే విచారించి ప్రభుత్వము తరపున సాక్ష్యమిచ్చినందులకు జరిమానా విధించెడివారు. పోలీసులు బలవంతముతో వారు సాక్ష్యమిచ్చిరి గాని ఈ జరిమానాను వారు సంతోషముతో చెల్లించెడివారు.

# 27. మల్లుదొర పట్టుబడుట

విప్లవకారులు గ్రామము నుండి గ్రామమునకు తిరుగుచున్నను సరియగు సమయములో ప్రభుత్వ సైనికులకు వార్తలు అందకపోవుటచే వారిని ప్రభుత్వము పట్టుకొనలేకుండెను. 1923 సెప్టెంబరు 2వ తేదీని మాత్రము రామవరము ప్రాంతమునకు కమాండర్ అండర్‌వుడ్‌కు విప్లవకారులు తారసపడగా ఇరుపక్షములకును యుద్ధము జరిగెను. దానిలో అండర్‌వుడ్ ఆధీనములోనున్న సిబ్బంది విప్లవకారుల కాల్పులకు 'ఈగలవలె రాలిపోయిరి'. ఆ తరువాత సెప్టెంబరు 17 తేదీని మల్లుదొర పట్టుబడు వరకును ముఖ్యమైన సంఘటనలేవియు జరుగలేదు.

శ్రీ రామరాజు అనుచరులలో ముఖ్యుడును, అపూర్వ సాహసియునగు గాం మల్లుదొరకు దురదృష్టవశమున రెండు దురభ్యాసములు గలవు: త్రాగుడు, వ్యభిచారము. అందువలననే అతనిని పట్టుకొనుట సులువైనది. శ్రీరామరాజు ఎన్ని సార్లు వానిని విడువవలెనని హెచ్చరించినను మల్లు దొరకు సాధ్యము కాలేదు. విప్లవము మొదలైన దగ్గర నుండి మితిమీరి త్రాగుట మానివైచెను. ఎప్పుడైనను త్రాగినప్పుడు మాత్రము రాజునకు తెలియకుండ త్రాగును. అతనికొక యుంపుడుకత్తె కలదు ఆమె కడకు అప్పుడప్పుడు రహస్యముగా పోవుచుండువాడు. ఇతర విషయములలో రాజుతో అసత్యమాడుటకు వెఱచినను ఈ విషయములో మాత్రము అతడు ఏదియో నెపమును గల్పించి చెప్పి తన యుంపుడుకత్తె ఇంటికి పోవుచుండువాడు, శ్రీరామరాజు తన ముఖ్యానుచరుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు రహస్యముగా వేగులవారిని నియమించి తెలిసికొనుచుండును. ఒకనాడు మల్లుదొర ఏదియో కారణమును జూపి తనయింటికేగుటకు రాజు అనుమతి పొందెను. మార్గమధ్యమున నొక తాడిచెట్టు నెక్కి దానికి కట్టబడిన లొట్టెలలోని కల్లును కడుపునిండుగా త్రాగి, ఇంటి మొగము బట్టి తూలుచు పోవుచుండెను. ఇదియంతయు నొక ప్రభుత్వ గూఢచారి కనుగొని రహస్యముగా మల్లు దొరను వెంబడించెను. చివరకు మత్తు బాగుగా ఆవహించి శరీరము స్వాధీనము తప్పి మల్లుదొర క్రింద బడిపోయెను. ఆ తావు నిర్జనమగుటచే ప్రభుత్వ గూఢచారి స్మృతితప్పి పడియున్న మల్లును సమీపించి యతనిని విప్లవకారుల రహస్యములను గురించి ప్రశ్నించుచుండెను. మల్లు దొర సగము తెలివితో అస్పష్టముగ నేవియో సమాధానములిచ్చుచుండెను. ఇంతలో వెనుకనుండి తుపాకి ప్రేలి గూఢచారి నేలగూలెను. మల్లుదొర ప్రయాణమైనంతనే శ్రీరామరాజు కనుసన్నల నాజ్ఞబొంది యొక

వేగు అతని ననుసరించెను. అతడు ప్రభుత్వ గూఢచారిని చంపకుండినచో చాల అనర్థము వాటిల్లెడిది. త్వరలోనే మల్లుదొర రాజు సమక్షమున నిలువబడెను. రాజుకు కోపము వచ్చి మద్యపానమును వ్యభిచారమును విడువనంతవరకు అతడు తమకు నిజమైన సహాయకుడు కాజాలడని చెప్పి ఆయుధములను విసర్జించి విప్లవ దళమును విడిచిపొమ్మని ఆజ్ఞాపించెను. మల్లుదొర వణకుచు ఎంతయో దుఃఖించెను. తన రాజు ఆజ్ఞ నుగ్రీవాజ్ఞగావెంచి తుపాకిని, కత్తిని ఆయన పాదముల కడ నుంచి సాష్టాంగపడి వెడలిపోయెను.

దానితో విప్లవము నుండి విడిపోవుట మల్లుదొర ఆలోచన కాదు. తన రాజుపై అతని కేమాత్రము కోపము లేదు. తన సంఘమునకు ద్రోహముచేయు తలంపుగూడ అతనికి లేదు ఇదివరకు తన నాయకుని యాజ్ఞ ఎట్లు పాలించెనో ఇప్పుడును ఆయాజ్ఞ ననుసరించి పొమ్మనుటచే బోయెను. ఎప్పుడు రమ్మనిన అప్పుడు మరల తన నాయకుని జేరును. తన రాజు మాట యందు అతనికి అమిత విశ్వాసము. తన యపరాధముచేతనే తన కట్టి శిక్ష విధింపబడెనని అతడు తలపోయువాడు.

అనంతరము మల్లుదొర నడింపాలెములో తన యుంపుడుకత్తె సుమర్ల సింకు బుల్లి అనే చితుకులమ్మ కొంపకు జేరి తప్ప త్రాగి యామెతో గడపుచుండెను. తన నీడలో వెంటాడుచు శత్రువులు పొంచియుందురను తలపు గూడ లేకుండ అతడు నిర్భయముగా అచ్చట నుండెను. శత్రువుల రాక తనకు ముందుగానే గ్రామస్థులు తెలియజేయుదురను ధైర్యముతో అతడచ్చట రెండు రోజులుగా కాలము గడుపుచుండెను. కాని విధి వక్రించినది. అదృష్టమతనిని చిన్నచూపు చూచినది.

1923 సెప్టెంబరు 17వ తేదీ రాత్రి 11 గంటల సమయము, గాం మల్లుదొర నడింపాలెములో ఒక కొండ దొర యువతి ఇంటి యందున్నాడనియు శరభన్నపాలెము నుండి అతనికి సారా పంపబడినదనియు నిమ్మగడ్డ గ్రామ మునసబు పనసల శరభన్న పడాలు నుండి కీరన్సుకు వార్త అందెను. వెంటనే కృష్ణదేవి పేట నుండి ఒక భారతీయ ఆఫీసరు, ఇద్దరు నాన్‌కమిషన్డు ఆఫీసర్లు, 20 మంది సైనికులు, ఇన్స్పెక్టరు రాధాకృష్ణతో కీరన్సు బయలుదేరెను. మాకారము గ్రామము దాటిన తరువాత నడింపాలెము వైపు రెండు లాంతర్లు వెళ్లుట పోలీసు దళము కంటబడెను. అవి బహుశా మల్లుదొరకు హెచ్చరిక చేయుటకు వెళ్ళుచున్న మనుష్యుల చేతులలోనివి అని తలచి వానికంటె ముందుగానే పోలీసు దళము నడింపాలెము చేరుకొనెను. ఒకదానికొకటి అనుకొనియున్న

రెండు ఇళ్ళను పోలీసులు చుట్టుముట్టిరి. అందులో ఒకదానిలో కొండదొర యువతిని కనుగొనిరి. ఇంటిలో నెవరున్నారో చెప్పుటకు ఆమె నిరాకరించెను. వెంటనే ఇల్లు సోదా చేయబడెను. మల్లు అంతకుముందే ఈ హడావిడిని గమనించి ఆ యింటిలో గల అటుక నెక్కి యుండెను. క్రింద అంతయు గాలించి కొంత సాహసముతో ప్రాణములకు తెగించి పోలీసులు అటుక నెక్కుటకు ప్రయత్నించిరి. అతని కడ తుపాకి లేదు. అటుక పైనున్న సామానును అతడాయుధములుగా నుపయోగించెను. చేతికందిన వస్తువులనెల్ల విసిరిపోరాడెను. చిన్న చిన్న ముంతలను పోలీసులపై విసిరికొట్టెను. పెద్ద పెద్ద బానలను వారిపై దొరలించెను. పెట్టెలు, బుట్టలు, తట్టలు అన్నిటిని ఉపయోగించెను. అటుకపై సామాను అయిపోయినవి. పై నుండి ప్రతిఘటన ఆగెను. ముగ్గురు మలబారు స్పెషల్ పోలీసులు. జమాదారు నారాయణకురూప్ ధైర్యము కూడ గట్టుకొని అటుకనెక్కిరి. మల్లుదొర పెద్ద ధాన్యపు పాతకలో దాగుకొనెను. అతని వద్ద ఒక పెద్ద కత్తి, ఒక గొడ్డలి ఉండెను.. కటిక చీకటి. విల్లుండుటకు స్థలము చాలదు అందుచే వానిని ఉపయోగించుటకు గూడ వీలులేక పోయెను. క్రింద నున్న సైనికులు మల్లును పొడుగుపాటి గెడలతో పొడిచిరి. పైన సైనికులు బాయొనెట్లతో పొడిచిరి. ఇరుకుగా నున్న ఆ ప్రదేశములో సైనికులు తన దరి చేరకుండ కత్తి విసరుచు గొడ్డలి త్రిప్పుచు శక్తి కొలది అతడు పోరాడెను. దేహమంతయు రక్తసిక్తమయ్యెను. నీరసమావహించెను. అతని ప్రతిఘటన నీరసముగా నుండుట గమనించి శత్రువులు చుట్టుముట్టి ఒక్కసారిగా నాతనిపై బడి బంధించుటకు చాల ప్రయాసపడిరి. అట్టి దిక్కు పరిస్థితిలో మల్లు లొంగవలసి వచ్చెను. వెంటనే ఈ వార్త తంతి ద్వారా ప్రభుత్వమునకు తెలుపబడెను. పితూరి ప్రారంభించిన తరువాత ప్రభుత్వ సైనికులు సాధించిన అపూర్వ విజయముగా ప్రభుత్వము ఈ వార్తను ప్రకటించినది.

సెప్టెంబరు 23 తేదీని కృష్ణాదేవి పేట నుండి ప్రభుత్వమునకు పంపిన నివేదికలో స్వీని ఇట్లు వ్రాసెను : "మొదట అటుకనెక్కిన ముగ్గురు మలబారు స్పెషల్ పోలీసులకు, వారి వెనుక నెక్కిన జమాదారుకు మల్లు దొర చేతిలో ఎట్టి ఆయుధమున్నదో తెలియనందున వారు ప్రాణములకు తెగించియే అటుకనెక్కిరని స్పష్టపడుచున్నది. మల్లుదొర నిర్బంధమునకు దారి తీసిన వార్తను ముగ్గురు గ్రామము మునసబులు అందించిరి. కాని తమ పేరులను బయటపెట్ట వద్దనియు, పితూరి అంతమయిన తరువాతనే తమకిచ్చు బహుమతులను ఇయ్యవలసినదనియు వారు కోరిరి. పితూరిదారులలో అతి దుస్సాహసియు, పరమ ఘాతుకుడును, రాజుయొక్క

# 28. గూడెం పోలీసు స్థావరముపై విప్లవకారుల దాడి

మల్లు దొర పట్టుబడిన తరువాత విప్లవకారులు ఉత్తర దిశగా ప్రయాణమై ఇంతవరకు వారు వెళ్ళని క్రొత్త ప్రాంతమునకు వెళ్లిరి. మినములూరు పెదుగాపాడేరు, పాడువాల గుంత జయపూరుకు ఒక రోడ్డు పోవును. సెప్టెంబరు 20 తేదీని గంగరాజు మదుగుల నుండి ఈ మార్గమున వారు పోవుచున్నట్లు తెలిసినది. 22 తేదీ రాత్రి వారు పాడేరు పోలీసు స్టేషనుపై దాడి చేసి పాడువా వైపు వెళ్లిపోయిరి. పితూరి ప్రాంతము నుండి రెండు పోలీసు దళములు వెంటనే వారిని వెంటాడుచు బయలుదేరెను. విశాఖపట్నం జిల్లా పోలీసు సూపరింటెండెంటు గూడ తన అధీనములోనున్న కొందరు రిజర్వు పోలీసులను, కోరాపుట్టి రిజర్వు నుండి ఇంకొక దళమును విప్లవకారులను రెండవ వైపు నుండి ఎదుర్కొనుటకు పంపెను. విప్లవకారులు వెనుదిరిగి గూడెము ప్రాంతమునకు మరలి వచ్చి దామనాపల్లి ఘాటువైపు సాగిపోయిరి. సెప్టెంబరు 30 తేదీని ఒక పోలీసు దళము వారిని కనుగొని కాల్పులు జరిపినది. కాని వారు తప్పించుకొనిరి. ఈ కాల్పులలో ఇద్దరు విప్లవకారులు గాయపడిరి. అందు ఒకడు తరువాత చనిపోయెను.

వరదల మూలమున అటు విప్లవకారులకు గాని ఇటు పోలీసులకు గాని ప్రయాణించుట దుర్ఘటముగా నుండెను. సెప్టెంబరు 23 తేదీతో ప్యూనిటివు పన్ను విధించుటకు పెట్టిన గడువు తీరిపోయినది. కాని ఉద్దిష్టఫలము కలుగకుండుటచే ప్రభుత్వము దానిని మరల ఉద్ధరించుట నిష్ఫలమని మానుకొనిరి. ఈ చర్యలలో పోలీసులలో చాల మంది అనారోగ్యమునకు గురియై ఇన్ఫ్లూయెంజాతో తీవ్రముగా బాధపడిరి.

చాల మంది గ్రామాధికారులపై గ్రామస్థులపై విప్లవకారుల ఆచూకి చెప్పి సహాయపడనందులకు, తమని తప్పుదారి పట్టించినందుకు కోర్టులలో కేసులుంచ నడిపి ప్రభుత్వము శిక్షలు వేయించుచుండెను. అక్టోబరు 18 తేదీని పంపిన నివేదికలో స్కాట్ ఇట్లు వ్రాసెను. "అతి దుష్టుడైన దామనాపల్లి గ్రామ మునసబును పట్టుకొని సాక్ష్యాధారములతో కోర్టుకు ఎక్కించుటకు చాల కాలము పట్టినది. మొగలిధొడ్డి దగ్గర విప్లవకారులు పొంచియుండుటకు సాయపడి, ఒక్క మాటతోనైనను హెచ్చరిక చేయకుండ పోలీసు దళము తన గ్రామములో నుండి వెళ్లుట చూచుచు వారిలో చాల మందిని

మృత్యు ముఖమునకు పంపిన దుర్మార్గుడు వాడు. ఈ నీచ కార్యమునకు వానిని నిర్బంధించి కోర్టులో కేసు పెట్టినను, విచారణ జరిపి సానుభూతితో కోర్టు వానిని విడిచి పుచ్చినది. కాని వాని దుష్కార్యములకు గాను ఇప్పుడు కొంతయైనను శిక్షపడుటచే కొంత ఊరట కలిగినది."

అక్టోబరు 11 తేదీ నుండి 14 తేదీ వరకు విప్లవకారులు తోకరాయి గ్రామము నందు బసచేసిరి. 20 తేదీని శ్రీరామరాజు నాయకత్వమున వారు ఎఱ్ఱవెర్లలో నుండిరి. 22 తేదీని ఎండు పడాలు, గంటం దొరల నాయకత్వమున సుమారు 50 మంది విప్లవకారులు గుండుపల్లిలో కనబడిరి. వారు రెండు వైపులను పోలీసు కావలా దళముల మధ్య చిక్కుకొనిరి. కాని ఆ కావలాదళములను గ్రామ మునసబులు తప్పుదారి పట్టించుటచే విప్లవకారులు తప్పించుకొనిరి. డిప్యూటి సూపరింటెండెంటు ముస్తఫా లీఖాను నాయకత్వమున గూఢచారి దళములు వారిని పట్టుకొనుటకు ప్రయత్నించి విఫలులైరి.

అక్టోబరు 26 తేదీని ఉదయమే సుమారు 60 మంది గల విప్లవకారుల దళము గూడెములో నున్న సైనిక స్థావరముపై బడినది. అప్పుడచ్చట 30 మంది గల ఈస్టు కోస్టు స్పెషల్ పోలీసు దళము ఒక భారతీయ ఆఫీసరు నాయకత్వమున నుండెను. దళాధిపతియగు హ్యూమ్ రక్షణ చర్యలలో దూరప్రాంతమున నుండెను. ఆ సమయమున దట్టముగా మంచుపట్టి వానజల్లు పడుచుండెను. ఖాళీ పోలీసు స్టేషనులపై జరుపు దాడులు నిష్ప్రయోజనమని యెంచి శ్రీరామరాజు ఆయుధములు సేకరించుటకు గూడెము శిబిరముపై దాడి చేసెను.

శ్రీరామరాజు తన దళమును నాలుగు భాగములుగా చేసెను. ఒక భాగము శిబిరమునకు వెనుకనున్న స్నానపు గదుల నుండి లోనికి ప్రవేశించి వీలైనన్ని తుపాకులు తేవలెను. రెండవ భాగము శ్రీరామరాజు దగ్గరనే యుండి ఆజ్ఞ ఈయగానే కాల్పులు సాగించవలెను. మూడవ భాగము డప్పులు వాయించి గందరగోళము సృష్టించి ఆఫీసర్ల ఆజ్ఞలు సైనికులకు వినిపించని విధముగా కల్లోల పరిస్థితిని కల్పించవలెను. నాల్గవ భాగములోని వారు "బాబూ, మేము కూలీలము" అని అరచుచు కాల్పులు సాగించు సైనికులను సందేహస్థితిలో పెట్టవలెను. ఇట్లు చాతుర్యముతో గూడిన సన్నాహములు చేసికొని శ్రీరామరాజు చీకటి రాత్రివేళ మబ్బుగనున్న సమయమున శిబిర నాయకుడగు హ్యూమ్ లేని సమయము కనిపెట్టి దాడి చేసెను. శ్రీరామరాజు ఏటవాలుగానున్న కొండపై నిల్చుండి గమనించుచుండెను.

మొదటి దళము ఆయుధముల కొరకు సిపాయిలు నిద్రించు చోటికి ప్రాకివెళ్ళిరి సైనికులు నిద్రలో నుండిరి. 'స్టాండ్సు' నుండి తుపాకులను తీసికొనుటకు విప్లవకారులు ప్రయత్నించిరి. మిలిటరీ సుబేదారును ఒకడు వానిని నేర్పుగా అమర్చియుంచెను. వానిని బయటకు తీయవలెననిన మొదటి తుపాకిని స్టాండు నుండి కొంచెము పైకి ఎత్తి వెడల్పుగానున్న భాగమును ముందుకు లాగుచు తుపాకి గొట్టమును క్రిందికి దింపవలెను. ఈ కిటుకు విప్లవకారులకు తెలియనందున వారెంత గుంజినను ఒక్క తుపాకినైనను బయటకు తీయజాలక పోయిరి. ఈ ప్రయత్నములో వారుండగా కాపలా సిపాయి పసిగట్టి పెద్దగా అరచి 'ఛాలెంజ' చేసెను. వెంటనే కొండపై నుండి శ్రీరామరాజు కాల్చెను గాని అది కొద్దిలో గురి తప్పిపోయెను. కాపలా సిపాయి ధ్వని వెంబడి కొండపైకి కాల్పులు సాగించెను. ఇంతలో శిబిరమున నిద్రించుచున్న సిపాయిలు మేల్కొని తుపాకులతో బయటికి వచ్చిరి. ఆ సమయమున సుబేదారు రమాన్, జమాదారు, సబిన్స్పెక్టరు అనంతప్ప శెట్టి, డాక్టరు శ్రీనివాసరావు పేకాడుకొనుచుండిరి. సిపాయిలు కలహించుచుండిరని మొదట వారు అనుకొనిరి. బయటకు రాగానే పరిస్థితిని గుర్తించి కాల్పులకు ఆజ్ఞనిచ్చిరి. కాని తుపాకులలో గుండ్లు లేవు. ఏ కారణము చేతనైనను తుపాకులు విప్లవకారుల వశమైన యెడల వానిలో గుండ్లు లేకుండుటకు గాను సిపాయిలు గుండ్లను తలగడలలో పెట్టుకొనిపరుండిరి. సిపాయిలు గుండ్ల కొరకు శిబిరము లోపలికి పోవుట చూచి వారు పారిపోవుచుండిరని భావించి శ్రీరామరాజు శిబిరముపై కాల్పులు చేయవలసినదిగా ఆజ్ఞాపించెను. అప్పుడే మూడవ దళము వారు సుమారు 20 మంది డప్పులు వాయించి గందరగోళము సృష్టించిరి. వెంటనే నాల్గవ దళము 'బాబూ, మేము కూలీలము' అని పదే పదే కేకలు వేయసాగిరి. ఆ గాఢాంధకారములో సిపాయిలు తుపాకులలో గుండ్లు నింపి కాల్పులు ప్రారంభించి అయిదు సార్లు కాల్చిరి. కాని శ్రీరామరాజు అనుచరులతో కొండలలోనికి పోయి అదృశ్యమయ్యెను.

ఈ పోరాటములో మహమ్మదుహాస్సేన్ అను సైనికుడు గాయపడి పిదప మరణించెను. అతని సాహసమును, ఆ యుద్ధమును గురించి అక్టోబరు 29 తేదీని ప్రభుత్వమునకు పంపిన నివేదికలో ఇట్లు కలదు. "..... అడవి సరిహద్దులో లాన్సు నాయక్ మహమ్మదు హాస్సేను గాయపడి పడిపోయెను. తక్కిన సిపాయిలు తుపాకులు కాల్చుచు ముందునకు ఉరుకుచుండిరి. అప్పుడు హాస్సేను తన తుపాకి నుండి 'బోల్టు, బాయొనెట్‌లను తూటాల బెల్టును తీసివైచి దూరముగా విసరివేసెను. ఇద్దరు విప్లవ

కారులు అతనిపై దూకి తుపాకిని చేజిక్కించుకొనిరి గాని తూటాలు, బాయొనెట్ వారికి చిక్కలేదు. సాహసవంతుడైన ఆ లాన్సు నాయక్ రెండు గంటల తరువాత మరణించెను. ఈ లోగా విప్లవకారులు పారిపోయిరి. ఈ పోరాటములో ఒక విప్లవకారుడు చంపబడెను. పెక్కు మంది గాయపడి యుందురని రక్తపు ధారలను బట్టి తెలియుచున్నది. ఈ దాడిలో ప్రత్యేకముగా గమనింపవలసిన విశేషమేమనగా గూడెము గ్రామ ప్రజలే కాక గూడెము తాలూకాలోని అనేక ఇతర గ్రామవాసులు గూడ ఇందు పాల్గొనిరి గూడెము గ్రామమంతయు ఇప్పుడు పాడుపడియున్నట్లు ఉన్నది. ఎవ్వరును లేరు. మగవారందరు విప్లవకారులతో జేరినట్లు కన్పించుచున్నది". ఈ దాడిలో ప్రభుత్వ సైనికులకు విప్లవ కారుల నుండి ఒక పోలీసు తుపాకి, 101 తూటాలు దొరికినవి. శిబిరమును రక్షించిన సుబేదారు అబ్దుల్ రహమానుకు పోలీసు మెడల్ ఇచ్చి గౌరవించిరి, మరణించిన సిపాయికి లాంఛనములతో తుది సంస్కారములు చేసిరి.

నవంబరు 10, 11 తేదీలకు ప్రభుత్వమునకు పంపిన నివేదికలో స్కాట్ విప్లవకారుల విశేషములను తెలుపుచు ఇట్లు వ్రాసెను: 'పట్టుబడిన ఒక విప్లవకారుని వాఙ్మూలము ఆసక్తిదాయకముగా నున్నది. అతడు పితూరి ప్రారంభములోనే విప్లవకారులతో జేరెను. 1923 జులై 29వ తేదీని తులాబాద వద్ద విప్లవకారులు ప్రభుత్వ సైనికులకు రేషను తీసికొని వచ్చు బండ్లను దోచుకొనిన సమయమున విప్లవ నాయకుడగు రాజుతో తుని రాజొకడు కలిసెనని అస్పష్టముగా చెప్పుచున్నాడు. కిలంకోట నివాసియగు ఇంకొక రాజు ఆ రాజుకు (శ్రీరామరాజుకు) ఆహార సామగ్రి, రు. 400/- సొమ్ము పాడేరు నుండి తిరిగి వచ్చుచుండగా అందించెనని కూడ చెప్పుచున్నాడు. ఇంకను, శ్రీరామరాజు తన అనుచరులకు తమకు కనిపించిన యూరోపియనులను చంపుమనియు, బలవంతము లేకుండ తమవద్దగల ఆయుధములిచ్చి వేసినచో సాయుధులైన భారతీయులను గూడ చంపవలదనియు చెప్పువాడట. పట్టుబడిన ఇంకొక విప్లవకారుని వాఙ్మూలము గూడ ఆసక్తికరముగనే యున్నది. చెడిపోయిన తుపాకులను బాగు చేయుట వీని పని. ప్రతి దినమును ఆయుధములను, తన అనుచరుల ఆయుధ శిక్షణను రాజు పరిశీలించు చుండువాడట. గూడెముపై దాడి విషయములో జ్యోతిశ్శాస్త్ర ప్రకారము ఆ సమయమున దాడి చేసినచో పోలీసులు వారి ఆయుధములు విడిచి పారిపోవుదురని రాజు చెప్పినట్లు తెలియుచున్నది. "సెప్టెంబరు నెల మధ్య నుండి విప్లవకారులు ఘాటుల దిగువ ప్రాంతమున పెద్ద యెత్తున కనబడకపోవుటచే వారు మన గూఢచారి దళమును చూచియు, మనకు ప్రతికూలురైన గ్రామాధికారులను గ్రామస్థులను శిక్షించుటను చూచియు భయపడి యుందురని తోచుచున్నది."

పెద్ద గెడ్డపాలెము సైనిక చర్యల తరువాత విప్లవకారుల శక్తి అణగిపోయినదనియు, వారి వద్ద తుపాకులు, మందుగుండు లేవనియు ప్రభుత్వము తలచెను. అందుచే ఈ దాడి వారికి ఆశ్చర్యము కలుగజేసినది. గూడెము శిబిరముపై ఈ దాడిని గురించి జి.ఆర్.ఎఫ్. టాటెన్‌హాం డిసెంబరు చివరి వారమునకు పంపిన తన నివేదికలో ఇట్లు వ్రాసెను : ఒక సంవత్సరము క్రితము ఏ పరిస్థితిలో ఉన్నామో ఇప్పుడును అదియే పరిస్థితిలో మున్నాము. ఏదియో ఒక సాహసిక చర్యకు దిగవలెనని యెంచి పితూరిదార్లు ఈ దాడిని తలపెట్టినట్లు కనిపించుచున్నది."

హోం సభ్యుడు నాప్ ఇట్లు అభిప్రాయపడెను: "గూడెము శిబిరముపై దాడి వలన ఒక విషయము స్పష్టమగుచున్నది. బహుశా చాల తక్కువ సన్నాహముతో మనము విప్లవకారుల చర్యలను ఎదుర్కొనుచున్నట్లు తోచుచున్నది."

గూడెము శిబిరముపై దాడి తరువాత విప్లవకారులు అదృశ్యమైరి. ధారకొండకు రెండు మైళ్ళ దూరములో వారు కనబడిరను వార్త అందుటచే నవంబరు ఒకటవ తేదీని హ్యూం కొంత సిబ్బందితో వారి దారిలో మాటు కాసి పట్టుకొనుటకు ప్రయత్నించెను కాని అవి విఫలమయ్యెను. వారిని చూచి దూరము నుండి కాల్చుటచే ఒక విప్లవకారుడు మరణించెను; కొందరు గాయపడిరి మరల నవంబరు 5వ తేదీని కొండలయ్యగొంది వద్ద ఒక విప్లవ దళమును చూచి హ్యూం సంచారదళము కాల్పులు జరుపగా ఇద్దరు చనిపోయిరి. ఒకడు గాయపడెను. దాని తరువాత నవంబరు 22న మన్యము అంచుననున్న ఉరట్ల గ్రామమును 50 మంది గల విప్లవదళము చేరినట్లు తెలిసెను. అప్పటి నుండి ఆ సంవత్సరము చివరి వరకు విప్లవకారులు పోలీసు సంచార దళములతో దాగుడుమూతలాడుచునే యుండిరి. చెదరిపోయిన ఒకరిద్దరు విప్లవకారులు పట్టుబడిరి. కాని చాల మంది విప్లవ దళమును విడిచిపోవుచున్నట్లుగా ప్రభుత్వమునకు వార్తలందు చుండెను. మల్లుదొరను పట్టించుటలో మిక్కిలి సహాయపడిన నడింపాలెము బారికిని విప్లవకారులు డిసెంబరు 11వ తేదీని పట్టుకొని చావమోదిరి. గంటందొర నాయకత్వమున 30 మంది విప్లవకారులు శరభన్నపాలెం దగ్గర కనబడిరని 21వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతమున వార్త అందినది. రంపులు, దమనపల్లి ఘాటులపై పోలీసు సంచార దళములు పంపబడెను. కాని విప్లవకారుల జాడ ఎచ్చటను కనబడలేదు. డిసెంబరు చివరి వారమంతయు కొమ్మిక, కంతారము, లాలరేవు ప్రాంతమందు వారు తిరుగుచుండిరని ప్రభుత్వమునకు వార్తలు వచ్చుచుండెను.

ఏమైనను ఏజన్సీలోనున్న ప్రభుత్వ బలము అప్పటి పరిస్థితిని అదుపులోనికి తెచ్చుటకు చాలదని చివరకు ప్రభుత్వము అభిప్రాయపడినది. అసలు విప్లవకారులు 100 మంది కంటె ఎక్కువ మంది లేకున్నను మన్య ప్రాంతమంతయు విప్లవకారుల వెనుక నుండి సహాయపడుచున్నదనియు, వారు ఏ ప్రాంతములోనున్న ఆ ప్రాంతపు జనులు వారిలో జేరుచున్నారనియు ప్రభుత్వము గ్రహించినది. అందుచే అటవీ ప్రాంత యుద్ధము నందు ఆరితేరిన సైన్య సహాయము వలన గాని వారిని అణచుటకు సాధ్యపడదని మద్రాసు రాష్ట్ర ప్రభుత్వము అభిప్రాయపడి అస్సాం రైఫిల్సు దళమును పిలిపించుటకు నిశ్చయించుకొనెను.

# 29. వదంతులు - వాస్తవాలు

(ప్రజలలో అల్లూరి సీతారామరాజు అని పేరే స్థిరపడినది. కావున ఇట నుండి సీతారామరాజనియే వ్యవహరింతుము)

1923 డిసెంబరులో కాకినాడలో భారత జాతీయ కాంగ్రెసు మహాసభలు జరుగుచుండెను. మహమ్మదాలీ అధ్యక్షుడు, జవహర్‌లాల్ నెహ్రూ కార్యదర్శి. దేశ ప్రజలు జాతీయతాభావతరంగముల నోలలాడుచుండిరి. అల్లూరి సీతారామరాజు వీరకృత్యములతో విప్లవ గాథలతో ఆంధ్రక్షోణి మారుమ్రోగుచుండెను. పేరు వినుటయే గాని సీతారామరాజును చూచినవారు తక్కువ. సర్వసంగ పరిత్యాగియైన ఒక యువ సన్యాసి ఒంటరిగా సర్వవిధ సంపన్నమైన బ్రిటిషు ప్రభుత్వమును ఎదుర్కొని పోరాడుచు ఊపిరి సలుపనిచ్చుటలేదను వార్తలు ప్రతి దినము పత్రికలు అందించుచుండెను. అట్టి సీతారామరాజు కాంగ్రెసు మహాసభలకు రాగలడనియు, అతని సందర్శన భాగ్యము లభింపగలదనియు అప్పటికి వచ్చిన ప్రజానీకము ఉవ్విళ్లూరుచుండెను. ఆ మహాసభలకు వచ్చి రాజు తన సందేశమును వినిపింపగలడని ప్రజలు, నాయకులు గూడ భావించిరి. ఈ వదంతులు విని ప్రభుత్వము గూడ రాజును బంధించుటకు సకల ప్రయత్నములు చేసినది. గూఢచారులు ప్రత్యేకముగా కాకినాడకు పంపబడిరి. కాని రాజు జాడ ఎచ్చటను కనబడలేదు. సభలు పూర్తి అయిన తరువాత సీతారామరాజు పంజాబీ వాలంటీరుగా సిక్కు వేషములో వచ్చి వెళ్లినని ప్రజలు చెప్పుకొనిరి.

ఆ రోజులలో విప్లవవీరుడు పృథ్వీసింగు రాజమండ్రి సెంట్రలు జైలులో శిక్షను అనుభవించుచుండెను. రాజవొమ్మంగి స్టేషనుపై దాడిచేసి మొట్టడం వీరయ్య దొరను విడిపించినట్లు సీతారామరాజు సెంట్రలు జైలుపై దాడిచేసి పృథ్వీసింగును విడిపించునను వార్త దేశములో సంచలనము కలుగజేసెను. ప్రభుత్వము కలవరపడినది. జైలు అధికారులు మిక్కిలి భయపడిరి, 500 మంది మిలిటరీ సిపాయిలు జైలుకు కాపలా పెట్టబడిరి. జైలులోని తుపాకులు మొదలగు ఆయుధ సామగ్రిని కాకినాడకు తరలించిరి. జైలు ప్రాంతమంతయు విద్యుద్దీపములతో నింపిరి. ఆ సమయమున రాజమండ్రి జైలులో నిర్బంధవాసమును గడుపుచుండిన స్వాతంత్ర్య యోధురాలగు దువ్వూరి సుబ్బమ్మగారు పై విషయములు తెలిపియుండిరి. కాని వదంతి నిజము కాలేదు. ఎట్టి విధమైన దాడియు జరుగలేదు. రాజునకు పృథ్వీసింగు మొదలగు విప్లవకారులతో

పరిచయము కలదనియు, వారితో బాటు రామసింగు అను పేరుతో రాజు తిరుచుండువాడనియు, పృథ్వీసింగు సలహాలను రాజు పొందియుండుననియు, ఇప్పుడతని సహాయమును రాజు కోరుచున్నాడనియు వదంతులు వ్యాపించెను. గాని అవి వాస్తవమనుటకు ఎట్టి యాధారమును లేదు. సీతారామరాజు స్వప్రతిభతోడనే సమరమును సాగించెను గాని ఇతర రాష్ట్ర విప్లవవీరుల సహకారము గాని, రాష్ట్రములోని జాతీయవాదుల సహాయముగాని అతడు అర్థించినట్లు కనిపించదు.

# 30. అస్సాం రైఫిల్సు దళము రాక

మద్రాసు ప్రభుత్వము కోరికపై అటవీ ప్రాంత యుద్ధములలో ఆరితేరిన అస్సాం రైఫిల్సు దళము రెండు కంపెనీలను అస్సాం ప్రభుత్వము పంపినది. ఈ దళము 1924 జనవరి 27వ తేదీని నర్సీపట్నము చేరినది. తరువాత వారికి నియమించిన స్థావరములను చేరుకొనినది.

జనవరి మాసమంతయు విప్లవకారులు ఆహార సామగ్రిని సేకరించుకొనుచు మన్య ప్రాంతమంతయు తిరుగుచునే యుండిరి. చిన్న దళములుగా విడిపోవుచు, మరల నెచ్చటనో సంకేతములను బట్టి కలిసికొనుచు వారు తిరుగుచుండిరి. ఫిబ్రవరి నెలలో వారు జయపురము జిల్లా పాడువా తాలూకాలో సంచరించినట్లు తెలియుచున్నది. కాని ఎక్కడ తిరుగుచుండిరో స్పష్టమైన సమాచారము లేదు. వారి కొరకు గూడెము పర్వత ప్రాంతమందును, మరికొన్ని తావులందును ఫిబ్రవరి, మార్చి నెలలలో మిలిటరీ దళము ఒక క్రమ పద్ధతిలో అన్వేషణ సాగించినది. కాని వారు ఒక విప్లవకారుని భార్యను మాత్రము పట్టుకొనగలిగిరి. ఆమెను బాధించగా తన భర్త దాచిన ఆయుధములున్న చోటును చూపినది. ఒక పోలీసు తుపాకి, ఒక దేశవాళీ తుపాకి, కొన్ని తూటాలు, ఇతర వస్తువులు అచ్చట దొరికినవి. అంత కంటె విప్లవకారులకు సంబంధించిన ఇతర సమాచారమేమియు లభించలేదు. కాని విప్లవకారులకు ఆశ్రయము లభించుచున్నదను ప్రాంతమంతయు ప్రతి వారము సైనిక దళములు గాలించుచుండెను.

ఏప్రిల్ 17వ తేదీని విప్లవముల నణచుటలో అనుభవశాలియగు టి.జి. రూథర్‌ఫర్డును మన్యప్రాంతమునకు స్పెషల్ కమిషనరుగా బ్రేకను స్థానమున నియమించిరి. ఇతడు గుంటూరు జిల్లాలో పల్నాటి విప్లవమును క్రూరముగా నణచివేసి ప్రభుత్వములో సమర్థుడని ప్రసిద్ధి గాంచినవాడు. మిలిటరీ, పోలీసు, తదితరులు బలమంతయు అతని అధీనములో నుంచబడెను. అతడు వచ్చిన వెంటనే కొన్ని కఠిన చర్యలు తీసికొనెను. కొన్ని ప్రాంతములపై ప్యూనిటివ్ పన్ను విధించెను. విప్లవకారులకు సహాయము చేయు గ్రామాధికారులను, ఇతరులను కఠినముగా శిక్షించెను. అతడు బాధ్యతలు స్వీకరించుటకు ముందు ఘాట్‌ల పై ప్రాంతమంతయు 14 భాగములుగా చేసి అంతటను ఏకకాలముననే విప్లవకారుల కొరకు వెదకుచుండిరి. అస్సాం రైఫిల్సు పటాలమును వర్షాకాలమునకు ముందే పంపివేయుదుమని తీసికొనివచ్చిరి. కాని

ప్రయోజనము నెరవేరక పోవుటచే ఇంకను కొంత కాలము ఆ పటాలమును అట్టిపెట్టుకొనుటకు మద్రాసు ప్రభుత్వము అస్సాం ప్రభుత్వమును అనుమతి యడిగినది. అందులకు అస్సాం ప్రభుత్వము అంగీకరించలేదు. కాని వర్షాకాలమునకు ముందే మొత్తము సైనిక దళమును తిరిగి పంపివేసినచో ఇంకొక పటాలమును గూడ పంపుటకు సమ్మతించినది. దానికి మద్రాసు ప్రభుత్వము ఒప్పుకొనుటచే 200 మంది సైనికులు గల ఇంకొక అస్సాం రైఫిల్సు పటాలము పంపబడెను. ఈ పటాలము ఘాట్ల క్రింది ప్రాంతమంతయు అన్వేషించుటకు నియోగింపబడెను.

అయినను అనేక కారణములచే విప్లవకారులను నిర్బంధించుట అంత సులభముగా కనుపించలేదు. ఆ ప్రాంతమంతయు దట్టమైన అడవులు, కొండలతో నిండియుండెను, అంతియే కాక ఆ ప్రాంతమందున్న గ్రామములలోని ప్రజలు విప్లవకారుల యెడ మిక్కిలి సానుభూతి కలిగి అన్ని విధముల వారికి సహాయపడుచుండిరి. గ్రామాధికారులు, క్రింది ప్రభుత్వోద్యోగులు కూడ వారిపట్ల సానుభూతి చూపించుచు వారిని గురించి సమాచారమును తగు సమయములో ప్రభుత్వాధికారులకు అందించకుండిరి. ఇది విప్లవకారులను నిర్బంధించుటకు ముఖ్యావరోధముగా పరిణమించినది. అందుచే రూథర్‌ఫర్డు కొన్ని ముఖ్యమైన చర్యలను తీసికొనెను. విప్లవకారులకు సహాయపడుచుండిరని అనుమానింపబడిన 55 మంది వ్యక్తులను నిర్బంధించుటకు ఏజన్సీ వారంట్లు జారీచేయబడినవి. అట్లే విప్లవకారుల యొక్క దగ్గర బంధువులని అనుమానింపబడిన 182 మంది వ్యక్తులకు గూడ వారంట్లు జారీ చేయబడినవి. మన్య ప్రాంతమంతటిలోను సిపాయిలచే దురంత దమనకాండ ప్రారంభింపబడెను. సైనిక శాసనము (మార్షలా) విధింపబడక పోయినను అట్టి పాలన సాగినది. విప్లవకారుల జాడ తెలుపుమని ప్రజలను అనేక విధముల హింసింపసాగిరి. మన్యమునకు విక్రయార్థమై పోవు ఆహార సామగ్రిని బట్టుకొని మన్యము లోనికి రానీయకుండ జేసిరి. గ్రామములను తగులబెట్టిరి. స్త్రీలను నిర్బంధించి అత్యాచారములకు గురిచేసిరి. సైనికులకు అదుపులేకుండ విచ్చలవిడిగా వదలివేసినచో ఎన్ని దురంతములను చేయుటకు వీలుండునో అన్నియు చేయసాగిరి. ప్రజలలో భయోత్పాతము కలుగజేయుటయే వారి లక్ష్యము.

# 31. అగ్గిరాజు పట్టుబడుట

మన్య ప్రాంతమును బ్రిటిషు ప్రభుత్వ కబంధ హస్తముల నుండి విడిపించుటకు తలపెట్టిన ఈ పోరాటమందు అగ్గిరాజు వీరోచిత పాత్ర ధరించెను. అతని సాహస చర్యలు ఆశ్చర్యకరముగా నుండెడివి. పోలీసులు ఆయుధ హస్తులై కావలా కాయుచున్నను వారిని తుపాకులతో బెదరగొట్టి సైన్యముల కొరకు తీసుకొనిపోబడుచున్న ఆహార సామగ్రిని దోచుకొని విప్లవ శిబిరములకు నడిపించెడివాడు. కొంతదూరము వరకు కనిపించిన జాడలు ఆపైన కనిపించెడివి కావు. సైనికులు ఇండ్లు తగులబెట్టి ప్రజలను భీతావహుల జేయుచుండిరి. అట్టి తఱి అగ్గిరాజుకు కోపము మిన్నుముట్టెడిది. ఏటులనో సైనిక శిబిరములజేరి వారి పాకలకు నిప్పు అంటించి వారికి నిలువ నీడలేకుండ జేసెడివాడు. వారి నెదుర్కొనవలసి వచ్చినప్పుడు తుపాకిలో తూటాలు ఉన్నంతవరకు వారిని నిలువరించి పిదప అంతలనే సహచరులతో అంతర్ధానమయ్యెడివాడు.

జయపురము, పర్లాకిమిడి అరణ్య ప్రాంతము గూడ పాలనా విధానములోను, ఆర్థిక దుస్థితిలోను ఈ మన్య ప్రాంతమును పోలియున్నది. అందుచే సీతారామరాజు విప్లవము వారిలో గూడ యుద్ధ కౌతూహలమును జనింపజేసినది. అచట నుండి గూడ తనకు సహాయులను గొనితెచ్చుటకు సీతారామరాజు ఆ ప్రాంతములకు పోయినప్పుడు గంటందొర, అగ్గిరాజు మొదలగు ఉపనాయకులే ఇచ్చట ప్రజలను నడుపవలసి యుండెను. ఇక్కడ విప్లవము యథావిధిగా సాగుచుండవలెను. విప్లవకారులకు విరోధులుగానున్న ప్రభుత్వోద్యోగులను బట్టుకొని చెట్లకు గట్టి చావబాది విడిచెడివారు. 'అగ్గిదొర' యని ప్రసిద్ధి గాంచిన పోలీసు ఇన్స్పెక్టరు అబ్దుల్ అజీజును గూడ పెక్కు సారులు చెట్టుకు విరిచి కట్టిరి. గంటం దొర సీతారామరాజు ఆశయములను గ్రహించి అనుసరించెడువాడు. విరోధులైనను అనవసరముగా హింసించెడు కాదు. కాని తీవ్ర స్వభావుడగుటచే అగ్గిరాజునకు ఈ పద్ధతులు నచ్చెడివి కావు. ఉపనాయకులలో అంతఃకలహములు అంకురించెను. కొందరు గ్రామాధికారులను, ముఠాదారులను ప్రభుత్వమునకు భయపడి సహాయపడుచుండుటచే విప్లవకారులకు విరోధులైనవారిని బాధించి భయపెట్టుట తగిన చర్యయే యని అగ్గిరాజు దృఢాభిప్రాయము. కాని గ్రామస్థులందరికీ చాలవరకు దగ్గర చుట్టరికము ఉండును గాన గ్రామాధికారులను ముఠాదారులను బాధించినచో చాల మంది విరోధులగుదురు కావుననే సీతారామరాజు అట్టి వారిని నయాన భయపెట్టి బోధించియు, జరిమానాలు విధించి సంతోషముగా

చెల్లించునట్లు చేసెడివారు. కాని అగ్గిరాజు అరిష్టములను గ్రహింపక విప్లవకారులకు వ్యతిరేకముగా ప్రవర్తించువారిని మిక్కిలి బాధించెను. కొంత మందిని కొట్టెను; ఒకని ముక్కు చెవులు కోసి యవమానించెను. మరియొకని కాళ్లు విరుగగొట్టెను. ఈ యకృత్యములలో అగ్గిరాజుకు పెద్దిపడాలుకూడ తోడ్పడుచుండువాడు. వీరికి కొందరు అనుచరులు సహాపడువారు. అందరును అగ్గిరాజు వంటి ధైర్యసాహసోపేతులు కాలేరు గదా. ద్రోహులను, తమలో పిరికివారిని గూడ అగ్గిరాజు బాధించెడువాడు. అట్టి వారిని శిక్షింపనిచో మిగిలినవారికి భయముండదనియు, క్రమశిక్షణ లోపించుననియు అతని సదాశయము.

ఇట్టి యకృత్యముల వలన విసిగిన ప్రజలకు విప్లవకారులపై పూర్వమున్న విశ్వాసము, సానుభూతి అంతరించసాగినవి. ఈ విప్లవము తమదిగానే భావించిన ప్రజలకు విప్లవకారులపై అసహ్యము. కోపము జనింప ప్రారంభమయ్యెను. అనేక మందిని స్వయముగా బట్టుకొని అధికారులకు అప్పగించిరి. అగ్గిరాజు చర్యలు కొందరికి అనుమానము గూడ కలుగజేసినవి. అతడు ప్రభుత్వ గూఢచారియనియు, కావుననే ఈ యంతఃకలహములను సృష్టించెననియు ఒక దుర్వార్త ప్రచారమయ్యెను. విప్లవమునకు అంతము ప్రారంభమయ్యెను.

ఈ యకృత్యములకు తోడు సైనికుల ఘాతుక కృత్యములు దుస్సహములగుచుండెను. అంతలో సీతారామరాజు పర్లాకిమిడి ప్రాంతము నుండి కొందరు అనుచరులను వెంటనిడుకొని ఈ మన్య ప్రాంతమునకు తిరిగి వచ్చెను. ప్రజలు అతనితో ఒక వంక అధికారులు, మరియొక వంక అగ్గిరాజు పెట్టెడు బాధలను గురించి చెప్పుకొనిరి. వారినెంతయో అతడోదార్చెను. అగ్గిరాజు అకృత్యములతో ప్రారంభమైన అంతఃకలహములు సీతారామరాజు రాకతో అంతమైనవి, కాని సైనికుల క్రూరకృత్యముల ధాటికి ప్రజలలో ధైర్యము సన్నగిల్లినది. ప్రజలలసిపోయిరి. శ్రీరామరాజును బట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయలు బహుమానమిత్తుమనియు, లేదా యావజ్జీవము నెలకు ఏబది రూపాయల చొప్పున నిచ్చుచుందుమని ప్రభుత్వము ప్రకటించెను. కాని రామరాజును బట్టి యిమ్మని సైనికులు బాధించుచుండ మేము తిరుగుబాటు నాపివైచితిమని ప్రజలు తమ ముఠాదారుల ద్వారా అధికారులకు రాయబారము పంపుచుండిరి. కాని ప్రభుత్వము నమ్ముట లేదు. విప్లవకారులెల్లరు ఏమైనను వీర మరణము పొందుటకే నిశ్చయించుకొనిరి.

పృథ్వీసింగుతో కలిసి రాజు అడవులలో దిరుగుచుండెనని ఒక వదంతి బయలుదేరినది. ఆ కాలముననే 1924 మే 6వ తేదీని కొండపల్లి అను గ్రామమున సీతారామరాజు ముఖ్యానుచరులతో నున్నాడని గూఢచారి శాఖ ఇన్స్‌పెక్టరు ఉపేంద్ర పట్నాయక్‌కు వార్త అందెను. వెంటనే అతడు మలబారు స్పెషల్ పోలీసులతో వారి అన్వేషణకు పూనుకొనెను. పోలీసులు ఆ గ్రామమును ధ్వంసమొనర్ప నారంభించిరి. ఆ దినమున సీతారామరాజు అక్కడ లేడు. మే 6వ తేదీని ఉపేంద్ర పట్నాయకు పంపిన నివేదిక ప్రకారము ఆ సంఘటన ఇట్లు జరిగెను: అచ్చట ఆహార పదార్థములను సంగ్రహించి విప్లవకారులు కిల్లాబు గ్రామము వైపు పోయిరని తెలిసినది. గ్రామస్థులు ఏమియు సమాచారము అందించలేదు. కిల్లాబును దాటి ఒక మైలు దూరము మాదేరునది వెంబడి వెదకుచు సైనికులు వెళ్లిరి. కొన్ని చోట్ల అడుగు జాడలు, అప్పుడే నీరు ఒడ్డున చిలకరింపబడియుండుట పట్నాయకు కనుగొనెను. నిశ్శబ్దముగా ఇంకను కొంత దూరము పోగా వాగులో సుమారు 50 మంది విప్లవకారులు రాజు మొదలగు నాయకులతో గూడ కనబడిరి. విప్లవకారులు పోలీసులపై కాల్పులు జరిపిరి. రెండు పక్షములకు తుపాకి యుద్ధము ప్రారంభమయ్యెను. కొంతసేపటికి విప్లవకారులు పారిపోనారంభించగా పోలీసులు తుపాకులు కాల్చుచు రెండు మైళ్ళవరకు వారిని తరిమిరి. తీవ్రమైన పోరాటము సాగెను. ఇద్దరు విప్లవకారులు నేలకొరిగిరి. కొంత మంది గాయపడిరి.

అగ్గిరాజు వద్ద 303 తుపాకి ఉండెను. దానితో అతడు కాల్పులు సాగించెను. అతని తుపాకిలో గుండ్లు అయిపోవచ్చెను. అది గ్రహించి అగ్గిరాజు వెనుకకు పారిపోవుచు కాల్పులు సాగించుచుండెను. శత్రువుల చేతిలో మరణింపగూడదని అతని తలంపు. ఇంతలో ఒక గుండు దెబ్బ కాలిపై తగిలి బలమైన గాయమై అతడు క్రిందబడెను. సమీపములో నొక బావియున్నది. ప్రాణములతో శత్రువులకు చిక్కకుండ దానిలోబడి మరణించవలెనని యతనియూహ, పండ్లు బిగబట్టి వడిగా ప్రాకుచు సైన్యము సమీపించునంతనే బావిలో దూకెను. కాని సైనికులు అతనిని సజీవముగానే పట్టుకొని బంధించిరి.[1]

కాని ఆ సంఘటనను పట్నాయకు 6-5-1924 తేదీని ఏజెన్సీ ఆపరేషన్సు అధికారికి పంపిన తన నివేదికలో ఇట్లు వర్ణించెను. "ఆ పర్వత ప్రాంతములో రెండు మైళ్ళ వరకు తరుముటచే పోలీసు బలము అలసిపోయెను. నా వెంట పోలీసు దళము రాకపోవుట గమనించకుండ నేను విప్లవకారులలో జొరబడి అగ్గిరాజును పట్టుకొంటిని. అతనికి

గడ్డము ఉండుట వలన నాయకుడగు రాజే అని మొదట భావించి అతని తుపాకితో గూడ నిర్బంధించితిని. అతడు నాపై తుపాకి ప్రేల్చెను గాని తప్పిపోయినది. మరల గుండ్లు నింపుకొను లోపల పట్టుకొంటిని. ఒంటరిగా నన్ను చూచి ఇంకొక విప్లవకారుడు తుపాకి కాల్చెను గాని అగ్గిరాజు జుట్టుపట్టుకొని ముందుకు త్రోసి వెంటనే కూర్చుండుట వలన గుండు నాపై నుండి పోయినది. ఇంతలో వెనుకనున్న పోలీసులు వచ్చి కాల్పులు ప్రారంభించిరి. కొంతసేపు ఎదురు కాల్పులు జరిపిన తరువాత పొదల మాటున విప్లవకారులు పారిపోయిరి. నా తుపాకిలో గుండ్లన్నియు అయిపోయినవి. సమయమునకు పోలీసు జవానులు నా సహాయమునకు వచ్చిరి. రెండు రోజుల నుండి విప్లవకారుల జాడకై తిరుగుచుండుట వలన సరియైన నిద్రాహారములు లేకపోయినను జవానులు క్రమశిక్షణతో పట్టుదలతో పనిచేసిరి. ఇందులో లాగరాయి మునసబు తీగల నాగన్న మాకు చాల సహాయమొనర్చినాడు. ఈ సంఘటనలో విప్లవకారులు ఇద్దరు చనిపోయిరి; చాల మంది గాయపడిరి, ఒక పోలీసు జవాను తీవ్రముగా గాయపడెను. నా వెంటనున్న పోలీసు దళము చాల అలసిపోయినది. అందుచే మన్యములను వెదకుచు వచ్చిన సబ్‌ఇన్స్పెక్టరు ఆళ్వారు నాయుడు దళమునకు విప్లవకారులను వెదకుటకు సూచనలిచ్చి ఇద్దరు విప్లవకారుల శవములతోడను, గాయపడిన పోలీసు జవాను తోడను, పట్టుబడిన అగ్గిరాజుతోడను రాజవొమ్మంగికి తిరిగి వచ్చి పై అధికారులకు నివేదిక పంపితిని."

అగ్గిరాజుపై ఎట్టి నేరారోపణ గాని, విచారణ గాని చేయకుండగనే ప్రభుత్వము అతనిని అండమాను దీవులకు పంపించినది. కాని ఈ వార్త గూఢముగా నుంచినది. చాల కాలము వరకు అగ్గిరాజు ఏమయ్యెనో ఎవ్వరికిని తెలియదు. అతడు ప్రభుత్వ గూఢచారిగా మారిపోయెనని కొందరు భావించి అతనిని ద్రోహిగా ముద్రవేసిరి. కాని దీనికి ఎట్టి ఆధారమును లేదు. జీవితాంతము అతడు అండమానులలోనే గడిపెను. తుదకు అక్కడనే ఆ వీరుని జీవితము ముగిసినది. 1936 సంవత్సరములో ఆచార్య రంగా గారు ఢిల్లీ శాసనసభలో ప్రశ్నించగా అగ్గిరాజు అండమానులలో చనిపోయినాడనియు, గోదావరి జిల్లా కలెక్టరుకు తెలియజేసితిమనియు సమాధానము చెప్పిరి. కాని ఈ మరణవార్త గ్రామ మునసబు ద్వారా గ్రామస్థులకు గాని, అతని తల్లికి గాని తెలియజేయలేదు.[1]

అగ్గిరాజు కృత్యములు కొంతవరకు విప్లవమును బలహీనపరచినవి. ప్రజలను

దోచి విప్లవమును సాగించు పద్ధతిని అగ్గిరాజు అవలంబించెను. రాజు లేని సమయమున విప్లవ చర్యలలో దౌర్జన్యయుతమగు మార్పులు విప్లవమును క్రుంగదీసినవి. ఈ అకృత్యములు ప్రజలకు కోపకారణములైనవి. కొందరు విప్లవకారులను ప్రజలే పట్టి ఇచ్చుటకు, చంపివేయుటకు గూడ నిదియే కారణము. అనేక మారులు శత్రుసైన్యముల నెదుర్కొని పోరాడిన వీరుడగు పెద్దిపడాలు తుదకు తన దేశీయులచేతనే నీచముగా చంపబడెను. ఒకప్పుడు వీరిద్దరిని ప్రజలు చాల గౌరవించెడువారు. కాని వీరి దౌర్జన్య విధానమే ప్రజలను అట్టి నీచోద్రేకమునకు ఉరికొల్పినది.

# 32. మద్రాసు కౌన్సిలులో చర్చ

విశాఖపట్టణమున ప్రభుత్వమేర్పరచిన ప్రత్యేక న్యాయస్థానములో విప్లవకారులను విచారించి శిక్షలు విధించుట ఎడతెగని కార్యక్రమములైనవి. ప్రభుత్వము వారిని కఠినముగా శిక్షింపసాగెను. ఈ కఠిన నిర్బంధములను మన్యములో దమననీతిని గురించి అప్పటి మద్రాసు లెజిస్లేటివు కౌన్సిలు సభ్యులు, విశాఖ జిల్లా బోర్డు అధ్యక్షులునైన చింతలపాటి వెంకట నరసింహరాజుగారు తన అసమ్మతి తెలిపియుండిరి. ఈ విషయమున ఆయన జిల్లా కలెక్టరును ఏజెన్సీ కమిషనరును కలిసికొనియు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోను, హోం సభ్యుడగు సర్ ఆర్థరు నాప్‌తోను ఉత్తర ప్రత్యుత్తరములను జరిపియు ప్రభుత్వ వైఖరిని విమర్శించి పరోక్షముగా సీతారామరాజు ఉద్యమము పట్ల అభిమానమును ప్రకటించెను. శాసన మండలిలో పోలీసు పద్దులపై చర్చలు సందర్భమున పోలీసు శాఖ విధానములను చాతుర్యముతో విమర్శించువాడు. అందుచే ఈయనను కూడ క్రిమినల్ కేసులలో ఇరికించియు, 144వ సెక్షను అమలు జరిపి ఏజన్సీ ప్రాంతములకు రాకుండ జేయవలెననియు అధికారులు తలచిరి. కాని రాష్ట్ర ప్రభుత్వము అట్టి చర్యల వలన విప్లవోద్యమము ఏజన్సీ దాటి వ్యాపింపగలదని భయపడి అట్టి చర్యలకు అంగీకరించలేదు.

1924 మార్చిలో మద్రాసు శాసనమండలిలో శ్రీ నరసింహరాజు చేసిన ప్రసంగముల వలన ఆనాటి పోలీసులు శ్రీరామరాజును పట్టుకొనుటకు చేసిన వ్యర్థ ప్రయత్నములు, వారి అసమర్థతయు తెలియగలదు. ఆయన ఇట్లు ప్రసంగించిరి : మద్రాసు రాష్ట్ర పోలీసు శాఖ సిబ్బంది అంతయు వినియోగింపబడినను $2\frac{1}{2}$ సంవత్సరములు ప్రయత్నించియు ప్రభుత్వము ఈ తిరుగుబాటును అణచలేకపోయినది. 700 మంది పైగా పోలీసులు, 30 మంది ఆఫీసర్లు పనిచేసి 13 లక్షల రూపాయిలు ఖర్చు పెట్టినను పోలీసులు కృతార్థులు కాలేకపోయిరి. వారికి కొండలలోనికి పోవుటకు ధైర్యము లేక, వెలుపలనే విప్లవకారుల కొరకు వృథాగా తిరుగుచున్నారు. విప్లవకారులను వెంబడించి, తరిమి వారితో పోరాడుటకు సైన్యమునకు సాహసము లేకపోయినది."

హోం సభ్యుడగు నాప్ ఆయనను విప్లవమును అణచుటకు సలహాలీయవలసినదిగా కోరగా ఆయన ఇట్లు చెప్పిరి : నాకు ఆ ప్రాంతములలో పలుకుబడిలేదు. విప్లవకారులకు, ప్రభుత్వమునకు, గ్రామస్థులకు సమాచారము అందించుట నా పనికాదు.

ప్రత్యేక పోలీసు సిబ్బంది ఎట్లు పని చేయుచున్నదో మాత్రము నేను చెప్పచుంటిని".
ఇట్లు సీతారామరాజు విప్లవశక్తిని, సైన్యము అసమర్థతను చాటుటకును, విప్లవవీరుని పట్ల తన అభిమానమును వెల్లడించుటకును నరసింహరాజు గారు శాసన మండలి వేదికనుపయోగించెను.

# 33. సీతారామరాజు అస్తమయము

అగ్గిరాజు నిర్బంధింపబడెను. అంతకుముందే మల్లుదొర దొరకిపోయెను. కొందరు విప్లవకారులు పట్టుబడిరి. మరికొందరు చనిపోయిరి. మిగిలిన విప్లవకారులలో నిరుత్సాహమేర్పడెను. విప్లవకారుల జాడలు తెలిసికొనుటకు మల్లుదొరను ఇతరులను జైళ్ళలో అనేక హింసలకు గురి చేయుచుండిరి. చాల మంది గ్రామాధికారులను ప్రజలను విప్లవకారులకు సహాయము చేయుచున్నారను మిషచే కోర్టులలో విచారణ జరిపి శిక్షించుచుండిరి. విప్లవకారులకు సహాయపడుచున్నారని అనుమాన మున్నవారి ఆస్తులను ప్రభుత్వము స్వాధీనపరచు కొనుచుండెను. అనేక గ్రామములపై సాముదాయిక జరిమానాలు విధింపబడెను. ప్రభుత్వము విధించిన ఆర్థిక దిగ్బంధము వలన ప్రజల నిత్యజీవితము దుర్ఘటమయ్యెను. విప్లవకారులకు సహాయపడు గ్రామములను తగులబెట్టుచుండిరి. కొండపల్లి, ఎరదాలబంద, తాళ్లపాలెము మొదలగు గ్రామాలలోని ప్రజలను ఇండ్లలో నుడి బయటకు నెట్టి వారి సామానులు, గుడ్డలు, మంచములు, బండ్లు మొదలగునవి తిండి గింజలతో సహా గ్రామ మధ్యమున రాసిగా పోసి తగులబెట్టుచు ఇప్పుడు పితూరిదారులకు చందాలు, భక్ష్యములు ఇయ్యుండని హేళన చేయసాగిరి.[1]

స్త్రీలకు, చివరకు పసిబిడ్డలను సైతము ప్రభుత్వ సైనికులు క్రూరముగా హింసింప మొదలిడిరి. సైనిక శిబిరములలోని వికటాట్టహాసములకు దీనులగు ప్రజలు భయముతో వణకసాగిరి.

సీతారామరాజు కొంతబలగముతో పర్లాకిమిడి ప్రాంతము నుండి తిరిగి వచ్చి ప్రజల నికృష్ట పరిస్థితిని చూచెను. వారి మానసికాందోళనను గ్రహించెను. అతని దయార్ద్ర హృదయము ద్రవించెను. ఇంకను తాను పోరాటమును సాగించినచో మన్య ప్రజలు పడు ఇక్కట్లను ఊహించెను. తన మూలమున ప్రజలకు కలుగు ఆ భయంకర పరిస్థితి మనోదర్పణమున ప్రతిఫలింపగా ఆ దృశ్యమును జూచి సహింపలేకపోయెను. కొండపల్లిని రెండు సార్లు తగులబెట్టుట చూడలేకపోయెను. మన్య ప్రజల పరిస్థితిని బాగుపరచి వారిని స్వేచ్ఛాజీవులుగా చేయుచమని తాను సంకల్పించిన విప్లవోద్యమము చివరకు వారి జీవితములను నికృష్టతరముగా జేసినది.

తునిలో మీర్జా నల్లపరాజు అచ్యుతరామరాజు, దాట్ల కృష్ణవర్మ మున్నగు

క్షత్రియులు సీతారామరాజునెడ సానుభూతి చూపుచున్నారను అనుమానముతో క్షత్రియ కుటుంబములపై రూథర్‌ఫర్డ్ 144 సెక్షను క్రింద ఆంక్షలు విధించెను. తుని రాజావారు, కోటనందూరు, భీమవరపుకోట గ్రామములలోని కొన్ని కుటుంబములలోని క్షత్రియులు తమ వద్ద గల తుపాకులు, ఈటెలు, కత్తులు మొదలగు ఆయుధములను లోతైన నూతులలోనికి దింపించి కనబడకుండ జేసిరి. ఒకనాడు సీతారామరాజు వీరకృత్యములను శ్లాఘించి గానము చేసిన జాతీయవాదులెవ్వరును ఈనాడు అతనికి సహకరించుకొనుటకు సాహసింపనైరి. జాతీయ నాయకుల వలన గాని, విప్లవ యోధుల వలన గాని సీతారామరాజునకు ఎట్టి సహాయము లభింపలేదు. గిరిజనుల దుర్భర క్లేశములను చూచి అతని హృదయమున అగ్ని జ్వాలలు రేగినవి. తాను పట్టుబడిన తప్ప వారి బాధలకు విమోచనము కలుగదు. అందుచే ఆత్మ త్యాగము తప్ప వేరు మార్గము లేదు. కావున అతడు దానినే వరించెను.

అగ్గిరాజు పట్టుబడిన దినమునకు ముందు మూడు రోజుల నుండియు సీతారామరాజు ఎవ్వరికిని కనబడలేదు. మే నెల ప్రారంభములో పోలీసు నిర్బంధము నుండి తప్పించుకొని పారిపోయిన పృథ్వీసింగు ఈ ప్రాంతమునకు వచ్చి సీతారామరాజుతో కలిసి రహస్యముగా తిరుగుచుండెనని వదంతులుండెను. అగ్గిరాజు పట్టుబడిన నాటి రాత్రి సీతారామరాజు మంప గ్రామ మునసబు ఇంటికి పోయెను. అంతకు ముందు రూథర్‌ఫర్డు కృష్ణాదేవి పేటలో సభ జరిపెను. ఆ సభకు మంప మునసబు కూడ హాజరయ్యెను. ఆ సభలో వారము దినములలో పితూరిదారుల ఆచూకీ ఈయనిచో ముఖ్యులను, తరువాత ప్రజలను కాల్చివేయుదుమని రూథర్‌ఫర్డు చెప్పెను. ఆ సభావృత్తాంతములను తెలిసికొనుటకు సీతారామరాజు మంప గ్రామమునకు వెళ్లెను. ఆ మునసబు అతిథి మర్యాద చేయనెంచెను గాని సీతారామరాజు పాలను పండ్లను గూడ తీసికొనక విచార గ్రస్తుడై ఆలోచనా నిమగ్నుడై ఆ రాత్రి గడపెను. మంప మునసబు తనను పట్టి ఇచ్చినచో తనపై ప్రకటింపబడిన పదివేల రూపాయల బహుమతి అతనికే లభ్యమగునని సీతారామరాజు చెప్పెను. కాని మునసబు ధనము కొరకు అట్టి నీచపు పనిని చేయజాలనని చెప్పెను.

మంప వద్దనున్న కొండలలో సీతమ్మకొల్లొద్ది, పందిగుంటలొద్ది ఉన్నవి పందిగుంట కొండ ఎక్కు మార్గమధ్యమున ఒక గుహ కలదు. ఈ ప్రాంతములో నున్నప్పుడు సీతారామరాజు ఈ గుహలో నివసించెడువాడు. అగ్గిరాజు మలబారు పోలీసులకు చిక్కిన నాటి రాత్రి సీతారామరాజు ఈ గుహలోనే విశ్రమించెను.

1924 మే 7వ తేదీని ఉదయముననే సీతారామరాజు కొయ్యూరు గ్రామ సమీపారణ్యమున ఏటి యొద్ద స్నానము చేసి జపము చేసికొని కూర్చుండి యుండగా మంప మునసబు ఇంటి నుండి వారి పశువుల కాపరి పాలు తీసికొని వచ్చెను. పాలు త్రాగి పాత్ర యిచ్చుటకు ముందు తన ఉనికిని కొయ్యూరులోని సైనిక శిబిరమునకు తెలియబరచి రావలసినదని సీతారామరాజు ఆ పశువుల కాపరిని కోరెను. అమాయకుడగు ఆ బాలుడు అట్లు చేసెను. వెంటనే సీతారామరాజును బట్టుకొనుటకు ఖారతీయోద్యోగి యగు ఆళ్వారు నాయుడు, జమాదారు, 25 మంది మలబారు పోలీసులతో అచ్చటికి పోయెను. సీతమరాజు వద్ద ఎట్టి ఆయుధము లేకపోయినను అతనిని పట్టుకొనుటకు ఎవరును సాహసింపజాలకపోయిరి. చివరకు భయము లేదని అతడు చెప్పిన తరువాత వారు అతనిని బంధించిరి. పిదప కొయ్యూరు (రాజేంద్రపాలెము) మకాములోనున్న మేజరు గుడాలు వద్దకు తీసికొనిపోయిరని తెలియుచున్నది.

ఇంకొక సమాచారము వలన ఇట్లు తెలియుచున్నది. చింతలపూడి ఘాటు దగ్గరనున్న శరభన్నపాలెము నుండి ముఖము కడుగుకొని రాజు నడచి పోవుచుండెను. అక్కడ ఎవరో దూరముననున్న రాజును పోలీసులుకు జూపిరి. వెంటనే పోలీసులు అతనిని పట్టుకొని చింతలపూడి ఘాట్‌లోనున్న మలబారు పోలీసు మకాముకు తీసుకొనిపోయిరి.

ఏది ఏమైనను సీతారామరాజు ఎట్టి ప్రతిఘటన చేయకయే తనంత తానుగా ఆత్మ త్యాగమునకు సిద్ధపడి ప్రభుత్వమునకు వశమై పోయెననుట మాత్రము సత్యము. శ్రీకృష్ణుడు శక్తి సంపన్నుడయినను తుదకు కిరాతుని చేతిలో నిర్యాణము నొందినట్లు శరీరమును ఎప్పుడోయొకప్పుడు విడువక తప్పదు గాన సీతారామరాజు గూడ బ్రిటిషు కిరాతుని చేతిలో నిర్యాణము నొందెను.

కాని ఆనాటి ప్రభుత్వ నివేదికలు వేరుగా చెప్పుచున్నవి. మే 7వ తేదీ ఉదయమున జమాదారు కుంచుమీనను నాయకత్వమున ఒక ఈస్టు కోస్టు స్పెషల్ పోలీసు దళము ఒక గూఢచారి సబ్‌ఇన్స్‌పెక్టరుకు రక్షణగా తిరుగుచు మంప గ్రామమునకు బయట ఒక చింత చెట్టు క్రింద మకాము చేసిరి వారు స్ఫురద్రూపియు, గడ్డము ఉన్నటువంటి ఒక వ్యక్తి ఫర్లాంగు దూరములో పోవుచుండుట చూచిరి. అతడే రాజై యుండునని తలచి వారు అతనిని వెంటాడిరి. ఇది చూచి అతడు పరుగెత్తెను, వారు అతనిపై కాల్పులు జరిపిరి. అప్పుడు అతడు క్రిందబడగా వారు పట్టుకొని నిర్బంధించిరి.

పట్టుబడిన యతడు తానే రాజునని చెప్పెను. ఆ యుదయమే కొయ్యూరులోనున్న మేజరు గుడాలు వద్దకు అతనిని తీసికొనిపోయిరి. గుడాలు అస్సాం రైఫిల్సు దళముతో అక్కడ ఉండెను. రాజునకు బహిర్భూమికి పోవుటకు కొంత స్వేచ్ఛనీయగా తప్పించుకొని పారిపోవుటకు ప్రయత్నించెను. వెంటనే తుపాకి కాల్చి సైనిక దళము అతనిని చంపివైచెను. శవమును చింతపల్లెములో బసచేసి యున్న స్పెషల్ కమీషనరు వద్దకు తెచ్చిరి; పూర్వము విప్లవకారుడుగానున్న ఒకడు ఆ శవమును సీతారామరాజుదిగా గుర్తించెను. మరునాడు దానిని కృష్ణదేవిపేటకు తీసికొనిపోయిరి. అచ్చట ఒకప్పుడు విప్లవకారులకు బందీలుగా పట్టుబడిన గూడెము డిప్యూటీ తహసీల్దారు, ఇతరుతలును, ముఠాదారులు, గ్రామ మునసబులును శవమును గుర్తించిన తరువాత 8వ తేదీ ఉదయమున దహనము చేసిరి. ఈ విషయము 1924 మే 16 తేదీని చేసిన ప్రభుత్వ ప్రకటనలోరించిరి. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో తరువాత శ్రీ ఏ.సి. వెంకటపతిరాజు వేసిన ప్రశ్నకు గూడ పారిపోవుచుండుగా కాల్చి చంపబడెననియే ప్రభుత్వము జవాబిచ్చినది.

సీతారామరాజు మరణమునకు దారితీసిన ఈ విషాదాంతమును గురించి రిటైర్డు డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటు జయరాం నాయుడు 1959 మే 28 తేదీని పంపిన నివేదిక వలన మనకు యథార్థ విషయములు లభ్యమగుచున్నవని తెలుపుచు ఆ నివేదికను యజ్ఞమిల్లి నరసింహారావుగారు ఇట్లు ఉదాహరించిరి :

"ఆ వేసంగి రాత్రి అంతయు (6-5-1924) రాజు కొండపై దాగి యుండెను. మరునటి దినము దాహమును తీర్చుకొనుటకు రాజు కొండ దిగి సెలయేరునొద్దకు వచ్చెను. సెలయేరు అవలియొడ్డును అల్వారునాయుడు తన దళముతో విడిసియుండెను; సెలయేరులో ముఖము కడుగుకొనుచున్న రాజును పోలీసులకు నీరు తెచ్చుటకు వెళ్లినవారు చూచిరి. వెంటనే వారు ఆ సమాచారమును జాగ్రత్తగా అల్వారు నాయుడుకు, జమాదారు కుంచుమీనునకు చెప్పిరి. అప్పటికే ఏజన్సీ ప్రజలు పితూరి వలన అలసిపోయిరి. ఈ రెండు సంవత్సరములు వారి గృహములు తగులబెట్టబడినవి. వారికి వ్యవసాయము లేదు, పోలీసులు సమాచారము కొరకు ప్రజలను వేధింపసాగిరి సైనికుల, మలబారు దళముల అమానుష చర్యలకు స్త్రీలు గురి చేయబడిరి. పురుషులందరు నిర్బంధింపబడి వెట్టిచాకిరి చేయవలసి వచ్చెను. అందువలన రాజు ఆచూకిని వారు ఇన్స్పెక్టరుకు చెప్పివేసిరి. వెంటనే ఇన్స్పెక్టరు అల్వారు నాయుడు, జమాదారు, మలబారు స్పెషలు పోలీసులు బయలుదేరి వెళ్లి రాజును చుట్టుముట్టి

బంధించిరి. మలబారు స్పెషలు పోలీసులు రాజును కొట్టవలెనని ప్రయత్నించిరి. కాని అల్వారు నాయుడు వారిని నిరోధించి తన మకామునకు తీసికొనిపోయెను. రాజు త్రాగుటకు నీరు అడిగెను. ఇన్స్‌పెక్టరు పాలను ఇచ్చెను. 'రాజును పట్టుకొంటిమి గదా ఇక పదివేల రూపాయిల బహుమతి పొందితిమి' అను సంతోషమున అల్వారు నాయుడు కృష్ణాదేవి పేటలోని తన సహచరులకు రాజు ప్రాణములతో పట్టుబడెనని చీటి వ్రాసి పంపెను. 1924 మే 7వ తేదీనాడే ఈ వార్తను మదరాసుకు, టెలిగ్రాము ద్వారా పంపబడెను. హిందూపత్రిక "అల్లూరి సీతారామరాజు సజీవముగా పట్టుబడెను" అను శీర్షికతో ఈ వార్తను ప్రకటించెను. తరువాత ఇన్స్‌పెక్టరు, జమేదారు, వారి మనుష్యులు రాజునకు గల మానవాతీత శక్తుల వల్ల వెడలిపోవునేమోయని భయపడి, రాజును మంచముపై పరుండబెట్టి శరీరము ఒక అంగుళము కూడ కదుపుటకు వీలులేని విధముగా కట్టివేసి ఆ మధ్యాహ్నము రాజును మంచముతో సహా అక్కడకు ఆరు మైళ్ల దూరములో కొయ్యూరు గ్రామము వద్దనున్న మేజరు గుడాల్ మకామునకు తీసికొని పోయిరి. వీరుడగు రాజును ఆ విధముగా మంచమునకు కట్టి వేసి తీసికొని వచ్చినందులకు ఇన్స్‌పెక్టరును, జమేదారును మందలించి గుడాల్ కట్లు విప్పించెను. రాజు మంచముపై కూర్చుండెను. మేజరు గుడాల్ చేయిచాపి రాజుతో కరచాలనము చేయబోయెను. రాజు నిరాకరించి బ్రిటిషు వాని చేతిని తాకుటను తాను అసహ్యించుకొందునని చెప్పెను. అంతట గుడాల్ 'నీవు కనుక బ్రిటిషు సైన్యములో నున్నచో కల్నల్‌వు కాగలవు' అని నవ్వుచు రాజు బాల్యవైఖరిని మందలించు ధోరణిలో శాంతముగనే మాటాడెను. అప్పటికిని రాజు తెల్లవారి వలననే తన దేశమునకు దుర్భర పరిస్థితి ఏర్పడినదని చెప్పుచు వారిని నిందింపసాగెను, మేజరు వైఖరి మారిపోయినది. అతడు కోపమును పట్టలేకపోయెను, 'ఈ ఏజన్సీ ప్రజలు ఇన్ని సంవత్సరములుగా పడుచున్న కష్టములకు తెల్లవారు కాదు, నీవే కారకుడవు. అందువలన శిక్షకు పాత్రుడవు' అని వెంటనే అతడు గుడారము లోనికి వెళ్లి, బైబిలు తీసుకొని మోకాళ్లపై నిలబడి కొద్ది నిమిషములు ప్రార్థన చేసెను. తరువాత బయటకు వచ్చి జమేదారుని పిలిచి, 'కోర్టు మార్షల్'కు ఆజ్ఞనిచ్చెను. మలబారు స్పెషలు పోలీసులు రాజును అక్కడ నున్న చెట్టుకు చేతులు విరిచి కట్టివేసి, ముఖమును కప్పివేసిరి. మేజరు రాజు దగ్గరకు వెళ్ళి 'నీ రక్త బంధువులకు ఏమైనా చెప్పెదువా?' అనెను అంతట రాజు 'నేను చెప్పవలసినదేదియు లేదు. కాని నన్ను కోర్టులో న్యాయ విచారణకు ఎందుకు హాజరు పెట్టవు? ఎందుకు చంపవలెను?' అని ప్రశ్నించెను. అంతట గుడాల్ 'నిన్ను తుదముట్టించుటకు నిశ్చయించితిని. అయిదు నిమిషములు

ప్రార్థించుకొనుము' అనెను. రాజు ప్రార్థన చిహ్నముగా తలను ఎత్తి తరువాత తలను వంచెను. అప్పుడు గుడాల్ కాల్పుకు ఆజ్ఞనిచ్చెను. జమాదారు మొదట కాల్చెను గాని గుండు ఎడమ చెయ్యి పై భాగమున తగిలెను. గురి తప్పినందులకు జమాదారుపై గుడాల్ మండి పడెను. అంతట స్వయముగా గుడాల్ ముందుకు నడిచి రాజు గుండెపై గురిచూచి తన రివాల్వరు కాల్చి కిరాతక చర్యకు పాల్పడెను. రాజు తల ఒరిగిపోయినది. అతడు విగతజీవుడయ్యెను.

ఈ విధముగా కొయ్యూరు వద్ద గల రాజేంద్రపాలెము అను చోట శ్రీరామరాజును చెట్టుకు గట్టి కాల్చుట జరిగినది. పిదప ఆ చెట్టును గూడ గుర్తు లేకుండ దగ్ధము చేసిరి.

జయరాం నాయుడు నివేదిక ఇంకను కొన్ని వివరములు ఇట్లు తెలియజేయుచున్నది : "సాయంత్రమునకు (7వ తేది) స్వీని, కలెక్టరు రూథర్‌ఫర్డు, ప్రభుత్వ కమిషనరు, మరికొంత మంది ఆఫీసర్లు కొయ్యూరులో మేజరు గుడాల్ గుడారములో సమావేశమైరి. ఒక మిలటరీ ఉద్యోగి రాజును పట్టుకొని కాల్చివేసి కీర్తి పొందినందులకు వారందరు అసూయపడిరి. సజీవముగా పట్టుబడిన వ్యక్తిని కాల్చిచంపుట అక్రమచర్య యని వారందరు గుడాల్‌ను మందలింపసాగిరి. అంతట అతడు కోపించి 'నేను తప్పుచేసిన యెడల అస్సాం గవర్నరు నన్ను ప్రశ్నించును. మీతోను, మీ గవర్నరు తోను నాకు సంబంధములేదు' అనెను. తరువాత పోలీసు ఆఫీసర్లు అందరు కలిసి రాజు పారిపోవుటకు ప్రయత్నించగా కాల్చివేయబడెనని కట్టు కథను అల్లిరి. నర్సీపట్నము హాస్పిటల్‌లో ముఖ్య వైద్యుని (ఆయన పేరు కృష్ణ స్వామి అనుకుంటా) చేత తుపాకి కాల్పులు శరీరమునకు వెనుక వీపుపై గలవని రిపోర్టు వ్రాయించిరి. నేను బొక్కలూరు గ్రామములో రాజుకు మూడు రోజులు అతిథియగు బందీగా నుండిన నా మేనల్లుడు ప్రసాదరావు, అబ్దుల్ రహమాన్ (ఇతనిని కూడ రాజు ఒకప్పుడు పట్టుకొనెను), మృతదేహము "అల్లూరి సీతారామరాజుదే" అని గుర్తించిన తరువాత మరుసటి దినము 8వ తేదీని దహనము చేయబడెను"

రాజు ఘోర హత్యను కళ్లారాచూచిన కొయ్యూరు నివాసులు బిస్సా సింగయ్య మొదలగు వృద్ధులు 4-10-1974 తేదీని తనతో ఈ విధముగా చెప్పినట్లు 'ఆంధ్ర క్షత్రియ వంశరత్నాకర' కర్త ఇట్లు వ్రాసిరి : రాజు గారు తమను కలెక్టరు వద్దకు తీసుకొని వెళ్లుమని గుడాలును కోరిరి. గుడాల్ నిరాకరించెను. గుడాల్ మద్ది చెట్టు వద్ద నిలబడి మూడుగుళ్లు

కాల్చిరి. రాజుగారిని మంచముతోనే సిరిపిలమాను చెట్టునకు కట్టిరి. పిమ్మట ఈ చెట్టును కొట్టివేసి, కాల్చి, బూడిద ఏటిలో కలిపిరి." సిరిపిలమాను చెట్టునకు దక్షిణమున పుంత కలదు. ఈ పుంత ప్రక్కను మద్దిచెట్టు ఉండెను. ఈ రెండు చెట్లకు మధ్య దూరము 30 గజములు. రాజు మృతదేహమును కృష్ణాదేవిపేట తీసికొనిపోయి 8-5-1924 తేదీని ఫొటో తీయించి దహనపరచిరి[7].

దహనమునకు ముందు కృష్ణాదేవిపేటలో మృతదేహమును తీసిన ఫొటో కూడ చాల అనుమానములకు తావాసగినది. దహనానంతరము కృష్ణాదేవి పేట వద్ద గల వరాహానదిలో బూడిదను కలిపివేసి సైనికులు కసి తీర్చుకొనిరి. ఈ మరణవార్తను తల్లికిగాని, కుటుంబములోనున్న మరెవ్వరికి గాని ప్రభుత్వము తెలియజేయలేదు. అందువలన దహనక్రియల కైనను వార్వెరును వచ్చు అవకాశము కలుగలేదు. ఆంగ్ల వార్తా పత్రికలో ప్రచురింపబడిన ఈ మరణవార్తను చూచి వెంటనే పినతండ్రి రామకృష్ణంరాజు గారు మోగల్లులోనున్న సీతారామరాజు తల్లికి ఉత్తరము వ్రాసిరి. ఆ వార్త వినగానే తల్లి కుమారునితోబాటు ఆ చితిపైబడి మరణింతునని దుఃఖావేశముముతో బయలుదేరెను. ఆమె వెంటనే ప్రయాణమై తుని వరకు వెళ్ళెను. గాని అప్పటికే సైనికులు దహనము చేసిరని అచ్చటి బంధువులు చెప్పగా శోక భారముతో తిరిగి మోగల్లు వచ్చి ఆ పదిరోజులు జరుగవలసిన కర్మ కాండ ఇంటి వద్ద జరిపించి కొంత తృప్తి పడెను.

విప్లవవీరుడు సీతారామరాజు ఒక ముష్కరుని పశుచర్యకు బలియై పోయెనను వార్త దావానలమువలె ఆంధ్రదేశమంతయు ప్రాకినది. కొందరు కాంగ్రెసు నాయకులు నిర్లక్ష్యము చూపినను, ప్రజాదాస్య విమోచనమునకై తన రక్తము ధారపోసిన వీరునికి ముక్కోటి ఆంధ్ర ప్రజానీకము కన్నీటి తర్పణములు విడిచినది. గెరిల్లా యుద్ధ వ్యూహములతో ఆనాడు మొగలు సామ్రాజ్యము నెదుర్కొనిన ఛత్రపతి శివాజి వలె నేడు బ్రిటిషు సామ్రాజ్యమును ఎదుర్కొని పోరాడిన అల్లూరి సీతారామరాజు జీవిత యాత్ర అతని 27వ యేటనే ముగిసినది.



కాల్చి చంపిన పిదప ప్రభుత్వము ప్రకటించిన సీతారామరాజు ఫొటో

# 34. గంటం దొర, ఇతర విప్లవవీరుల మరణము

సీతారామరాజును పట్టుకొని వధించిన పిదప ప్రభుత్వ సేనలు మిగిలిన విప్లవనాయకుడగు గంటం దొరను పట్టుకొని, ఇతర విప్లవకారులను బంధించుటకు సర్వసన్నద్ధమయ్యెను. రాజు మరణించిన తరువాత గ్రామస్థులు ప్రభుత్వమునకు విప్లవకారులను గురించి వార్తలందించుటలో సుముఖత చూపుచుండిరి. మే నెలలో పోలీసులు గాని గ్రామస్థులు గాని 13 మంది విప్లవకారులను పట్టుకొనిరి. ఆ తరువాత అక్కడక్కడ చిన్న చిన్న పోరాటములలో ఇంకను కొంతమంది విప్లవకారులను పోలీసులు నిర్బంధించటయో, చంపి వేయుటయో జరిగినది. మే 26 తేదీని ఇంకొక విప్లవ నాయకుడగు ఎండుపడాలును గ్రామస్థులు పట్టుకొని చంపివేసినట్లు ప్రభుత్వ నివేదిక వలన తెలియుచున్నది. సంకోజి ముక్కుడు అను మరియొక విప్లవకారుడు గూడ పట్టుబడి 12 ఏండ్ల శిక్ష విధింపబడెను.

తమ పవిత్ర నాయకుడగు శ్రీ రామరాజు అస్తమయ వార్త విని గాం గంటం దొర దేహము నిలువెల్ల దహించుకొని పోయెను. ప్రబల ప్రతీకార వాంఛ అతని మనస్సున ప్రవేశించినది. తమ నాయకుడు పోయిన తరువాత తన జీవితము వ్యర్థమనిపించినది. ప్రభుత్వ సైన్యము అన్ని దిక్కుల నుండి అతని కొరకు గాలించుచుండెను. కృష్ణాదేవిపేట ప్రాంతములో 7 పోలీసు దళములు, చింతలపూడి ప్రాంతమున 5 దళములు, పెదవలసలో మూడు దళములు గంటం దొర కొరకు గాలింపసాగినవి. ఈ రోజులలోనే అతడు నడింపాలెము గ్రామమునకు వచ్చి రాజు జీవించియేయున్నాడనియు, మూడు నెలల క్రితము ఆయన విప్లవములో క్రొత్తగా చేరిన ముగ్గురు వీరులతో కలిసి మాచిగుంటమునకు వెడలిపోయెననియు, అచ్చటి ప్రజలతో చెప్పి యున్నట్లు తెలియుచున్నది. కాని విప్లవమును, తన సహచరులను అట్లు సీతారామరాజు విడిచి వెళ్ళిపోయెననుట నమ్మదగినదిగా కన్పట్టదు. అట్టిది అతని స్వభావమునకే విరుద్ధము.

గంటం తన ప్రభావమును అమావాస్య వెళ్ళిన తరువాత జూన్ 2వ తేదీని చూపగలనని నడింపాలెము గ్రామస్థులకు చెప్పియుండినట్లు ఏజెన్సీ కమాండింగు ఆఫీసరు స్వీనీ మే 31 తేదీని ప్రభుత్వమునకు పంపిన నివేదికలో వ్రాసెను.

అస్సాం రైఫిల్సు దళము వారి సేవలను ఉపయోగించుకొనుటకు ఇచ్చిన గడువు తీరిపోవుటచే జూన్ నెల ప్రారంభములో వారు అస్సామునకు తిరిగి పోయిరి.

గంటం నేడు ఒంటరివాడై పోయెను. దైవ సమానుడయిన తన నాయకుడు శ్రీరామరాజు లేడు. సోదరుడు మల్లుదొర ప్రభుత్వ నిర్బంధములో నున్నాడు. అగ్గిరాజు శత్రువుల వశమయ్యెను. ఇక గంటం దొర కొరకు ప్రభుత్వాధికారులు ప్రజలను హింసింపసాగిరి. గంటం మొదటి భార్య, కూతురు గూడ బంధింపబడిరి. రెండవ భార్య ఆత్మరక్షనకు గాను అడవులలోనికి పారిపోయి తిరుగాడుచుండెను. అయినను ఎట్టి సంకట పరిస్థితులలోను సాహసము అతని సాహచర్యమును విడువలేదు.

జూన్ 7వ తేదీని సాహసమే ఊపిరిగాగల ఎనిమిది మంది సహచరులతో కలిసి తిరుగుచు గంటం దొర 'పందుకొంటుదొన' అను ఒక కొండ వాగు వద్దకు వచ్చెను. ఈలోగా ఒక సంచార పోలీసు దళము హఠాత్తుగా అక్కడ ప్రత్యక్షమయ్యెను. ఉభయులు తుపాకులను ఎక్కుపెట్టి కాల్చిరి. యుద్ధము ఉధృతమయ్యెను. ప్రభుత్వ సైనికులు సుమారు వంద మంది ఉండిరి. అయినను గంటం దొరను చేరుటకు వారు భయపడుచుండిరి. మూడు వైపుల నుండియు వారు గంటం దొరను చుట్టుముట్టి తుపాకి గుండ్లను వర్షించుచుండిరి. జమాదారు పొన్నుస్వామి కథనము ప్రకారము గంటం దొర మూడు వైపుల నుండి చుట్టుముట్టబడుటతో తప్పించుకొని పోవుటకు అవకాశము చిక్కలేదు. పారిపోవుటకు ప్రయత్నించుచునే అతడు పోలీసు కాల్పులకు బదులు కాల్పులు జరుపుచుండెను. తన యొద్దనున్న నాటు తుపాకి తోనే గంటం ఈ యుద్ధమును సాగించుచుండెను. చెట్ల చాటు నుండి గంటం బృందము తుపాకులు కాల్చుచుండిరి. గంటం దగ్గర తూటాలు అయిపోయినవి. తుదిబారును కాల్చి, చెట్టు చాటు నుండి ఆవలికి వచ్చి సైనికులకెదురుగా అతడు నిల్చుండెను. అప్పటికిని అతనిని సమీపించుటకు భయపడి సైనికులు దూరము నుండియే తుపాకులను కాల్చుచుండిరి. తప్పించుకొనుటకు అతడు ప్రయత్నించలేదు. గుండ్లకు రొమ్మునొడ్డి వెనుకంజవేయక నిలుచుండెను. అతని అనుచరులు గూడ బయటపడి కాల్పులు సాగించుచుండిరి. ప్రభుత్వ సైనికుడు కాల్చిన గుండు తగిలి గంటం నేలకొరిగెను. ఇట్లు శౌర్య సాహసములతో పోరాడి గంటం దొర వీరస్వర్గమలంకరించెను. ఇంకొకడు తీవ్రముగా గాయపడెను. తక్కిన వారు తప్పించుకొని పారిపోయిరి. కొన్ని పోలీసు తుపాకులు, కొంత మందుగుండు ప్రభుత్వ వశమయ్యెను, గంటం దొర మరణముతో ఎట్టకేలకు పోలీసులు విజయమును ప్రకటించుకొనిరి.

ప్రభుత్వాధికారుల అంచనా ప్రకారము అప్పటికి ఇంకను 30 మంది వరకు విప్లవకారులు నిర్బంధింప బడవలసి యుండెను. వారందరును చెదరిపోయి ఎక్కడెక్కడో దాగుకొనిరి. జూన్ 25వ తేదీని ప్రభుత్వము చేసిన పత్రికా ప్రకటన ప్రకారము జూన్

10వ తేదీని నర్సీపట్నమునకు మూడు మైళ్ళ దూరములో నున్న ఒక గ్రామములో గోకిరి ఎర్రేసును బంధించి గూడెము డిప్యూటీ తహసీల్దారు వద్ద హాజరుపరచినట్లు తెలియవచ్చుచున్నది. అతనిని పట్టుకొనిన వారికి 500 రూపాయలు బహుమతిని ప్రభుత్వము ప్రకటించుట వలన ఆ గ్రామస్థులే అట్టి పనికి పాల్పడిరని తెలియుచున్నది. జూన్ నెల 16వ తేదీ బొంకుల మోదిగాడు అను మరియొక విప్లవకారుడు కూడ ప్రభుత్వమునకు దిక్కెను. అతనిని పట్టుకొనిన వారికి గూడ 500 రూపాయలు బహుమతిని ప్రభుత్వము ప్రకటించినది. అతనిని కొంతాళం వద్ద గ్రామస్థులు పట్టుకొని, నర్సీపట్నము తీసికొని వచ్చినట్లు తెలియుచున్నది. క్రమముగా కొన్ని రైఫిళ్ళు, పోలీసు తుపాకులు గూడ ప్రభుత్వము వశపరచుకొనినది. సీతారామరాజు, గంటం దొర అంతరించిన తరువాత సైనికులు ఈ లొంగుబాట్లను సాధించుకొనగలిగిరి.

వర్షాకాలము ప్రారంభమగుటతో తక్కిన విప్లవకారులను అనుసరించి వెదకుట ఏజెన్సీ ప్రాంతములో కష్టముగాన అక్కడ పనిచేయు పోలీసు సిబ్బందిలో చాల భాగము తగ్గించబడెను. 300 మంది ఈస్టు కోస్టు స్పెషలు పోలీసు సిబ్బంది మాత్రము మిగిలిన విప్లవకారులను వెదకి పట్టుకొనుటకు ఏజెన్సీ ప్రాంతములో ఉంచబడిరి. కొద్ది మంది తప్ప, తక్కిన విప్లవకారులందరును పట్టుబడుటయో, లేక ఇతర ప్రాంతములకు కనబడకుండ కూలీలుగా పోవుటయో జరిగినది. విప్లవకారులలో ముఖ్యులందరును మరణించుటయో, పట్టుబడుటయో జరిగిన పిమ్మట నడిపించు నాయకుడు లేక విప్లవము చల్లబడిపోయినది. సెప్టెంబరు నెల చివరకు విప్లవకారులలో ఒక ముఖ్యుడు మాత్రము పట్టుబడవలసి యున్నట్లు ప్రభుత్వ నివేదిక వలన తెలియుచున్నది.

ఈ పరిస్థితులలో పెద్ద పోలీసు సిబ్బందిని ఏజెన్సీ ప్రాంతములో ఇంకను ఉంచుట అనవసరముగా భావించి 240 మంది ఈస్టుకోస్టు స్పెషల్ పోలీసు సిబ్బందిని మాత్రము అక్కడ ఉంచి వారి హెడ్‌క్వార్టర్సును విజయనగరమునకు మార్చుటకు మద్రాసు ప్రభుత్వము ఉత్తర్వులు జారీ చేసినది. మిగిలిన విప్లవకారులను పట్టి నిర్బంధించుటకు ఒకటి రెండు పోలీసు స్థావరములు మాత్రము ఇంకను ఏజెన్సీలో కొంత కాలము ఉంచబడెను.

ఇట్లు 1992 ఆగస్టు 22 తేదీన ప్రారంభమైన అల్లూరి సీతారామరాజు విప్లవము 1924 జూలై మొదటి వారమున ముగిసినది.

# 35. అనుమానాలు, అపోహలు

సీతారామరాజు మరణము పట్ల పత్రికలును, ప్రజలును చాల అనుమానములను వెలిబుచ్చిరి. 1924 మే 8 తేదీని ఆంధ్ర పత్రిక ఇట్లు వ్రాసినది. "ఈ వేళ అందిన టెలిగ్రాములో ఉపేంద్ర పట్నాయకుకు, రామరాజు దళమునకు మధ్య పోరాటము జరిగినదని మొదట చెప్పబడినది. 12గురు చనిపోయిరనియు, సీతారామరాజు పట్టుపడెననియు ప్రకటింపబడినది. పిమ్మట ఆతడు తప్పించుకొని పారిపోయెననియు, గాయములు తగిలినవనియు నివేదికలో పేర్కొనిరి. రేపు మరల ఆతడు గాయములు ఏమియు తగులకుండగనే తప్పించుకొని పోయెనని ప్రకటింపబడవచ్చును. సర్వదా ప్రయత్నించినను సీతారామరాజును పట్టుకొనలేక ప్రభుత్వము తన గొప్పలు చెప్పుకొనుచుండుట చాల ఆశ్చర్యకరముగానున్నది."

ఈ యనుమానమునే 1912 జులైలో 'శారదా' పత్రిక ఇంకను విశదముగా ఇట్లు వివరించినది. "సీతారామరాజు మరణమును గురించి ప్రజలలో ఎన్నియో అనుమానములున్నవి. ప్రభుత్వమతనిని 7వ తేదీని పట్టుకొనినను 16వ తేదీ వరకు ఆ విషయము ప్రకటించలేదు. అప్పుడైనను పారిపోవుటకు ప్రయత్నించుచుండగా 8వ తేదీని కాల్చివేయబడెనని ప్రకటింపబడినది. ఈ ఆలస్యమునకు కారణమేమి? ఈ 9 రోజుల వ్యవధిలో కార్యరంగములో ఉన్న అధికారులకు, ప్రభుత్వమునకు మధ్య ఏమి ఉత్తర ప్రత్యుత్తరములు జరిగినవి. రాజు వంటి పెద్ద పితూరి నాయకుడు. ప్రభుత్వ వశములో నుండగా పోలీసు నిర్బంధములో నుండి అతడు ఎట్లు తప్పించుకొనుటకు ప్రయత్నించెను? పోలీసులు కాల్చుట వలన అతనికి ఎన్ని గాయములు తగిలెను? ఎచ్చట తగిలెను? శవ పరీక్ష జరిపి పంచాయతీ జరిపించిరా? అయినచో ఆ శవ పంచాయతీ నివేదికను ప్రభుత్వము ఎందుకు ప్రకటించలేదు? రాజు మరణవార్తను కొంత మంది నమ్ముట లేదని పత్రికలు ప్రకటించుచున్నవి. అందుచే ఈ విషయములో సకల వివరములను ప్రకటించుట ప్రభుత్వ విధి. పారిపోవుచున్నపుడు అతనిని ఎవరు కాల్చిరి? అంత పెద్ద ప్రభుత్వ బలగము కాల్పులు జరుపకుండ పట్టుకొనలేక పోయినదా? కాల్పులు అవసరమైనవే యనుకొందము. అతని కాళ్ళపై ఏమైనను గాయములు తగిలినవా? పారిపోవు వానిని పడగొట్టుటకు కాళ్ళపై కాల్చి గాయము చేసినచో చాలదా? అట్టి గాయము తగిలినచో దాని వలననే అతడు మరణించెనా? లేక నడుముపై ఏమైనను

దెబ్బ తగిలినదా? ఈ విషయములన్నియు విచారించదగినవి'' అని ఆ పత్రిక ప్రభుత్వమును నిలువదీసినది.

1924 జులై 22 తేదీని 'హిందూ' పత్రిక సీతారామరాజు మరణించినాడా? అని గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ అనుమానించుచున్నది' అను శీర్షికతో ఇట్లు ప్రకటించెను : రాజమండ్రిలో జులై 20వ తేదీ ఉదయము జరిగిన గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ అల్లూరి సీతారామరాజుకు సంబంధించిన తీర్మానమును గంటకు పైగా చర్చించినది. ఆ తీర్మానమిట్లున్నది - ''హింసను నిరసించుచు అహింసా సిద్ధాంతమునకు కట్టుబడియున్నను, ఈ కమిటీ భారతమాతకు స్వేచ్ఛ కలిగించు విషయములో అల్లూరి సీతారామరాజు చూపిన దేశభక్త్యావేశము, మహోన్నత త్యాగములను అభినందించుచున్నది. కాని సీతారామరాజు అవలంభించిన మార్గము సత్వర స్వరాజ్య సాధనకు ఆటంకము కలిగించుచున్నదని ఈ కమిటీ అభిప్రాయపడుచున్నది. ''వెన్నేటి సత్యనారాయణ గారు, కె. వీరయ్య గారు ఈ తీర్మానమును ప్రతిపాదించగా బులుసు సాంబమూర్తి గారు రాజీగా ఒక సవరణను తీసికొని వచ్చిరి. 'విప్లవ నాయకుడైన సీతారామరాజు చనిపోలేదని దేశములో వదంతులు ప్రాకి యుండుటచే పై తీర్మానమును ప్రవేశ పెట్టకుండుట మంచిదని ఈ కమిటీ యభిప్రాయపడుచున్నది' అని సవరణ సారాంశము. దానిని కమిటీలో మెజారిటీ సభ్యులు ఆమోదించిరి.

దీని నాక్షేపించుచు శారద పత్రిక పైన వివరించినట్లు వ్రాసి ఇంకను ఇట్లు వలపొనిచ్చినది: సీతారామరాజు మరణము విషయములో ముఖ్యముగా అనుమానించదగు విషయముల విచారణను వదలి కొందరు కాంగ్రెసు వారు అనవసర తీర్మానములను ప్రతిపాదించి వ్యర్థ కాలక్షేపము చేయుట శోచనీయము అని.

మరల 1924 అక్టోబరులో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సమావేశము సీతారామరాజును గురించి ఒక తీర్మానమును ప్రవేశపెట్టినది. దానిని గురించి 1924 అక్టోబరు 23 తేదీని 'కాంగ్రెసు' పత్రిక ఇట్లు వ్రాసినది : సీతారామరాజు యొక్క హింసా మార్గమును నిరసించుచునే అతని ధైర్యసాహసములు మొదలగు ఉన్నత గుణములను ప్రశంసించువారు అనేకులు ఆంధ్ర దేశమున గలరు. అతడు చనిపోయినని ప్రభుత్వము ప్రకటించినను కొందరు ఆ విషయమును విశ్వసించుట లేదు. ఈ అభిప్రాయమునే గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ కూడ ఇదివరలో ఒకప్పుడు వెల్లడించినది. దాని తీర్మానమును పత్రికలన్నియు ప్రకటించినవి. చిన్న విషయములలో గూడ అసత్య

వార్తలను నిరాకరించుచు ప్రభుత్వము ప్రకటనలు వెలువరించెడిది. కాని **ఇట్టి ముఖ్య** విషయములో ప్రభుత్వము ఏల మౌనము వహించినదో తెలియుట లేదు . **గారు ఇంతకు** ముందు చేసిన ప్రకటనలు నిజమనియు రాజు మరణము నిస్సందేహముగా జరిగిన వాస్తవమే యనియు ఎందుకు ప్రకటించగూడదు? ఈ విషయములో లెజిస్లేటివు కౌన్సిలులో గూడ కొందరు సభ్యులు ప్రశ్నలు వేసిరి గాని ప్రభుత్వపు జవాబులు గోడ మీద పిల్లి వాటముగా నున్నవి. ప్రస్తుతము రాజు బ్రతికి యున్నాడా; మరణించెనా యనునది ముఖ్య విషయము.

1924 అక్టోబరు 24 తేదీ 'జ్యోతి' పత్రికయు, అక్టోబరు 25 తేదీ 'కృష్ణా' పత్రికయు అహింసా సిద్ధాంతమునకు కట్టుబడిన కాంగ్రెసు సభ్యులు కొందరు ఆ సిద్ధాంతమును ప్రక్కకు నెట్టి మన్యము పితూరి నాయకుడగు అల్లూరి సీతారామరాజు యొక్క హింసా పద్ధతులను గర్హించుచునే అతని దేశసేవను ఉగ్గడించుచు అనుమానములకు చిక్కులకు తావిచ్చుచు బెంగాలులో 'సెరాజ్‌గంజు వద్ద 'సాహ' విషయములో చేసిన తీర్మానముల వంటివి చేయుట సిగ్గుచేటు అని నిగ్గదీసినవి.

కొందరు పెద్దలు నిరసించినను ఆంధ్ర ప్రజానీక హృదయములలో అల్లూరి సీతారామరాజునిన ఆనందావేశములు పొంగిపొరలుచుండెను. సంగ్రహ జీవిత చరిత్రలు, కథలు, పాటలు ప్రచారము గాంచినవి. 1926లో "కాంగ్రెస్" పత్రిక ఇట్లు ప్రకటించినది : " బల ప్రయోగముపైననే ఆధారపడి పాలించుచున్న పరదేశ ప్రభుత్వమును ఎదుర్కొనుటకు అహింసాయుతమైన ఉద్యమము మాత్రమే సరియైన మార్గమని దేశమంతయు ఘోషించుచున్న సమయమున ఒక ఆంధ్ర క్షత్రియ యువకుడు క్షాత్ర ధర్మముచే ప్రేరేపింపబడి ప్రపంచములో అతిశక్తిమంతమగు ప్రభుత్వ వ్యవస్థపై కత్తిగట్టి దానితో రెండు సంవత్సరములు పైగా యుద్ధము చేసి ప్రక్కలో బల్లెమై సంచలనము కలుగజేసెను. ఆంధ్రులీ విషయమును ఎప్పుడును మరచిపోలేరు. దేశము ప్రస్తుతమున్న పరిస్థితులలో అతడవలంబించిన పద్ధతి నిస్సందేహముగా గర్హణీయమే. ప్రభుత్వము అతనిని ఎట్టకేలకు చంపినట్లు ప్రకటించుకొనినది. కాని గత వారము లెజిస్లేటివు కౌన్సిలులో రాజును పట్టుకొనినందులకా? లేక అతనిని కాల్చి చంపినందులకా? కొందరు పోలీసు వారికి బహుమతులిచ్చిరి అని వేసిన ప్రశ్నలకు ప్రభుత్వ న్యాయశాఖ సభ్యుడు అతనిని పట్టుకొనినందులకే ఇచ్చితిమని వాక్రుచ్చెను. దీనిని బట్టి రాజు పట్టుకొనబడెనని స్పష్టమగుచున్నది. కాని నిర్బంధములో నున్న రాజును తరువాత కాల్చవలసిన అవసరమేమి వచ్చినది? ఈ ప్రశ్నకు ప్రభుత్వము జవాబు చెప్పవలయును. శవపరీక్ష

కూడ చేసిరని ఆ న్యాయశాఖ సభ్యుడు చెప్పెను. కాని అది ఎవరు నిర్వహించిరి. దాని ఫలితమేమి? ఈ ప్రశ్నలకు ప్రభుత్వము జవాబు చెప్పవలసియుండెను. శ్రీరామరాజు ఈ ఫితూరిని దేశ స్వాతంత్ర్య స్థాపనకే లేవదీసెనో, కష్టము క్లిష్టము అయిన ఈ ప్రయత్నమును స్వార్థముతో చేసెనో కాలమే నిర్ణయించగలదు. శ్రీరామరాజు హింసా మార్గమును మేము అభినందించలేము. కాని ప్రజానీక హృదయములలో ఒక పవిత్ర స్థానమును ఆక్రమించియున్నాడని మాత్రము ఘంటా పథముగా చెప్పగలము."

శ్రీరామరాజు కూడ తన తల్లితో "అమ్మా! నేను ఎప్పుడును ఒకరి చేతిలో చనిపోను. అట్టి వార్తలు మీరు నమ్మవద్దు. అట్టి పరిస్థితి సంభవించుచో నాకు నేనే ఆత్మహత్య చేసికొందును." అని చెప్పుచుండెడివారు. ఈ విషయము ఆ వీరమాత చెప్పుచుండెడివారు.

ఏమైనను, సీతారామరాజు నిర్యాణమును గురించిన అనుమానము ప్రజలకును ప్రభుత్వమునకు గూడా పోలేదు. అతని మరణవార్తను గురించి చేసిన ప్రకటనను డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు "జన్మభూమి" పత్రికలోని ఒక వ్యాసములో విపులముగా చర్చించియుండిరి.

* తారామరాజు పేరున ఆయనను పోలిన ఇంకెవరినో బట్టుకొని కాల్చిరనియు, ఆయన తప్పించుకొని ఏ హిమాలయములకో తపస్సుచేసి కొనుటకు పోయియుండును, అంతియేగాని ఆయన మరణించలేదు అని ప్రజల విశ్వాసము. మరణించినాడనుటకు వారి మనస్సు ఒప్పదు. ఎచ్చట తిరుగుబాటు జరిగినను, విప్లవము విజృంభించినను, దానికి నాయకుడు సీతారామరాజేయని ప్రజలు భావించెడువారు. 1942 ఉద్యమములో గూడ సీతారామరాజు రాజమండ్రిలో ప్రత్యక్షమగుచున్నారని ప్రజలాశపడిరి. శాంతి సమయములలో మానవ సౌభాగ్యమునకు సేవలొనర్చు సాధువులలోను తపో నిష్ఠులలోను రామరాజును చూచుటకు ప్రయత్నించెడువారు.

అట్లే ప్రభుత్వ గూఢచారులు కూడ సీతారామరాజని యనుమానమున్న వ్యక్తులను వెంటాడి పరిశీలించెడువారు. చాలసార్లు సాధువులను బంధించి విడిచి పెట్టెడివారు. 1934 సెప్టెంబరులో భీమవరములో నొక సాధువును సీతారామరాజను అనుమానముచే బట్టుకొని పిదప విడిచి పెట్టిరి. ఆ రీతిగానే మన్యములో గోదావరి తీరమున దేవీపట్నమువద్ద పాపికొండలలో తపస్సు చేసికొనుచున్న పేరంటాలపల్లి సాధువు అను పవిత్రమూర్తిని సీతారామరాజుగా అనుమానించి చాల కాలము అతనిపై నిఘా వేసిరి.

అట్లే కొలది సంవత్సరముల పూర్వము మరణించిన తుని దగ్గర బెండపూడి సాధువును గురించియు ప్రజలకును, ప్రభుత్వమునకు సీతారామరాజని చాల ఆపోహలుండెడివి. అతడు సీతారామరాజేయని గోదావరి మండల క్షత్రియులు తమ పిల్లలనిచ్చి పెండ్లిండ్లుకూడ చేసిరి. అట్లతడు ఎనిమిది పెండ్లిండ్లు కూడ చేసికొని సంసార బంధః ఒను మిక్కిలిగా పెంచుకొని నాడు. నిరంతరము అన్నదానము చేయుట వలన ప్రభుత్వముకూడ అనుమానించుచునే యుండెను. ఇప్పటికిని సీతారామరాజు అను పేరుతో కొందరు సాధువులు అప్పటచ్చట ఉండుటయు ప్రజల నమ్ముటయు జరుగుచున్నది. ప్రజా హృదయములలో అట్టి స్థిరపీఠము సంపాదించుట వలన ప్రజలాయన చనిపోవుటకు అంగీకరించరు. సుభాష్ చంద్రబోసు విషయములో గూడ ఇప్పటికిని జీవించి ఎక్కడునో యున్నాడనియే అప్పుడప్పుడు వార్తలు వెలువడుచున్నవి గదా!

# 36. శ్రీరామరాజా, సీతారామరాజా?

విప్లవవీరుని పేరు అల్లూరి సీతారామరాజనియే ప్రజానీకములో ప్రసిద్ధి పొందినది. అసలు పేరు శ్రీరామరాజు అని చాలమందికి తెలియదు. తెలిసిన వారును పేరు అట్లు మారుటకు ఏవో ప్రేమకథలు అల్లియు, ఊహా చిత్రములు వర్ణించియు ఆయనయే సీతారామరాజని పేరు మార్చుకొనెనని చిత్రించిరి. కాని ఈ కట్టుకథలకు ఏమియుఆధారము కనబడదు. ప్రభుత్వ రికార్డులలో సంతకము చేసినను, ఇతర స్థలములందు వ్రాసికొని నను ఆయన శ్రీరామరాజు అనియే వ్రాసికొనెను, కాని ఎక్కడను సీతారామరాజు అని వ్రాసికొనలేదు.

ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు శ్రీరామరాజు. ఆయన మాతామహుడు మందపాటి శ్రీరామరాజు. ఆపేరే ఆయనకుపెట్టిరి. చిన్నప్పటి నుండియు తల్లిదండ్రులును, బంధువులును 'చిట్టిబాబు' అని పిలిచెడివారు. తరువాత మన్యములో నివాసమున్నప్పుడు మన్యపు ప్రజలు 'బాబు' అనియు "రాజుగారు" అనియు, 'రాజు' అనియు వాకొనెడివారు.

ఎక్కడో క్వాచిత్కముగా తప్ప ప్రభుత్వ నివేదికలందు, పత్రము లందు అన్నిచోట్లను శ్రీరామరాజు అనియే యున్నది. పత్రికల వారు మాత్రము చాల వరకు 'సీతారామరాజు' అని వ్యవహరించిరి.

హాపెల్ నివేదికను ప్రకటించిన 1923 జూలై 23 తేదీగల మద్రాసు ప్రభుత్వ పబ్లిక్ డిపార్టుమెంటు జి.ఓ. 572లో శ్రీరామరాజు అనియే యున్నది. మిత్రుడు పేరిచర్ల సూర్యనారాయణరాజు నకు వ్రాయబడి ప్రభుత్వము నకు పట్టుబడిన లేఖక్రింద 'శ్రీ అల్లూరి శ్రీరామరాజు' అని సంతకము చేయబడినది 4-2-1922తేదీని అసిస్టెంటు కమిషనరుకు పెట్టిన అర్జీలోను 'శ్రీ అల్లూరి శ్రీరామరాజు' అనియే చేవ్రాలు చేయబడెను. కాని 16-9-1922 తేదీని చేసిన ప్రభుత్వ ప్రకటనలోను, మద్రాసు ప్రభుత్వము భారత ప్రభుత్వమునకు  ఏజన్సీలో తిరుగుబాటును గురించి ఆ తేదీనే పంపిన లేఖలోను. 3-10-1922 తేదీని ప్రభుత్వము చేసిన పత్రికా ప్రకటన లోను 'అల్లూరి సీతారామరాజు' అనియున్నది. (ఇది చాల సంవత్సరముల తరువాత నకలు వ్రాయసకాని తప్పు అయి యుండవచ్చును.) అట్లే 27-8-1922న విశాఖపట్టము ఏజెన్సీ కమిషనరు అగు ఎఫ్ డబ్లియు. స్టీవర్టు ప్రభుత్వమునకు పంపిన నివేదికలో "అల్లూరి సీతారామరాజు" అనియె యున్నది. కాని 28-8-1922న పోలీసు ఇనస్పెక్టరు జనరల్ ఎఫ్. ఆర్మిటేజ పంపిన

నివేదికలో "శ్రీరామరాజు" అని యున్నది. 13-9-1922న పైడిపుట్ట భూమిని గురించి ఎస్. ఆదినారాయణ ఇచ్చిన వాఙ్మూలములో " అల్లూరి శ్రీరామరాజు" అనియే చెప్పెను.

అడ్డతీగల, రంపచోడవరము స్టేషనులపై దాడి జరిపిన తరువాత ఆయాస్టేషను సబిన్స్పెక్టరులు ఏజెన్సీ కమీషనరుకు 18-10-1922 తేదీని, 20-10-1922 తేదీని పంపిన తంతి వార్తలలోను 'శ్రీరామరాజు' అనియే వ్యవహరించిరి. 30-10-1922న చేసిన మద్రాసు ప్రభుత్వ పత్రికా ప్రకటనలోను, 'శ్రీరామరాజు' అనియే పేర్కొనబడినది. 29-12-1922న జె.ఆర్.హిగ్గిన్సు పితూరి దారులను పట్టుకొనిన వారికి బహుమతులు ప్రకటించెను. 'అల్లూరి శ్రీరామరాజు"ను పట్టుకుంటే రు.1500/- ఈనాము ప్రకటించెను. అట్లే ఏజెన్సీ జిల్లా మేజిస్ట్రేటు కోర్టు C.C. 23/1923లో ముద్దాయిలుగా తన ముందు హాజరు కావలెనని హిగ్గిన్సు 1-6-1923 జిల్లా గజెట్‌లో ప్రకటించిన వారిలో 'అల్లూరి శ్రీరామరాజు' మొదటి వాడు. 26-1-1923న ఏజెన్సీ కమీషనరు హిగ్గిన్సు ప్రభుత్వమునకు పంపిన నివేదికలోను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎ. గ్రాహం గోదావరి జిల్లా మెజిస్ట్రేటుకు 21-4-1923 తేదీన పంపిన మెమో నం. 31/0-1లోను గూడ 'అల్లూరి శ్రీరామరాజు' అని వ్రాసిరి. రాజవొమ్మంగి స్టేషను సబ్ ఇన్స్పెక్టరు పంపిన 15-4-1923 తేదీ గల F.I.R.లో గూడ 'ఎ. శ్రీరామరాజు, గాం గంటం దొర' మొదలగు పేర్లు వ్రాయబడినవి. ఇది బొర్గంపల్లిలో పితూరిదారులు అపాయకరమైన ఆయుధములతో వచ్చి బలాత్కారముగా ఒక రూపాయి విలువ గల బియ్యమును తీసికొనిరని నేరము మోపు రిపోర్టు. 19-4-1923 హిందూ పత్రికలో మాత్రము 'అల్లూరి సీతారామరాజు' అన్నవరము వెళ్ళుట గురించి వ్రాయబడినది. కాని 15-6-1923 'స్వరాజ్య' పత్రిక గూడెము తహసీల్దారును విప్లవకారులు పట్టుకొనిరని వ్రాయుచు 'శ్రీరామరాజు' అని రంపపితూరి నాయకుని పేర్కొనినది. జయపూరు మహారాజు 16-6-1923న ప్రభుత్వమునకు లేఖ వ్రాయుచు 'అల్లూరి సీతారామరాజు' అని వ్రాసెను. కాని 10-7-1923న మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గ్రాహం భారత ప్రభుత్వమునకు పంపిన నివేదికలో 'శ్రీరామరాజు' అనియే వ్రాసెను. 7-9-1923న స్వీనీ పంపిన నివేదికలో గూడ 'అల్లూరి సీతారామరాజు' అని యున్నది.

ఆనాటి పత్రికలన్నియు సాధారణముగా 'సీతారామరాజు' అని పేర్కొనియే పితూరి వార్తలను వెలువరించినవి. 1926లో 'కాంగ్రెసు' పత్రిక మాత్రము 'శ్రీరామరాజు చంపబడెనా?' అనుచు సందేహము వెలిబుచ్చినది. 'కాంగ్రెసు' పత్రిక మద్దూరు అన్నపూర్ణయ్యగారి సంపాదకత్వమున నడుపబడుచుండుటచే కాబోలు 'శ్రీరామరాజు' అనియే వ్రాయుచుండెడిది.

కోర్టు పత్రములు మాత్రము 'అల్లూరి శ్రీరామరాజు' అనియే పేర్కొనినవి. కందుకూరి నారాయణరావు అని రెవిన్యూ ఇన్స్పెక్టరుపై పితూరీదారులకు సహాయపడెనని అభియోగము మోపుచు ఏజన్సీ గవర్నరు రూథర్‌ఫర్డు కోర్టులో పితూరీదారుల నాయకుడు 'అల్లూరి శ్రీరామరాజు' అని పేర్కొనెను.

"అల్లూరి శ్రీరామరాజు" మొదలుగాగల 31 మంది పితూరీదారులపై అభియోగములు మోపుచు మద్రాసు ప్రభుత్వము పబ్లికు శాఖ 15-2-1923 తేదీ గల 109 నం. జి.ఓలో నాయకుడు 'అల్లూరి శ్రీరామరాజు' అని ప్రకటించినది. ఏజన్సీ డివిజను అదనపు సెషన్సు జడ్జి ఎల్.హెచ్. ఆరంటు 'కొలగానిసంగతులు' మొదలగు 22 మంది విప్లవకారులను విచారించి 25-6-1923న తీర్పు చెప్పిన సెషన్సు కేసు నం. 16/1923లో గూడ తిరుగుబాటు నాయకుడు 'అల్లూరి శ్రీరామరాజు' అనియే పేర్కొనబడినది.

21-2-1924 తేదీ గల ప్రభుత్వ పబ్లికు శాఖ జి.ఓ. నం. 126 ఫైలులో పోలీసు ఇన్స్పెక్టరు జనరలు లేఖలో 'శ్రీరామరాజు' అనియు, 'నోటు'లో "అల్లూరి సీతారామరాజు' ' అనియు ఒకే ఫైలులో ఉండుట విచిత్రము. ఇది మల్లుదొరను పట్టుకొనిన వారికి బహుమతి ఎవరెవరికి ఎంత పంచవలయును అను విషయమును గురించినది సెక్రటేరియట్‌లోని ఉద్యోగి పత్రికలలో వచ్చుపేరుచే ప్రభావితుడై యుండవలెను.

ప్రభుత్వ గూఢచారి ఇన్స్పెక్టరు అగు ఉపేంద్ర పట్నాయకు నర్సీపట్నము ఆఫీసర్ కమాండింగ్‌కు 1924 మే 6వ తేదీన వ్రాసిన నివేదికలో విప్లవకారుల చర్యలను గురించి వ్రాయుచు "శ్రీరామరాజు, అతని అనుచరులు" అనియే పేర్కొనెను.

30-5-1924న వెలువడిన పబ్లిక్‌శాఖ జి.ఓ. నం. 384లో 'వందలం గున్నడు' మొదలగుగాగల 47 గురు వ్యక్తులమీద నేరములు మోపుచు విప్లవనాయకునిగా 'అల్లూరి శ్రీరామరాజు'ను వాకొనినది. అట్లే 1-7-1924 తేదీన గల పబ్లిక్‌శాఖ జి.ఓ.ం నం 457లో గూడ 'అల్లూరి శ్రీరామరాజు' అనియే పేర్కొనబడెను. ఇది పితూరీదారులకు యూనిఫారం మొదలగునవి కుట్టి అందించినందులకు రేకపల్లి కాకన్న, పణతుల చిదంబరం అనువారిపై అభియోగములు మోపు విషయమునకు సంబంధించినది.

ఇక విప్లవవీరుని చేతి వ్రాతతో వున్న సంతకములు మొదలైనవి దువ్వూరి ముఠాదారు శ్రీ చెక్కా లింగం దొరగారికి 14-6-1922న వ్రాసిన లేఖలో తెలుగులోను గూడెము

డిప్యూటీ తహసీల్దారు బాస్టియనుకు 1922 జూన్‌లో వ్రాసిన లేఖలోను 1924 డిసెంబరులో స్టేషను హౌసు డైరీలో రిమార్కు వ్రాసి ఆ క్రిందను ఇంగ్లీషులోను 'శ్రీ అల్లూరి శ్రీరామరాజు' అని సంతకము చేయబడినది. అతనికి సంబంధించిన తెలుగు పుస్తకములు 'మనుచరిత్ర' , 'ఆంధ్రనామ సంగ్రహము'లలో నాగరి లిపిలో 'శ్రీ మన్మహారాజ రాజాధిరాజ, శ్రీ అల్లూరి శ్రీరామరాజు, శ్రీరామ విజయనగరము అని వ్రాసికొనెను.'

ఇట్లు రెండు పేరులను ప్రచారము నందుండి ప్రభుత్వము గూడ తడబడుచు రెండు పేర్లను వాడుచుండుటవలననే 1922-23 సంవత్సరపు అనుబంధపు పద్దులలో పితూరికి సంబంధించిన పద్దును ఆమోదించు విషయములో మద్రాసు విధాన సభలో జరిగిన చర్చలో శ్రీమాన్ శశిభూషణ రథ మహాశయుడు ఈ విధముగా ప్రభుత్వమును ప్రశ్నించెను. "ప్రభుత్వము వెలువరించిన మొదటి మూడు ప్రకటనలలో విప్లవమునకు కారకుడు 'అల్లూరి సీతారామరాజు' అనియు, చివరి ప్రకటనలో 'శ్రీరామరాజు' అనియు ప్రకటించిరి గదా! అందుచే ఇందులో విప్లవ నాయకుడు అసలు ఎవరో నేను తెలిసికొనగోరుచున్నాను. "ఇటువంటి ప్రశ్ననే మరియొక సభ్యుడగు దివాన్ బహదూర్ కృష్ణ నాయరు గూడ అడిగెను.

పత్రికల ప్రభావమువలననే ప్రజలలో 'సీతారామరాజు' అను నామము పాతుకొనిపోయి స్థిరపడిపోయినది. శ్రీ రామరాజు అను పేరు కంటె సీతారామరాజు అను పేరు ప్రచురముగను, పలుకుటకు తేలికగా నుండుట చేతను అట్లు జరిగియుండవచ్చును. ఆ నామ ప్రాచుర్యమునకు బీజమెచ్చట నుండి వచ్చినదో కాని ప్రజా హృదయములలో వేరుదన్ని పాతుకొనిపోయినది. ఇప్పటికిని భద్రాచలము, కృష్ణాదేవిపేట మొదలగు మన్య ప్రాంతముల నుండి కోయలు మున్నగు గిరిజనులు మైదాన ప్రాంతములకు డెల్టా ప్రాంతములకు వచ్చినపుడు 'మా సీతారామరాజు' అంటూ ఏవో వారు వినిన కథలు చెప్పారు, ఆయన మరణించలేదనియే నమ్ముచు చెప్పుచుందురు.

# 37. మన్యములో తిరుగుబాటుకు కారణములు

మన్య ప్రాంతములో వంద సంవత్సరములకు పైగా అప్పుడప్పుడు వివిధ కారణములచే తిరుగుబాటులు రేగుచునే యుండెను. దుర్భర దారిద్ర్యములో మ్రగ్గుచున్న మన్య ప్రజలను ప్రభుత్వాధికారులు అనేక విధములుగా పీడించుచుండిరి. అచటి ప్రజలు చాల వరకు అనాగరికులగు కోయలు, సవరలు, గోండులు మొదలగు ఆటవికులు; కాని స్వేచ్ఛా జీవులు. తిండి బట్టల కరువుకు తోడుగా మలేరియా వ్యాధి వారిని పీల్చి పిప్పిచేయుచుండెను. ప్రభుత్వపు భూమి శిస్తు విధానము, అటవీ శాసనము, అధికారుల నిరంకుశ పాలన స్వతంత్ర జీవులగు మన్య ప్రజలకు దుస్సహములైనవి. అందుచే కొండజాతి ప్రజలు అసంతృప్తి చెంది అనేక పర్యాయములు ప్రభుత్వముపై తిరుగుబాటు చేసిరి. ఈ తిరుగుబాటులు కొన్ని ముందు అధ్యాయములలో వివరింపబడినవి.

శ్రీరామరాజు తిరుగుబాటుకు ముఖ్య కారణము మన్య ప్రజలను ప్రభుత్వాధికారులు పెట్టు హింసల నుండి రక్షించుటయే పిదప బ్రిటిషు వారిని పారద్రోలి స్వరాజ్యమును సాధించుట. హోమ్‌పెల్ తన నివేదికలో ఈ తిరుగుబాటుకు ముఖ్య కారణములుగా క్రింది వానిని పేర్కొనెను :

1. అడవులను కొట్టుట, పోడు వ్యవసాయము మొదలగు వ్యావసాయిక విషయములలో ప్రభుత్వ నిబంధనల యెడ మన్య ప్రజలలో అసంతృప్తి

2. గూడెము డిప్యూటీ తహసీల్దారు అగు బాస్టియను, అతని ఓవర్సీరు సంతానం పిళ్లై రోడ్డు నిర్మాణమునందు కూలీలకు సరిగా కూలి ఈయకుండుట, వెట్టిచాకిరి చేయించుట.

3. పెద్దవలస గ్రామము పూర్వపు మునసబు అగు ఎండుపడాలును ఘాటు రోడ్డు కంట్రాక్టు విషయములో బాస్టియను మోసగించుట, అతనిని పెద్దవలస ముఠాదారును చేయుదునని వాగ్దానము చేసి అట్లు చేయకపోవుట.

4. గాంసోదరుల భూములను వశము చేసికొని బాస్టియను ఇంకొకరికి ఇచ్చుటయు, లబ్బనుకుల గ్రామ మునసబుగిరి నుండి గంటం దొరను తొలగించుట.

5. గూడెము ముఠాదారు మొట్టడం వీరయ్యదొరకు ప్రవాసము విధించి, తరువాత అతడు తప్పించుకొని ఏజెన్సీకి తిరిగి వచ్చినపుడు నిర్బంధించుట.

అటవీ నిబంధనలను ఉల్లంఘించిన వారికి అధికారులు పెద్ద మొత్తములను జరిమానాగా వేసి వసూలు చేయుచుండిరి. ఒక వెదురు కఱ్ఱ కొట్టుకొనిన 15 రూపాయలు, ఒక దూడను మేపుకొనుటకు నాలుగు అణాలు అధికారులు వసూలు చేయసాగిరి. అడవులలో నివసించుచున్న ప్రజలు వారి నిత్యావసరములకు కావలసిన వస్తువుల కొరకు ఎక్కడకు బోదురు? ఈ నిర్బంధములకు ప్రజలు అసంతృప్తితో ఉడికిపోవు చుండిరి. ఇక బాస్టియను, అతని తొత్తు సంతానం పిళ్లె హింసలకు ప్రజలలో వారిపై ద్వేషము మిన్నుముట్టినది. ఏజెన్సీ నిర్మాణపు పనులన్నియు డిప్యూటి తహసీల్దారుగా బాస్టియను అధీనములో నుండెడివి. అతని నోరు మంచిది కాదు. కూలీలను ఇతరులను బాస్టియను అవమానపరచి బండబూతులు తిట్టెడువాడు. వారికి సరిగా కూలినిచ్చెడివాడు కాదు. లంచములు బాగుగ తినమరిగినాడు. తరువాత అతనిపై ప్రభుత్వము జరిపించిన విచారణలో అతని దురంతములు చాల వెలుగులోనికి వచ్చినవి. చింతపల్లి ఘాట్‌రోడ్డు వేయు పనికి రాకపోయినను, తనకు కోళ్ళు, ఆవులు, పళ్ళు, డబ్బు ఈయకపోయినను, తన ఇష్ట ప్రకారము వారు ప్రవర్తించక పోయినను, బాస్టియను మన్య ప్రజలను చాల హింసించెడివాడు. కఱ్ఱతో వారిని కొట్టి, బూట్లతో తన్నెడువాడు. స్తంభములకు కట్టించియు, జుట్టు దూలమునకు కట్టి వ్రేలాడదీసియు కొట్టెడువాడు. కళ్ళలోను, ఇతర చోటులందును కారపుపొడి జల్లించెడువాడు. తన గుఱ్ఱము మెడకు వారిని కట్టి ఈడ్పించెడువాడు. చేతులు విరిచికట్టి నంత చుట్టును త్రిప్పి ఊరేగించి అవమానించెడువాడు. దుష్టుడైన బాస్టియనుకు సంతానం పిళ్లె అగ్నికి వాయువువలె తోడై, అతడు చేయు పనులకు వంతపాడెడువాడు. ఇవి యన్నియు ప్రజల హృదయములలో రాజుకొని త్వరలోనే మన్యము భగ్గుమనెను.

కోయలు సాగు చేయుచుండిన భూములపై వారికి జిరాయితీ హక్కు ఉండెడిది. కాని ఈ హక్కును హరించుచు బ్రిటిషు ప్రభుత్వము 1916లో ఒక క్రొత్త చట్టము చేసినది. దీని మూలముగా అనేక మన్య ప్రజలు దెబ్బతినిరి. అట్టి వారిలో గాంసోదరులు ఒకరు వారి భూములను లంచము తీసికొని బాస్టియను గుమ్మర్ల వలసయ్య అనువానికి ఇచ్చెను. గంటం దొరను బూటు కాలితో తన్నెను. మల్లుదొరను రూళ్ళ కఱ్ఱతో చేతులపైనను కాళ్ళ పైనను కొట్టి, స్తంభమునకు కట్టివేయించి, గంటం దొరను వెనుక వేసికొని వచ్చినచో ఖైదులో పెట్టించెదనని బెదిరించెను. ఈ దురంతములన్నియు అందరును శ్రీరామరాజునకు చెప్పుకొనిరి. వారి బాధలను చూచి మనసు కరిగి వాని నుండి వారిని విముక్తి చేయుటకు అతడు వారికి నాయకుడై తిరుగుబాటును లేవదీసెను.

బాస్టియను యొక్క దురంతములే పితూరీకి ముఖ్య కారణమైనదని అబ్దుల్ అజీజ్ ఖాన్ అను ఇన్స్పెక్టరు కోర్టులో సాక్ష్యమిచ్చెను. బాస్టియను క్రూరకృత్యములే మన్యపు తిరుగుబాటుకు తక్షణ కారణమైనవి. తమకు చిరకాలము నుండి జరుగు అన్యాయములను బాపుకొనుటకు పవిత్ర మూర్తియు సాధువునగు శ్రీరామరాజును తమ నాయకునిగా ఎంచి మన్య ప్రజలు తిరుగుబాటునకు సన్నద్ధులైరి.

ఇంచుమించి తిరుగుబాటు నాయకులందరును హతులగుటయో నిర్బంధింపబడుటయో జరిగిన పితూరి అలజడి శాంతించిన తరువాత ఏజన్సీ స్పెషల్ కమీషనరు అగు టి.జి. రూథర్ఫర్డు 1924 ఆగస్టు 22 తేదిని ఈ పితూరీ కారణములను గూర్చి చర్చించుచు మద్రాసు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపెను. అందులో ఇట్లున్నది.:-

హాపెల్ నివేదికలో పేర్కొనబడిన పితూరి కారణములు సరియైనవే. నిర్బంధింపబడిన ఖైదీలను, మన్య ప్రాంతమందలి ఇతర ప్రజలను విచారించి సమాచారమును రాబట్టుటకు ప్రయత్నించితిని కాని అదనముగా ఏమియు సంపాదింపలేక పోతిని. ఆ ప్రాంతపు ప్రజలు సత్యము చెప్పరు సగము మందికి అసలు పితూరి అంటేనే తెలియదు. నాయకులగు రాజు, ఎండుపడాలు, గంటం దొర, మల్లయ్యదొర మొదలగువారు ఉన్నచో అసలు విషయములు తెలిసెడివి కాని వారందరు హతులైరి. గాం మల్లయ్య వాఙ్మూలము ఇదివరకే తీసికొనబడెను. చాల మంది పితూరిదారులు తమ జీవిక కొరకో, లేక భూములిచ్చెదరను ఆశతోనో, నిర్బంధము వలననో పితూరిలో జేరిరి. 1922 జనవరిలోనే నర్సీపట్నం జిల్లాలో గాంధి సహాయ నిరాకరణోద్యమము ప్రారంభింపబడెను. ఆ జనవరిలోనే పితూరిని గూర్చిన వదంతులు వినవచ్చినవి. కాని వానిని ఎవరును పట్టించుకొనలేదు. రాజు ఈ ప్రాంతమున చాల పలుకుబడిని సంపాదించెను. సహాయ నిరాకరణ కార్యక్రమములోని అంత అభ్యంతరము కాని విషయములను అతడు చేపట్టెను. పట్టుబడిన విప్లవకారుల నుండి ప్రభుత్వ గూఢచారి శాఖ ఈ మధ్య సంపాదించిన సమాచారము ప్రకారము రాజు మైదాన ప్రాంతముతోను, అచ్చటి సహాయ నిరాకరణవాదుల తోడను నిరంతరము సంబంధము పెట్టుకొనినట్లు తెలియుచున్నది. అందుచే పితూరికి సంబంధించిన మొట్టమొదటి ఆలోచన రాజు భ్రాంత బుద్ధిలో అంకురించెను. అతడు అప్పటికే తాను గొప్పవాడనను అహంభావముతో బాధపడుచుండెను. జనవరి నుండి తిరుగుబాటు ప్రారంభించు వరకు అతని పట్ల ప్రభుత్వము చూపిన మృదుప్రవర్తన గూడ అతనికి మంచి ప్రోత్సాహమిచ్చినది.

అంతకు ముందే గొలుగొండ రాజులు మొదలగు వారు ఈ ప్రాంతమున లేవదీసిన పితూరి సంప్రదాయ మొకటి యున్నది. పోడు వ్యవసాయమునకు సర్కారు వారి నిబంధనలు, అటవీశాసనము దాటు అటవీ శాఖాధికారుల క్రూర ప్రవర్తన మొదలగు వాని వలన ప్రజలలో ప్రబలిన అసంతృప్తిగూడ పితూరికి కారణమగుట నిరాకరించలేము. అగ్గి వైచినచో భగ్గుమను ఇట్టి పరిస్థితులను సానుకూలముగా మలచికొని బ్రిటిషు ప్రభుత్వమును కూలద్రోయుటలో తనవంతుగా పితూరిని ప్రారంభించుటకు కావలసిన ధైర్యము, ప్రతిష్ఠ రాజుకు పూర్తిగా గలవు. అతనిలో దైవాంశయున్నదని కూడ ప్రజల నమ్మకము. అతని అనుచరులలో అన్ని రకముల వారు కలరు. అనేక కారణములచే అసంతృప్తి చెందినవారు, కూడు గుడ్డ దొరకునని చేరినవారు, దోచుకొనుటయందు ఆసక్తి కలవారు, అతడు తమ ఇబ్బందులను తీర్చునని ఆశించినవారు వారిలో కలరు. ముఠాదారులను, గ్రామాధికారులను రాజు కలిసికొని వారు తనకు సహాయపడునట్లు ప్రతిజ్ఞలను గూడ తీసికొనినట్లు తెలియుచున్నది. తక్కిన నిబంధనల వలన అసంతృప్తి ప్రజల ఫితూరిదారులకు సహాయపడుటకు వారి సంచారములను గురించి సమాచారమును పైకి పొక్కనీయకుండుటకు కారణములు కావచ్చును. కాని అట్టి వానికి ఆ ఆస్కారములేని గంగరాజు మాడుగుల, పాడువ తాలుకాలలోని ప్రజలు కూడ ఫితూరిదారులపై సానుభూతి చూపి ఎందుకు సహాయపడుచున్నారో తెలిసికొనుట నాకు జవాబు దొరకని చిక్కు ప్రశ్నగానే మిగిలినది. విప్లవకారులు వారిపై కక్ష తీర్చుకొందురను భయము వలనగాని, లేక సర్కారుతో యుద్ధము చేయుటకు వారు చూపు సాహసము చూచి ముగ్ధులై కాని, లేక పోలీసు వారు రెవిన్యూ అధికారులు తమచే బలవంతముగా తమకిష్టములేని రోడ్లు వేయుట, అడవి పనులు మున్నగునవి చేయించుటవలన వారిపై ద్వేషము వలన గాని ప్రజలు అట్లు చేయుటకు కారణమై యుండవచ్చును. ఏమైనని, పోలీసులు, అస్సాం రైఫిల్సుకు సంబంధించిన సైనికులు మన్య ప్రాంతమంతయు తిరుగుచుండుటచే ఎన్ని అసౌకర్యములు, వత్తిడి ఉన్నను ఈ బడుగు ప్రజల ప్రభుత్వమునకు సహాయ నిరాకరణము చేయుటకు ఎందుకు సదా ప్రయత్నించుచున్నారో అర్థముకాక ఫితూరి కార్యనిర్వహణలోనున్న ప్రతి అధికారియు తికమక పడుచున్నారు. పట్టుబడిన విప్లవకారులను చాల మందిని విచారించగా గంటం దొర బెదిరింపులకు భయపడియో, వారికి జీవిక కల్పించెదరను ఆశ చేతనో విప్లవములో చేరితిమని చెప్పిరి. అంతియేగాని వారికి వ్యక్తిగతముగా ప్రభుత్వము పట్ల వైరము లేదు. కొలది మంది విషయములో ఇది సత్యము కావచ్చునేమో కాని వారి మాటల యందు నాకు నమ్మకము

లేదు. అటవీ నిబంధనల వలన చాల పెద్ద మొత్తములు జరిమానాగా విధింపబడి చాల మంది నిర్బంధింపబడిరి. పోడు వ్యవసాయ నిబంధనల వలన వారిలో అసంతృప్తి జనించినది.

తన నివేదిక చివరను ఎండు పడాలు, మొట్టడం వీరయ్యదొర, గాం సోదరులు మొదలగు కొందరు వ్యక్తులు ఎట్లు అసంతృప్తి చెందిరో రూథర్‌ఫర్డు వివరించెను.

ఇట్లు స్వేచ్ఛా ప్రవృత్తులగు మన్య ప్రజలు తెల్లదొరల ప్రభుత్వము తమ స్వేచ్ఛ నపహరించి తమను అనేక వ్యథలకు గురి చేయుచున్న తరుణమున తమకు ఆత్మ గౌరవమును బోధించి, శస్త్రవృత్తిని నేర్పిన రాజు నాయకత్వము క్రింద ధైర్యసాహసములను పుంజుకొని స్వాతంత్ర్యము సాధించుటకు విప్లవమును ప్రారంభించిరి.

# 38. విప్లవ లక్ష్యము

శ్రీరామరాజునకు చిన్నప్పటి నుండి స్వాతంత్ర్యేచ్ఛ మెండుగా నుండెను. కుటుంబ రక్తములోనే అది జీర్ణించి యుండెను. దైవభక్తియు, జపతపములును అతని జీవిత చర్యలలో ప్రధానముగా కన్పించుచున్నను దేశభక్తియు స్వాతంత్ర్యేచ్ఛయు అంతర్లీనమై యుండెను. మన్యములో అధికారుల ఘాతుక చర్యలచే ప్రజలు విసిగి సరియగు నాయకత్వమున్నచో తిరుగుబాటు చేయుటకు సిద్ధముగా నుండిరి. అచ్చటి పరిస్థితులు పరిపక్వ దశకు వచ్చి అవకాశము రాగానే శ్రీరామరాజులో అంతర్లీనముగా నున్న దేశభక్తి స్వాతంత్ర్యేచ్ఛా భావములు ఉద్బుద్ధములై అతనిని కార్యాచరణకు పురికొల్పినవి. దానితో విప్లవము ప్రారంభమై నడుపబడినది. ఇది స్వార్థ బుద్ధితో చేయబడినదని ప్రభుత్వము మొదట తలచి ప్రచారము చేయుటచే, ప్రభుత్వ నివేదికలపై ఆధారపడి బయటి పత్రికలు ప్రజలు గూడ చాల వరకు మొదట అట్లే తలచిరి.

మన్యములో గూడెము ప్రాంతమునకు పాలకుడు కావలెనను లక్ష్యమే రాజును విప్లవమునకు పురికొల్పినదని హ్యూపెల్ తన నివేదికలో పేర్కొనెను. బ్రిటిషువారి యెడ తీవ్ర విద్వేషముతో గూడెము ప్రాంతమున ఒక స్వతంత్ర రాజ్యమునుస్థాపించి దానికి అతడు రాజు కావలెనను ఆశయమే శ్రీరామరాజును విప్లవమునకు ప్రేరేపిం చినదని అప్పటి ప్రభుత్వ  తాత్కాలిక ప్రధాన కార్యదర్శియగు ఇ.ఎస్. లాయిడ్ గూడ హ్యూపెల్ అభిప్రాయమును సమర్థించెను.

రష్‌బ్రూక్ విలియమ్స్ అను బ్రిటిషు చరిత్రకారుడు '1922-23 సంవత్సరములలో ఇండియా' (India in 1922?23) అను తన గ్రంథములో "గూడెము కొండలలో నివసించు కృష్ణా జిల్లా నివాసి పవిత్రత అను వాతావరణమును కల్పించి అకస్మాత్తుగా అసంతృప్తిపరుల బృందమును  లేవదీసి మూడు పోలీసు స్టేషనులను ఎదుర్కొని తుపాకులను మందుగుండు సామగ్రిని దోచుకొనెను. తననే రాజుగా ప్రకటించుకొని ప్రభుత్వముపై యుద్ధమును ప్రకటించెను. ఒకప్పుడు ఇతని అనుచరులు 200 మంది వరకు గలరు. వీరి యొద్ద విల్లమ్ములు, తుపాకులు గలవు. వీరి అపూర్వ సంఘటనా సామర్థ్యము, పర్వత మయమై ఏటవాలు కొండలతోగూడిన దట్టమైన అరణ్య ప్రాంతపు పరిచయము స్థానిక పోలీసుశాఖను నిశ్చేష్టుల జేసినవి" అని వ్రాసెను

ఇట్లు శ్రీరామరాజు మన్య ప్రాంతమునకు రాజు కావలెననెడు స్వార్థ బుద్ధితో

అనాగరికులును విద్యాగంధము లేనివారును అయిన మన్య ప్రజల ఆర్థిక దుస్థితిని, నికృష్ట పరిస్థితులను ఆధారము చేసికొని వారిని పవిత్రత పేరిట రెచ్చగొట్టినట్లు అనాటి ప్రభుత్వము, విదేశ రచయితలు వ్రాసిరి. 'సిపాయి తిరుగుబాటు' పేరిట ఇట్టి సంకుచిత భావము అనాటి ప్రథమ స్వాతంత్ర్య సమరమునకు గూడ ఆపాదింపబడినది.

మన్యములో విప్లవమును రాజు ఇట్టి స్వలాభాపేక్షతో ప్రారంభించెనను అభిప్రాయము కల్గుటకు కారణములు లేకపోలేదు.

కృష్ణదేవి పేట పోలీసు స్టేషనుపై దాడి జరిపినప్పుడు విప్లవకారులు 'గాంధీజీకి జై' అనియే కాక 'చక్రవర్తి వచ్చుచున్నారు' అని అఱచుచు వచ్చినట్లు వార్త అందినదని అనాటి పోలీసు ఇనస్పెక్టరు జనరల్ అగు ఆర్మిటేజ్ ప్రభుత్వమునకు నివేదిక పంపెను. తరువాత పట్టుబడిన విప్లవ కారులు కొంతమంది కూడ శ్రీరామరాజునకు గూడెము ప్రాంతపు రాజు కావలెనను ఆశయము ఉండెనని సాక్ష్యమిచ్చిరి. అదియును గాక శ్రీరామరాజు తనకు సంబంధించిన కొన్ని పుస్తకములలో 'శ్రీమన్మహారాజ రాజాధిరాజ శ్రీ అల్లూరి శ్రీరామరాజు, శ్రీరామ విజయనగరం' అని వ్రాసికొనెను. ఈ కారణములచే మన్యమునకు రాజు కావలెనను స్వార్థ చింత తోడనే విప్లవము ప్రారంభించినట్లు పైకి కనిపించుచున్నది. కాని తరచి చూచినచో ఈ యూహ అసంబద్ధమని తేలుచున్నది.

శ్రీరామరాజు చిన్నతనము నుండియు పూజలు, జపతపాదుల యందు కాలము గడుపుచుండెడివాడు. అవకాశము వచ్చినపుడు క్షాత్ర విద్యలనుగూడ అభ్యసించుచుండెడువాడు. దేశభక్తికి కొదువలేదు. అది ఉగ్గుపాల నుండియు నేర్చినదే. తల్లిదండ్రుల వలన వినిన రామాయణ మహాభారతాది వీరకథలు వీరత్వమును క్షాత్రము ను పెంచి పోషించినవి. కొంత కాలమునకు దేశభక్తి మరుగునబడి దైవభక్తి ఉద్భూతమైనది. కాశీ హిమాలయాది యాత్రలు, పాపికొండలు మొదలైన వానిపై తపస్సు దీనికి తార్కాణము. తల్లిని చూచి ఆమె ఆశీర్వాదముతో తపస్సు చేసికొనవెంచి మరల దక్షిణాదికి వచ్చెను. దైవ వశమున మన్య ప్రాంతమున వచ్చుచు ఆ ప్రజల కోరికతో అచ్చట స్థావరమేర్పరచుకొనెను. తాను ఉన్న ప్రాంతమునకు శ్రీరామ విజయనగరమని పేరు పెట్టెను. పిదప ప్రజలకు తలలో నాలుకయై వారికి అన్ని విధముల సలహోలిచ్చుచు సహాయపడుచు వారి క్షేమమునకై మద్య నిషేధము, పంచాయితీ కోర్టులు మున్నగు నిర్మాణ కార్యక్రమమును చేపట్టెను. ప్రభుత్వాధికారుల చేతులలో ప్రజల బాధలు విని వారికి సాయపడవెంచెను. గాంధీ గారి సత్యాగ్రహమును గురించియు,

స్వాతంత్ర్యోద్యమమును గురించియు తెలిసికొనుచునేయుండెను. గాంధీగారి పట్ల ఎంత గౌరవ భావమున్నను క్షత్రియుడుగా తనకాయన అహింసా పద్ధతి నచ్చలేదు. దుర్మ వలన గాని దుష్టుడు లొంగడని అతని యుద్దేశము. మన్యములో పరిస్థితులు గూడ విప్లవమునకు సుముఖముగా నుండుట వలనను అప్పటి ప్రజలలో తన యెడ అపారమైన ఆదరముండుట వలనను విప్లవమున కాయత్తమై బలవత్తరమగు బ్రిటిషు ప్రభుత్వము నెదుర్కొనుటకు ఆధునికాయుధ సామగ్రి కొరకై పోలీసు స్టేషనులపై దాడి చేసెను. కృష్ణదేవిపేట పోలీసు స్టేషనుపై దాడి చేసినప్పుడు గాంధీజీకి జై యని విప్లవకారులచే నినాదము చేయించెను. అంతియే కాని తనకు జయకొట్టమని వారిని ప్రబోధించలేదు. తరువాత జరిగిన యుద్ధ చర్యలలో గాని తన యనుచరుల యెడ అతని ప్రవర్తనలో గాని తనను మన్య ప్రాంతమునకు రాజుగా భావించినట్లు ఎచ్చటను కనబడదు. తాను ముందుండి విప్లవము నడిపించుచు నాయక పదమును సార్థకము చేసెను గాని తానెక్కడో యొకచోట నుండి ఆజ్ఞలు పంపలేదు. ఈ విషయము మద్రాసు అసెంబ్లీలో గూడ ప్రస్తావనకు వచ్చినప్పుడు ఏజెన్సీ ప్రజలందరికిని సమానమైన బాధలు లేనిచో సీతారామరాజు తానొక స్వతంత్ర రాజ్యమును తన కొరకు స్థాపించుకొనుట కొరకు వారినందరిని కూడ గట్టుకొని విప్లవము లేవదీయుట అసాధ్యమనియు, మన్య ప్రజల బాధలు నివారించి వారిని స్వతంత్రులుగా జేసి స్వరాజ్యమునకు తోడ్పడుటయే అతని లక్ష్యమనియు కొందరు సభ్యులు వాదించిరి.

ఆనాడు గూడెము కేంద్రముగా తాలూకా ఉండెడిది. ఆ తాలూకాను మొదట స్వాధీనపరచుకొని అది కేంద్రముగా చుట్టు ప్రక్కల ప్రాంతములను, పిదప మైదాన ప్రాంతములను బ్రిటిషు పాలన నుండి విముక్తి చేయవలయునని శ్రీరామరాజు తలంపు. మన్య ప్రజలు ఈ వ్యూహమంతయు అర్థము చేసికొనునంతటి ప్రాజ్ఞులు కారు. అందుచే వారికర్థమైన రీతిలో పట్టుబడినవారు సాక్ష్యము చెప్పినారు. శ్రీరామరాజునకు గూడెము ప్రాంతమునకు రాజు కావలెనను ఆకాంక్షయున్నచో "శ్రీమన్మహారాజ రాజాధిరాజ" అని బిరుదులు తగిలించుకొనినవాడు శ్రీరామ విజయనగరమని ఎందుకు వ్రాసికొనును? హంపీ విజయనగరమును స్థాపించినట్లు తాను కూడ ఇంకొక క్రొత్త విజయనగర సామ్రాజ్యమును స్థాపింపవలెననియా? అట్టి కోరిక అతనికున్నట్లు కుటుంబ సభ్యులతోగాని, తన ముఖ్యానుచరులతోగాని ప్రస్తావించినట్లు కనబడదు. ఇక అట్టి కోరిక లేనిచో "శ్రీమన్మహారాజ రాజాధిరాజ" అను బిరుదులు తానేల స్వయముగా పెట్టుకొనవలెను అనుశంకరావచ్చును. కాకినాడలో చదువుచున్నప్పుడు అతడు జార్జి

చక్రవర్తి పతకమును ధరించెడువాడు. "బ్రిటిషువారు మన గుండెలపై తిష్ఠ వేసినారు అను విషయము నిత్యము హెచ్చరికగా నుండుటకు నేను దీనిని ధరింతును" అని అతడు చెప్పువాడని అతని సహాధ్యాయియగు మద్దూరి అన్నపూర్ణయ్యగారు చెప్పిరి. బ్రిటిషు పాలకులకు రాజు, చక్రవర్తి అను బిరుదులుండెడివి. మన భారత దేశమును పాలించుట చేతనే వారు చక్రవర్తి బిరుదమును తగిలించుకొనిరి. మనదేశమునకు మనమే రాజులుగా ఆ బిరుదులు మనకే ఉండుట ఉచితము, అట్లగు వరకు పట్టుదల సడలించకుండ పోరాటము సాగించి స్వరాజ్యము సాధించుటకు అవి జ్ఞాపికలుగా నుండవలయును అను ప్రబల వాంఛయే దానికి కారణముగా గన్పడుచున్నది.

1922 సెప్టెంబరు 16 తేదీని మిత్రుడు పేరిచర్ల సూర్యనారాయణరాజుకు వ్రాసిన ఉత్తరములో గూడ తాను అన్ని అంశములను బాగుగా ఆలోచించియే ఈ యుద్యమమును తలపెట్టితిననియు దేశమును రక్షించుటకుగాను, యుద్ధము తప్పనిసరియనియు శ్రీరామరాజు వ్రాసెనే కాని తాను రాజ్యము సంపాదించి పట్టము గట్టుకొని రాజుగా ప్రజలనేలుట తన కోరికగా నెచ్చటను చెప్పలేదు. 1923 జూన్ 8 తేదీని మల్కానగిరి డిప్యూటీ తహసీల్దారుతో మాట్లాడుచు శ్రీరామరాజు తనకు గాంధీ గారియెడ అమిత గౌరవమున్నను దేశ విముక్తికి హింస అవసరమని తన యభిప్రాయ మనియు, స్వరాజ్యము సాధించు వరకు విప్లవమును సాగింతుననియు చెప్పెను.

ఇందు దోషమేమియు గనబడదు. 1930లో లెజిస్లేటివు సభకు కాంగ్రెసు సభ్యునిగా రాజీనామానిచ్చి స్వతంత్ర సభ్యునిగా పోటీ చేయుటలో తన చర్యను సమర్థించుకొనుచు టంగుటూరి ప్రకాశం పంతులుగారు ఒక పత్రికా ప్రకటన చేసిరి. అందు గాంధీగారు 1921 డిసెంబరు 6 తేదీ గల 'యంగ్ ఇండియా' పత్రిక యందు తాను నమ్మిన దానికి బద్ధులై తదనుగుణముగా నిజాయితీతో ఆచరించు సత్యవ్రతులు కావలెనని నుడివిరి. ఆ సలహాను తాననుసరించుచున్నాని ప్రకాశము గారు చెప్పిరి. అట్లే కాంగ్రెసు పత్రిక సంపాదకునిగా అందు ప్రచురించిన వ్యాసములకు రాజద్రోహ నేరమును మోపగా క్రొవ్విడి లింగరాజుగారు 1931 జులై 31వ తేదీని లిఖిత వాఙ్మూలమును ఇచ్చిరి. అందు తనకు భారత జాతీయ కాంగ్రెసు సభ్యుడుగా అహింసా తత్త్వమందు అచంచల విశ్వాసమున్నను హింసా మార్గమవలంబించి దేశ స్వాతంత్ర్యము కొరకు ప్రాణత్యాగమొనరించిన వీరుల ధైర్య సాహసములను, త్యాగబుద్ధిని, లక్ష్యశుద్ధిని కొనియాడకుండ నుండలేను. అట్టి వీరులగు ఆంధ్రవీరుడు అల్లూరి సీతారామరాజు, భగత్సింగు అతని సహచరులను నా పత్రికలో కొనియాడితిని అని వ్రాకుచ్చిరి. ఆ

విధముగానే శ్రీరామరాజు కూడ తనకు అహింసావాదియగు గాంధీజీ యందు ఎంత భక్త్యాదరములున్నను తాను నమ్మిన హింసా పద్ధతితో దేశ స్వాతంత్ర్యమునకు పూనుకొనెను. అందుచే అతని లక్ష్య శుద్ధిని శంకించుట భారత పుత్ర రత్నమును అవమానించుటయే యగును. మహాత్ముడు శ్రీరామరాజును శ్లాఘించెను గదా!

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమున ఝాన్సీలక్ష్మీబాయి తన రాజ్యమును సంపాదించుకొనుట కొరకే స్వార్థ బుద్ధితో బ్రిటిషు వారిపై యుద్ధము చేసిన దనియు, రెండవ ప్రపంచ యుద్ధ సమయమున సుభాష్ చంద్ర బోసు జపాను వారితో జేరి బ్రిటిషు వారిని పారద్రోలి తానే భారతదేశమును పాలించుట కొరకు భారత జాతీయ సైన్యమును నిర్మించి ప్రయత్నించె ననుటయు ఎంత హాస్యాస్పదమో శ్రీరామరాజు స్వార్థ ప్రయోజనము నాశించి విప్లవము లేవదీసెననుటయు అంతహాస్యాస్పదము గాను తోచును.

స్వప్రయోజనము నాసించు రాజులు తమకనువుగాని సమయమున ప్రజలను అనుచరులను వారి యదృష్టమునకు వారిని వదిలివైచి తాము తప్పించుకొనుటయు, అనువగు సమయమున మరల అనుచర వర్గమును చేరదీసికొని తమ ప్రయోజనమును సాధించుకొనుటకు ప్రయత్నించుటయు చరిత్రలో ఎన్నియో ఉదాహరణములను మనము చూడగలము. తాముమరణించినను తమ నాయకుడగు రాజుప్రాణములకు ఎట్టి అపాయమును కలుగగూడదను దృఢాభిప్రాయము గల విశ్వాసపాత్రులగు అనుచరులు కలిగి యున్నను రాజు ఎట్టి పరిస్థితులలోను తన అనుచరులను విడిచి తప్పించుకొనుటకు ప్రయత్నించలేదు. చివరకు తాను తప్పించుకొని పోవుటకు వీలున్నను తనకొరకు ప్రభుత్వము ప్రజలను పెట్టు హింసలను చూడలేక, తాను. అదృశ్యమైనచో తన ఆచూకితెలుపుమని ప్రజలను ఇంకను నానా హింసలకు గురిచేయుదురనియు, తాను పట్టుబడినచో ప్రజలను హింసించుట అపుదురనియు తలచి శ్రీరామరాజు ఆత్మార్పణమునకే సిద్ధపడెను.

విప్లవము ప్రారంభించిన పిదప పంపిన ప్రభుత్వాధికారుల నివేదిక లలో గూడ పితూరి దారులకు మన్యము బయట నున్న సహాయనిరాకరణోద్యమ కారులతో సంబంధము కలదనియు కొందరు కాంగ్రెసు వాదులు వారికి అండగానున్నారనియు వ్రాసిరి. అట్టి అభిప్రాయముతోడనే ప్రభుత్వము పితూరి దారులకు బయటి కాంగ్రెసువాదులకు సంబంధము లేకుండ చేయుటకు నానా ప్రయత్నములు చేసి కట్టుదిట్టములు గావించినది.

అందుచే శ్రీరామరాజు కావించిన ప్రయత్నము గూడెము ప్రాంతమునకు రాజు కావలెనను సంకుచిత స్వార్థప్రయోజనము నాశించికాక దేశ స్వాతంత్ర్యము కొరకు జరుగు సమరములో భాగముగా స్వరాజ్యమో స్వారాజ్యమో లక్ష్యముగా చేసిన బృహత్ప్రయత్నముగా భావింపనగును. దీనికి ప్రమాణము స్నేహితుడగు పేరిచర్ల సూర్యనారాయణరాజుకు శ్రీరామరాజు వ్రాసిన యుత్తరమే. రూథర్‌ఫర్డు నివేదికలో గూడ బ్రిటిషు ప్రభుత్వమును కూలద్రోయుటలో తన భాగముగా తనధైర్యసాహసములను, మన్య ప్రజలపై తన అపారమైన పలుకుబడి ఆధారము చేసికొని రాజు పితూరీని ప్రారంభించెనని వ్రాసెను.

డాక్టరు ఎస్. రమేశన్‌గారు కూడ విశాఖజిల్లా గజట్‌లో ఇట్లు వ్రాసిరి. "చిరస్మరణీయమగు కాంగ్రెసుపార్టీ పాత్రయేకాక స్వాతంత్ర్యసమరములో అల్లూరి సీతారామరాజు చర్యలు గూడ ప్రసిద్ధ సంఘటనలై యున్నవి. .....బ్రిటిషు ప్రభుత్వమును ధిక్కరించి ఒక స్వతంత్ర ప్రాంతమును స్థాపించి అప్పటినుండి చుట్టునున్న ఇతర ప్రాంతములకు స్వాతంత్ర్య దీపికను గొనిపోయి పారతంత్ర్య తిమిరములను పటాపంచలు చేయుటయే అతని లక్ష్యము..... సీతారామరాజు నిస్సందేహముగా మహోన్నత భావములతో ఉత్తేజితుడైన మహావీరుడు.'

తూర్పు గోదావరి జిల్లా గజట్‌లో ఇట్లు వ్రాసిరి. "దేశమంతయు అహింసాయుత సహాయ నిరాకరణోద్యమములో మునిగి యుండగా అల్లూరి సీతా రామరాజు అను యువకుడు తీవ్రదేశభక్తి పూరితుడై బ్రిటిషు ప్రభుత్వముపై 1922 ఆగస్టులో తిరుగుబాటు చేసెను. బ్రిటిషు వారినెదిరించి ఒక స్వతంత్ర రాజ్యమును స్థాపించి అప్పటి నుండి స్వాతంత్ర్య సందేశమును ఇతర ప్రాంతములకు తీసికొనిపోయి వ్యాపింపజేయవలెనని అతని కోరిక..... కాని అతని అపజయము, అతని జీవితము, చర్యలు అన్నియు దేశ స్వాతంత్ర్య సిద్ధియే అతని లక్ష్యముగా నిరూపించుచు ఆంధ్రదేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో మహోజ్జ్వల ఘట్టముగా భాసించుచున్నది.

# 39, తెగడ్తలు, పొగడ్తలు

మన్యం విప్లవము సాగుచున్నంతకాలము వార్తా పత్రికలు గాని, రాజకీయ నాయకులుగాని, కాంగ్రెసు కమిటీలు గాని సీతారామరాజుపట్లను, అతని లక్ష్యముపైనను ఎవ్వరును సానుభూతి చూపలేదు. అతని విప్లవ చర్యలు బందిపోటు చర్యలుగాను, విప్లవ కారులు పితూరి దారులుగాను పరిగణింపబడిరి.

విప్లవము ప్రారంభించిన మొదటి రోజులలోనే పెద్దాపురము కాంగ్రెసువారు రాష్ట్ర కాంగ్రెసు సంఘము వారికి ఈ సంఘటనలను గురించి తెలియజేసిరి.. అప్పుడురాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులైన టంగుటూరి ప్రకాశము గారు 30-8-1922 తేదీని బ్రహ్మజోస్యుల సీతారామయ్య (తణుకు)గారి ద్వారా ఇట్లు తంతి పంపిరి. "పెద్దాపురము, కాంగ్రెసు వారేమియు కల్పించుకొనగూడదు. దోపిడిగాండ్రు పోలీసు స్టేషనులను దోచుకొని, తుపాకులను తూటాలను తీసికొని పోవుచుండ కాంగ్రెసు వారు చేయవలసినదేమో నాకు బోధపడుట లేదు. వారి దగ్గరకు బోయి మీరిటుల చేయగూడదని నెమ్మదిగా బోధించుటకు గూడ నవకాశము లేదు. కాంగ్రెసు వారెవరును బందిపోటుల కడకు పోగూడదు. కాంగ్రెసు నాయకులు రావలెనను తంతి వార్తలను పత్రికలకు పంపుటయే అసంగతము." ఇట్లు ఈ విప్లవ వీరులను దోపిడిగాండ్రని రాష్ట్ర కాంగ్రెసు నోరుచప్పరించ గానే భారత కాంగ్రెసు నాయకులకు అసలు ఈ అలజడి గురించి తెలిసికొనుటకే అవకాశము లేకపోయినది.

మద్రాసు లెజిస్లేటివు కౌన్సిలులో రంప పితూరికి కారణములను కనుగొనుటకు విచారణ జరిపించవలసినదని సభ్యులు కోరిరి. కాని కట్టమంచి రామలింగారెడ్డి గారు దానికి అభ్యంతరము తెలిపి, మొదట ఫితూరీని అణచి వేయవలెననియు, విచారణ సంగతి తరువాత చూడవచ్చుననియు పలికిరి. సభ్యులందరు పితూరిని ఎట్లైనను మొదట అణచివేయవలననియే అభిప్రాయము వెలిబుచ్చిరి. ఏజెన్సీ గ్రామ ప్రజలు రాజు ఉద్యమమును గూర్చి, ఉనికి గూర్చి ప్రభుత్వమునకు సమాచారమును అందించకుండుట సహింపరాని నేరమనియు, అట్టివారిని శిక్షించవలెననియు సభ్యులు సలహా ఇచ్చిరి. అంతియే కాని, రాజును గూర్చి కాని, అతని విప్లవమును గూర్చి గాని ఎవ్వరును సానుభూతి చూపలేదు.[2] స్వయముగా నిజమును తెలిసికొనక ప్రభుత్వ ప్రకటనలపై ఆధారపడుట వలన కలిగిన ఫలితమిది. కాని కొన్ని సంవత్సరములు గడిచిన తరువాత పత్రికలు,

రాజకీయ నాయకులు ఆంధ్రులలో దేశభక్తిని పురికొల్పుటకు రాజు పేరును, విప్లవమును ఉదాహరించజూచిరి.

1924 మే 17 తేదీని ఆంధ్రపత్రిక ఇట్లు విమర్శించినది. "యుద్ధమున మరణము నొందిన క్షత్రియుడు వీరస్వర్గమలంకరించునని చెప్పుదురు. రాజు ఇప్పుడు వీరస్వర్గమున విహరించుచున్నాడని మనమూహింతము. హింస ఎంతటి నిరుపయోగమైన ఆయుధమో రాజు ఫితూరీయే మనకు సాక్ష్యము. అందుచే గాంధీజీ బోధించిన అహింసాయుత సహాయ నిరాకరణమే మనకు శ్రీరామరక్ష. రంప పితూరి వంటి హింసా మార్గములు ఆత్మ వినాశకరమే కాక ప్రజలకు దేశమునకు గూడ హాని కలిగించును.'

1924 జులై 23 తేదీని గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ ఒక తీర్మానమును ప్రవేశపెట్టిరి. అందు హింసాయుత పద్ధతులను తాము అంగీకరింపకపోయినను అల్లూరి సీతారామరాజు యొక్క దేశభక్తిని, భారతమాత కొరకు అతడు చేసిన ఉత్తమ త్యాగమును అభినందించకుండ ఉండ లేమనియు, సీతారామరాజు అవలంబించిన హింస మార్గముల వంటివి శీఘ్ర స్వరాజ్య సిద్ధికి ఆటంకములని మా యభిప్రాయమని పేర్కొనిరి. పిదప సీతారామరాజు మరణించెనను వార్తలపై సందేహములు గలుగుటచే ఆ తీర్మానము ఉపసంహరింపబడెను.

1926లో 'కాంగ్రెస్' పత్రిక "దేశమంతయు పశుబలముపై నాధారపడిన బ్రిటిషు ప్రభుత్వము నెదుర్కొనుటకు అహింసాయుతోద్యమమే తగిన సాధనమని ఘోషించుచుండగా ఒక ఆంధ్ర క్షత్రియ యువకుడు క్షాత్ర భావముతో నుత్తేజము పొంది ప్రపంచములో అతిశక్తిమంతమైన ప్రభుత్వమునకు ప్రక్కలో బల్లెమై రెండేండ్లు పాటు అలజడి కలిగించిన విషయమును ఆంధ్రులెన్నటికి మరువలేరు" అని శ్లాఘించినది. శ్రీరామ రాజు ధైర్య సాహసములను వర్ణించుచు ఒక పెద్ద పాటను గూడ ప్రకటించినది. 1929లో అల్లూరి శ్రీరామరాజు 33వ జన్మదినోత్సవమునకు సంబంధించి జులై 10 తేదీ "కాంగ్రెసు" పత్రిక ఇట్లు వ్రాసినది: "శ్రీరామ రాజు ధైర్య సాహసములను గురించి ఎఱుగనివారుగాని, అతని లక్ష్యము నెరవేరకుండుటకు విచారించని వారుగాని ఆంధ్రదేశములో ఎవ్వరును ఉండరు. కొందరు జాతీయ నాయకులు గూడ అతని ధైర్యసాహసములను, దేశభక్తిని, రాజనీతి చతురతను కొనియాడకుండనుండలేకపోయిరి. కాని అతనిని జాతీయ వీరునిగా గుర్తించి జయంతిని జరుపుట ఈ మధ్యనే ప్రారంభమైనది. ప్రజలు కూడ ఈ విషయమున ఎక్కువ ఆసక్తి కనబరుచుండిరి. కొందరు యువకులు

1927లో శ్రీరామరాజు జన్మదినోత్సవమును జరుపనెంచగా పెద్దలు సమ్మతించలేదు. అందుచే ఆ యుత్సవమును జరిపించుటకు తగిన స్థలముగాని, అధ్యక్షునిగా వ్యవహరించుటకు తగు వ్యక్తిని గాని వెదకికొనుటకు చాల తంటాలు పడవలసి వచ్చినది. చివరకు వేమవరము రామదాసు పంతులుగారు దానికి అధ్యక్షత వహించి విజయవంతముగా నిర్వర్తించిరి. మరుసటి సంవత్సరము పోలీసులలో కలవరము బయలుదేరినది. రాజు పటము మాపత్రికలో ప్రకటింపబడినది. దండునారాయణ రాజుగారి అధ్యక్షతన రెండవ జయంతి మహావైభవముగా జరిగినది. రాజమండ్రిలోనే కాక బెజవాడ మొదలగు ఇతరపట్టణములలో గూడ ఈ జయంతి జరుపబడినది. ఇతర చోట్ల సమావేశములలోను, ఇతర రాష్ట్రములలోని పత్రికలలోను అతని జీవిత విశేషములు ప్రచారము గావింపబడినవి. అతనిని జాతీయ వీరునిగా గుర్తింపమొదలిడిరి. దేశభక్తిలోను, పౌరుషములోను ఆంధ్రులు గూడ ఇతర రాష్ట్రముల వారికి ఏమియు తీసిపోరని నిరూపింపబడినది. ఝాన్సీలక్ష్మీబాయి, శ్రీరామరాజు వంటి వీరశిఖామణుల ఉదాత్త జీవితములు యువతీ యువకుల ఉడుకు రక్తమును పొంగునట్లు ప్రేరేపించగలవు. ఆ వీరుల ప్రయత్నములు సఫలము కాక పోవుట దురదృష్టకరము. హింసాయుతము కానిండు, అహింసాయుతము గానిండు, ఈనాడు భారత స్వాతంత్ర్య సమరము సాగించుటకు సుశిక్షితులైన సైనికులు అవసరము. సైనికునికి ధైర్యమే కవచము. ఈనాటి దేశ పరిస్థితులను దృష్టిలో నుంచుకొని భారత జాతీయ కాంగ్రెసు శాంతియుత సమరమే ప్రజలకు మంచిదని భావించినది. శ్రీరామరాజు వలె యువజనులు ధైర్య కవచమును ధరించి కాంగ్రెసు ఆజ్ఞలను పాటించి భారత స్వాతంత్ర్యమును సాధించవలెను. అన్ని రంగములలోను దాస్య శృంఖలాలను ఛేదించుటకు విప్లవమే శరణ్యము. అట్టి విప్లవమునకు కావలసిన గుణములు ధైర్య సాహసములును, దేశభక్తియు. అట్టి గుణములన్నియు మూర్తీభవించిన రూపము శ్రీరామరాజు. శ్రీరామరాజుకు జై." హిందూస్థాన సేవాదళ కార్యదర్శియైన ఎస్.ఎన్. హార్డీకరు గూడ ఇట్టి సందేశమునే యువత కిచ్చెను.

అల్లూరి సీతారామరాజు పేరును, అతని విప్లవమును గూర్చి 1928, 1929 సంవత్సరములలో జాతీయ స్థాయిలో ప్రచారము గావించి, అతని పేరును పైకి తెచ్చినది మద్దూరి అన్నపూర్ణయ్యగారు. ఆయన సంపాదకత్వమున వెలువడు తెలుగు పక్షపత్రిక 'కాంగ్రెసు'లో రాజును గురించి ఉత్తేజకరమగు వ్యాసములు ప్రచురింపబడినవి. యువజనోద్యమ సంస్థాపకునిగా రాజును ఆయన వర్ణించెను.

1-1-1951 తేదీని కొవ్వూరు వీరమందిరములో రెబ్బాప్రగడ మందేశ్వర శర్మగారు శ్రీరామరాజు చిత్ర పటావిష్కరణ రాజు సహోద్యాయి యగు అన్నపూర్ణయ్యగారి చేత చేయించినప్పుడు అన్నపూర్ణయ్యగారు ఉపన్యసించుచు ఇంకను ఇట్లు చెప్పిరి. "1922 సంవత్సరములో బాల తపసి, మన్యములో తిరుగుబాటు అని తెలియగానే శ్రీరామరాజు నాకు 1917 సంవత్సరములో సన్యాసి వేషములో కనిపించిన వైఖరి జ్ఞప్తికి వచ్చినది. 1917లో ఒకసారి పిఠాపురము రైలు స్టేషనులో ఒక సన్యాసి కనిపించెను. అతడు శ్రీరామరాజు అని భావించితిని. దగ్గరకు వెళ్లి పలుకరించితిని. నేను తెలుగులో మాట్లాడగా అతడు ఇంగ్లీషులోను, నేను ఇంగ్లీషులో మాటాడగా అతడు హిందీలోను మాటాడెను. శ్రీరామరాజు తాను కానట్లుగా నటించెను. అందుచేత అతడు శ్రీరామరాజుకాడు అనుకుంటిని. కొంతకాలమునకు మేము ఉభయులము మరియొక చోట తిరిగి కలిసికొంటిమి. ఇదివరలో నీవు ఫలానా స్టేషనులోనన్ను పలుకరించితివి కాదా అని శ్రీరామరాజు ప్రశ్నించెను. నేను ఆశ్చర్యపడి మోసపోతినని గ్రహించి, నీవు శ్రీరామరాజువు కాదంటివి గదా యని యడిగితిని. 'అవును, నేనా విధముగా నటించుటయే ప్రాక్టీసు చేయుచున్నాను' అని అతడనెను. ఒకసారి నేను ఉత్తరదేశములో కాంగ్రెసు మీటింగునకు వెళ్ళినప్పుడు ఉత్తర హిందూ స్థానపు పత్రికా విలేఖరులందరు నన్ను చూడవచ్చిరి. మన ఆంధ్ర దేశములోని విలేఖరులు అన్నపూర్ణయ్యను వీళ్లంతా ఏమి ఎఱుగుదురా అని ఆశ్చర్యపడిరి. శ్రీరామరాజు నాకు బాల్య స్నేహితుడని వ్రాసిన వ్యాసమును బట్టి నన్ను కలిసికొన్నచో శ్రీరామరాజును గురించి పోగెట్టు సమగ్రముగా తెలియగలదని వారందరును వచ్చిరి. అట్టి శ్రీరామరాజు కుటుంబమునకు ప్రభుత్వ మేమియు సహాయము చేయకుండుట ఎంత అన్యాయము! అసలు శ్రీరామరాజు ఆంధ్రదేశములో పుట్టడమే తప్పు. ఇంకెక్కడైనా అయితే ప్రజలు బ్రహ్మరథం పట్టి ఉందురు. నిజంగా అటువంటి శ్రీరామరాజును మఱచిపోవుట ఆంధ్రులకు ఆత్మ హ త్యా సదృశము"

1927 మొదలుకొని ప్రతి సంవత్సరము రాజు జయంతిని జరిపించుటకు అన్నపూర్ణయ్యగారు నడుము కట్టెను. మొదటి రెండు సంవత్సరములు పైన వివరించిన విధముగా జరిగినవి. 1929 సంవత్సరములో జరిగిన తృతీయ జయంత్యుత్సవము గుంటూరు, మచిలీపట్నము మొదలగు చోట్లను జరిగెను. సుభాష్‌చంద్రబోసు, జవహర్‌లాల్ నెహ్రూ కూడ తమ సందేశములను పంపిరి. మచిలీపట్టణము సభలో డాక్టరు పట్టాభిసీతారామయ్య గారురాజు ధైర్య సాహసములను దేశభక్తిని కొనియాడిరి.

బ్రిటిషు అధికారులే యుద్ధ సమయమున సీతారామరాజు యుద్ధ నైపుణ్యమును,

వ్యూహ చతురతను, ప్రభుత్వ సైనికుల కదలికలను ఎప్పటికప్పుడు తెలిసికొను చాకచక్యమును తమ నివేదికలలో ప్రభుత్వమునకు తెలుపుచు ఆశ్చర్యపడుచుండిరి.

1929 జులై 18 తేదీ 'యంగ్ ఇండియా' పత్రికలో గాంధీ మహాత్ముడు ఇట్లు వ్రాసెను. "ఈ మధ్య నా పర్యటనలో ఒక యువకుడైన దేశభక్తుని పటమని నాకు చూపబడినది. అది అల్లూరి శ్రీరామరాజు పటమని చెప్పబడినది. శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య అతని చరిత్రను నాకు పంపించెను. అతని హింసా విధానము నాకు సమ్మతము కాకున్నను, అతనిని గురించి అన్నపూర్ణయ్య పంపిన చరిత్ర అంతయు నిజమైనచో శ్రీరామరాజు ఫితూరిదారు కాదు. గొప్పవీరుడు, శ్రీరామరాజు చూపిన అకుంఠిత ధైర్యసాహసములు, దేశభక్తి, మేధ, ఉపాయశాలిత్వము భారత యువకులు నేర్చుకొని అహింసా విధానమున స్వరాజ్య సిద్ధికి పాటు పడెదరుగాక."

జవహర్లాలు నెహ్రూ కూడ శ్రీరామరాజును గురించి తనకు విశేషముగా తెలియక పోయినను తెలిసినంత వరకు అతడు ధైర్య సాహసోపేతులగు అసాధారణ వీరులలో నొకడు అని కొనియాడెను.

నేతాజీ సుభాష్ చంద్రబోసు శ్రీరామరాజును ప్రశంసించుచు అతడు ఇతర స్వతంత్ర దేశమందు ఎచ్చటైనను పుట్టియుండినచో అతని సాహస కార్యములకు మరింత అవకాశముండెడిది. అతని విధానములను సమ్మతించనివారు సైతము అతని ధైర్య సాహసములను, దేశభక్తిని,పట్టుదలను పౌరుషమును, విశాల భావములను స్తుతింపకుండనుండలేరు అని నుడివెను.

ఇటలీ దేశమున మాజినీ జాతీయతను ప్రచారము చేసి స్వాతంత్ర్యాగ్నిని ప్రజ్వలింప జేయగా గారిబాల్డి కత్తిని బట్టి యుద్ధమును జేసి స్వాతంత్ర్యమును స్థాపించునట్లు తిలక్, గాంధీజీ, దాసులు రేకెత్తించిన జాతీయ భావముల ప్రచారము నూతగా గొని కత్తిని చేపట్టి భారత స్వాతంత్ర్యమును స్థాపించుటకు శ్రీరామరాజు సంకల్పించెను అని మద్దూరి అన్నపూర్ణయ్యగారు ప్రస్తుతించిరి.

ఆంధ్రదేశములో కాక ఏ పంజాబులోనో, వంగదేశములోనో శ్రీరామరాజు పుట్టి యుండినచో జాతీయ నాయకునిగా శ్లాఘించబడెడువారు. మహారాష్ట్రీయుడగుసావర్కారు, పంజాబీయుడగు భగత్‌సింగు అతని సహచరులు మున్నగు వారిని జాతీయ నాయకు లుగా దేశమంతయు పూజించుచుండ శ్రీరామ రాజును బందిపోటునియు, ఫితూరిదార

నియు ఆంధ్ర నాయకులు తీర్మానించి గర్హించిరి. గాంధీజీ, నెహ్రూ మొదలగువారికి అతని స్వాతంత్ర్య సమరమును గూర్చియు, వీరకృత్యములను గూర్చియు ఏమియు తెలియదు. అతని గాథ ఆంధ్రదేశమును దాటిపోలేదు. అందుచేతనే భారత స్వాతంత్ర్య చరిత్ర కారులకు అతని పేరు తెలియదు. భారతీయ విద్యాభవన్ వారు ప్రచురించిన (1969) స్వాతంత్ర్య సమర చరిత్రను వివరించిన బృహత్ గ్రంథములో ఎచ్చటను సీతారామరాజు పేరైనను స్మరింపబడలేదు. ఆంధ్రులు తమలో నెంత ఘనకార్యములు చేసినవారినైనను లాఘవపరచుట గన్పించును. ఇతరులు శ్లాఘించిన గాని వారి గొప్పతనమును మనము గుర్తించము. మహాత్మునే మఱచిపోవుచున్న మహాదేశము మనది.

నాటి నాయకుల మాట ఎట్లున్నను ప్రజల హృదయములలో మాత్రము వీరుడుగా, దేశభక్తుడుగా, త్యాగ నిరతుడుగా పీఠము వైచికొని పాటలలో, పద్యములలో కథలలో సంక్షిప్త చరిత్రలలో కీర్తింపబడుచునే యుండెను. పిదప అల్లూరి సత్యనారాయణ రాజుగారు ఆంధ్రప్రదేశ్ మంత్రిగా నుండగా సీతారామరాజు జీవితాంశములు సేకరించి చరిత్ర వ్రాయించుటకు కొంత ప్రయత్నము జరిగినది. శ్రీ పడాల రామారావు 'అల్లూరి సీతారామరాజు' నాటకము, శ్రీ సుంకర సత్యనారాయణ బుర్రకథయు పరిమితముగా కొంత ఉత్తేజము కలుగజేయుచు నుండినవి. కాని నటుడు శ్రీ కృష్ణ సీతారామరాజు చరిత్రను సినిమాగా తీసి ఎల్లెడల ప్రదర్శింప జేసిన తరువాతనే ఆంధ్రదేశమున ఆబాలగోపాలము నందును చైతన్యము పెల్లుబికినది. ఎక్కువగా యువజనులు ఉత్తేజము పొంది ఉత్సాహముతో చాలచోట్ల అల్లూరి సీతారామరాజు సంఘములు స్థాపించి, విగ్రహములు నెలకొల్పి, జయంతులు వర్ధంతులు జరుపుట మొదలిడినారు.

# 40. ఉపసంహారము

సీతారామరాజు మరణించిన పిదప అతని కుటుంబము చాల కష్టముల పాలైనది. అతని తమ్ముడు సత్యనారాయణరాజుకు చదువుకొనుటకు అవకాశము లేకపోయెను. నర్సాపురము టైలరు హైస్కూలులో 4వ తరగతి చదువుచుండగా తల్లి కృష్ణాదేవి పేట తీసికొనిపోయెను. అక్కడ అన్నగారే తమ్మునకు గురువై బాలరామాయణము, భాస్కర శతకము, ఆంధ్రనామ సంగ్రహము, మనుచరిత్రము, శబ్దమంజరి, రఘువంశము మున్నగునవి చదివించిరి. జ్యోతిశ్శాస్త్రమందు పరిచయము కల్పించి జాతకచక్రము వేయుట నేర్పెను. తరువాత పైడిపుట్టలో కొన్ని రోజులుండి రాజును విడిచి తల్లియు, తమ్ముడును వచ్చివేసిరి.

తమ్ముడు ఏలూరులో నేషనల్ స్కూలులో జేరి ప్రాథమిక విద్య పూర్తి చేసెను. సీతారామరాజు తమ్ముడగుటచే స్టయిపెండు ఇచ్చుటకు నిరాకరించిరి. పినతండ్రి రామకృష్ణంరాజుగారి సహాయము వలన ఆ చదువు పూర్తి చేసి 1925-27 సంవత్సరములలో ఉపాధ్యాయ వృత్తికి ట్రయినింగు కూడ పూర్తి కావించెను. పిమ్మట 1931 నుండి 34 వరకు భద్రాచలమునకు 30 మైళ్ళ దూరములో నున్న చర్లవద్దకు వ్యవసాయము చేయుటకు అతడు తల్లితో వెళ్లెను. సీతారామరాజు విప్లవము 1924తో అంతమైనను ప్రభుత్వ గూఢచారులు చాలకాలము వరకు ఆ కుటుంబమును వెంటాడుచునే యుండిరి. ఒకనాడుపోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏదియోపని మీదవచ్చి నట్లుగా రాజు తల్లి ఉన్న ఇంటికి వచ్చి దాహము పుచ్చుకొని తనకేమియు తెలియనట్లు "శ్రీరామరాజుగారు మీకు ఏమగుదురు?" అని ప్రశ్నించెను. ఇట్లు అడుగుటలో ఏదియో రహస్యముండునని అనుమానించి "ఏమియు కారు" అని తమ్ముడు జవాబిచ్చెను. ఇనస్పెక్టరును సాగనంపుచు "ఏమండీ, శ్రీరామరాజుగారితో మీ కేమైనను సంబంధము కలదాయని యడిగితిరి. వారితో సంబంధమున్నచో తప్పా?" అని అమాయికముగా రాజు తమ్ముడు అడిగెను. దానికి ఇనస్పెక్టరు "ఏమియులేదు, వారితో సంబంధమున్నచో ప్రభుత్వము ఇక్కడ ఉండనివ్వరు. అట్టిదేదైనను ఉంటే చెప్పండి" అనెను. "అట్టిదేదియు లేదు, మామూలుగడా అడిగితిని" అని తమ్ముడనెను. ఇనస్పెక్టరు నవ్వుకొని వెళ్లిపోయెను.

సీతారామరాజు పినతండ్రియగు రంగరాజుగారి కుమారుడు డాక్టరు వెంకట కృష్ణంరాజు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా తురుమెళ్ళ గ్రామములో డాక్టరుగా పని

చేయుచుండెను. ఆయన యొద్దకు తెనాలి పోలీసు సబిన్‌స్పెక్టరు వెళ్ళి సీతారామరాజు తల్లి, తమ్ముని గురించి భోగట్టా చేసెను. "అతనిని నేనే అక్కడకు పంపితిని. ఆ భూములు మావే" అని డాక్టరుగారు చెప్పి, "నీవు పోలీసు వారితో అబద్ధమాడితివట, అట్లు ఎప్పుడును అబద్ధమాడగూడదు" అని పిదప ఆయన తమ్మునికి ఉత్తరము వ్రాసిరి.

తరువాత ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించుటకు రాజు తమ్ముడు ప్రయత్నించెను. సీతారామరాజు తమ్ముడు అను కారణమున భద్రాచలము సబ్‌కలెక్టరు అక్కడ ఉద్యోగమిచ్చుటకు నిరాకరించెను. పిమ్మట 1934లో తూర్పుగోదావరి జిల్లా బోర్డులో ఉపాధ్యాయునిగా ప్రవేశించి, ఉద్యోగము చేసి, విరమించి పెద్దాపురము తాలూకా జగ్గంపేట వద్ద నున్న బూరుగుపూడిలోస్థిరపడి ప్రభుత్వము నుండి పింఛను పుచ్చుకొనుచు ప్రస్తుతము కాలక్షేపము చేయుచున్నారు.

1947లో స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత సీతారామరాజు తల్లి రాజకీయ బాధితులుగా ప్రభుత్వ సహాయము కొరకు మద్దూరి అన్నపూర్ణయ్యగారు, రెబ్బాప్రగడ మందేశ్వర శర్మ (కొవ్వూరు) గారల ప్రేరణతో దరఖాస్తు పంపియుండిరి. అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షుని హోదాలో భోగరాజు పట్టాభిసీతారామయ్యగారి చేత కూడ సిఫార్సు చేయించి అప్పటి మద్రాసు ముఖ్యమంత్రియగు శ్రీ పూసపాటి కుమారస్వామి రాజాగారికి మందేశ్వరశర్మగారు స్వయముగా ఇచ్చియుండిరి. కాని జైలుశిక్ష పొందలేదను నెపముతో ఎట్టి సహాయమును జరుగలేదు. దీనికామె ఇట్లు చింతించెడువారు. "నా చిట్టిబాబు (శ్రీరామరాజు) కాంగ్రెసుకు మార్గదర్శకుడు. 1921 సంవత్సరములోనే మద్య నిషేధమును అమలు జరిపెను. పంచాయితీ కోర్టులు స్థాపించెను. దేశ స్వాతంత్ర్యమునకూ బ్రిటిషు ప్రభుత్వమును పారద్రోలవలెనని తిరుగుబాటు చేసెను. నా కుమారుని వంటివారు అనేకమంది ఆత్మబలిదానము చేయుట చేతనేనేడు స్వాతంత్ర్యము సిద్ధించినది. అఖిల భారత కాంగ్రెసు సిఫార్సును గూడ త్రోసిరాజను కాంగ్రెసు ప్రభుత్వము నేడు పరిపాలించుచున్నాదా? బ్రిటిషు ప్రభుత్వము సహితము 50 ఎకరముల భూమినిచ్చి, పశువుల నిచ్చి, ఇండ్లు కట్టించి, పంట పండు వరకు అన్నిటిని సప్లయి చేయు ఏర్పాటు చేసిరే. కాని జాతీయ ప్రభుత్వము కదాయని ఒప్పుకొనినను తిరస్కరింపబడెనా? నా యోగమును బట్టి వారికాబుద్ధి సర్వేశ్వరుడు తోపించినాడు" అని ఆమె వాపోవుచు రామనామస్మరణలో బడెడువారు. ఈ విధముగా చింతించుచు కాలము వెళ్ళబుచ్చుచు 1953 అక్టోబరు 30వ తేదీని (విజయనామ సంవత్సర ఆశ్వయుజ బహుళ నవమీ శుక్రవారము మధ్యాహ్నము 2 గంటలకు) ఆమె 77వ యేట చిన్నకుమారుని వద్ద కాలధర్మము నొందిరి.

సీతారామరాజు సోదరియగు దంతులూరి సీతమ్మగారు భీమవరములో ఆమె కుమారుని వద్ద నుండి 1964 జులై 18 తేదీని పరమపదించిరి.

# పరిశీలించిన ముఖ్య గ్రంథములు, పత్రములు


| | | |
|---|---|---|
| 1. | అల్లూరి సీతారామరాజు ప్రశంస | - భమిడిపాటి సత్యనారాయణ (1925) |
| 2. | అల్లూరి సీతారామరాజు చరిత్ర<br>(రంప పితూరి)<br>(ఎమ్. కృ. రా) | - కలియుగార్జున ఎమ్. కృష్ణారావు<br>(కొండపల్లి వీరవెంకయ్య బుక్<br>సెల్లర్స్ అండ్ పబ్లిషర్సు,<br>రాజమండ్రి, 4వ ముద్రణ, 1926) |
| 3. | అల్లూరి సీతారామరాజు<br>(పా. రా. కృ.) | పాన్నలూరి రాధాకృష్ణ మూర్తి<br>(లాల్‌పబ్లికేషన్స్, గవర్నరు<br>పేట, బెజవాడ, 1938) |
| 4. | The Great Rebel in Andhra<br>Sri Alluri Sitarama Raju,<br>a phase in the Freedom Movement | Y. Vittal Rao<br>(J.A.H.R.S. Journal,<br>Vol. XXIV, P. 29-34, 1956) |
| 5. | అల్లూరి సీతారామరాజు చరిత్ర-<br>(య.న.రా.) | యర్రమిల్లి నరసింహారావు,<br>(అల్లూరి సీతారామరాజు<br>స్మారక సంఘము,<br>ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,<br>హైదరాబాదు, 1961) |
| 6. | అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర<br>(కొ.ల.నా.) | కొడాలి లక్ష్మీనారాయణ<br>(Research Institute,<br>Moparru, Tenali Tk,<br>Guntur Dist., 1965) |
| 7. | అల్లూరి సీతారామరాజు అను<br>శ్రీరామరాజు నిజ చరిత్ర<br>(శే. శ్రీ.రా) | శేఖర మంత్రి<br>శ్రీరామ చంద్రరావు<br>(అల్లూరి సీతారామరాజు<br>మెమోరియల్ సంఘం, |

రాజేంద్రపాలెం, కొయ్యూరు P.O., విశాఖ జిల్లా, 1983)

8. అల్లూరి సీతారామరాజు (నాటకం) - పడాల రామారావు

9. ఆంధ్రశ్రీ (నవల) - పడాల రామారావు

10. జ్ఞాపికలు (వ్రాతప్రతి) (అ.స.నా.రా.) - అల్లూరి సత్యనారాయణ రాజు (సోదరుడు)

11. A.J. Happell's Report - (G.O. No. 572 Pub. Dept. dated 23-7-1923 of Madras Govt.)

12. The Freedom Struggle in Andhra Pradesh, Vol. III (F.S.A.P.) - Prof. M. Venkata Rangaiya, (A.P. State Committee, 1965)

13. Struggle for Freedom Vol. XI - R.C. Majumdar and A.K. Majumdar. (Bharatiya Vidya Bhavan, Bombay, 1969)

14. Visakhapatnam District Gazette, (V. Gaz.) 1979 - Dr. N. Ramesan

15. East Godavari District Gazette, (E. G. Gaz.) 1979 - Dr. N. Ramesan

16. శ్రీ ఆంధ్ర క్షత్రియ వంశరత్నాకరము, ప్రథమ భాగము (ఆం.క్ష.ర) - బుద్ధరాజు వరహాల రాజు, బి.ఎ. (పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా, 198[illegible])

17. Alluri Sitarama Raju, Hero of the Rampa Rebellion, 1922-24 (P.K.M.) - Pala Krishna Moorthy (Viplavajyothi Alluri Sitarama Raju Yuvaka Kendram, Poduru, W.G.Dt. 1983)

18. ఈ ఫితూరీకి సంబంధించిన ఆనాటి ప్రభుత్వ పత్రములు, నివేదికలు.

విప్లవవీరుడు

# అల్లూరి సీతారామరాజు చరిత్ర



రచయిత: దంతులూరి వెంకటరామరాజు, ఎం.ఎ.